16-08Pg1exHMNWJQEO.qxd:16-08Pg1exHMNWJQEO.qxd 1/1/02 6:28 AM Page 1



ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శ్రీకాకుళం

: fb.com/vaartha Digital

Published from Srikakulam, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

17-8-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 198 పేజీలు: 16 వెల: 6.50

## సముద్రంలో నిప్పుల తుఫాను

బెంగాల్ అసెంబ్లీ మాజీ డి. స్పీకర్ అనుమానాస్పద మృతి

5

# భోగాపురం నుంచి విమానాల రాకపోకలు షురూ!

### తొలి రోజే హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై ఫ్లైట్స్

### ప్రయాణికులకు అందుబాటులోకి 31 విమానాల సర్వీసులు

### విశాఖ ఎయిర్ పోర్ట్ నుంచి షెడ్యూల్ విమానాల నిలిపివేత



**విజయవాడ, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా భోగాపురంలో కొత్తగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వాణిజ్య విమాన సర్వీసులు ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. దీనితో పాటు, విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌లోని (ఐఎన్ఎస్ డేగా) సివిల్ ఎన్‌క్లేవ్‌లో వాణిజ్య కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆదివారం అర్ధరాత్రి 12:01 గంటల నుంచి అంటే సోమవారం తొలి గంటల నుంచి భోగాపురం విమానాశ్రయం పూర్తిస్థాయిలో పనిచేస్తుందని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఇప్పటికే అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అన్ని విమానయాన సంస్థలు తమ సేవలను విశాఖపట్నం నుంచి భోగాపురానికి మార్చాయి. తొలిరోజే హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా, తిరుపతి వంటి నగరాలకు 31 సర్వీసులు నడపడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. పాత విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌కు ఉన్న విటిజెడ్ ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ కోడ్‌ను కూడా భోగాపురం విమానాశ్రయానికి బదిలీ చేశారు. అయితే, జాతీయ అత్యవసర పరిస్థితులు, భారత వైమానిక దళం, ఇతర రక్షణ దళాలు, పోలీసు, ప్రభుత్వ ప్రత్యేక విఐపి విమానాల రాకపోకలకు మాత్రం విశాఖ ఎయిర్‌పోర్ట్‌ను వినియోగించనున్నారు.

ప్రధాని నరేంద్ర మోడీ ఆగస్టు 1న ఈ విమానాశ్రయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. సుమారు రూ.4,727 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం కేవలం 31 నెలల్లోనే పూర్తయి, దేశంలో అత్యంత వేగంగా నిర్మించిన విమానాశ్రయాల్లో ఒకటిగా నిలిచింది. షెడ్యూల్ కంటే దాదాపు ఐదు నెలల ముందే దీని నిర్మాణం పూర్తి కావడం విశేషం. ఈ ఎయిర్‌పోర్ట్‌కు ఇప్పటికే డిజిసిఎ ఏరోడ్రోమ్ లైసెన్స్‌తో పాటు అవసరమైన అన్ని భద్రత, అగ్నిమాపక, పర్యావరణ అనుమతులు లభించాయి. మొదటి దశలో యేటా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించేలా దీన్ని రూపొందించారు. భవిష్యత్తులో దీని సామర్థ్యాన్ని యేటా 4 కోట్ల మంది ప్రయాణికులకు పెంచేలా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్టు ఉత్తరాంధ్రలోని పూర్వపు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఆర్థిక వృద్ధి, పర్యాటకం, పారిశ్రామిక పెట్టుబడులు, ఎగుమతులు, లాజిస్టిక్స్, ఏరోస్పేస్, రక్షణ రంగాలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు. ఈ సమీకృత >>2

# 2025నాటి ఓటర్ల జాబితాతోనే స్థానిక పోరు

### ముందుగా పురపాలక సంఘాల ఎన్నికలు

### ఆ తర్వాతే గ్రామపంచాయతీల నిర్వహణ

### రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం యోచన

**విజయవాడ, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కసరత్తు ఆరంభమైంది. 'సర్' తుది జాబితాతో నిమిత్తం లేకుండా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం భావిస్తోంది. అక్టోబర్‌లో ఈ ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచనతో ప్రభుత్వం ఉంది. అయితే, ఇటీవల నిర్వహించిన ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) తుది ఓటర్ల జాబితాలతో కాకుండా 2025 నాటి ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్) ఓటర్ల జాబితాల ఆధారంగా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. అక్టోబర్ 3న సర్ తుది ఓటర్ల జాబితాలు ప్రచురించనున్నారు. వాటిని ప్రామాణికంగా తీసుకుని స్థానిక సంస్థల్లో ఓటర్ల జాబితాలు ప్రచురిస్తే ఎన్నికల నిర్వహణ జాప్యమవుతోందని భావిస్తున్నారు. ఈ కారణంతో 2025 నాటి జాబితాలతోనే ఎలక్షన్స్‌కి వెళ్లాలని రాష్ట్ర ఎన్నికలసంఘం నిర్ణయించింది. ఈ మేరకు ముందుగా పురపాలక, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఫొటో గుర్తింపు ఓటరల్ జాబితాల ప్రచురణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముందుగా పుర, నగరపాలక, నగర పంచాయతీల్లో, ఆ తర్వాత గ్రామ పంచాయతీల్లో ఎలక్షన్స్ జరగనున్నాయి. ఈ ఎన్నికల కోసం ఆశావాహులంతా సన్నద్ధమవుతున్నారు. >>2

# బిసిల సంరక్షణకు ప్రత్యేక చట్టం

### ముసాయిదా సిద్ధమైంది

### సర్దార్ గౌత లచ్చన్న స్ఫూర్తితో పరిపాలన

### బిసిల అభ్యుదయానికి కృషి చేస్తున్నాం: సిఎం నారా చంద్రబాబు నాయుడు

### గౌతు లచ్చన్నకు ముఖ్యమంత్రి నివాళి



ఆదివారం అమరావతిలో గౌతు లచ్చన్న చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** బిసిల సంరక్షణను చేపట్టే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని, దీనికోసం త్వరలోనే చట్టం చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. బిసి సంరక్షణ చట్టం కోసం ముసాయిదా సిద్ధమైందని వెల్లడించారు. స్వాతంత్ర్య సమరయోధులు సర్థార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా తన కార్యాలయంలోని ఆయన చిత్రపటానికి నివాళి అర్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ బిసిల అభ్యున్నతికి సర్దార్ గౌతు లచ్చన్న విశేషకృషి చేసారన్నారు. ఆయన స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం బిసిల అభ్యుదయానికి కృషి చేస్తుందన్నారు. "బిసిలకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తోంది. వారి సంక్షేమం కోసం పని చేయడంతోపాటు రక్షణ కల్పించేందుకు చట్టం చేస్తున్నాం. దీనికోసం ముసాయిదా ఇప్పటికే సిద్ధమైంది. ఇక బిసిల సంక్షేమంలో భాగంగా వివిధ వర్గాలను అన్ని రకాలుగా అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం. చేపలవేట నిషేధ సమయంలో 1.34 లక్షల మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున రెండేళ్లలో రూ.505 కోట్లు ఇచ్చాం. వడ్డెరలకు మైనింగ్ లీజులు, గీత కార్మికులకు ఎక్సైజ్ షాపులు కేటాయించాం. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు బిసిలకు 3 కిలో వాట్లకు అదనంగా రూ.20 వేలు సబ్సిడీ ఇస్తున్నాం. రాష్ట్రంలో అందరికీ రూ.2.5 లక్షల >>2



### ఏనుగుల సంచారంపై ప్రజలను

# అప్రమత్తం చేయండి

### అటవీశాఖ అధికారులకు ఉప ముఖ్యమంత్రి ఆదేశం

### ఏనుగుల కదలికలపై డ్రోన్లతో నిఘా

### అటవీ సమీప గ్రామాల్లో రాత్రివేళ గస్తీ పెంచండి

### రెవెన్యూ, పోలీసు శాఖల సమన్వయంతో ప్రజలకు సమాచారం అందించండి

### హనుమాన్ బృందాలను మొహరించాలని పవన్ సూచన

**విజయవాడ, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లా చంద్రగిరి సమీప ప్రాంతాల్లోని ఎర్రవారిపాలెం వద్ద ఏనుగుల గుంపు సంచరిస్తున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని, ధైర్యం చెప్పాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ, డ్రోన్ల సహాయంతో వాటి సంచార మార్గాలను గుర్తించి సమీప గ్రామాల ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. శేషాచలం అటవీ ప్రాంతంలోని ఏనుగులు రెండు గుంపులుగా సంచరిస్తూ రాత్రివేళ అటవీ సరిహద్దుల్లోని పంట పొలాలను ధ్వంసం చేస్తున్నాయన్న సమాచారంపై పవన్ కల్యాణ్ అటవీశాఖ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆస్తి, ప్రాణ నష్టాన్ని తగ్గించేందుకు అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, అటవీ సమీప గ్రామాల్లో రాత్రివేళ ప్రత్యేక గస్తీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజలు రాత్రివేళ పొలాలకు వెళ్లకుండా అవగాహన కల్పించడంతోపాటు అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఏనుగుల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో మైకులు, మొబైల్ సందేశాలు, స్థానికసమాచార వ్యవస్థల ద్వారా హెచ్చరి >>2

# కొనసాగుతున్న జూడాల సమ్మె

### నేటినుంచి అత్యవసర సేవలు బంద్

### జూడాల సమ్మెకు సిపిఐ మద్దతు

### సమస్యలు పరిష్కరించాలని సిఎంకు ఈశ్వర్య లేఖ

**గుంటూరు(మెడికల్), ఆగస్టు 16 ప్రభాతవార్త:** జూనియర్ వైద్యుల జీతభత్యాల సవరణను అమలు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం చేపట్టిన దశలవారీ ఆందోళన మూడో దశకు చేరుకుంది. ప్రభుత్వం నుంచి ఆగస్టు 15 సాయంత్రం 5 గంటలలోగా సంతృప్తికరమైన లిఖితపూర్వక హామీలేదా నిర్ణయం వెలువడుతుందని ఆశించినప్పటికీ, నిర్దేశిత గడువులోగా స్పష్టమైన హామీ రాకపోవడంతో ఆగస్టు 17 నుంచి మూడో దశ ఆందోళన ప్రారంభిస్తున్నట్లు సంఘం ప్రకటించింది. ఇప్పటివరకు చేపట్టిన దశల్లో అత్యవసరవైద్యసేవలు, అత్యవసర చికిత్స విభాగ సేవలను కొనసాగిస్తూ, అత్యవ సరం కాని వైద్య సేవలను మాత్రమే దశలవారీగా నిలిపివేసినట్లు సంఘం తెలిపింది. ప్రభుత్వానికి సమస్య పరిష్కరించేందుకు తగినసమయం ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈవిధానాన్ని అనుసరించినట్లు పేర్కొంది.

**అత్యవసర సేవలు సైతం నిలిపివేత:**

ఆగస్టు 17 నుంచి అత్యవసరం కాని వైద్య సేవల నిలిపివేత కొనసాగడంతో పాటు, ఆందోళనలో పాల్గొంటున్న జూనియర్ వైద్యులు అత్యవసర వైద్య సేవలను కూడా ఉపసంహరించుకోనున్నట్లు సంఘం ప్రకటించింది. అంత >>2



### నాణ్యత లేమితో అంతర్జాతీయ మార్కెట్‌లో చెడ్డపేరు

### పురుగు మందుల అవశేషాలు, అఫ్లోటాక్సిన్‌పై అభ్యంతరాలు

### నాడు చైనా... నేడు శ్రీలంక నుంచి కంటైనర్లు వెనక్కి

### వరుసగా విదేశీ మార్కెట్లలో తిరస్కరణతో ఎగుమతిదారుల్లో ఆందోళన

# గుంటూరు మిర్చి 'ఘాట్లు' ఏదీ?

**గుంటూరు(మెడికల్), ఆగస్టు 16 ప్రభాతవార్త:** గుంటూరు మిర్చికి అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న పేరు ప్రతిష్ఠకు నాణ్యతా ప్రమాణాలే ఇప్పుడు అతిపెద్ద సవాలుగా మారుతున్నాయా? ఒకవైపు చైనా నుంచి పురుగుమందుల అవశేషాలపై అభ్యంతరాలు వ్యక్తమై మిర్చి సరుకులు తిరస్కరణకు గురైన ఘటన మరువకముందే.. తాజాగా శ్రీలంకకు వెళ్లిన గుంటూరు మిర్చి సరుకుల విషయంలోనూ నాణ్యతపై అభ్యంతరాలు వ్యక్తమైనట్లు వెలువడుతున్న సమాచారం మిర్చి ఎగుమతి వర్గాల్లో కలకలం రేపుతోంది.గుంటూరు నుంచి చైనాకు ఇటీవల పంపిన మిర్చి సరుకుల్లో అనుమతించిన పరిమితికి మించి పురుగుమందుల అవశేషాలు ఉన్నట్లు అక్కడి అధికారులు గుర్తించి మూడు సరుకులను తిరస్కరించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై ఎగుమతిదారులు, మిర్చి రంగం ప్రతినిధులు ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసి నాణ్యతా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

ఇదిలా ఉండగానే శ్రీలంకకు గుంటూరు నుంచి వెళ్లిన మిర్చి సరుకుల్లో అధిక తేమ, అఫ్లోటాక్సిన్ సమస్యలను అక్కడి అధికారులు గుర్తించినట్లు సమాచారం. తేమ ఎక్కువగా ఉండటం వల్ల నిల్వ సమయంలో బూజు ఏర్పడి నాణ్యత దెబ్బతినే అవకాశం ఉండటంతో కొన్ని సరుకులపై అభ్యంతరాలు వ్యక్తమైనట్లు తెలుస్తోంది. అయితే శ్రీలంకలో ఎన్ని సరుకులు తిరస్కరణకు గురయ్యాయి, వాటిలో నాణ్యతాపరీక్షల్లో నమోదైన ఖచ్చితమైన పరిమాణాలు ఏమిటన్నది అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.

**శ్రీలంకలోనూ కఠిన ప్రమాణాలు:**

శ్రీలంకలో మొత్తం మిరపకాయలకు సంబంధించిన నాణ్యతా ప్రమాణాలు కఠినంగానే ఉన్నాయి. మిరపకాయల్లో తేమ 11 శాతా నికి మించకూడదని, అఫ్లోటాక్సిన్ బి1కిలోకు 5 మైక్రోగ్రాములు, మొత్తం అఫ్లోటాక్సిన్లు కిలోకు 10 మైక్రోగ్రాములకు మించకూడదని అక్కడి ప్రమాణాలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో ఎగుమతికి ముందు మిర్చి నాణ్యతను పూర్తిస్థాయిలో పరీక్షించడంఅత్యంత కీలకంగా మారింది. ముఖ్యంగా కోతఅనంతరం ఎండబెట్టడం, గోదాముల్లో నిల్వ చేయడం, ప్యాకింగ్, రవాణా సమయంలో తేమ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. >>2

# టీచర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దు

### విజయవాడలో మెగా డిఎస్సీ-2025 విజేతల ఆత్మగౌరవ ర్యాలీ




డిఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు ఆదివారం విజయవాడలో నిర్వహించిన భారీ ఆత్మగౌరవ ర్యాలీ దృశ్యం

**విజయవాడ, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** మెగా డిఎస్సీ 2025లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులు ఆదివారం విజయవాడలో భారీ ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహించారు. తమ నియామకాలపై వైసిపి నేతలు విష ప్రచారం చేస్తున్నారంటూ వారు ఆరోపించారు. తమ ఎంపిక విధానంపై రాద్ధాంతం చేస్తున్న వారి దుష్ప్రచారాన్ని తిప్పి కొడుతూ మెగా డిఎస్సీ 2025లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులు ఈ ఆత్మగౌరవ ర్యాలీని నిర్వహించారు. తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా చేస్తున్న ఆరోపణలు వెంటనే ఆపకపోతే వైసిపిని ప్రకాశం బ్యారేజీలో కలిపేస్తామంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి సుమారు 7వేల మందికి పైగా నూతన >>2

# నేటి నుండి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు




**విజయవాడ,ఆగస్టు 16, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఈనెల 17వ తేదీ సోమవారం నుండి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు సమాచార శాఖ ఒక బులిటన్ విడుదల చేసింది.ఉదయం .10గం.లకు రాష్ట్ర శాసన మండలి సమావేశాలు ప్రారంభం అవుతాయి. అసెంబ్లీ సమావేశాల ప్రత్యక్ష ప్రసారం(లైవ్ టెలికాలికాస్ట్)ను అసెంబ్లీ మీడియా పాయింట్ తోపాటు సచివాలయ నాల్గవ భవనంలోని ప్రచార విభాగం (పబ్లిసిటీ సెల్)ద్వారా చేయబడుతుంది.తొలి రోజు ప్రశ్నోత్తరాల అనంతరం అసెంబ్లీ సమావేశాల నిర్వహణ తదితరంశాలపై మీటింగ్ జరుగుతుంది.ఈ సమావేశంలో ఎన్నిరోజులు అసెంబ్లీ నిర్వహించాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటారు. బిసి సంరక్షణ కోసం ప్రత్యేక పాలసీతో సహా పలు కీలకంశాలపై అసెంబ్లీలో చర్చించనున్నారు. ఇక ఇప్పటికే కూటమి పక్షాలు తమ 175 మంది సభ్యులు తప్పనిసరిగా సమావేశాలకు హాజరు కావాలని ఆదేశించాయి. వైసిపి తమ ప్రతిపక్ష హోదా ఇవ్వనందుకు నిరసనగా శాసనసభకు హాజరు కావట్లేదని ప్రకటించింది.

# పెళ్లికి వెళ్లి తిరిగివస్తూ..

- కాల్వలోకి దూసుకెళ్లిన కారు
- ఆరుగురు విద్యార్థులు గల్లంతు
- ప్రాణాలతో ఒకరు క్షేమం
- నలుగురి మృతదేహాలు లభ్యం
- మరొకరి కోసం ముమ్మర గాలింపు
- పశ్చిమగోదావరి జిల్లాలో విషాద ఘటన

2లో



ఆదివారం న్యూఢిల్లీలో అటల్ బిహారీ వాజ్‌పేయి సమాధివద్ద నివాళులర్పిస్తున్న ప్రధాని మోడీ

# మాజీ ప్రధాని వాజ్‌పేయికి రాష్ట్రపతి, ప్రధాని నివాళి

**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** మాజీ ప్రధాని, దివంగత నేత అటల్ బిహారీ వాజ్‌పేయి 8వ వర్ధంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేశానికి వాజ్‌పేయి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్ వేదికగా పోస్టులు చేశారు. దేశ సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన అసాధారణ రాజనీతిజ్ఞుడు అటల్‌జీ అని ప్రధాని మోడీ కొనియాడారు. వాజ్‌పేయికి అపారమైన దూరదృష్టి ఉందని ప్రశంసించారు. ఆయన మాటలు, కృషి తరతరాలకు స్ఫూర్తినిచ్చాయని పేర్కొన్నారు. మాజీ ప్రధాని నాయకత్వం దేశాన్ని మరింత బలోపేతం చేసిందన్నారు. సుపరిపాలన, ప్రజా సంక్షేమంపై అటల్‌జీ చూపిన దృష్టి ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తుందని ప్రధాని మోడీ చెప్పుకొచ్చారు. మరోవైపు, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయికి ఘనంగా నివాళులర్పించారు. న్యూఢిల్లీలోని సదైవ అటల్ సమాధి వద్దకు ఆమె చేరుకున్నారు. ఈ సందర్భంగా పుష్పాంజలి ఘటించారు. అనంతరం దేశానికి వాజ్‌పేయి అందించిన సేవలను రాష్ట్రపతి స్మరించుకున్నారు.

# ఓటర్ల జాబితాతోనే స్థానిక పోరు

>> రాజకీయ పార్టీలు కూడా అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో పడ్డాయి. ఇక స్థానాల రిజర్వేషన్లపై కూడా ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. బిసి రిజర్వేషన్లకు సంబంధించి డెడికేటెడ్ కమిషన్ ఇప్పటికే నివేదిక ఇచ్చింది. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిందంటేనే ఎన్నికలు సమీపించాయని అర్థం అంటూ అధికారులు చెబుతున్నారు. దాంతో ఓటర్ల జాబితా ప్రచురణపై ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. వీలైనంత త్వరగా ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని ఆదేశాలు కూడా జారీ చేసింది. మున్సిపాలిటీల్లో వచ్చే నెల 3లోగా, ఇప్పటి వరకు ఓటర్ల జాబితా సిద్ధం చేయని సుమారు 50 పంచాయతీల్లో ఈ నెల 17వ తేదీలోగా ఓటర్ల జాబితా ప్రచురణ పూర్తి చేయాలని పురపాలక, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలను ఎన్నికల సంఘం ఆదేశించింది. పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల ఎంపిక, వాటికి సంబంధించిన పబ్లికేషన్ ప్రక్రియ కూడా ఈ నెల 21 నుంచి 31లోగా పూర్తి చేయాలని సూచించింది. ఎన్నికల సిబ్బందికి శిక్షణతో పాటు ఏర్పాట్లు కూడా 30 35 రోజుల్లో పూర్తి చేయాలని ఎన్నికల సంఘం చూస్తోంది.

# ప్రజలను అప్రమత్తం చేయండి

>> కలు జారీ చేయాలన్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షి స్తూ అవసరమైన చోట హనుమాన్ బృందాలను మోహరించి ప్రజల భద్రతను నిర్ధారించాలి. క్షేత్ర స్థాయి సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటూ అటవీశాఖ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఉప ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఏనుగులు పంట పొలాలపై దాడి చేసి పంటలను ధ్వంసం చేస్తున్న నేపథ్యంలో, పంట నష్టంపై అధికారులు నివేదికలు రూపొందించిన వెంటనే అటవీశాఖ ద్వారా తక్షణ పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని పవన్ కల్యాణ్ తెలిపారు.

# రాకపోకలు షురూ!

>> ప్రాజెక్టు మొత్తం 2,703.26 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో 2,203.32 ఎకరాలు విమానాశ్రయానికి, 500 ఎకరాలు ఏవియేషన్ హబ్‌కు, 136.63 ఎకరాలు ఏవియేషన్ యూనివర్సిటీ/ఎడ్యుసిటీకి కేటాయించారు. ఎయిర్‌పోర్ట్‌లోని 3,800 మీటర్ల పొడవైన కోడ్‌ఇ రన్‌వే బోయింగ్ 777, బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్, ఎయిర్‌బస్ ఏ330, ఏ340 వంటి భారీ విమానాలను సైతం హ్యాండిల్ చేయగలదు. దేశీయ, అంతర్జాతీయ కార్యకలాపాలకు మద్దతుగా అత్యాధునిక ఎయిర్‌ఫీల్డ్ లైటింగ్, నావిగేషన్ వ్యవస్థలను ఇక్కడ ఏర్పాటు చేశారు. ఈ విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఒక నూతన అధ్యాయం ప్రారంభం కానున్నది. పాత రన్‌వే కేవలం ఆరు వేల అడుగులు మాత్రమే ఉండటంతో పెద్ద విమానాల ల్యాండింగ్‌కు ఇబ్బందులు ఎదురయ్యేవి. దీన్ని అధిగమించడానికి 10,007 అడుగుల రన్‌వేను నిర్మించి 2007 జూన్ 15న ప్రారంభించారు. దీంతో బోయింగ్ 737, ఎయిర్‌బస్ ఎ320 వంటి భారీ వాణిజ్య విమానాల రాకపోకలకు మార్గం సుగమమైంది. రూ.95 కోట్లతో సరికొత్త ఇంటిగ్రేటెడ్ ప్యాసింజర్ టెర్మినల్ భవనాన్ని 2009 ఫిబ్రవరి 20న ప్రారంభించారు. ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్ (ఐఎల్ఎస్) రాత్రివేళల్లో విమానాలు దిగే సాంకేతికత (నైట్ ల్యాండింగ్) 2012లో అందుబాటులోకి వచ్చింది. అదే సంవత్సరం ఎయిర్ ఇండియా సింగపూర్‌కు మొట్టమొదటి అంతర్జాతీయ సర్వీసు ప్రారంభించడంతో విశాఖ గ్లోబల్ ఏవియేషన్ మ్యాప్‌లో నిలిచింది. ఈ క్రమంలో విశాఖ ఎయిర్‌పోర్ట్ నుంచి షెడ్యూల్ విమానాలను నిలిపేస్తున్నట్లు పౌరవిమానయానశాఖ ఇప్పటికే ప్రకటించింది. 30 సంవత్సరాల పాటు వైజాగ్ విమానాశ్రయం నుంచి (ఐఎన్ఎస్ డేగ) సివిల్ ఎన్‌క్లేవ్ నుంచి షెడ్యూల్డ్ కమర్షియల్ విమానాల రాకపోకలను నిలిపేస్తున్నట్లు పేర్కొంది. జాతీయ అత్యవసర పరిస్థితుల్లో ఈ నిబంధనకు మినహాయింపు ఉంటుందని తెలిపింది. భారతీయ వాయుసేన, సాయుధ దళాలు, పోలీసు విమానాలు, ప్రభుత్వ అతిథులు రాకపోకలు సాగించే విమానాలు, లీజ్, విఐపి ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఇక్కడి నుంచి నడుస్తాయని పౌరవిమానయానశాఖ పేర్కొంది. నాన్‌షెడ్యూల్డ్ వాణిజ్య కార్యకలాపాలూ కొనసాగుతాయని తెలిపింది. ఇప్పటి వరకు విశాఖ విమానాశ్రయానికి ఉన్న అంతర్జాతీయ ట్రావెల్‌కోడ్ విటిజెడ్ సోమవారం (ఆగస్టు 17) అర్ధరాత్రి 00:01 గంటల నుంచి అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి బదిలీ అవుతుందని కేంద్రం వెల్లడించింది.

# గుంటూరు మిర్చి 'ఘాటు' ఏదీ?

>> **నాణ్యతలో చిన్న లోపం.. మార్కెట్‌లో భారీ దెబ్బ:**

గుంటూరు మిర్చికి దేశీయంగానే కాకుండా విదేశీ మార్కెట్లలోనూ ప్రత్యేక గుర్తింపు ఉంది. గుంటూరు ప్రాంతం మిర్చి ఉత్పత్తి, వ్యాపారానికి ప్రధాన కేంద్రంగా కొనసాగుతోంది. గుంటూరు సన్నం మిర్చికి భౌగోళిక గుర్తింపు కూడా ఉంది. ఆంధ్రప్రదేశ్ దేశ మిర్చి ఉత్పత్తిలో కీలక వాటా కలిగి ఉండగా, గుంటూరు మార్కెట్ అంతర్జాతీయ ధరలపై కూడా ప్రభావం చూపుతోంది. గుంటూరు మిర్చికి దేశీయంగానే కాకుండా విదేశీ మార్కెట్లలోనూ ప్రత్యేక గుర్తింపు ఉంది. గుంటూరు ప్రాంతం మిర్చి ఉత్పత్తి, వ్యాపారానికి ప్రధాన కేంద్రంగా కొనసాగుతోంది. గుంటూరు సన్నం మిర్చికి భౌగోళిక గుర్తింపు కూడా ఉంది. ఆంధ్రప్రదేశ్ దేశ మిర్చి ఉత్పత్తిలో కీలక వాటా కలిగి ఉండగా, గుంటూరు మార్కెట్ అంతర్జాతీయ ధరలపై కూడా ప్రభావం చూపుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఒకటి రెండు సరుకుల్లో నాణ్యతా లోపాలు గుర్తించినా.. దాని ప్రభావం మొత్తం ప్రాంతం నుంచి జరిగే ఎగుమతులపై పడే అవకాశం ఉంది. విదేశీ కొనుగోలుదారుల్లో గుంటూరు మిర్చిపై నమ్మకం దెబ్బతింటే భవిష్యత్తులో అదనపు పరీక్షలు, ఆలస్యాలు, వ్యయాలు పెరగడంతో పాటు ధరలపైనా ప్రభావం పడే ప్రమాదం ఉందని ఎగుమతి వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

**రైతు నుంచి ఎగుమతి వరకు నాణ్యతా గొలుసు:**

మిర్చి నాణ్యత కేవలం ఎగుమతిదారుడి బాధ్యతతో పూర్తయ్యే అంశం కాదు. పొలంలో పురుగుమందుల వినియోగం నుంచి కోత, ఎండబెట్టడం, నిల్వ, రవాణా, గోదాములు, ఎగుమతికి ముందు నమూనా పరీక్షల వరకు ప్రతి దశలోనూ నాణ్యతను కాపాడాల్సి ఉంటుంది. ఇటీవల చైనా నుంచి వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో ప్రమాదకర పురుగుమందుల వినియోగాన్ని నియంత్రించడంతో పాటు రైతులకు అవగాహన కల్పించాలని మిర్చి ఎగుమతిదారుల సంఘాలు ప్రభుత్వాన్ని కోరిన విషయం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఇప్పటికైనా మేల్కొనాల్సిందే:**

గుంటూరు మిర్చి పేరు అంతర్జాతీయ మార్కెట్‌లో మరింత బలపడాలంటే నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ లేకుండా వ్యవస్థను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎగుమతికి సిద్ధం చేసిన ప్రతి సరుకును ముందుగానే నాణ్యతా పరీక్షలకు లోబరచడం, తేమను శాస్త్రీయ పద్ధతుల్లో నియంత్రించడం, పురుగుమందుల అవశేషాలపై క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించడం, రైతులకు సురక్షి త సాగుపై అవగాహన కల్పించడం అత్యవసరంగా మారింది.



ఆదివారం గుంటూరులో ఆందోళన చేస్తున్న ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం

# కొనసాగుతున్న జూడాల సమ్మె

>> గ్గత వైద్యులు, జూనియర్ వైద్యులు, ఉన్నత వైద్య విభాగాల శిక్షణ వైద్యులు, జిల్లా వైద్య శిక్షణలోఉన్న వైద్యులు, సీనియర్ వైద్యులు తదితరులు ఆందోళనలో భాగస్వాములు కానున్నట్లు తెలిపింది. జీతభత్యాల సవరణపై గత అనేక నెలలుగా అధికారులకు పలుమార్లు లిఖితపూర్వకంగా విజ్ఞప్తులు, ప్రతినిధిత్వాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన, లిఖితపూర్వకమైన, కాలపరిమితితో కూడిన నిర్ణయం వెలువడలేదని ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం పేర్కొంది. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని జీతభత్యాల సవరణపై స్పష్టమైన, లిఖితపూర్వక, కాలపరిమితితో కూడిన హామీ లేదా నిర్ణయం ఇవ్వాలని కోరింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి ముందుకు వస్తే, రోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణాత్మక చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని సంఘం స్పష్టం చేసింది. ఆందోళన కారణంగా ప్రజలకు, రోగులకు కలగబోయే అసౌకర్యంపై తమకు అవగాహన ఉందని, అయితే సమస్య మరింత తీవ్రం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని పేర్కొంది. జీతభత్యాల సవరణపై ప్రభుత్వం తక్షణమే సంతృప్తికరమైన లిఖితపూర్వక నిర్ణయం తీసుకుని, వైద్య సేవలు సాధారణ స్థితికి తిరిగి వచ్చేలా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం విజ్ఞప్తి చేసింది.

ఈ నేపథ్యంలో సిపిఐ వారికి మద్దతు ప్రకటించింది. వారి సమస్యలు పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర సమితి కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య సిఎం చంద్రబాబుకు లేఖ రాసారు. ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు లేఖ నకలు జతపరిచారు. జూడాల సమ్మెను వారి డిమాండ్లకు అంగీకరించి, ఉపసంహరణ చేయించాలని ఈశ్వరయ్య తన లేఖలో కోరారు. మన పొరుగు తెలుగు రాష్ట్రమైన తెలంగాణతో పోలిస్తే ఎపిలో జూనియర్ డాక్టర్లకు ఇస్తున్న స్టైపెండ్ చాలా తక్కువగా ఉంది. స్టైపెండ్ పెంపుదలతోపాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, రక్షణ చర్యలు, మెరుగైన పని వాతావరణం కల్పించాలని జూడాలు కోరుతున్నారు. అతి భారీ పని గంటలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఇతోధికంగా వైద్య సేవలందిస్తున్న జూనియర్ డాక్టర్ల శ్రమను, ఒత్తిడిని గుర్తించి తగిన విధంగా వారికి స్టైపెండ్ పెంచాలి. జూడాలు గత 5 రోజులుగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో సోమవారం నుండి అత్యవసర సేవలను బహిష్కరిస్తామంటూ ప్రకటించారు. జూనియర్ డాక్టర్లు చేసిన ప్రకటనతో రోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఫలితంగా ప్రభుత్వ వైద్యరంగం ఒడిదుడుకులు ఎదుర్కొనే ప్రమాదం దాపురించిందని ఈశ్వరయ్య పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, జూనియర్ డాక్టర్లతో చర్చలు జరిపి, వారి సమస్యల పరిష్కారం కోసం తగు చర్యలు చేపట్టవలసిందిగా కోరారు.

# ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దు

>> ఉపాధ్యాయులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. విజయవాడ నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ భారీ ప్రదర్శన, అంబేద్కర్ స్మృతివనం వరకు కొనసాగింది. "వైసిపి విష ప్రచారం నశించాల్లి, "టీచర్ల ఆత్మగౌరవాన్ని కించపరచొద్దు అంటూ నినాదాలతో హోరెత్తించారు. రాత్రింబవళ్లు కష్టపడి చదివి ప్రతిభతో ఉద్యోగాలు సాధిస్తే, తమను వైఎస్సార్సీపీ నేతలు అవమానపరుస్తున్నారని ఉపాధ్యాయులు మండిపడ్డారు. డిఎస్సీ నియామకాలపై ఆ పార్టీ ఉద్దేశపూర్వకంగా చేస్తున్న విష ప్రచారం వల్ల ఎన్నో యేళ్ల నిరీక్షణ తర్వాత జాబ్ సాధించామన్న కనీస సంతోషం కూడా తమకు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడితే ఇకపై సహించేది లేదని వారు తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా పలు వురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ యేళ్ల తరబడి కష్టపడి చదివి, మెరిట్ ఆధారంగానే ఉద్యోగాలు సాధించామని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ప్రభుత్వ ఉద్యోగం సాధించామన్న కనీస సంతోషాన్ని వైసిపి నేతలు తమ విష ప్రచారంతో దూరం చేస్తున్నారని వాపోయారు. తమ ప్రతిభను శంకించి, నియామకాలపై బురద జల్లడం వల్ల తాము, తమ కుటుంబ సభ్యులు మానసికంగా కుంగిపోతున్నామని తెలిపారు. ఇప్పటికే కర్నూలు, తిరుపతితో పాటు పలు జిల్లాల్లో ఇలాంటి నిరసన ర్యాలీలు నిర్వహించామని, అయినా వైసిపి నేతల తీరు మారకపోవడం దారుణమన్నారు. తమపై విమర్శలు చేస్తున్న వారికి సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి తమ నిరసనను నిర్వహించారు. తమపై విష ప్రచారం తక్షణమే ఆపాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.

# బిసిల సంరక్షణకు ప్రత్యేక చట్టం

>> చొప్పున యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకువస్తున్నాం. అభివృద్ధితో పాటు సంక్షేమం, సుపరిపాలనను అందించేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. పేదలు భోజనానికి ఇబ్బందులు పడకుండా రూ.5 అన్నా క్యాంటీన్లలో భోజనం అందిస్తున్నాం. కొందరు వ్యక్తులు దీనికీ అడ్డం పడి అన్నా క్యాంటీన్లను ఎత్తేశారు. విద్య అందరికీ అందాలన్న లక్ష్యంతో తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ.. వారి తల్లుల ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నాం. సంక్షేమంతో పాటు అభివృద్ధిపైనా శ్రద్ధ పెడుతున్నాం. గత పాలనలో రోడ్లన్నీ గుంతలే. మన రాష్ట్రాన్ని చూసి ఎగతాళి చేశారు. ఇప్పుడు రోడ్లకు మరమ్మత్తులు చేశాం. పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించాం... రూ.12 లక్షల కోట్ల మేర పెట్టుబడులు ఇప్పటికే గ్రౌండ్ అయ్యాయి. యువతకు ఉద్యోగాలు వచ్చేలా చేస్తున్నాం. అభివృద్ధి-ఉపాధి కల్పించేలా పారిశ్రామికాభివృద్ధి చేస్తున్నాం. రోడ్లు, పోర్టులు, విమానాశ్రయాలు కూడా రాష్ట్రంలో నిర్మించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం. గత పాలకుల నిర్వాకం వల్ల ఆర్థిక ఇబ్బందులున్నా.. గడచిన రెండేళ్లలో పేదలను ఆదుకునేందుకు రూ.1.50 లక్షల కోట్లు సంక్షేమం చేశాం. అభివృద్ధి కోసం 2 యేళ్లల్లో రూ.1.34 లక్షల కోట్లు ఖర్చుచేశాం. రోడ్లు సహా ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాం" అని సిఎం వివరించారు.

# గౌతు లచ్చన్న స్ఫూర్తితో కూటమి పాలన



ఆదివారం సర్దార్ గౌతు లచ్చన్న రాష్ట్ర స్థాయి జయంతోత్సవంలో ఆయన విగ్రహానికి నివాళి అర్పిస్తున్న రాష్ట్రమంత్రులు, ప్రజాప్రతినిధులు

**విజయవాడ, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** సర్దార్ గౌతు లచ్చన్న స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని, బిసిలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అన్నింటా ముందంజలో నిలబెట్టేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని మంత్రులు సవిత, అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, అచ్చెన్నాయుడు తెలిపారు. గౌతు లచ్చన్న పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయాలన్న ఉద్దేశంతోనే ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామన్నారు. బిసిలను గత ప్రభుత్వం లో వేధిస్తే, సిఎం చంద్రబాబు అక్కున చేర్చుకున్నారన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవాన్ని బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు సవిత, అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, అచ్చెన్నాయుడు తొలుత గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మంత్రులు ప్రసంగించారు. గౌతు లచ్చన్న 117వ జయంతిని జరుపుకోవడం ఆనందంగా ఉందని మంత్రి సవిత తెలిపారు. 1909 ఆగస్టు 16న గౌతు లచ్చన్న శ్రీకాకుళం జిల్లా బారువా గ్రామంలో సామాన్య గౌడు కుటుంబంలో జన్మించారన్నారు. తన 21వ యేటనే గాంధీజీ పిలుపు మేరకు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. ఆ ఉద్యమంలో గౌతు లచ్చన్న వెన్నుచూపని పోరాటం చేశారని, జైలు శిక్షలు సైతం అనుభవించిన యోధుడని కొనియాడారు.

అణగారిన వర్గాలు, బీసీలు, రైతులు, కార్మికుల హక్కుల కోసం తుది శ్వాస విడిచిపెట్టే వరకూ పోరాటం చేశారన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా బిసిలు, రైతులు, శ్రామికుల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. గౌతు లచ్చన్న ఆశయాల సాధనే లక్ష్యంగా సిఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు. అన్న ఎన్టీఆర్ బిసిల అభ్యున్నతి కోసం పార్టీని స్థాపించారన్నారు. బిసిలకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యమిస్తూ పాలన సాగిస్తున్నాయన్నారు. విద్యతోనే బిసిలు అభివృద్ధి చెందుతారని నమ్మిన వ్యక్తి సిఎం చంద్రబాబు అని అన్నారు. అందుకే, రాష్ట్ర వ్యాప్తంగా బిసి గురుకులాలను సిఎం చంద్రబాబు ఏర్పాటు చేస్తున్నారన్నారు. గౌతు లచ్చన్న జయంతిని జరగకుండా గత పార్టీ నేత తన హయాంలో అడ్డంకులు సృష్టించారన్నారు.



# సినీ నిర్మాత బండ్ల గణేశ్ కుమార్తె వివాహానికి హాజరైన సిఎం చంద్రబాబు

**విజయవాడ.ఆగస్టు 16,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ సినీ నిర్మాత బండ్ల గణేశ్ కుమార్తె జనని వివాహం పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్య తేజతో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ శుభకార్యానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. సిఎం చంద్రబాబు, భువనేశ్వరిల చేతుల మీదుగా వరుడు సూర్య తేజ మంగళసూత్రం అందుకుని వధువు జననికి తాళి కట్టారు. తన కుమార్తె వివాహానికి హాజరైన చంద్రబాబును చూసి బండ్ల గణేష్ భావోద్వేగానికి గురయ్యారు. ఎపి నుంచి పలువురు రాజకీయ, వాణిజ్య ప్రముఖులు ఈ వివాహానికి హాజరయ్యారు.

# పెళ్లికి వెళ్లి తిరిగివస్తూ..

- కాల్వలోకి దూసుకెళ్లిన కారు
- ఆరుగురు విద్యార్థులు గల్లంతు
- ప్రాణాలతో ఒకరు క్షేమం
- నలుగురి మృతదేహాలు లభ్యం
- మరొకరి కోసం ముమ్మర గాలింపు
- పశ్చిమగోదావరి జిల్లాలో విషాద ఘటన

**ఏలూరు, ఆగస్టు 16 పశ్చిమ గోదావరి ప్రభాతవార్త బ్యూరో:** ఇరగవరం మండలం ఐతంపూడి లాకుల సమీపంలో ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అదుపుతప్పిన కారు పెరవలి-నరసాపురం కాలువలోకి దూసుకెళ్లడంతో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు గల్లంతు కాగా వీరిలో ఒకరు క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. వీరంతా శనివారం రాత్రి పెరవలిలో జరిగిన వివాహ వేడుకకు హాజరయ్యారు. తిరిగి అర్ధరాత్రి దాటిన తర్వాత వెళుతుండగా ఓగిడి నుంచి ఐతంపూడి వెళ్లే దారిలో కారు అదుపు తప్పి కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం మోరికి చెందిన పోతుల లక్ష్మి భానువికాస్ అభిరామ్ (18), నాగిరెడ్డి దుశ్వంత్ సాయి (18), చెరుకూరి రాజారాం చరణ్ (16), అమలాపురం మండలం చాకూరుకి చెందిన నాగాబత్తుల సాయిసూర్యతేజ (19), పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం చింతపర్రు గ్రామానికి చెందిన వీరమల్లు సాయి వెంకటకిరణ్ (18) ఐదుగురు గల్లంతు కాగా ఆచంట మండలం వల్లూరు గ్రామానికి చెందిన మట్టా సంతోష్ ప్రాణాలతో బయట పడ్డాడు. ఆదివారం సాయంత్రానికి గాలింపు చర్యల్లో భాగంగా ఐతంపూడి లాకుల వద్ద భానువికాస్, మరికొంతదూరంలో సాయివెంకటకిరణ్, నెగ్గిపూడి లాకుల వద్ద దుశ్వంత్ సాయి, తేజసాయిసూర్య మృతదేహాలు లభ్యమయ్యాయి. ఓగిడికి చెందిన మండే గణేష్ తనకు వరుసకు సోదరుడయ్యే జోగా వెంకటదుర్గాప్రసాద్ వివాహానికి తన స్నేహితులను పిలిచాడు. పెరవలిలోని పెళ్లి అనంతరం ఇరగవరం మండలం ఓగిడి గ్రామంలోని పెళ్లికొడుకు నివాసానికి వెళ్లినవారు, అర్ధరాత్రి దాటిన తర్వాత కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఓగిడి నుంచి ఐతంపూడి వైపు వస్తుండగా లాకుల సమీపంలోని మలుపువద్ద కారు అదుపుతప్పి పెరవలి-నరసాపురం కాలువలోకి దూసుకెళ్లింది. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. మట్టా సంతోష్‌ను సురక్షి తంగా బయటకు తీసుకొచ్చారు.

**నలుగురి మృతదేహాలు లభ్యం:**

సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టాయి. గజ ఈతగాళ్ల సహాయంతో కాలువలో ముమ్మరంగా గాలింపు నిర్వహించారు. ఆదివారం సాయంత్రానికి పోతుల లక్ష్మీ భాను వికాస్ అభిరామ్, నాగిరెడ్డి దుశ్వంత్ సాయి, వీరమల్లు సాయి వెంకటకిరణ్, నాగాబత్తుల సాయి సూర్యతేజ మృతదేహాలను వెలికితీశారు. తోటి విద్యార్థులు మృతి చెందడంతో నరసాపురంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలతో పాటు విద్యార్థుల స్వగ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది. మృతుల కుటుంబ సభ్యుల రోదనలతో సంఘటనా ప్రాంతం విషాదభరితంగా మారింది. వివాహ వేడుకకు వెళ్లి సంతోషంగా తిరిగి వస్తున్న యువకుల ప్రయాణం విషాదంగా మారడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యేలు:**

ప్రమాద సమాచారం తెలుసుకున్న తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. గల్లంతైన విద్యార్థుల కోసం గాలింపు చర్యలను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ బాధిత కుటుంబాలను పరామర్శించారు. తాడేపల్లిగూడెం డిఎస్పీ యు.రవిచంద్ర, తణుకు రూరల్ సిఐ డి.వెంకటేశ్వర రావు, తణుకు టౌన్ సిఐ జెవి రమణ తదితర అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతదేహాలను తణుకులోని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వారం - వర్జ్యం

17-08-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.పంచమి సా.5.05 న.చిత్త తె.4.59
వ.మ.12.14-మ.1.55
దు1. మ.12.36-మ.1.27
దు2. మ.3.08-మ.3.59
రాహు ఉ.7.30-ఉ.9.00
శుభ ఉ.7.00-ఉ.8.00

## వార్తాఫలం

**మేషం :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. ఏ పనిని చేపట్టినా చికాకు కలిగిస్తాయి. వాహన సౌఖ్యంకలదు.

**వృషభం :** ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊపిరి పీల్చుకుంటారు. నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**మిథునం :** సాంకేతిక పరిశోధన విషయాలపై ఆసక్తి చూపుతారు. వ్యాపారాలలో స్వల్ప మార్పులు చోటు చేసుకుంటారు.

**కర్కాటకం :** చర్చాగోష్ఠులలో పాల్గొంటారు. పనులు మందకొడిగా సాగుతాయి. నూతన ఒప్పందాలు చేసుకుంటారు.

**సింహం :** దూరప్రాంతాల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

**కన్య :** వివాదాలకు దూరంగా ఉండండి. ఉద్యోగులకు స్థాన చలనం ఉంటుంది. సోదరుల కలయిక. వాహన సౌఖ్యం.

**తుల :** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడుతాయి. ఆస్తి వివాదాలు, కోర్ట్ కేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి. వస్త్ర లాభం.

**వృశ్చికం :** స్త్రీలతో వివాదాలు ఏర్పడకుండా జాగ్రత్తలు పాటించండి. ఊహించని విధముగా ఉద్యోగావకాశాలు పొందుతారు.

**ధనుస్సు :** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. స్వల్ప ధనలాభం. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**మకరం :** ఋణబాధల నుండి విముక్తి పొందుతారు. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. సోదరుల కలయిక.

**కుంభం :** మీలోని సృజనాత్మకత వెలుగు చూస్తుంది. వ్యాపారాభివృద్ధి పట్ల దృష్టి సారిస్తారు. ఇంటా బయటా ప్రోత్సాహం.

**మీనం :** పూర్తిగా ఆశలు వదులుకొన్న కార్యక్రమాలను సానుకూలము చేసుకోవటానికి కృషి చేస్తారు. వాహన సౌఖ్యం కలదు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

వార్త

కన్పించే శత్రువు శాపంలా అన్పించవచ్చు. కాని నటించే మిత్రుడు శత్రువు కన్నా ప్రమాదకరం.

- జాన్ గే

# మత్తు వదిలిస్తారా?

గతి తప్పినా, మతి తప్పినా ఏ వాహన చోదకుడైనా వెళ్లేది నేరుగా యమలోకానికే అన్న విషయంలో ఎవరికీ ఏ భిన్నాభిప్రాయమూ ఉండదు. వాహనాలు నడిపేటప్పుడు అది నేల మీదనైనా, గాల్లోనైనా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. ఎంతో మంది ప్రయాణికుల ప్రాణాలు, భవిష్యత్తు వాహన చోదకుల అప్రమత్తత మీదనే ఉంటుంది. వారు ఏ తప్పు చేసినా ప్రయాణికుల ప్రాణాల్లో గాల్లో కలిసిపోతాయి. మాదకద్రవ్యాలు, గంజాయి, మద్యం సేవించిన వారువాహనాలు నడిపినప్పుడు రోడ్డు ప్రమాదాల్లో పడి చనిపోయిన సంఘటనలెన్నెన్నో వింటున్నాము. కుటుంబ జీవనాధారమైన వ్యక్తులు విమాన ప్రమాదాల్లో చనిపోయిన వారి కుటుంబాల పరిస్థితి దిక్కుతోచదు. థాయ్‌లాండ్‌లోని పుకెట్-ఢిల్లీ ఎయిర్ ఇండియా విమానం గాల్లో ఉండగానే 300 అడుగులు కిందకు పడిపోయిన ఘటనలో 'బ్లాక్ బాక్స్' డేటా చెప్పిన విషయాలు అవలోకిస్తే కొంత ఆశ్చర్యమూ కొంత దిగులు కలుగుతుంది. విమానంలోని మూడు హైడ్రాలిక్ వ్యవస్థలు ఒకేసారి విఫలమవడంతో దాదాపు 4 సెకెన్లతోపాటు ఫ్లైట్ కంట్రోల్స్ పూర్తిగా మొరాయించాయని విమాన తయారీ సంస్థ ఎయిర్‌బస్ తన ప్రాథమిక నివేదికలో వెల్లడించింది. ప్రధానంగా చెప్పుకోవాల్సిన విషయం మరొకటి ఉంది. పైలట్ గంజాయి తీసుకున్నట్లు రెండుసార్లు చేసిన డోపింగ్ పరీక్షలో తేలింది. మాదకద్రవ్యాల ప్రభావంతోనే పైలెట్లు గతి తప్పి విమానాలు ప్రమాదాలకు గురై ఎన్నోప్రాణాలు గాల్లో కలిసిపోయిన సంఘటనలు వింటున్నాము. మత్తు ఎంత ప్రమాదమో అందరికీ తెలిసిందే.ప్రభుత్వాలు అప్రమత్తం చేస్తున్నా, ప్రభుత్వ ఉద్యోగులు, విమాన చోదకులు మాదకద్రవ్యాలు తీసుకోరాదని నిబంధనలున్నా ఎవరూ పాటించడం లేదు. వాటి నిషేధాన్ని అమలు పెట్టాల్సిన అధికారులు కూడా పట్టించుకోరు. ఈభయంకర సత్యాల నేపథ్యంలో ఎయిర్ ఇండియా పైలెట్లకు డోపింగ్ పరీక్షలను తప్పనిసరి చేసింది. ఏ-320 నియోవిమానం హఠాత్తుగా 300 అడుగుల కిందకుపడిపోయి తీవ్ర సంచలనం సృష్టించింది. ప్రయాణికులు ఎంతగానో గాభరాపడ్డారు. ప్రతి విమానంలోనూ ఉన్నట్లే ఈ విమానంలోకూడా 'డిజిటల్ ఫ్లైట్ డేటా రికార్డర్' సమాచారాన్ని విశ్లేషించిన అనంతరమే పైలెట్ల వ్యవహారశైలి, తీసుకున్న మాదకద్రవ్యాల వివరాలు వెల్లడయ్యాయి. విమానంలోని అసాధారణ పరిస్థితుల వల్లనే విమాన గమనాన్ని ఎత్తును నియంత్రించే ఎలివేటర్లు, అలైరౌన్లు స్పాయిలర్లు నాలుగు సెకన్లపాటు పైలెట్ ప్రమేయం లేకుండా తమంతటతామే కదిలాయని విశ్లేషణలో తేలింది. విమానం రెక్కలుగాల్లో తగినంత లిఫ్ట్ ఇవ్వలేకపోతున్నాయని 'స్టాల్'హెచ్చరికలు వచ్చాయి. ప్రయాణికుల భద్రత, నమ్మకమే ప్రధానంగా ఎయిర్ ఇండియా యాజమాన్యం కఠిన నిర్ణయం తీసుకుంది. ఒక ప్రమాదం జరగడం దాని విశ్లేషణ, పరిణామాలను బట్టి నిర్ణయాలు తీసుకోవడంవల్లన పోయిన ప్రాణాలు తిరిగిరావు. దాదాపు ప్రపంచంలో ఎలాంటి వాహన చోదకతలో లోపాలున్నాయన్న అయినా విమర్శలకు గురికాకుండా ప్రమాదం వాటిల్లకుండా ముందుజాగ్రత్తలతో పైలెట్లకు డోపింగ్ తప్పనిసరి చేయడం ఆహ్వానించదగినదే. ప్రమాదానికి గురైన విమాన ప్రధాన పైలట్ సుదీప్ విశిష్ట్ విచిత్ర వ్యవహారశైలి, తడపాటు, నడవలేక తూలుతున్నవైనాన్ని బట్టి మూత్ర నమూనాల పరీక్ష చేయిస్తే అసలు విషయం బయటపడింది. ఈ విమానం కిందకు దిగేక్రమంలో ప్రయాణికులు తీవ్ర ఒత్తిడికిగురయ్యారు.దాదాపు ప్రయాణికులు కుదుపునకు గురై విమానంపై కప్పునుబలంగా ఢీకొట్టారు. విమానాన్ని నడిపే పైలట్ సరైన మానసికస్థితిలో కానీ శారీరక పటుత్వంతో కానీ లేకుంటే జరిగే ప్రమాదాలకు, దుస్సంఘటనలకు ఆ విమాన సంస్థే బాధ్యత వహించాల్సిందే. విమానాల వర్కింగ్ కండిషన్ బాగుంటేనే అవి సజావుగానడుస్తాయి. తాజాగా ఎయిర్ ఇండియా తీసుకున్న నిర్ణయం వలన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 5వేల మంది పైలెట్లు డోపింగ్ టెస్ట్ చేయించుకోవాల్సి ఉంటుంది. పైలెట్లు, సిబ్బంది డోపింగ్ టెస్ట్‌లో నిషేధిత ఆహార పదార్థాలున్న సంకేతాలు కానీ,ఆనవాళ్లు కానీ కనబడితే, నిర్ధారణ పరీక్షల్లో పాజిటివ్‌గా వస్తే అది ప్రమాదాలను సూచిస్తుంది. ఘటన జరిగినప్పుడే కాస్త హడావుడి.మళ్లీ మామూలే. ముందుగా విమాన భద్రతా లోపం కన్పిస్తే జాగ్రత్తపడేందుకు ఎన్నో అవకాశాలున్నాయి. విమానయాన సంస్థలు యేటాకనీసం10శాతం ఫ్లైట్ క్రూను యాదృచ్ఛికంగా సైకోయాక్టివ్ ప్రమాదాలు పడుతుంటాయి. ఒక పరీక్షల్లో పాజిటివ్ వచ్చినంత మాత్రాన శరీరం రోగగ్రస్థమని అనుకోనక్కర్లేదు. ఈ పరీక్షలను ఒక్క పైలట్‌లకే సబ్ స్టాన్సెస్ పరిమితం చేయడం తప్పు.డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఏవియేషన్ నిబంధనల ప్రకారంయేదాదికి 10శాతం మంది పైలట్లకు మాత్రమే యాదృచ్ఛికంగా డ్రగ్స్ పరీక్షలు నిర్వహిస్తుంటారు. ఆధునిక విమానయాన రంగంలో సిబ్బందిపై విపరీత పనిభారం, సక్రమంగా లేని రోస్టర్ వేళలు,తగినంత విశ్రాంతి దొరక్కపోవడం వంటిఅంశాల్లో వారి మానసిక ఒత్తిడివారి ఆరోగ్యం మీద పడుతోంది. డ్రగ్స్ వాడకాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించకూడదు. విమానం నడిపే పైలట్ చేతిలో వందలకొద్దీ ప్రాణాలుంటాయి.ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా అంతే సంగతులు.ఎయిర్ ఇండియా వంటి విమానయాన సంస్థలు మరికొన్ని తమ సర్వీసులను నడిపిస్తున్నాయి. ఆ సంస్థలు కూడా తమ పైలట్‌లు ఇటువంటి నిబంధనలు పాటించేటట్లు చూసుకోవాలి. నిన్నమొన్నటి విమాన ప్రమాదం మొదటిది కాకున్నా, ఇలాంటి ప్రమాదం మరొకటి జరగకుండా అప్రమత్తంగా ఉండాలి.



ప్రతి ఒక్కరూ ఇది చెడు అని చెప్పగలరు. అయితే అందులో నుంచి బయటపడే మార్గం చెప్పగలిగినవాడే నిజమైన మిత్రుడు.

స్వామి వివేకానంద



సాధారణంగా ప్రతి వారు 'నాకు' ముక్తి కావాలనుకుంటారు. ఇది సరికాదు. 'నాకు' అనే పదం నుండి విముక్తి కావాలి.

రమణ మహర్షి

# ప్రజావాక్కు



### మానవ వివేచన ముఖ్యం

కృత్రిమ మేధస్సు వేగంగా విస్తరిస్తున్న కొద్దీ ఉద్యోగ ప్రపంచం స్వరూపం కూడా గణనీయంగా మారుతోంది. ఏఐ ఆధారిత కోర్సులకు బిజినెస్ స్కూళ్లు,ఉన్నత విద్యా సంస్థలు ప్రాధాన్యం ఇవ్వడం అవసరమే. అయితే సాంకేతికనైపుణ్యాలకే పరిమితమైతేభవిష్యత్ ఉద్యోగ ప్రపంచాన్ని ఎదుర్కొనే సమగ్ర సామర్థ్యం విద్యార్థుల్లో పెరగదు. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు మానవీయ నైపుణ్యాలను పెంపొందించడంపైనే విద్యాసంస్థలు దృష్టి సారించాలి. కమ్యూనికేషన్, బృందంగా పనిచేయడం, విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కారం, నిర్ణయ సామర్థ్యం వంటి నైపుణ్యాలు ఏఐ విస్తరిస్తున్నా తమ ప్రాధాన్యాన్ని కోల్పోవు. యంత్రం సమాచారాన్ని వేగంగా విశ్లేషించగలదు. కానీ ఆ సమాచారానికి సందర్భాన్ని జోడించడం, దాని విశ్వసనీయతను పరిశీలించడం, నైతిక పరిణామాలను అంచనా వేయడం, తుది నిర్ణయం తీసుకోవడం మానవ వివేచనపైనే ఆధారపడి ఉంటుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల భవనాలు దాదాపుగా ఆధునీకరించబడినవి. ఏప్రభుత్వ కార్యాలయం అయినా మార్పులు చేసేటప్పుడు ప్రధానంగా పారిశుధ్యపు వసతి, నీటి సరఫరా, విద్యుత్ కలిపే చేస్తారు. మరి మహిళలకు ఒకటి వేరేగా వాష్‌రూమ్ ఉంటేనే సిబ్బంది, మహిళ విద్యార్థినీలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.ఇవి లేనందున కొందరుఅమ్మాయిలు వేరే ప్రైవేట్ పాఠశాలకు వెళ్ళే ప్రయత్నం చేస్తున్నారు. ఇది అతి సహజమైనది. కొందరు బడి మానివేయడం బాధాకరం. వీరు చెప్పే ధైర్యం లేక అలా చేస్తున్నారు.ఇది చిన్న సమస్య. విద్యాశాఖ ఈ వసతి కూడా లేని పాఠశాలల్లో వాష్‌రూమ్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి.

- బి. మేఘనాదం, విశాఖపట్నం

### యూరప్ సంక్షోభం!

నిజానికి మొరాకోలో పేదరికం తగ్గింది అయితే యువకులలో నిరుద్యోగం పెరిగింది.అది ఎంతగా అంటే దేశంలో ఉన్న మొత్తం నిరుద్యోగం కంటే మూడింతలు ఎక్కువ నిరుద్యోగంఉంది.అందుకేకొన్నినివేదికలప్రకారం స్పెయిన్ లోను, గ్రీస్‌లోను ఇటలీలోకి వలసలు పెద్ద మొత్తంలో ఉన్నాయి. అభివృద్ధి అనేది ఉపాధి రహితంగా ఉంది.

-భారత అవినాష్, జనగామ

### పరిశుభ్రత ప్రతి పౌరుడి కర్తవ్యం

నేడు కొందరు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం, ప్లాస్టిక్ సీసాలు,కవర్లు, ఆహార అవశేషాలు రోడ్లపై పడేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. చెత్తను నిర్లక్ష్యంగా పారేయడం వల్ల దుర్వాసన, దోమలు, ఈగలు పెరిగి అనేకవ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. మన ఇల్లు ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో,మన వీధులు,పార్కులు, బహిరంగ ప్రదేశాలుకూడా అంతేశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది. పరిశుభ్రత ప్రభుత్వ బాధ్యతే కాదు, ప్రతి పౌరుడి కర్తవ్యం కూడా. పరిశుభ్రమైన పరిసరాలతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం. ఇతరులకు ఆదర్శంగా నిలుద్దాం.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

### అన్నదాత పట్ల చొరవ చూపాలి

ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక కుదేలవుతున్న రైతన్న కష్టాలువర్ణనాతీతం.అనాది నుంచి కర్షకుడికి అతివృష్టి, అనావృష్టి అవినాభావ సంబంధం అంటే అతిశయోక్తికాదు. అగ్నికిఆజ్యం పోయకుండా కల్తీ విత్తనాలు, ఎరువులు తదితర వ్యవసాయ సంబంధిత వనరులతో మూలిగే నక్కమీదతాటికాయపడినట్లు ఈ యేడాది రుతుపవనాలు ఆలస్యానికి కారణమయిన ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం వల్ల పంటలకు కోలుకోలేని దెబ్బ. మొత్తం దేశం సాగుకు గుదిబండ దాంతోఅప్పుల బాధతో ఆగని ఆత్మహత్యలు. దేశానికి వెన్నెముఖ శ్రామికుడు కళ్లలో మెరుపులు చూసినప్పుడే ప్రజలు సుభిక్షం. కావున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాత పట్ల మరింత చొరవ చూపాలి.

- ఆర్. వెంకటేష్, బెంగళూరు

### వినియోగదారుల రక్షణ నైతిక బాధ్యత

వాట్సాప్ ప్రతిపాదించిన యూజర్‌నేమ్ ఫీచర్‌పై దేశవ్యాప్తంగా జరుగుతున్న చర్చ ఒక కీలకఅంశాన్ని వెలుగులోకి తెచ్చింది.వినియోగదారుల సౌలభ్యం ఎంతముఖ్యమో, వారి భద్రత అంతకంటే ముఖ్యమనే విషయాన్ని ఈవివాదం గుర్తు చేస్తోంది. ఫోన్ నంబర్‌కు బదులుగా యూజర్‌నేమ్ ఆధారంగా సంభాషించే అవకాశం కల్పించడం గోప్యతకు మేలు చేసినా, అదే సమయంలో నకిలీగుర్తింపులు, వ్యక్తుల పేర్లను అనుకరించడం,ఆర్థికమోసాలు, సైబర్ నేరాలకు అవకాశం కల్పిస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం భద్రతాపరమైన అంశాలపై వివరణ కోరుతూ జాగ్రత్త వైఖరిని అవలంబించడం సముచితమే.

-సి.సాయి, నల్గొండ జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# యువత వికాసమే అభివృద్ధికి కొలమానం

**యువతుల విషయంలో భద్రత, ప్రయాణ సౌకర్యం, పిల్లల సంరక్షణ, అనువైన పని విధానాలు కల్పించి వారు స్థిరమైన ఆదాయం పొందేపరిస్థితులను సృష్టించాలి. అలాగే గ్రామీణ, చిన్న పట్టణ యువతకు నాణ్యమైన విద్య, ఇంటర్నెట్, గ్రంథాలయాలు అందుబాటులో ఉంచి ఆర్థిక పరిస్థితి అడ్డంకిగా మారకుండా విద్యా రుణాలు, ఉపకార వేతనాలను విస్తరించాలి. 2036 నాటికి యువత జనాభా 34.55 కోట్లకు తగ్గే అవకాశం ఉన్నందున ప్రస్తుత దశలో తీసుకునే నిర్ణయాలు దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతాయి. యువత సంఖ్యను మానవ సామర్థ్యంగా మార్చడానికి విద్యతోపాటు నైపుణ్యం, ఉపాధి, మానసిక ఆరోగ్యం, ఆర్థికభద్రత, మహిళల భాగస్వామ్యం అవసరం. యువతను కేవలం దేశ 'భవిష్యత్తు' అని పిలవడంతో సరిపెట్టకుండా వారు తమ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకునే వాతావరణాన్ని నిర్మించడమే ప్రభుత్వ విధానాల ప్రధాన లక్ష్యం కావాలి.**

డి. జయరాం

నేటి యువత ఆకాంక్షలను కేవలం ఒక ఉద్యోగానికి మాత్రమే పరిమితం చేయడం సరిపోదు. ఆర్థిక స్వావలంబన, స్థిరమైన ఆదాయం, నాణ్యమైన ఉద్యోగం, వ్యక్తిగత స్వేచ్ఛ, నిరంతర అభ్యాసం, పని వ్యక్తిగత జీవితాల మధ్య సమతుల్యత వారి ప్రధాన ప్రాధాన్యతలుగా మారాయి. గ్రామీణ యువతకు స్థిరమైన ఉపాధిమార్గాలు, పట్టణ యువతకు వృత్తిపరమైన పురోగతి, యువతులకు ఆర్థిక స్వాతంత్ర్యంతో పాటు భద్రత, ప్రయాణ సౌకర్యాలు, అనుకూలమైన పని వాతావరణం ప్రధాన అవసరాలుగా కనిపిస్తున్నాయి. జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవడంతో పాటు తమ జీవిత నిర్ణయాలను స్వతంత్రంగా తీసుకునే స్వేచ్ఛను వారుకోరుకుంటున్నారు. 2026 నాటికి భారత దేశంలో 15 నుండి 29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత జనాభా సుమారు 36.74 కోట్లకు చేరింది. 2021 నాటికి ఈ సంఖ్య 37.14 కోట్లుగా ఉండగా, దేశ జనాభాలో యువత వాటా 27.2 శాతంగా నమోదైంది. 2031 నాటికి ఇది 35.66కోట్లకు,2036 నాటికి 34.55 కోట్లకు తగ్గుతుందని ప్రభుత్వ అంచనాలు చెబుతున్నాయి. ప్రస్తుతం భారత్ వద్ద ఉన్న ఈ భారీ యువ జనాభా ఒక ప్రత్యేకమైన ఆర్థిక అవకాశం. విద్య, నైపుణ్యాలు, ఉపాధి, ఆరోగ్యం, ఆర్థిక భద్రత వంటి అంశాలను సమర్థంగా అనుసంధానించగలిగితేనే ఈ జనాభా ఉత్పాదక శక్తిగా మారుతుంది. ఈ మారిన ఆకాంక్షలకు ఆర్థిక పరిస్థితులు పెద్ద సవాలుగా నిలుస్తున్నాయి. 2026 డెలాయిట్ సర్వేప్రకారం భారత జెన్ జెడ్ స్పందించిన వారిలో 54 శాతం మంది ఆర్థిక అనిశ్చితి కారణంగా ముఖ్యమైన జీవిత నిర్ణయాలను వాయిదా వేసుకున్నట్లు తెలిపారు. అలాగే 37 శాతం మందికి సొంత ఇల్లు కొనుగోలు చేయడం అందుబాటులో లేక పోగా, 29శాతం మంది ఆర్థిక అసురక్షిత భావనను వ్యక్తం చేశారు.మరో 27శాతం మందికి నిరుద్యోగమే ప్రధానఆందోళనగా మారింది. ఈ గణాంకాలు యువత జీవితంలో ఆర్థిక స్థిరత్వం ఎంత కీలకంగా మారిందో స్పష్టం చేస్తున్నాయి. అందువల్ల నేడు ఉద్యోగ ఎంపికలో వేతనంతో పాటుఉద్యోగ భద్రత, నైపుణ్యాల పెంపు, వ్యక్తిగత సమయానికి ప్రాధాన్యత పెరుగుతోంది. యువత ఆకాంక్షలకు విద్య నుంచి ఉపాధికి జరిగే మార్పు విధానమే కీలకమైన పరీక్షగా నిలుస్తోంది. ఉన్నత విద్య విస్తరిస్తున్నప్పటికీ, విద్యార్థులు పొందుతున్న విద్యకు, ఉద్యోగ మార్కెట్ కోరుతున్న నైపుణ్యాలకు మధ్య అంతరం కొనసాగుతూనే ఉంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ, ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్ సంయుక్తంగా రూపొందించిన ఇండియన్ ఎంప్లాయిమెంట్ రిపోర్ట్ 2024 కూడా భారత కార్మిక మార్కెట్‌లో యువత ఉపాధి, నైపుణ్యాలే కీలక అంశాలని తెలిపింది. విద్యార్థులు పట్టా పొందిన వెంటనే ఉద్యోగానికి సిద్ధంగా ఉండేలావిద్యా వ్యవస్థలో మార్పులు రావాల్సిన అవసరం ఉంది.దీనికోసం కళాశాలలు, విశ్వవిద్యాలయాలు పరిశ్రమలు, పరిశోధనా సంస్థలతో అనుసంధానాన్ని పెంచుకోవాలి. ఇంటర్న్‌షిప్‌లు, ఆచరణాత్మక ప్రాజెక్టులు ఉన్నత విద్యలో అనివార్య భాగం కావాలి. నైపుణ్య శిక్షణకు ఇచ్చే ధ్రువీకరణ పత్రాల సంఖ్య కంటే ఉద్యోగ ప్రాప్తి, ఆదాయ పెరుగుదల,వ్యాపార స్థాపన వంటి ఫలితాల ఆధారంగా ప్రమాణాలను కొలవాలి. కోర్సు



ఎంచుకునే ముందే అభ్యర్థులకు మార్కెట్ డిమాండ్‌పై స్పష్టమైన వృత్తి మార్గదర్శకత్వం అందడం వల్ల ఏ రంగంలో అవకాశాలున్నాయో ముందే తెలుస్తుంది.చదువు పూర్తయ్యాక స్థిరమైన ఉద్యోగం కోసం పోటీ పడే యువతకు అవకాశాలు పరిమితంగా కనిపించినప్పుడు ప్రభుత్వ ఉద్యోగాలపై ఆకర్షణ పెరుగుతుంది. అయితే మొత్తం యువతకు సరిపడా ప్రభుత్వ ఉద్యోగాలు సాధ్యం కావు. కాబట్టి తయారీ, నిర్మాణం, ఆరోగ్యం, పర్యాటకం, రవాణా, ఆధునికవ్యవసాయం, సంరక్షణ సేవలు, డిజిటల్ రంగాల వంటి అధిక ఉపాధి సృష్టించే రంగాలను విస్తరించాలి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రుణాలు, సాంకేతికత సులభంగా అందేలా చూస్తూ, యువ పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సహాయంతో పాటు సరియైన మార్గదర్శకత్వం అందించాలి. అదే సమయంలో ప్రభుత్వ నియామకాలు, పోటీపరీక్షల నిర్వహణలో పారదర్శకత అత్యంత అవసరం. నియామకాల్లో జాప్యం, పరీక్షల నిర్వహణపై అనుమానాలు యువత భవిష్యత్తును తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ప్రతి శాఖ ఖాళీలను ముందుగానే ప్రకటించి నిర్ణీత కాలపరిమితిలో నియామక ప్రక్రియ పూర్తిచేయాలి. పరీక్షా విధానంలో సాంకేతిక భద్రతను పెంచి, కష్టపడి చదివే అభ్యర్థికి తన శ్రమకు తగినన్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని కల్పించాలి.ఉపాధి పోటీ, విద్యా ఒత్తిడి, ఆర్థిక అనిశ్చితి యువత మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. యునిసెఫ్ ప్రకారం 18-29 సంవత్సరాల యువతలో 7.3 శాతం మంది మానసిక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటుండగా, ఎన్‌సీఈఆర్‌టీ సర్వేలో 11శాతం మంది విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు వెల్లడైంది. ప్రతిలక్ష జనాభాకు కేవలం 0.75 మంది మానసిక వైద్యులు మాత్రమే ఉండటం సేవల కొరతను సూచిస్తోంది. అందుకే పాఠశాలలు, కళాశాలల్లో గోప్యతతో కూడిన సలహా కేంద్రాలను ఏర్పాటుచేసి, మానసిక ఆరోగ్య సేవలను సంక్షోభం వచ్చినప్పుడు మాత్రమే కాకుండా ముందస్తు సహాయ వ్యవస్థగా మార్చాలి. మరోవైపు, కృత్రిమ మేధ ఉపాధి ప్రపంచాన్ని వేగంగా మార్చుతోంది. 2026 డెలాయిట్ సర్వే ప్రకారం భారత జెన్ జెడ్, మిలీనియల్స్‌లో90 శాతానికి పైగా ప్రతిరోజూ ఎఐని ఉపయోగిస్తున్నారు. కేవలం సాంకేతిక వినియోగమే కాకుండా డేటా రక్షణ, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. విద్యా సంస్థలు, పరిశ్రమలు కలిసి నిరంతర నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా కొత్త విజ్ఞానాన్ని నేర్చుకునే అవకాశం లభిస్తుంది. యువతుల విషయంలో భద్రత, ప్రయాణ సౌకర్యం, పిల్లల సంరక్షణ, అనువైన పని విధానాలు కల్పించి వారు స్థిరమైన ఆదాయం పొందేపరిస్థితులను సృష్టించాలి. అలాగే గ్రామీణ, చిన్న పట్టణ యువతకు నాణ్యమైన విద్య, ఇంటర్నెట్, గ్రంథాలయాలు అందుబాటులో ఉంచి ఆర్థిక పరిస్థితి అడ్డంకిగా మారకుండా విద్యా రుణాలు, ఉపకార వేతనాలను విస్తరించాలి. 2036 నాటికి యువత జనాభా 34.55 కోట్లకు తగ్గే అవకాశం ఉన్నందున ప్రస్తుత దశలో తీసుకునే నిర్ణయాలు దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతాయి. యువత సంఖ్యను మానవ సామర్థ్యంగా మార్చడానికి విద్యతోపాటు నైపుణ్యం,ఉపాధి, మానసిక ఆరోగ్యం,ఆర్థికభద్రత, మహిళల భాగస్వామ్యం అవసరం. యువతను కేవలం దేశ 'భవిష్యత్తు' అని పిలవడంతో సరిపెట్టకుండా వారు తమ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకునే వాతావరణాన్ని నిర్మించడమే ప్రభుత్వ విధానాల ప్రధాన లక్ష్యం కావాలి. ●

# డిజిటల్ శబ్దంలో ప్రకృతి స్వరం వినిపిస్తుందా?

ఫిరోజ్ ఖాన్

స్వాతంత్ర్య దినోత్సవ వైభవం ముగిసింది. దేశం సాధించిన విజయాలను గర్వంగా స్మరించుకున్నాం. అయితే ఆ సంబరాల తర్వాత కూడా మన ముందున్న ఒక ప్రశ్నను విస్మరించలేం. అభివృద్ధి ఫలితాలు ప్రతి పౌరుడి దైనందిన జీవితంలో ఎంతవరకు ప్రతిఫలిస్తున్నాయి? స్వతంత్రం అంటే కేవలం విదేశీపాలన నుంచి విముక్తి మాత్రమే కాదు. ప్రతి పౌరుడు ఆరోగ్యకరమైన, సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణంలో జీవించే అవకాశమూ దాని విస్తృత భావనలో భాగమే. ఇది ఏ ప్రభుత్వానికీ, ఏ రాజకీయ పార్టీకీ వ్యతిరేకమైన ప్రశ్న కాదు. అభివృద్ధి, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యతను ఎలా సాధించాలనే అంశంపై సమాజం చేసుకోవాల్సిన ఆత్మపరిశీలన. భారత రాజ్యాంగంలోని 48ఏ అధికరణం పర్యావరణం, అడవులు,వన్యప్రాణుల పరిరక్షణకు రాష్ట్రం కృషి చేయాలని సూచిస్తే, 51ఏ(జి) అధికరణం ప్రకృతి పట్ల కరుణతో వ్యవహరించడం ప్రతి పౌరుడి కర్తవ్యంగా పేర్కొంటుంది. న్యాయవ్యవస్థ కూడా జీవించేహక్కును ఆరోగ్యకరమైన పర్యావరణంతో అనుసంధానిస్తూ వచ్చిన నేపథ్యంలో, అభివృద్ధిని కేవలం ఆర్థిక గణాంకాలతో కాకుండా పౌరుడు పీల్చే గాలి, తాగే నీరు, పిల్లలు పెరిగే పరిసరాలు, నగరాల్లో పచ్చదనం వంటి అంశాలతోనూ అంచనా వేయాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యంలో రాజకీయ చర్చ అనివార్యం. ఎన్నికలు, విధానాలు, అధికార-ప్రతిపక్ష వాదనలు ప్రజా జీవితంలో సహజమైన భాగాలే. అయితే డిజిటల్ వేదికలపై ఏఅంశం ఎంత వేగంగా వైరల్ అవుతుందో,అదే అంశం ప్రజా చర్చలో ఎంతకాలం నిలుస్తుందో కూడా మారుతోంది.రాజకీయ అంశాలు తక్షణ దృష్టిని ఆకర్షిస్తున్న సమయంలో గాలి, నీరు, అడవులు, వాతావరణ మార్పు, ప్రజారోగ్యం వంటి దీర్ఘకాలిక సమస్యలు వెనుకబడే అవకాశం ఉంది. రాయిటర్స్ ఇన్‌స్టిట్యూట్ డిజిటల్ న్యూస్ రిపోర్ట్ 2026లో భారత్‌కు సంబంధించిన సర్వేలో వార్తలపై విశ్వాసం 39



శాతంగా నమోదైందని, ఆన్‌లైన్‌లో తప్పుడు లేదా తప్పుదారి పట్టించే సమాచారంపై ఆందోళన వ్యక్తం చేసిన వారి వాటా 58శాతంగా ఉందని పేర్కొంది. సామాజిక మాధ్యమాలను పూర్తిగా ప్రతికూలంగా చూడటం కూడా సరైంది కాదు. అవే వేదికలు పర్యావరణ అవగాహన, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, స్థానిక సమస్యలకుప్రజా దృష్టి తీసుకురావడంలో ఉపయోగపడుతున్నాయి. అసలు అవసరం వైరల్ సమాచారాన్ని వెంటనే నిజమని నమ్మడం కాదు. మూలాలను పరిశీలించడం, శాస్త్రీయ ఆధారాలను గౌరవించడం, ధృవీకరించిన సమాచారాన్నే ముందుకు తీసుకెళ్లడం. దేశంలో రహదారులు, పరిశ్రమలు, పట్టణాలు, డిజిటల్ సేవలు విస్తరిస్తున్న కొద్దీ వాటి పర్యావరణ ప్రభావాలను ముందుగానే అంచనా వేసి తగ్గించడం కూడా అవసరం. ప్రపంచ ఆరోగ్యసంస్థ వాయు కాలుష్యాన్నిప్రజారోగ్యానికి ప్రధాన ప్రమాద కారకంగా గుర్తిస్తోంది. సూక్ష్మ కణకాలుష్యం, ముఖ్యంగా పీఎం 2.5, ఆరోగ్యంపై చూపే ప్రభావాలపై ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం ద్వారా నగరాల్లో గాలినాణ్యత మెరుగుదల, కాలుష్య నియంత్రణ, స్థానికస్థాయి కార్యాచరణకు ప్రాధాన్యం ఇస్తోంది. ఇటువంటి కార్యక్రమాల అసలు ఫలితం వాటి అమలు,పర్యవేక్షణ,ప్రజలకు అందుతున్నప్రయోజనాల్లో కనిపించాలి.వాహనాల ఉద్గారాలు,నిర్మాణ ధూళి, రోడ్డు ధూళి, వ్యర్థాల దహనం, పారిశ్రామిక ఉద్గారాలు వంటి కాలుష్య వనరులపై నిరంతర పర్యవేక్షణ అవసరం. అభివృద్ధి ఆగాల్సిన అవసరం లేదు. పర్యావరణ పరిరక్షణను అభివృద్ధికి వ్యతిరేకంగా చూడకుండా, అభివృద్ధి నాణ్యతను నిర్ణయించే ఒక ముఖ్యమైన ప్రమాణంగా చూడాల్సిన సమయం ఇది. దేశాభివృద్ధిని ఇకపై కేవలం జీడీపీ, హైవేలు, భవనాలు,పెట్టుబడుల పరిమాణంతోనే కొలవడం సరిపోదు.అభివృద్ధి మధ్యఒక సాధారణ పౌరుడి జీవన నాణ్యత ఎంత మెరుగుపడిందన్నదీ అంతేముఖ్యమైన ప్రమాణం కావాలి. దేశం ఎంత ఎత్తుకు ఎదిగిందన్నదే కాదు, ఆఎదుగుదల ప్రతిపౌరుడికి ఎంత ఆరోగ్యకరమైన,స్వచ్ఛమైన,జీవితం అందించిందన్నదే నిజమైన ప్రగతికి కొలమానం. ●

# సాగునీరు లేక ఎండిపోతున్న కృష్ణా డెల్టా

కె. శ్రీనివాస్

కృష్ణా డెల్టాకు జూన్ 15 నుండి సాగునీరు విడుదల చేస్తామని ప్రకటించడంతో కొద్దిపాటి వర్షాలు, కాలువకు వచ్చిన నీరుతో రైతులు నారుమళ్ళు వేసుకున్నారు.కృష్ణా డెల్టాలో ఇప్పుడు వరి వేయవద్దు అంటూ ప్రచారం చేయడంతో రైతులు, కౌలు రైతులు గందరగోళ స్థితిలోఉన్నారు. కృష్ణా డెల్టా పరిధిలో ఖరీఫ్‌లోనే వరి సాగు చేసే పరిస్థితి ఉంది. సాగునీరు లేక రబీ కాలంలో రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకుంటున్నారు. ఖరీఫ్, రబీ కాలాల్లో ఆరుతడి పంటలు సాగు చేసుకోమని చెప్పడం వలన కృష్ణా డెల్టా రైతులకు, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు ఉపాధి లేక వలసలు పోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా డెల్టాకు సాగునీటి సమస్యపై దృష్టి సారించి అందుకు తగులు చర్యలు ప్రకటిస్తే రైతులు కాస్త ఊపిరి పీల్చుకుంటారు. పట్టిసీమ, పులిచింతల ద్వారా కృష్ణా డెల్టాకు సాగునీరు ఇచ్చే అవకాశం ఉంది. ఏలూరు మండలంలో 10వేల ఎకరాలకు పోణంగి పుంత కాలువ ద్వారా గోదావరి జలాలు గోదావరి ఏలూరు కాలువ నుండి అందించవచ్చు. కానీ పోణంగి కాలువకు గోదావరి నీళ్లను విడుదల చేయడం లేదు. అందుకు గోదావరి మెయిన్ కెనాల్ ఆధునీకరించకపోవడం వలన పోణంగి పుంత కాలువకు గోదావరి నీరు అందడం లేదని అధికారులు చెప్తున్నారు. గోదావరి మెయిన్ కెనాల్‌ను ఆధునీకరణ చేయకుండా అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి రైతులను బలి చేస్తున్నారు. పట్టిసీమ కాలువ నీళ్లను కృష్ణా, గోదావరి మెయిన్ కాలువలకు మళ్లించే అవకాశం ఉంది. పట్టిసీమకు గోదావరి నుండి 80టీఎంసీల నీరు తోడుకునే అవకాశం ఉంది. ఇట్లాంటి పరిస్థితుల్లో గోదావరి వరద జలాలను సముద్రం పాలు చేయకుండా కృష్ణా డెల్టా రైతులకు సాగునీరు అందించే పరిస్థితి ఉన్నా పెడచెవిన పెడుతున్నారు. అందుకు తగిన చర్యలు ప్రభుత్వం ఎందుకు తీసుకోవడం లేదో అర్థం కాని పరిస్థితి. శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు పెద్దఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. జలాశయాలు నిండుతున్నాయి. పులిచింతల వద్ద నీటి నిల్వలు ఉన్నాయి. ఎల్‌నినో ప్రభావం తగ్గుతోందని శాస్త్రవేత్తలు చెబుతుంటే అందుకు విరుద్ధంగా ప్రభుత్వం మాట్లాడుతున్నది. వందల టిఎంసిల గోదావరి వరద నీరు సముద్రం పాలు అవుతున్నది. రైతులు, కౌలు రైతులు ఎకరాకు రూ. 10 వేలు నుండి రూ. 15 వేలు వరకు పెట్టుబడులు పెట్టి నారుమళ్ళు వేశారు. కొన్నిచోట్ల నాట్లు కూడా వేశారు. ఈ పరిస్థితుల్లో కృష్ణా కెనాల్, గోదావరి ఏలూరు మెయిన్ కెనాల్ రెండు కూడా సమాంతర కాలువలుగా ఉన్నాయి. ఏలూరు పరిధిలోని కృష్ణా డెల్టా ఆయకట్టుకు గోదావరి జలాలు నేరుగా అందించే అవకాశం ఉంది. గతంలో అనేక సందర్భాల్లో కృష్ణాజిల్లా తేలప్రోలు వరకు కృష్ణా డెల్టాకు గోదావరి జలాలను అందించారు. అయితే ఇప్పుడు కృష్ణా, గోదావరి ప్రధాన కాలువలు ఆధునీకరణ జరగకపోవడంతో ఈ కాలువలు శివారు ప్రాంతానికి సాగునీరు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇందుకు ప్రభుత్వం, ఇరిగేషన్ శాఖ



అధికారులదే బాధ్యత. ఇప్పటికైనా మేల్కొని కృష్ణా,గోదావరి ప్రధాన కాలువలను ఆధునీకరణ చేయాలి. ఇరిగేషన్ శాఖ ప్రణాళికా లోపం చాలా స్పష్టంగా కనబడుతున్నది. రైతులు నారుమళ్ళు వేసుకుని, నాట్లు వేసుకునే సమయంలో నీరు ఇవ్వలేమని చేతులెత్తేయడం భావ్యంగా లేదు. ఖరీఫ్, రబీ రెండు పంట కాలాల్లో అపరాలు సాగు చేస్తే పశువులకు మేత దొరకదు. పైగా పనులు దొరికే పరిస్థితి లేక కౌలు రైతులు,వ్యవసాయ కార్మికులు ఉపాధి కోసం వలసలు పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కృష్ణా డెల్టా ఆయకట్టు భూములకు సాగునీరు విడుదల చేయాలని రైతాంగం కోరుతున్నారు. కొన్ని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కృష్ణ డెల్టాకు సాగునీరు అందించే పరిస్థితి ఉంది. ఉదాహరణకు ఏలూరు రూరల్ మండలంలోని కృష్ణా డెల్టా పరిధిలోని 10వేల ఎకరాలకు పోణంగి పుంత కాలువ ద్వారా గోదావరి జలాలు అందించవచ్చు. పట్టిసీమ ఎత్తిపోతలు కాలువ నీళ్లను పెదవేగి మండలం జానం పేట వద్ద తమ్మిలేరులోకి, ఇతర చోట్ల నుండి మళ్లించి కృష్ణా డెల్టా శివారు భూములకు సాగునీరును గతంలో అందించారు. గోదావరి కాలువకు తూర్పు లాకుల వద్ద మోటార్లు పెట్టి నీరు తోడి గోదావరి జలాలు అందించే అవకాశం ఉన్నది. రైతులు, కౌలు రైతులు వేసిన వరి నారు మళ్ళు, నాట్లు ఎండిపోకుండా సాగునీరు అందించి పంటలను కాపాడాలి. ఇప్పటికైనా ప్రభుత్వం తగు ప్రణాళిక రూపొందించి, నిధులు కేటాయించి కృష్ణా, గోదావరిప్రధాన కాలువలను, ఇతర పంట కాలువలను ఆధునీకరణ చేయాలి. సాగునీటి కోసం కృష్ణా డెల్టా రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారు. ఏలూరు కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. అనేక చోట్ల నిరసనలు తెలియజేస్తున్నారు. అయినా ప్రభుత్వం స్పందించడం లేదు. కదలడం లేదు. ఎల్‌నినో ఉంది ప్రత్యామ్నాయ పంటలు వేసుకోమని వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు ప్రచారం చేస్తున్నారు. అదే శాస్త్రవేత్తలు ఎల్‌నినో ప్రభావం తగ్గుతోందని చెబుతున్నారు. మరోవైపు కృష్ణానది లోని జలాశయాలకు పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. కృష్ణా డెల్టా ఆయకట్టు స్థిరీకరణకు పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. అయినా కృష్ణా డెల్టా సాగుకు నీటి కొరత ఎదుర్కోవాల్సిన పరిస్థితులే ఉన్నాయి. లక్ష కోట్లు పెట్టి గోదావరి బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తామని ఆర్భాటంగా ప్రచారం చేస్తున్నారు. ఉట్టికి ఎగురలేని అమ్మ.. ఆకాశానికి ఎగురుతా అన్నట్లుగా మన పాలకుల మాటలు ఉన్నాయి. కాలువల్లో గుర్రపు డెక్క, తూడు, కర్ర నాచు తొలగించలేని ప్రభుత్వాలు లక్షల కోట్లతో కొత్త సాగు నీటి ప్రాజెక్టులు నిర్మాణం చేస్తామని చెప్పడం ఇవి ప్రజలను మభ్యపెట్టడం తప్ప మరొకటి కాదు. కళ్ళ ఎదుట ఉన్న పంట కాలువల్లో నీరు పారడం లేదు కానీ, ఎక్కడికో నీళ్ల ఇస్తాం.. సస్యశ్యామల చేస్తాం.. అని చెబుతుంటే ఇది రైతులకు అర్థం కాదని ప్రభుత్వాలు భావించడం వారి అవివేకం అవుతుంది. కృష్ణా డెల్టా సాగు నీటి హక్కులను కూడా కాపాడలేకపోతున్నారు. పార్టీలకు అతీతంగా రైతులు తమ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా డెల్టా రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్ పరిణామాలు మరో విధంగా ఉంటాయి. అందుకు పాలకులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పని పరిస్థితులు ఏర్పడతాయి. ఇప్పటికైనా కృష్ణా డెల్టా రైతుల గోడు వినాలి. సాగునీటి సమస్యలు పరిష్కరించాలి. కృష్ణా డెల్టా ఎడారిగా మారకుండా సాగునీటి కోసం కృష్ణా డెల్టా రైతులకు ఉద్యమ మార్గం తప్ప మరో మార్గం లేదు. ●

# సముద్రంలో నిప్పుల తుఫాను!






❖70యేళ్ల రికార్డ్ బ్రేక్ దిశగా ఎల్ నినో ❖మారుతున్న వాతావరణ సరళి ❖వర్షపాతం, ఉష్ణోగ్రతలు, కరవుపై ప్రభావం, ❖నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ అంచనా ❖ ఇక ఆశలన్నీ ఈశాన్యపవనాలపైనే

**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** వర్షాకాలం ప్రారంభమై దాదాపు రెండు నెలలు కావోస్తోంది. కానీ వర్షాలు మాత్రం 'ఒక్కసారి వచ్చిపోమ్మ మెరుపుతీగ' అన్నట్టు ఇలా వచ్చి అలా వెళ్తున్నాయి. ఇక ముందైన వర్షాలు రాకపోతాయా? అని ఓ పక్క రైతులు ఆకాశంవైపు దిగాలుగా చూస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్ఓఎఎ) చేదు వార్తతో పాటు శుభవార్త కూడా చెప్పింది. వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఎల్ నినో బిగ్ షాక్ ఇచ్చింది. ఉష్ణమండల పసిఫిక్ మహాసముద్రంలో ఈ ఎల్ నినో భూతం వేగంగా బలపడుతోంది. ఇది 2026 అక్టోబర్-డిసెంబర్ నాటికి, 1950 తర్వాత నమోదైన మిగతా ఎల్ నినోల తీవ్రత కంటే 69శాతం ఎక్కువగా ఉండొచ్చని నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ వెల్లడించింది. ఎన్ఓఎఎ అంచనా ప్రకారం, ప్రస్తుతం ఏర్పడుతున్న సూపర్ ఎల్ నినో ఇప్పటివరకు నమోదైన వాటిలో అత్యంత బలమైన సంఘటనగా నిలిచేందుకు దాదాపు 69శాతం అవకాశం ఉంది. గతంలో, ఈ సంఘటన "చారిత్రక రికార్డులలోని అతిపెద్ద ఎల్ నినో సంఘటనలలో ఒకటిగా" నిలిచే అవకాశం ఉందని ఎన్ఓఎఎ అంచనా వేసింది. ఈ ఎల్ నినో ఎంత వేగంగా తీవ్రమవుతోందనే దానితో పాటు, ఇది శరదృతువు చివరిలో, శీతాకాలం ప్రారంభంలో గతంలో అనుకున్న దానికంటే బలమైన స్థాయిలో గరిష్ట స్థాయికి చేరుకుం టుందని కంప్యూటర్ మోడల్ మార్గదర్శకాలు దాదాపు ఏకగ్రీవంగా చూపించడం వల్ల, అంచనాలో ఈ మార్పు ప్రధానంగా వచ్చింది. ఎల్ నినో అనేది మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్‌లో సగటు కంటే ఎక్కువ వేడి సముద్ర ఉష్ణోగ్రతలతో కూడిన ఒక వాతావరణ చక్రం. ఈ వెచ్చని నీరు మేఘాలు, భారీ వర్షపాతం ద్వారా వాతావరణంలోకి అధిక పరిమాణంలో వేడిని బదిలీ చేస్తుంది.దీని ఫలితంగా, ప్రపంచవ్యాప్తంగా వాతావరణ సరళి మారుతుంది. ఇది ఇండోనేషియా, ఆస్ట్రేలియాలో కరువుకు, దక్షిణ అమెరికాలోని కొన్ని ప్రాంతాలలో వరదలకు, ఇతర ప్రాంతాలలో అనేక ఇతర ప్రభావాలకు దారితీస్తుంది. ఉష్ణమండల పసిఫిక్‌లోని ఒక ప్రామాణిక ప్రాంతంలో సగటుతో పోలిస్తే సముద్రపు ఉష్ణోగ్రతలు ఎంత వేడిగా ఉన్నాయనే దాని ఆధారంగా ఎల్ నినో తీవ్రతను నిర్ణయిస్తారు. ఈ సంఘటన, దాని తీవ్రతలో మునుపటి రికార్డు హోల్డర్‌గా ఉన్న 1982-83 మధ్య సంభవించిన భారీ సూపర్ ఎల్ నినోను కూడా మించిపోతుందని ఎన్ఓఎఎ అంచనా వేస్తోంది. ఇదే విషయాన్ని భారత భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ పార్లమెంటు ముందు సైతం తీసుకొచ్చింది. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది చివరి త్రైమాసికంలో తీవ్ర వాతావరణ పరిస్థితుల ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది.

**నైరుతి రుతుపవనాల్లో కనిపించని వర్షపాతం**

పసిఫిక్ మహాసముంద్రంలోని నీరు వేడెక్కడం నైరుతి రుతుపవనాలపై ప్రతికూల ప్రభావం చూపిస్తోంది. ఈ కారణంగానే గతంలో పోల్చుకుంటే ఈ ఏడాది వర్షపాతం చాలా తక్కువగా నయోదైంది. భారత వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం, దేశంలో జూన్ 1 నుంచి ఆగస్టు 14 మధ్య కాలంలో దీర్ఘకాలిక సగటులో కేవలం 90శాతం మాత్రమే నమోదయ్యే అవకాశం ఉంది. అంటే ఇది సాధారణం కంటే చాలా తక్కువ అని ఐఎండి స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా మరో శుభవార్త కూడా చెప్పింది. ఈ ఎల్‌నినో ప్రభావం సాధారణంగా నైరుతి రుతు పవనాల వర్షాలను తగ్గించినప్పటికీ, అక్టోబర్-డిసెంబర్ మధ్య దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రాంతాలలో ఈశాన్యరుతుపవనాల రాక కొనసాగుతుంది. ఆ రుతువప నాలపై ఇది పెద్దగా ప్రభావం చూపకపోవచ్చని అంచనావేసింది. అంటే రాబోయే రోజుల్లో ఈశాన్య రుతుపవనాలతో వర్షాలు పెరిగే అవకాశంఉంది. ప్రస్తుతం హిందూ మహాసముద్రంలో బలపడుతున్న పాజిటివ్ ఇండియన్ ఓషన్ డైపోల్ పరిస్థి తులను వాతావరణ శాస్త్రవేత్తలు నిశితంగా గమనిస్తున్నారు. ఒక వేళ ఈ ఓషన్‌డైపోల్ కనుక అక్కడే స్థిరపడితే దక్షిణాది రాష్ట్రాలపై ఎల్‌నినో చూపే ప్రతికూల ప్రభావం తగ్గి,వర్షాలకు అనుకూలమైన వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని చెబుతున్నారు. అంటే రాబోయే రోజుల్లో మనకు వర్షాలు వచ్చే అవకాశం ఉన్నట్టే సూచనలు కనిపిస్తున్నాయి.



## మా పైలట్లను బంధించిన ఖతార్

### ఇరాన్ తాజా ఆరోపణ, ఆ ప్రచారంలో నిజంలేదన్న ఖతార్

**దోహ, ఆగస్టు 16:** తమ సైన్యానికి చెందిన ముగ్గురు పైలట్లను ఖతార్ బంధించిందని, వారిని వెంటనే విడిచిపెట్టాలని ఇరాన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఖతార్ ప్రభుత్వానికి సూచించింది. అయితే, ఇరాన్ ఆరోపణలను ఖతార్ ఖండించింది. తాము పైలట్లను బంధించలేదని, ఈ ప్రచారంలో నిజం లేదని పేర్కొంటూ అధికారిక ప్రకటన విడుదల చేసింది. అమెరికా, ఇరాన్ యుద్ధం ప్రారంభమై దాదాపు ఆఉ నెలలు కావస్తోంది. ఇజ్రాయెల్, అమెరికా కలిసి దాడి చేశాయి. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌తోపాటు అమెరికా సైనిక బేస్ కలిగిన ఇతర గల్ఫ్ దేశాలపై దాడులకు దిగిన సంగతి తెలిసిందే. దుబాయ్, యుఎఇ, సౌదీ, ఖతార్, బహ్రెయిన్ వంటి దేశాలలోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు చేసింది. ఈ క్రమంలో గత ఏప్రిల్‌లో ఖతార్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ వైమానిక దాడులకు దిగింది. యుద్ధ విమానాలతో దాడి చేసింది. అయితే, ఖతార్‌లోని అమెరికా సైన్యం ఈ విమానాల్ని కూల్చివేసింది. ఈ ఘటనలో ముగ్గురు పైలట్లు, విమానాల నుంచి దూకి తమను తాము రక్షించుకున్నారని ఇరాన్ చెబుతోంది. అయితే, ఖతార్ భూభాగంలో దిగిన ముగ్గురు పైలట్లను ఆ దేశం బంధించిందని ఇప్పుడు ఇరాన్ ఆరోపిస్తున్నది. నెలలు గడుస్తున్నా వారిని తమకు అప్పగించడం లేదని చెబుతోంది. ఇరాన్‌కు చెందిన ఎస్‌యు-24 విమానాల్ని ఖతార్ కూల్చివేయడంతో, ఆ విమానాల్లోని జావేద్ సలేహి, అబ్దోల్మాజిద్ దష్తియన్, ఒమ్రన్ బెహ్రావేషియన్ అను ముగ్గురు పైలట్లు ఖతార్ సైన్యానికి చిక్కారని, వారిని విడిచిపెట్టాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. అయితే, ఇరాన్ వాదనను ఖతార్ కొట్టేసింది. తమ వద్ద ఇరాన్ సైనికులు ఎవరూ లేరని చెబుతోంది. ఈ మేరకు ఖతార్ విదేశాంగ శాఖ ప్రతినిధి మాజెద్ అల్ అన్సారీ సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేశారు. తాము విమానాలు కూల్చిన ఘటనలో సైనికుల కోసం పూర్తి స్థాయిలో సోదాలు, సహాయక చర్యలు చేపట్టామని వివరించింది. అయితే, తమకు ఏ ఒక్క సైనికుడు దొరకలేదని చెప్పింది. ఇదే సమయంలో ఒక సైనికుడికి సంబంధించిన అస్థికలను గతంలోనే ఇరాన్‌కు అందజేశామని పేర్కొంది. అంతేకాదు ఈ ఆరోపణలు గతంలోనే వచ్చాయన్నారు. అప్పుడు ఇరాన్‌కు ఒక ప్రతిపాదన పంపినట్లు పేర్కొన్నారు. ఇరాన్ అధికారులు, ఖతార్‌లో పర్యటించి, పూర్తిస్థాయి సోదాలు జరుపుకోవచ్చని చెప్పామన్నారు. కానీ, ఈ అంశంపై ఇరాన్ ఇంకా స్పందించలేదని చెప్పారు. ఇరాన్.. ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు చేస్తుందని విమర్శించారు. ఈ విషయంపై కొంతకాలంగా వివాదం కొనసాగుతున్నా ఇరు దేశాలు తమ వాదనకు కట్టుబడి ఉన్నాయి.

## భారత స్వాతంత్ర్య వేడుకలు గిన్నిస్ రికార్డు

**న్యూయార్కు, ఆగస్టు 16:** అమెరికాలో భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. న్యూయార్క్ ట్రైస్టేట్ ప్రాంతంలోని భారతీయ అమెరికన్ సమాజం నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమం ప్రపంచ రికార్డును సొంతం చేసుకుంది. అమెరికా 250వ వార్షికోత్సవం, భారత 80వస్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యూజెర్సీలోని పార్సిపానీ వెటరన్స్ మెమోరియల్ పార్కులో 1,300కు పైగా అమెరికా జెండాలను ఏర్పాటు చేశారు. భారత త్రివర్ణ పతాకాల మధ్య వాటిని 250 అనే సంఖ్య ఆకారంలో అమర్చారు. దీంతో అత్యధిక సంఖ్యలో జెండాస్తంభాల ఏర్పాటు విభాగంలో గిన్నిస్‌వరల్డ్ రికార్డు నమోదైంది. భారత స్వాతంత్ర్య దినోత్సవం, అమెరికా 250వ వార్షికోత్సవం ఒకేసారి రావడంతో ఈ ఏడాది వేడుకలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. ఈ నేపథ్యంలో భారత్ 80, అమెరికా 250 పేరుతో ఆ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత్, అమెరికా మధ్య స్నేహబంధానికి, రెండు దేశాల ప్రజలను మరింత దగ్గర చేయడంలో భారతీయ అమెరికన్ సమాజం పోషిస్తున్న పాత్రకు ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. భారత టెక్నాలజీ సంస్థ జోహో మద్దతుతో న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ జనరల్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్స్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. భారీ సంఖ్యలో జెండాలను ఒక ప్రత్యేక ఆకృతిలో ఏర్పాటు చేయడం ద్వారా భారత్, అమెరికా మధ్య ఉన్న బంధాన్ని చాటే ప్రయత్నం చేశారు. భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యూయార్క్ ట్రైస్టేట్ ప్రాంతంతో పాటు అమెరికాలోని పలు ప్రాంతాల్లో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్, ఐక్యరాజ్యసమితిలోని భారత శాశ్వత మిషన్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. వీటికి పెద్ద సంఖ్యలో




ప్రవాస భారతీయులు హాజరయ్యారు. టైమ్స్ స్క్వేర్‌లో ఎఫ్ఐఏ నిర్వహించిన వార్షిక వేడుకలో భారత త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. భారతీయ సంస్కృతి, వారసత్వాన్ని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమెరికాలోని పలు ప్రముఖ కట్టడాలు భారత త్రివర్ణ పతాకపు రంగులతో వెలిగిపోయాయి. న్యూయార్క్‌లోని ఎంపైర్ స్టేట్ బిల్డింగ్, బోస్టన్‌లోని ప్రుడెన్షియల్ సెంటర్ వంటి ప్రముఖ భవనాలు త్రివర్ణ రంగుల్లో దర్శనమిచ్చాయి. అమెరికాలోని పలు రాష్ట్రాల గవర్నర్లు కూడా ఆగస్టు 15ను భారత దినోత్సవం గా ప్రకటిస్తూ ప్రత్యేక ప్రకటనలు జారీ చేశారు. అమెరికా సెనేటర్లు, గవర్నర్లు, చట్టసభ సభ్యులు, వివిధ నగరాలు, పట్టణాలు భారతీయఅమెరికన్ సమాజం అందిస్తున్న సేవలను ప్రశంసించాయి.

## ఆత్మీయ నేస్తాలతో గడిపిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** జెన్ జీ స్టైల్లో ప్రధాని మోడీ పూర్తిగా సోషల్ మీడియాపై ఫోకస్ పెట్టారు. ఇటీవల ఆయన చేస్తున్న ఇన్స్టాగ్రామ్ పోస్టులే ఇందుకు నిదర్శనం. తాజాగా సోషల్ మీడియా స్టార్లు తమ డైలీ రొటీన్ ను పోస్ట్ చేసినట్లు మోడీ కూడా తన దినచర్యలో కీలక ఘట్టాన్ని మన ముందుకు తీసుకువచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి జాతిని ఉద్దేశించి ప్రసంగించడానికి కొద్ది నిమిషాల ముందు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన అధికారిక నివాసంలో అత్యంత ఆత్మీయమైన క్షణాలను గడిపారు. 7 లోక్ కల్యాణ్ మార్గ్‌లోని తన నివాస ప్రాంగణంలో రోజూవారీ దినచర్యలో భాగంగా నెమళ్లు, ఆవులకు ఆహారం తినిపిస్తున్న అరుదైన దృశ్యాలను ఆయన సామాజిక మాధ్యమ వేదికగా పంచుకున్నారు. దేశవ్యాప్తంగా ఘనంగా జరుగుతున్న 80వ స్వాతంత్ర్య వేడుకల వేళ ఈ భావోద్వేగపూరిత వీడియో నెటిజన్ల మనసులను అమితంగా ఆకట్టుకుంటోంది. తన నివాసంలోని మూగ జీవాలు తన కుటుంబ సభ్యులతో సమానమని ప్రధాని మోడీ తరచూ చెబుతుంటారు. ప్రతి రోజూ ఉదయాన్నే వాటికి దాణా అందించడం ఆయన నిత్యకృత్యం. స్వాతంత్ర్య దినోత్సవం కావడంతో ఎప్పటికంటే ముందే ఆయన ఎర్రకోటకు బయలుదేరాల్సి వచ్చింది. ఈ మార్పును గ్రహించినట్లుగా ఆవులు, అందమైన నెమళ్లు ఆయన కంటే ముందే దగ్గరకు వచ్చి వీడ్కోలు



పలికాయని మోడీపేర్కొన్నారు. నా మిత్రులకు ఆహారం అందించడం రోజూ చేసేదే కానీ నిన్న ఉదయం నేను తొందరగా వెళ్తున్నానని గ్రహించి అవి నన్ను కలిసేందుకు వచ్చాయంటూ ఆయన ఇన్స్టాగ్రామ్‌లో రాసుకొచ్చారు. పీఎం నివాసంలో కనిపిస్తున్న పశువులలో ఆంధ్రప్రదేశ్ ప్రాచీన, అరుదైన రకానికి చెందిన పుంగనూరు జాతి ఆవులు కూడా ఉండటం గమనార్హం. వీటితో పాటు అందమైన నెమళ్లకు ఆయన సొంత చేతులతో ధాన్యాన్ని, దానాను అందిస్తున్న దృశ్యాలు ప్రధాని వ్యక్తిత్వంలోని మరొక భావోద్వేగ కోణాన్ని ఆవిష్కరించాయి. గతంలో కూడా ఆయన తన ప్రశాంతమైన ఉదయపు నడక సమయంలో వీటితో గడిపిన సందర్భాలను సోషల్ మీడియాలో పంచుకున్నారు.

### అమెరికాలో వరుస కాల్పుల కలకలం

## నిందితుడు సహా ఆరుగురు దుర్మరణం

**వాషింగ్టన్, ఆగస్టు 16:**అమెరికాలో వరుస కాల్పుల ఘటనలు కలకలం రేపాయి. కెంటకీ రాష్ట్రంలోని లెక్సింగ్టన్‌లో గల ఓ పార్కులో జరిగిన ఈ కాల్పుల్లో ఐదుగురు మృతి చెందారు. మృతుల్లో 16 యేళ్ల బాలుడు సహా నలుగురు పెద్దలు ఉన్నారు. మరో 13యేళ్ల బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. తొలుత ఓ నివాసంలోకి ప్రవేశించిన దుండగుడు విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో ముగ్గురు మృతి చెందారు. అనంతరం అక్కడి నుంచి పరారై మరో ఇంటికి వెళ్లి కాల్పులు జరపడంతో మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఆ తర్వాత సమీప అటవీ ప్రాంతంలో మరో మహిళ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఈ ఘటనకు పాల్పడినట్లు అనుమానిస్తున్న చాడ్ హిక్‌మన్ (39) మృతదేహం కూడా అదే అటవీ ప్రాంతంలో లభ్యమైంది. దాంతో ఈ ఘటనలో నిందితుడి ప్రమేయంపై దర్యాప్తు కొనసాగుతోంది. డెట్రాయిట్‌కు సుమారు 170 మైళ్ల (270 కిలోమీటర్ల) దూరంలోని ఓ ఇంట్లో కాల్పులు జరిగినట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఇంట్లో తనిఖీలు చేపట్టిన అధికారులు 16 యేళ్ల బాలుడు, 45 యేళ్ల వ్యక్తి,



40 యేళ్ల మహిళ మృతదేహాలను గుర్తించారు. అదే ఇంట్లో 13 యేళ్ల బాలిక కూడా తుపాకీ గాయాలతో కనిపించింది. ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు. కాల్పుల తర్వాత నిందితుడు అక్కడి నుంచి పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అతడి కోసం మస్కాకీ కౌంటీలో భారీగా గాలింపు చేపట్టారు. నిందితుడి కోసం గాలింపు కొనసాగుతున్న సమయంలో మరో ఇంట్లో 53 యేళ్ల వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. అతడు కూడా తుపాకీ గాయాలతో మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. దాంతో నిందితుడే ఈ హత్య కూడా చేసి పరారయ్యాడని భావించిన పోలీసులు, అతడి కోసం విస్తృతంగా గాలించారు. హిక్‌మన్ ఎలా మృతి చెందాడు? కాల్పులకు కారణమేంటి? అనే విషయాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## బెంగాల్ అసెంబ్లీ మాజీ డి.స్పీకర్ అనుమానాస్పద మృతి

### టిఎంసి కార్యాలయంలో ఆయన మృతదేహాన్ని కనుగొన్న పోలీసులు



**కోల్‌కత్తా, ఆగస్టు 16:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర విషాదం, కలకలం చోటుచేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సీనియర్ నాయకుడు, రాష్ట్ర అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్ ఆశిష్ బెనర్జీ (80) అనుమానాస్పద స్థితిలో మరణించారు. బీర్భూమ్ జిల్లా రాంపూర్‌హాట్‌లోని తన నివాసానికి సమీపంలో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆయన మృతదేహం ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. ఈ ఘటనతో అధికార టీఎంసీ వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్ట్‌మార్టం నిమిత్తం రాంపూర్‌హాట్ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. ఇది ఆత్మహత్యా లేక దీని వెనుక ఏదైనా కుట్ర ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆశిష్ బెనర్జీకి బెంగాల్ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. రాంపూర్‌హాట్ నియోజకవర్గం నుంచి ఆయన ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. మమతా బెనర్జీ ప్రభుత్వంలో విద్య, వ్యవసాయ శాఖల మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా కూడా సేవలు అందించారు. అయితే, ఈ ఏడాది మొదట్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన బీజేపీ అభ్యర్థి ధ్రువ సాహా చేతిలో ఓటమి పాలయ్యారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత, జూన్‌లో బీర్భూమ్ జిల్లా టీఎంసీ కోర్ కమిటీ ఛైర్మన్ పదవికి కూడా ఆశిష్ బెనర్జీ రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఆయన రాజకీయంగా కొంత ఒత్తిడిలో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో టీఎంసీకి కంచుకోటగా ఉన్న బీర్భూమ్ జిల్లాలో ఇటీవలి ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా 6 స్థానాలు గెలుచుకోవడం టీఎంసీకి పెద్ద ఎదురుదెబ్బగా మారింది. ఈ రాజకీయ పరిణామాలు కూడా జిల్లా నేతలపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. ఆశిష్ బెనర్జీ మరణవార్త తెలియగానే ఆయన నివాసం వద్దకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీగా చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోస్ట్‌మార్టం నివేదిక వచ్చిన తర్వాతే మృతికి గల కచ్చితమైన కారణాలు తెలుస్తాయని పోలీసులు వెల్లడించారు.

## వందేమాతరం గీతాన్ని అవమానించారంటూ సోనియాపై ఫిర్యాదు

**మంగుళూరు, ఆగస్టు 16:** వందేమాతరం గేయాన్ని అవమానించారంటూ కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీపై కేసు నమోదైంది. కర్ణాటకలోని మంగళూరుకు చెందిన బీజేపీ నాయకుడు వికాస్ పుట్టూర్ స్థానిక ఉర్వా పోలీస్ స్టేషన్‌లో



ఫిర్యాదు చేశాడు. శనివారం ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల సందర్భంగా వందేమాతరం గేయాన్ని సోనియా అవమానపరిచారని, ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొ న్నారు. వెంటనే ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరాడు. ఒకవేళ పోలీసులు లేదా రాష్ట్ర ప్రభుత్వం తగిన రీతిలో స్పందించకుంటే కర్ణాటక హైకోర్టును ఆశ్రయిస్తానని పేర్కొన్నాడు. వందేమాతరం గేయాన్ని కాంగ్రెస్ అవమానించి, చారిత్రకంగా తప్పు చేసిందని బీజేపీ నేత పుట్టూర్ అన్నారు. జాతీయ పతాకం ఎగరేసే సమయంలో వందేమాతరం ప్లే అవుతున్నప్పుడు సోనియా గాంధీ ఆటంక పరిచారని, గేయాన్ని అవమానించారని విమర్శించాడు. ఈ గేయాన్ని అవమానించిన వారి హోదాకు, స్థాయికి అతీతంగా చర్యలు తీసుకోవాలని తన ఫిర్యాదులో కోరినట్లు వివరించాడు. రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా ఈ కేసుపై విచారణ జరపాలని పోలీసుల్ని కోరాడు. ప్రస్తుతం ఈ కేసుకు సంబంధించిన అంశాల్ని పోలీసులు పరిశీలిస్తున్నారు. సోనియా గాంధీకి వ్యతిరేకంగా ఇప్పటివరకు ఇంకా ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని తెలుస్తోంది. భారత న్యాయ వ్యవస్థపై తనకు నమ్మకం ఉందని, పుట్టూర్ స్పష్టం చేశాడు.

## కోటి ఇస్తే అసోం సిఎంను హతమారుస్తానన్న నిందితుడి అరెస్టు

**గువాహతి, ఆగస్టు16:** తనకు కోటి రూపాయిలు ఇస్తే అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మను హత్య చేస్తానని అందుకు తన సెల్ నంబర్‌ను సంప్రదించాలంటూ ప్రకటన చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి తండ్రి, సోదరుడితోపాటు మరో వ్యక్తిని అరెస్ట్ చేశామని అస్సాం పోలీసులు వెల్లడించారు. మోరిగావ్ జిల్లాలో శనివారం రాత్రి ఈ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. సీఎం శర్మ హత్యకు సోషల్ మీడియాలో ప్రకటించిన సెల్ నంబర్ ఆధారంగా ఈ కేసు దర్యాప్తు చేపట్టినట్లు వారు వివరించారు. దీనిపై విచారణ చేపట్టగా ఆ నంబర్ అబ్దుల్ ముతాలేబ్ పేరు మీద ఉందని అన్నారు. అతడు వృత్తిరీత్యా టైలర్‌గా జీవనంగా సాగిస్తున్నారని పేర్కొన్నారు. 80వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని గువాహతిలోని



ఖానాపారాలో శుక్రవారం సీఎం హిమంత బిశ్వ శర్మ రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి మీడియాలో లైవ్‌లో ప్రసంగించారు. ఈ సందర్భంగా అస్సాం సీఎంను తాను హత్య చేస్తానని ప్రకటించాడు. అందుకు కోటి రూపాయిలు ఇస్తే ఆ పని చేస్తానని వెల్లడించారు. అందుకు తన సెల్ నంబర్ సంప్రదించాలని సోషల్ మీడియాలో ప్రకటించాడు. అదే సమయంలో పాకిస్థాన్‌ను అనుకూలంగా భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశాడు. దీంతో ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దాంతో భూరగావ్ పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో సెల్ నంబర్ ఆధారంగా దర్యాప్తు చేపట్టి అబ్దుల్ ముతాలేబ్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం అతడి తండ్రి, సోదరుడితోపాటు మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారందరిని పోలీసులు విచారిస్తున్నారు. ఈ ప్రకటన అబ్దుల్ ముతాలేబ్ ఒక్కరే చేశారా లేకుంటే దీని వెనుక ఎవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. సోషల్ మీడియాలో వచ్చిన బెదిరింపు ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు చెప్పారు. ఆ కేసుకు సంబంధించి అందుబాటులో ఉన్న డిజిటల్ ఆధారాలను కూడా పరిశీలిస్తున్నట్లు పోలీస్ ఉన్నతాధికారులు వివరించారు.

## జార్ఖండ్ కూటమి ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించండి

### రాహుల్ గాంధీకి నిరసనకారుల అల్టిమేటమ్

**రాంచి, ఆగస్టు 11:** జార్ఖండ్‌లో జేఎంఎం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతు ఉపసంహరించాలని ఆ పార్టీ నేత రాహుల్ గాంధీని విద్యార్థి నిరసనకారులు డిమాండ్ చేశారు. ఆగస్టు 20న సీఎం హేమంత్ సోరెన్ నివాసాన్ని ముట్టడిస్తామని వారు స్పష్టం చేశారు. జార్ఖండ్‌లో నిర్వహించిన నియామక పరీక్షలలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న విద్యార్థులు గత 22 రోజులుగా నిరసనలు కొనసాగిస్తున్నారు. దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాంచిలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. తమ డిమాండ్లపై స్పందించని సీఎం హేమంత్ సోరెన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్ట్ 20న ముఖ్యమంత్రి నివాసాన్ని మేం ముట్టడిస్తాం. జేఎంఎం, కాంగ్రెస్ రెండూ మాతో రాజకీయాలు చేస్తున్నందున ఆయన రాజీనామాను మేం కోరుతున్నాం. ఒకవేళ ముఖ్యమంత్రి మా మాట వినకపోతే, జేఎంఎం నేతృత్వంలోని కూటమికి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మద్దతు ఉపసంహరించుకోవాలని కూడా మేము



డిమాండ్ చేస్తున్నామని జేపీఎస్సీ జేఎస్ఎస్సీ రిఫార్మ్స్ మంచ్ నాయకుడు రవీంద్ర పాశ్వాన్ అన్నారు. 24 జిల్లాల్లోనూ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మలను దహనం చేస్తామని నిరసనకారులు తెలిపారు.

## సంక్షిప్త వార్తలు

### జార్ఖండ్‌లో ఆటోరిక్షా బైక్ ఢీ: ఆరుగురు మృతి

**రాంచీ, ఆగస్టు 16:** జార్ఖండ్ రాష్ట్రంలో ఘోరరోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. లతేహార్ జిల్లాలో ఓ కంటైనర్ ట్రక్కు అదుపు తప్పి ఆటో రిక్షా, బైక్‌ను ఢీకొట్టడంతో చిన్నారి సహా ఆరుగురు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల నప్రకారం వేగంగా వచ్చిన ట్రక్కు ఆటో, బైక్‌ను ఢీకొట్టడంతో చంద్వాపోలీస్ స్టేషన్ పరిధిలోని దేద్ తంగవాలోయలో పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ రగిబ్‌ఖాన్ (35),అఫసారి ఖాటూన్(40), ఆమె కుమారుడు అస్జాద్ (7)ఉన్నారని, మరో ముగ్గురి వివరాలు తెలియాల్సి ఉందని చంద్వా పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ మనోరంజన్ ప్రసాద్ తెలిపారు.

### బర్త్‌డేకేక్‌లో చచ్చిన బల్లి: 11 మందికి అస్వస్థత




**ముంబై, ఆగస్టు16:** బర్త్‌డే కేక్‌లో చచ్చిన బల్లి కనిపించింది. ఆ కేక్ తిన్న 11మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు దీనిపై దర్యాప్తు చేపట్టారు.మహారాష్ట్రలోని నలసోపారాలో ఈసంఘటనజరిగింది. ఒకరి పుట్టిన రోజు వేడుక పలువురిని ఆసుపత్రి పాలు చేసింది.బర్త్‌డే కేక్‌లో చచ్చిన బల్లి కనిపించింది.అది తిన్నతర్వాత 11మంది ఫుడ్‌పాయిజనింగ్‌కు గురయ్యారు.ఏడుగురుపిల్లలు,నలుగురు మహిళలు కడుపు,ఛాతిలో నొప్పితో బాధపడ్డారు.

### ప్రధాని మోడీపై అనురాగ్ కశ్యప్ సెటైర్లు



**ముంబయి, ఆగస్టు 16:**స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్ర కోట వేదికగా ప్రధాని నరేంద్ర మోడీచేసిన దిమాగీ నక్సల్ (మేధో నక్సల్) వ్యాఖ్యలపై ప్రముఖ సినీ దర్శకుడు అనురాగ్ కశ్యప్ తీవ్రంగా స్పందించారు. యువతపై రాజకీయ ముద్రలు వేయడం కన్నా,వారికి విద్యా బుద్ధులు నేర్పడం, విమర్శనాత్మక ఆలోచనలను ప్రోత్సహించడం, అవసరమైతే థెరపీ ద్వారా వారిని అర్థం చేసుకోవడం ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడి యాలో పెద్ద చర్చకు దారితీశాయి. సోషల్ మీడియా వేదికగా ప్రధాని వ్యాఖ్యలపై అనురాగ్ కశ్యప్ స్పందిస్తూ, నేటి రాజకీయ భాష యువతరం ఆందోళనలను, వారి ఆలోచనా విధానాన్ని ప్రతిబింబిస్తోందా అని ప్రశ్నించారు.

### మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది ఇంటిపై జాతీయ జెండా



**శ్రీనగర్, ఆగస్టు 16:** జమ్మూ కశ్మీర్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఓఆసక్తికరమైన దృశ్యం అందరి దృష్టిని ఆకర్షించింది.భద్రతాదళాల మోస్ట్‌వాంటెడ్ లిస్ట్‌లో ఉన్న లష్కరే తోయిబా టాప్‌కమాండర్ అబిద్ రంజాన్ షేక్ తల్లిదండ్రులు తమ ఇంటిపై మువ్వన్నెలజెండాను ఎగరేసి దేశభక్తిని చాటుకున్నారు. షోపియాన్‌లోనివారి నివాసంపై తల్లి,తండ్రి ఇద్దరూ కలిసి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) నుంచి కార్య కలాపాలు సాగిస్తున్న అబిద్ రంజాన్ షేక్, లోయలో జరిగిన అనేక ఉగ్రవాద దాడుల్లో కీలక సూత్రధారిగా ఉన్నాడు.

### భార్యను హత్యచేసిన బిఎస్‌ఎఫ్ జవాన్



**చండీగడ్, ఆగస్టు 16:** బోర్డర్ సెక్యూరిటీఫోర్స్ (బీఎస్‌ఎఫ్)జవాన్‌గా పని చేస్తున్న అమర్‌జిత్ సింగ్ సెలవుపై ఇంటికి వచ్చి భార్య రమాతో గొడవ నేపథ్యంలో ఆమెను కొట్టడంతో మరణించింది. అయితే టెర్రస్ పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడినట్లు భార్య కుటుంబ సభ్యులకు సమా చారమిచ్చాడు. ఆమహిళ శరీరంపై పలు గాయాలు ఉండటంతో అను మానించిన ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పంజాబ్‌లోని హోషియార్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది.

### ఎయిర్‌పోర్టులో ప్యాసింజర్‌వద్ద గన్‌పేలి ఇద్దరికి గాయాలు

**వారణాసి, ఆగస్టు 16:** వారణాసి ఎయిర్‌పోర్టులో ఒక ప్యాసింజర్ గన్ తీసుకెళ్తుండగా, అధికారులు తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఉన్నట్లుండి గన్‌పేలిపోయింది. ఈఘటనలో ఇద్దరికి గాయాల య్యాయి. వారణాసిలోని లాల్‌బహదూర్ శాస్త్రిఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో ఆదివారం ఉదయం 9.30గంటలకు ఈఘటన జరిగింది.అజాంగడ్‌కు చెందిన కమ్లేష్ రాయ్ అనే ప్రయాణికుడు తనభార్యతో కలిసి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఐఎక్స్1810 అనే విమానంలో ముంబై వెళ్లేందుకు ఎయిర్పోర్టుకు వచ్చాడు.

17-8Pg6exHMNWJQE.qxd:17-8Pg6exHMNWJQE.qxd 1/1/02 6:08 AM Page 1



# సనాతన ధర్మ పరిరక్షణ, ప్రాచీన ఆలయాల పూర్వవైభవమే లక్ష్యం

**• దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి • ఆత్మకూరులో శ్రీ అలగనాథ స్వామి కళ్యాణ మండపం వైభవంగా ప్రారంభం**



**ఆత్మకూరు (నెల్లూరు), ఆగస్టు 16 ప్రభాతవార్త:** రాష్ట్రంలో సనాతన ధర్మ పరిరక్షణ, ఆధ్యాత్మిక సంప్రదాయాల పరిరక్షణతో పాటు చారిత్రక ఆలయాల పునరుద్ధరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆత్మకూరులో చారిత్రాత్మక నేపథ్యం గల శ్రీ అలగనాథ స్వామివారి ఆలయంలో రూ.80 లక్షల దేవాదాయ శాఖ నిధులతో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపాన్ని మంత్రి వైభవంగా ప్రారంభించారు. తొలుత ఆలయానికి విచ్చేసిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఆలయ మర్యాదలతో అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆలయాల్లో నిత్య ధూపదీప నైవేద్యాలు కొనసాగేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలోనే ధూపదీప నైవేద్య పథకంపై ఆలోచన చేశారని తెలిపారు. అర్చకులు, వేద పండితులు లేని ప్రాంతాల్లో స్థానికంగా ఉన్న పాఠశాల ఉపాధ్యాయులు, బ్రాహ్మణ కుటుంబాలు లేదా మహిళలు కూడా ఆలయంలో దీపం వెలిగించి పూజలు నిర్వహించేలా ప్రోత్సహించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం సుమారు 6,800 ఆలయాలకు ధూపదీప నైవేద్య పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందులో ఆత్మకూరు నియోజకవర్గంలోని 135 దేవాలయాలకు ధూపదీప నైవేద్య పథకం కింద సుమారు రూ.1.62 కోట్లను ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. శ్రీ అలగనాథ స్వామివారి ఆలయాన్ని కూడా ఈ పథకంలో చేర్చామని తెలిపారు. రాష్ట్రంలో ఆలయాలు లేని ప్రాంతాల్లో కొత్తగా భజన మందిరాలు, ఆలయాలను నిర్మించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని మంత్రి తెలిపారు. విలువలతో కూడిన విద్య, సనాతన ధర్మ సంప్రదాయాలు, వైదిక ధర్మాలు, ఆగమ శాస్త్రాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. పిల్లల్లో క్రమశిక్షణ, సంస్కారం, నైతిక విలువలను పెంపొందించేందుకు కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో ఆత్మకూరు పరిధిలో ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం నియోజకవర్గంలో అనువైన ప్రాంతంలో ఐదు ఎకరాల భూమిని సేకరించి మఠం నిర్మాణానికి ఏర్పాటు చేస్తామని తెలిపారు. దేవాలయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కాదని, అవి మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికత, విద్యా విజ్ఞానాలకు కేంద్రాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. జిల్లాలో ఆధ్యాత్మిక అభివృద్ధికి మరింత ఊతమిస్తూ, సనాతన ధర్మాన్ని, వైదిక సంప్రదాయాలను, ఆలయ సంస్కృతిని రాబోయే తరాలకు సురక్షితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. తెలుగుదేశం నాయకులు ఆనం కైవల్యా రెడ్డి, వేలూరు కేశవ చౌదరి, తాళ్లూరు గిరినాయుడు, తుమ్మల చంద్ర రెడ్డి, సుంకర పెంచల చౌదరి, కత విజయ భాస్కర్ రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు కుడుముల సుధాకర్ రెడ్డి, కెవి శేషారెడ్డి, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మాస్టర్స్ స్విమ్మింగ్‌లో ఓవరాల్ ఛాంప్ ఎన్టీఆర్ జిల్లా




**విజయవాడ, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇంటర్ డిస్ట్రిక్ట్ 7వ మాస్టర్ ఛాంపియన్ షిప్ ట్రోఫీలో ఎన్టీఆర్ జిల్లా స్విమ్మర్లు సత్తా చాటారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసారావుపేటలో జరిగిన పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారు. ఈ సందర్భంగా విజేతలను పలువురు అభినందించారు. ఓవరాల్ గా 23 స్వర్ణాలు, 10 రజతాలు, 8 కాంశ్య పతకాలను సాధించిన టీమ్ స్విమ్మర్ల ప్రతిభను కొనియాడారు. 235 పాయింట్లతో ఎన్టీఆర్ జిల్లా అగ్రస్థానంలో నిలవగా, తదుపరి కృష్ణా జిల్లా స్విమ్మర్లు 179 పాయింట్లతో రెండోస్థానంలో నిలిచారు. విజేతల్లో జి శ్రీకాంత్ 6 గోల్డ్, డి యుగంధర్ 4 గోల్డ్, 2 రజత పతకాలు దక్కించుకున్నారు. కే.ప్రవీణ్ కుమార్, జేఎస్ శరత్‌చంద్ర, ఎస్.రమేశ్ 3 చొప్పున బంగారు పతకాలు అందుకున్నారు. ఎం శ్రీకాంత్ 2 గోల్డ్ పతకాలు దక్కించుకోగా, వి శ్రీనివాసరావు, కే కిషోర్, పి దుర్గారావు, వై రామారావు ఒక్కో బంగారు పతకం సహా వివిధ పతకాలు సాధించి సత్తా చాటారు. ఇక మహిళల విభాగంగలో వి సుహాసిని మూడు పతకాలు అందుకున్నారు. అందులో ఒకటి గోల్డ్ ఉంది. విజేతలను ఎన్టీఆర్, కృష్ణా జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధులు ఇంకా ఇన్చార్జ్ అనిల్ కుమార్, సిమ్మింగ్ కోచ్‌లు మాల్యాద్రి, లక్ష్మణ్ రావు తదితరులు అభినందించారు. తదుపరి జాతీయ స్థాయి పోటీల్లో కూడా మంచి ప్రతిభ కనబరచాలంటూ ప్రోత్సహించారు.

# తిరుపతిలో నేటి నుండి ఆధ్యాత్మిక సేవలపై జాతీయ సదస్సు

**తిరుమల, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి నిర్వహణలో తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరం లో టిటిడి ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలోనేటి నుండి 19వ తేదీ వరకు మూడు రోజులు వైష్ణవ ఆచార్యుల ఆధ్యాత్మిక సేవలపై జాతీయ సదస్సు జరగనుంది. ఈ సదస్సులో రామానుజాచార్యులు, పుండరీకాక్షులు, గోవింద భట్టర్, దాశరథి (ముదలియాండాన్) జీవితం, ఆధ్యాత్మిక సేవలు, విశిష్టాద్వైత సిద్ధాంత ప్రచారం, ఆలయ ఆచార–సంప్రదాయాల పరిరక్షణలో వారు చేసిన విశిష్ట కృషిపై పరిశోధనాత్మక చర్చలు జరుగనున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 25 మంది పరిశోధకులు, పలువురు పండితులు ఈ సదస్సులో పాల్గొని పరిశోధనా పత్రాలను సమర్పించనున్నారు. వైష్ణవ సంప్రదాయ వికాసంలో ఆచార్యుల పాత్ర, వారి ఆధ్యాత్మిక సేవలు, దివ్యప్రబంధ ప్రచారం తదితర అంశాలపై లోతైన చర్చలు నిర్వహించనున్నారు. నేటి ఉదయం 10 గంటలకు తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి మంగళాశాసనాలతో సదస్సు ప్రారంభమవుతుంది. భక్తి, ఆధ్యాత్మికత, పరిశోధనలను సమన్వయం చేస్తూ వైష్ణవ సంప్రదాయ వైభవాన్ని మరింతగా వెలుగులోకి తీసుకురావడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశ్యం.

# మెరుగైన విద్యుత్తు సరఫరా చేసేందుకు కృషి

**• రూ. 520 కోట్లతో 104 సబ్‌స్టేషన్ల నిర్మాణం • ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**



**తిరుపతి, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిఎస్‌పిడిసిఎల్ పరిధిలో విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్తును సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ఎస్‌పిడిసిఎల్‌లో వివిధ అభివృద్ధి పనులపై ఆదివారం సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి డైరెక్టర్లు పి.అయూబ్ ఖాన్, కె. గురవయ్యలతో సమీక్షి ంచారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలందించడంలో భాగంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. లో ఓల్టేజ్ సమస్యను అధిగమించడం, 24 గంటలూ నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయడం కోసం సంస్థ పరిధిలోని 9 జిల్లాల్లో గత యేడాది అక్టోబరు నుండి సుమారు రూ.520 కోట్ల వ్యయంతో 104 సబ్ స్టేషన్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. ఎపిఎస్‌పిడిసిఎల్ పరిధిలోని నెల్లూరు జిల్లాకు 8 సబ్ స్టేషన్లు, తిరుపతి 14, చిత్తూరు 11, అన్నమయ్య 13, కడప 7, కర్నూలు 6, నంద్యాల 8, అనంతపురం 14, శ్రీసత్యసాయి జిల్లాకు 14, కుప్పం రెస్కోకు 9 సబ్ స్టేషన్లను మంజూరు చేశామన్నారు. వాటిలో 29 సబ్ స్టేషన్ల నిర్మాణాన్ని పూర్తిచేసి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. మరో 13 సబ్ స్టేషన్ల నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని, వాటిని త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని వివరించారు. అందులో 50 సబ్‌స్టేషన్ల నిర్మాణానికి సంబంధించి టెండరు ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన 12 సబ్‌స్టేషన్ల పనులను సంబంధించి టెండరు ప్రక్రియను పూర్తి చేయాల్సి వుందన్నారు. సబ్ స్టేషన్ల నిర్మాణ అంశంలో సంబంధిత కాంట్రాక్టర్లు నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు వీలుగా సంబంధిత అధికారులు కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

**నేడు డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి:** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) ఉదయం 10గంటల నుండి నుంచి మధ్యాహ్నం 12.30 గంటలవరకు 'డయల్ యువర్ సిఎండి' కార్యక్రమాన్ని ఎస్‌పిడిసిఎల్ నిర్వహించనుంది. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 89777 16661 నంబర్‌కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. కాగా సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 గంటల నుండి నుంచి 9:30గంటల వరకు 'డయల్ యువర్ ఎస్ఇ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లా స్థాయిలో తమ విద్యుత్ సమస్యలను ఎస్ఇల దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు తిరుపతి: 87126 52679, చిత్తూరు: 79931 47979, నెల్లూరు: 08612 320427, అన్నమయ్య: 94408 17449, కడప: 08562 242457, కర్నూలు: 73826 14308, నంద్యాల: 73826 18976, అనంతపురం: 91547 90350, శ్రీసత్యసాయి: 99637 07847 నంబర్లకు ఫోన్‌చేసి తెలియజేయాలి.

# హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో జ్యుడీషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు



**విజయవాడ, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జ్యుడీషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు రాష్ట్ర హైకోర్టు కార్యాలయం నందు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ రాష్ట్రంలో న్యాయధికారుల పనితీరు, పరిస్థితుల గురించి సానుకూలంగా చర్చించారు. సిజెను కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జ్యుడీషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చక్రపాణి, రమేష్ నాయుడు, శైలజ కంపల్లి, శ్రీనివాసరావు, బెజవాడ రాధారాణి, వెన్నెల, వెంకట శేషాద్రి తదితరులు ఉన్నారు.

## తిరుమల సమాచారం



### వరుస సెలవులతో తిరుమలలో భారీ రద్దీ

**తిరుమల, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** వరుససెలవులు... వారాంతం కలసి రావడంతో ఏడుకొండలు భక్తులతో కిటకిటలాడుతోంది. శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటల సమయం నిరీక్షణ తప్పడంలేదు. ఆదివారం ఉదయానికే వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్ట్‌మెంట్లు నిండిపోయి వెలుపల లైన్లు ఆక్టోపస్ భవనం వరకు చేరాయి. ఇష్టదైవమ్ వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో తిరుమల గిరులు భక్తజనసందోహంతో కిటకిట లాడుతున్నాయి. భక్తుల రద్దీ పరిస్థితులను టిటిడి అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. క్యూ లైన్లలో గంటల తరబడి వేచి ఉంటున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగు నీరు, పాలు, అన్నప్రసాదాలను నిరంతరాయంగా అందజేస్తున్నారు. శని వారం ఒక్కరోజే స్వామివారిని 90,293 మంది భక్తులు దర్శించుకున్నారు. 53,090 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ.3.81 కోట్లు లభించింది. రానున్న రోజుల్లో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున, వృద్ధులు, చిన్నపిల్లలతో వచ్చే భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.

### నవంబర్ నెల సేవా టికెట్ల కోటా విడుదల



**తిరుమల, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఈ యేడాది నవంబర్ నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు, దర్శన టోకెన్లు, వసతి గదుల ఆన్‌లైన్ కోటా విడుదల షెడ్యూల్‌ను టిటిడి వెల్లడించింది. భక్తులు ఆయా రోజుల్లో దర్శన టిక్కెట్లను ఆన్‌లైన్‌లో ముందస్తుగా బుక్ చేసుకోవాలని సూచించింది. భారీ డిమాండ్ ఉండే సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన వంటి ఆర్జిత సేవల కోసం ఎలక్ట్రానిక్ డిప్ (లక్కీ డిప్) విధానంలో టికెట్లను కేటాయించనున్నారు. ఇందుకోసం భక్తులు 18వ తేదీ (రేపు) ఉదయం 10 గంటల నుండి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో పేర్లను నమోదు చేసుకోవచ్చు. లక్కీ డిప్‌లో టిక్కెట్లు పొందిన భక్తులు ఆగస్టు 22వ తేదీ మధ్యాహ్నంలోగా నిర్ణీత రుసుము చెల్లించి తమ టిక్కెట్లను ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. ఇతర సేవా టికెట్లను 21న విడుదల చేయనున్నారు. ఆ రోజు ఉదయం 10గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టిక్కెట్లు అందుబాటులోకి వస్తాయి. మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవల కోటాను టిటిడి విడుదల చేస్తుంది. 24న ఉదయం 10గంటలకు అంగప్రదక్షిణం టోకెన్లు, ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్ట్ బ్రేక్ దర్శనం టిక్కెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగుల ప్రత్యేక దర్శన టోకెన్ల కోటాను విడుదల చేస్తారు. 25న ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు, మధ్యాహ్నం 3గంటలకు తిరుమల, తిరుపతిలోని వసతి గదుల బుకింగ్ కోటాను అందుబాటులో ఉంచుతారు. భక్తులు టిటిడి అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే టికెట్లను బుక్ చేసుకోవాలని స్పష్టం చేశారు.

# వైట్‌బోర్డుతో తిరుమలకు ట్యాక్సీ సేవలు

# సర్కార్ ఆదాయానికి గండి

**• వెయ్యికిపైగా సొంత వాహనాలే • పట్టించుకోని రవాణాశాఖ**



**తిరుపతి, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** పుణ్యక్షేత్రం తిరుమలకు యాత్రికుల సౌకర్యార్థం తిరుపతి నుండి పలురకాలుగా తిరుగుతున్న నాలుగువేల వాహనాల్లో వెయ్యికిపైగా వైట్‌బోర్డు వాహనాలు యాత్రికుల సేవలో తరిస్తున్నాయనేది ప్రధాన ఆరోపణ. దీనివల్ల ప్రభుత్వానికి రావలసిన ఆదాయానికి భారీ గండిపడుతుందని పలువురు ట్యాక్సీ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ తిరుమల నుండి తిరుపతికి నిర్దేశిత నంబర్లతో వైట్‌బోర్డుతో తిరుమలకు యాత్రికులను చేరవేసున్నారనేది దుమారం రేపుతోంది. ట్యాక్సీ వాహనాలు తిరుమలకు వస్తున్నా ప్రతి మూడునెలల కోసారి పన్ను చెల్లించాల్సి ఉందని, అంతేగాక తిరుమలలో ట్యాక్సీలు ఔటర్‌రింగురోడ్డుమీదుగానే తిరిగి యాత్రికులను ఎక్కించుకోవడం, దించడం వంటివి చేమాల్సి ఉంటుందని వాపోతున్నారు. వైట్‌బోర్డు వాహనాలను తిరుమలలోపల సిఆర్‌ఒ, రాంభగీచా అతిథిగృహాలు, పద్మావతి విచారణ కార్యాలయం, ఎంబిసి తదితర ప్రాంతాలకు అనుమతిస్తుండటంతో యాత్రికులు కూడా వాటిపై ఆధారపడుతున్నట్లు తెలుస్తోంది. వైట్‌బోర్డు కార్లు, ఇన్నోవాలు, వంటి ఇతరత్రా వాహనాలు ట్యాక్స్ చెల్లింపు కూడా తక్కువేనని,అయితే ట్యాక్సీల ఆదాయానికి గండికొడుతున్నారని పలువురు ట్యాక్సీ డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైట్‌బోర్డుతో తిరుపతి– తిరుమల, తిరుమల– తిరుపతి మధ్యనేగాక స్థానిక ఆలయాలు, కాణిపాకం, శ్రీకాళహస్తి, తమిళనాడు వేలూరు బంగారుగుడి వంటి ప్రాంతాలకు కూడా టోల్‌గేట్ ఫీజుల్లో మినహాయింపు ఉంటుందని చెబుతున్నారు. ప్రతిరోజూ 1,500 వరకు వైట్‌బోర్డు వాహనాలు తిరుమలకు వెళ్తుండటం చూస్తే దీనివెనుక ఆంతర్యం ఏమిటని అర్థమవుతుంది. రవాణాశాఖ అధికారులు అలిపిరి టోల్‌గేట్‌లో, జిఎన్‌సి టోల్‌గేట్‌లో ఆకస్మిక దాడులు చేస్తే వైట్‌బోర్డుతో ట్యాక్సీలుగా తిరుగుతున్నట్లు గుర్తించి ఆశ్చర్యపోయారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి ట్యాక్స్ రూపంలో భారీగా నష్టం వస్తుందనేది రవాణాశాఖ వర్గాల సమాచారం. అంతేగాక ఇలా ట్యాక్సీలుగా తిరుగుతున్న వైట్‌బోర్డు వాహనాలపై మెరుపుదాడులు చేస్తే అధికార కూటమి పార్టీల నేతల నుండి రవాణాశాఖ అధికారులపై ఒత్తిళ్ళు తీవ్రంగా ఉంటున్నాయనేది కూడా ప్రధాన సమాచారం. దీనివల్ల రవాణాశాఖ అధికారులు కూడా వైట్‌బోర్డు వాహనాలను పట్టుకోవాలంటే వెనుకడుగువేయాల్సి వస్తోందని తెలుస్తోంది. పైగా ట్యాక్సీల్లో సీటింగ్ కెపాసిటీకి మించి ఒకరు ఎక్కువ వున్నా భారీ జరిమానా విధించి అలిపిరి టోల్‌గేట్‌లో నో ఎంట్రీ (నాట్ అలవుడ్) పెడుతున్న పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది కూడా వైట్‌బోర్డు వాహనాలను పట్టించుకోవడం లేదనేది ప్రధాన ఆరోపణ. దేశవిదేశాల నుండి తిరుమలకు యాత్రికులు వస్తున్నారు. రోజుకు 90వేలమంది వరకు యాత్రికులు వస్తుండగా తిరుపతి నుండి ఐదారు వేల మంది వరకు యాత్రికులు వైట్‌బోర్టు వాహనాల్లోనే తిరుమలకు వెళ్తున్నారనేది రవాణాశాఖ వర్గాల కథనం. దీనివల్ల ట్యాక్సీడ్రైవర్లకు నష్టం కలుగుతోంది. ఇప్పటికైనా తిరుమలకు ట్యాక్సీల పేరుతో తిరుగుతున్న వైట్‌బోర్డు వాహనాలపై చర్యలు తీసుకుంటే తప్ప ప్రభుత్వ ఆదాయం కూడా చేరదని కొందరు డ్రైవర్లు వ్యాఖ్యలు.



### రెండుసార్లు గరుడ వాహన సేవ

**నేడు గరుడ పంచమి • 28న శ్రావణ పౌర్ణమి**

**తిరుమల, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో నేడు సోమవారం గరుడ పంచమి పర్వదినం జరుగనుంది. ఈ సందర్భంగా రాత్రి 7 నుండి 9 గంటల వరకు మలయప్పస్వామి తనకెంతో ఇష్టవాహనమైన గరుడునిపై తిరుమాడ వీధులలో ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నారు. ప్రతి యేటా తిరుమలలో గరుడ పంచమిని టిటిడి వేదోక్తంగా నిర్వహిస్తుంది. నూతన దంపతులు తమ వైవాహిక జీవితం ఆనందదాయకంగా ఉండేందుకు, స్త్రీలు తమకు పుట్టే సంతానం గరుడునిలాగా బలశాలిగా, మంచి వ్యక్తిత్వం గలవాడిగా ఉండేందుకు "గరుడపంచమి" పూజ చేస్తారని ప్రాశస్త్యం. ఇక ఆగస్టు 28న శ్రావణ పౌర్ణమి రోజున గరుడసేవను నిర్వహించనుంది. ఈ సందర్భంగా ఆరోజు మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడవాహనంపై శనివారం రాత్రి 7 నుండి 9 గంటల నడుమ భక్తులను అనుగ్రహించనున్నారు.

# అలిపిరి నడక మార్గంలో ధూమపానం

**• పోలీసులకు ఫిర్యాదు... సెక్యూరిటీ సిబ్బందిపై వేటు**

**తిరుమల, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎంతో భక్తితో పవిత్రంగా తిరుమలకు వచ్చే భక్తులు ప్రశాంతంగా గోవింద నామస్మరణ చేసుకుంటారు. అలాంటిది ఆదివారం ఉదయం ఉన్నపళంగా భక్తుని వేషంలో ఓ వ్యక్తి ఏకంగా ధూమపానం సేవించి పొగను భక్తుల మధ్య వదలడంతో దుమారం రేపింది. అలిపిరి మెట్ల మార్గంలో భక్తులతో నడుస్తూ పొగతాగడంతో తోటి భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. నడకమార్గంలో నిశిత తనిఖీలు చేయాల్సిన భద్రత సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందని పై అధికారులు తేల్చారు. దీంతో నిర్లక్ష్యం వహించిన సెక్యూరిటీ సిబ్బందిపై వేటువేశారు. తిరుమల పవిత్రతను కాపాడాలని భక్తులకు టిటిడి ప్రసారసాధనాల ద్వారా ప్రచారం చేస్తుంది. అలిపిరి నడకమార్గంలో ఓ వ్యక్తి పొగతాగడం తీవ్ర వివాదానికి దారితీసింది. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఈ చర్యను టిటిడి తీవ్రంగా పరిగణించింది. నిబంధనలను ఉల్లంఘించిన ఆ వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంది. తిరుమల క్షేత్ర పవిత్రతను కాపాడేందుకు కాలినడక మార్గాల్లో, ఘాట్‌రోడ్డులో. తిరుమలకొండపై మద్యపానం, ధూమపానం, మాంసాహారం, మత్తుపదార్థాల వినియోగంపై పూర్తి నిషేధం అమలులో ఉంది. ఈ విషయం తెలిసినా ఆ వ్యక్తి నిబంధనలను అతిక్రమించి పవిత్రమైన నడకమార్గంలో ధూమపానం చేయడంతో సంచలనంగా మారింది. ప్రవేశ మార్గాల వద్ద తనిఖీలను మరింత కట్టుదిట్టం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



### తిరుమలకు నూతన అగ్నిమాపక వాహనం

**తిరుమల, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన అగ్నిమాపక వాహనాలు కొరత ఉంది. ఈ నేపథ్యంలో రానున్న సెప్టెంబర్‌లో జరగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముందే ఆదివారం ప్రభుత్వం నూతన అగ్నిమాపక వాహనాన్ని అందించింది. ఈ వాహనం 5వేల లీటర్ల నీటి సామర్థ్యం కలిగి ఉంది. ఇక్కడ అగ్నిమాపక కేంద్రంలో రెండు ఉన్నాయి. తిరుమలలో అటు ఆలయం, ఇటు పోటుతోబాటు ఎక్కడ అగ్నిప్రమాదాలు సంభవించినా, అత్యవసర సేవలకు, వివిఐపిల పర్యటనలో వీటి వినియోగం ఉంటుంది. ఆదివారం ప్రభుత్వం నుండి నూతన వాహనం రావడంతో పాత వాహనం స్థానంలో దీన్ని వినియోగించుకునే అవకాశం కలిగింది.



### తిరుమలలో పలాస భక్తుడు అదృశ్యం

**తిరుమల, ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన బండారి సంతోష్ సంతు (28) తిరుమలలో అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. భార్య బండారి శ్రావణి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈనెల 8వ తేదీ తిరుమల శ్రీవారి దర్శనం క్యూ లైన్ నుండి సంతోష్ తన కుటుంబ సభ్యుల నుండి విడిపోయాడు. సిసిటివి పరిశీలనలో ఎలిఫెంట్ గేట్ వద్ద భద్రతా సిబ్బందితో వాగ్వాదం అనంతరం క్యూలైన్ నుండి బయటకు వెళ్లి, ఆ తరువాత మ్యూజియం వెనుక కనబడి నట్లు గుర్తించారు. కుటుంబ సభ్యులు తిరుమల, తిరుపతి పరిసర ప్రాంతా లలో వెతికారు. అతని ఆచూకీ లేనందున తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు గానీ, తిరుమల 1 టౌన్ పోలీస్ స్టేషన్‌కు 94407 96771, 94407 96769, 08772 289027 సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.



## ఏదో వెలితిగా ఉంది..
# ఎంతో బాధగా ఉంది..



విశాఖపట్నం, ఆగస్టు 16, ప్రభాత వార్త :

దశాబ్దాలుగా మన అని చెప్పుకున్న విశాఖ ఎయిర్ పోర్టు తో ఈరోజుతో బంధం తెగిపోయింది. కొత్త ఒక వింత.. పాత ఒక రోత.. అంటారు. కానీ మా విశాఖ ఎయిర్ పోర్టు మాకు ఎప్పుడూ నిత్య నూతనమే. వ్యాపారవేత్తగా మొదట విమానయానం చేసింది ఇక్కడినుంచే. రాజకీయ నాయకుడిగా వందల సార్లు సాగించిన ప్రయాణాలకు వేదికగా (తరువాయి 8వ పేజీలో)




# ఇక సెలవు..

## మూతపడనున్న విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం
## నేటి నుంచి భోగాపురం నుంచే విమాన రాకపోకలు



జ్ఞానాపురం, ఆగస్టు 16, ప్రభాత వార్త

విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం సేవలు ఆదివారం అర్ధరాత్రి నుంచి ముగియనున్నాయి. ఈనెల 17వ తేదీ సోమవారం నుంచి భోగాపురం అంతర్జాతీయ సేవలు ప్రారంభ కాలు ఉన్నాయి. విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం



చరిత్ర కాబోతుంది. నగరవాసులు బాధాతప్త హృదయముతో విశాఖ విమానాశ్రయాన్ని కొన సాగించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. విజయనగరం జిల్లా భోగాపురం ఎయిర్పోర్ట్ అందు బాటులోకి రావడంతో కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు విశాఖ అంతర్జాతీయ విమానాశ్రమాన్ని శాశ్వతంగా మూసివేత నిర్ణయాన్ని తీసుకున్నారు. ఈ మూసివేత నిర్ణయాన్ని (తరువాయి 8వ పేజీలో)

## విశాఖలో కనుమరుగైన విమానాలు!

**విశాఖ విమానాశ్రయ సివిల్ ఎన్క్లేవ్ నుంచి నిర్వహించే చివరి షెడ్యూల్డ్ వాణిజ్య విమాన సర్వీస్ ఇండిగో విమానం 6E 2018**

**ఆగస్టు 16 అర్ధరాత్రితో మూత పడ్డ విశాఖ ఎయిర్ పోర్ట్**

**ఆఖరి వీడ్కోలు పలికిన ఉత్తరాంధ్రా ఎమ్మెల్యేలు**

విశాఖపట్నం, ఆగష్టు 16,ప్రభాత వార్త :

విమానం శబ్దం వినిపిస్తే విశాఖ ఆకాశం వైపు చూసిన నగరం... ఇక ఆ శబ్దం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితిని ఆదివారం అర్ధరాత్రితో కోల్పోయింది . ఎన్నో ఏళ్లుగా నగరానికి చేరువలోనే ఉన్న విమానాశ్రయం నుంచి ఎగిరిన విమానాలు, దిగిన విమానాలు విశాఖ నగర అభివృద్ధికి, వ్యాపారానికి, పర్యాటకానికి ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చాయి. కానీ కాలం మారింది... అభివృద్ధి పేరుతో విమానాల గమ్యం కూడా మారిపోయింది. విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు (తరువాయి 8వ పేజీలో)



- తొలి విమానం రాకపోకలకు సర్వం సిద్ధం
- అంగరంగ వైభవంగా ఏర్పాట్లు

## నేటి నుంచే
# భోగాపురం విమానాశ్రయం సేవలు

(ప్రభాతవార్త -విశాఖపట్నం)

ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం సాకారం కానుంది. భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నేటి నుంచి తొలి విమాన సేవలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రారంభోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు విమానాశ్రయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

ఇండిగో, ఎయిర్ ఇండియా ఎక్స్ప్రెస్ విమానాలతో తొలి సేవలకు శ్రీకారం చుట్టనున్నారు. ఉదయం 6 గంటలకు చెకిన్ హాల్లో జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. 6.05 నుంచి 6.20 గంటల వరకు ప్రముఖుల చేతుల మీదుగా బోర్డింగ్ పాస్ల పంపిణీ, ఫొటో సెషన్ నిర్వహిస్తారు. 6.20 నుంచి 6.30 గంటల వరకు రెండు విమానయాన సంస్థల సిబ్బంది, ప్రయాణికులతో కేక్ కటింగ్ కార్యక్రమం ఉంటుంది. హైదరాబాద్ నుంచి ఇండిగోకు చెందిన 6E6408 విమానం ఉదయం 6.45 గంటలకు తొలి విమానంగా భోగాపురం చేరుకోనుంది. ప్రయాణికులకు అరైవల్ గేట్ వద్ద ఘన స్వాగతం పలికి ఏటికొప్పాక బొమ్మల బ్యాగులు, ఫస్ట్ ఫ్లైట్ సర్టిఫికెట్లు అందించనున్నారు. అనంతరం 6ఈ9051 విమానం ఉదయం 7.30 గంటలకు భోగాపురం నుంచి హైదరాబాద్కు బయలుదేరుతుంది. అదే సమయంలో బెంగళూరు నుంచి ఎయిర్ ఇండియా ఎక్స్ప్రెస్కు చెందిన ఐఎక్స్2064 విమానం ఉదయం 7.30 గంటలకు భోగాపురం చేరుకోనుంది. ప్రయాణికులకు ప్రత్యేక స్వాగతం పలికిన అనంతరం ఐఎక్స్2065 విమానం ఉదయం 8 గంటలకు బెంగళూరుకు బయలుదేరుతుంది.

తొలి విమాన సేవలతో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు ఉత్తరాంధ్ర ప్రాంతానికి విమాన కనెక్టివిటీ మరింత మెరుగుపడనుంది. వాణిజ్య, పారిశ్రామిక, పర్యాటక రంగాల అభివృద్ధికి భోగాపురం విమానాశ్రయం కీలకంగా మారనుందని భావిస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ భద్రతా కారణాల నేపథ్యంలో ఈ నెల 20 వరకు హై అలర్ట్ కొనసాగుతున్నందున టెర్మినల్ లోపలికి మీడియా ప్రతినిధులను అనుమతించబోమని అధికారులు తెలిపారు. తొలి విమాన సేవల నేపథ్యంలో విమానాశ్రయంలో భద్రతను కట్టుదిట్టం చేశారు.

## నేడు కలెక్టరేట్లో
# పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్

**జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్**



విశాఖపట్నం, ఆగస్టు 16, ప్రభాత వార్త :

విశాఖపట్నం జిల్లా కలెక్టరేట్లో సోమ వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ తెలిపారు. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరుగుతాయని, రెవెన్యూ అధికారులతో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజలు వారి సమస్యలకు సంబంధించిన అర్జీలను పూర్తి వివరాలతో సమర్పించాలని సూచించారు. అలాగే 'మీ కోసం' కాల్ సెంటర్ 1100 సేవలు, మీకోసం.ఏపీ.గోవ్.ఇన్ వెబ్సైట్ను వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. ఇప్పటి వరకు ఆయా శాఖలకు అందిన ఫిర్యాదులు, తీసుకున్న చర్యలపై సమీక్ష ఉంటుందని, సంబంధిత నివేదికలతో అధికారులు నిర్ణీత సమయానికి రావాలని ప్రకటన ద్వారా తెలిపారు.

## విశాఖ ఉక్కు బాధితులకు ఊరట..
# రూ.19 కోట్ల బకాయిలు విడుదల

**ఎంపీ భరత్, కేంద్రమంత్రులకు కాటం చందర్రావు ధన్యవాదాలు**



గాజువాక,ఆగష్టు 16,ప్రభాతవార్త :

విశాఖపట్నం స్టీల్ప్లాంట్లో 'ఎంప్లాయ్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్' కింద పదవీ విరమణ వయస్సు వచ్చిన 43 మంది వితంతువులకు రూ. 19 కోట్ల డిపాజిట్లను యాజమాన్యం విడుదల చేసింది. గత ఆరు నెలలుగా పెన్షన్, డిపాజిట్లు అందక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఈ నిర్ణయంతో ఉపశమనం లభించింది. ప్రస్తుతం ఈ పథకం కింద 750 మంది రూ. 200 కోట్లకు పైగా డిపాజిట్ చేసి ప్రతినెలా రూ. 4 కోట్ల వరకు పెన్షన్ పొందుతున్నారు. 2026 ఫిబ్రవరి నుంచి జూలై మధ్య పదవీ విరమణ వయస్సు వచ్చిన 43 మందికి బకాయిలు నిలిచిపోవడంతో ఎస్ సి ఓ ఎ డిప్యూటీ సెక్రటరీ జనరల్ కాటం ఎస్ ఎస్ చందర్రావు ఈ విషయాన్ని విశాఖ ఎంపీ ఎం. శ్రీ భరత్ దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీ భరత్ పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామికి విన్నవించగా, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కూడా యాజమాన్యానికి లేఖ రాశారు. నేతల చొరవతో ఉక్కు యాజమాన్యం స్పందించి తొలి విడతగా రూ. 19 కోట్లు చెల్లించడంతో ఎంపీ శ్రీ భరత్, కేంద్రమంత్రి పెమ్మసాని, సీఎండీ ప్రభాకర్లకు కాటం చందర్రావు ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఉద్యోగుల వేతన బకాయిలు, వి ఆర్ ఎస్, రిటైర్డ్ ఉద్యోగుల రూ. 500 కోట్ల ప్యాకేజీ, లీవ్ ఎన్క్యాష్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని, నిలిచిపోయిన అధికారుల ప్రమోషన్లను పునరుద్ధరించాలని ఆయన కోరారు.

## అల్పపీడనం బలపడింది..
# వాయుగుండంగా మారే అవకాశం

- ఉత్తరాంధ్రలో 60 కి.మీ. వేగంతో ఈదురుగాలులు..
- మత్స్యకారులకు హెచ్చరిక



విశాఖపట్నం, ఆగస్టు 16, ప్రభాతవార్త :

వాయవ్య బంగాళాఖాతం, పశ్చిమ బెంగాల్-ఉత్తర ఒడిశా తీర ప్రాంతాలను ఆనుకుని ఏర్పడిన అల్పపీడనం స్పష్టమైన అల్పపీడనంగా బలపడి కొనసాగుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఇది రానున్న 24 గంటల్లో వాయవ్య దిశగా పయనించి వాయుగుండంగా మారే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంతో పాటు ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల్లో మంగళవారం వరకు గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. సముద్రం అలజడిగా మారి అలలు ఎగసిపడే అవకాశం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. ఇప్పటికే సముద్రంలో ఉన్న వారు వెంటనే తీరానికి తిరిగి రావాలని సూచించింది. సోమవారం శ్రీకాకుళం, విజయనగరం, పోలవరం, విశాఖ, ఏలూరు, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మన్యం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, మార్కాపురం, ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రేపు ఉత్తరాంధ్ర జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

## ఏఎంసిలో నేటి నుంచి
# అత్యవసర వైద్య సేవలు నిలిపివేత

- ప్రభుత్వ స్పందన లేకపోవడంతో జూడాల సమ్మె మరింత ఉధృతం
- ఏపీజేయూడిఏ పిలుపు మేరకు మూడవ దశ ఆందోళనకు శ్రీకారం
- కెజీహెచ్ సూపరింటెండెంట్ ఆఫీస్ ఎదుట నిరాహార దీక్షలు, నిరసన ప్రదర్శనలు
- సమ్మె తో ప్రత్యామ్నాయ ఏర్పాట్లులో ఆసుపత్రుల పాలకులు




విశాఖపట్నం, ఆగస్టు 16 ప్రభాత వార్త :

స్టైఫండ్ పెంపు, పాత బకాయిల విడుదల తదితర పెండింగ్ సమస్యల పరిష్కారంకు సంబంధించి గత ఆరు రోజులుగా ప్రభుత్వంతో ఏపీ జూనియర్ డాక్టర్ల సంఘం జరుపు తున్న చర్చల్లో పురోగతి లేని కారణంగా సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని మెడికల్ కాలేజీ పరిధిలోని ప్రభుత్వభోధనా ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య సేవలను బహిష్కరించాలని నిర్ణయించినట్లు ఏపీ జూనియర్ డాక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన, సంయుక్త కార్యదర్శులు డాక్టర్ బలగం దినకర్ సాయి శ్రీనివాస్, కె. రవీంద్రలు తెలిపారు. గత ఆరు రోజులుగా తమ సమస్యల పరిష్కారం కోసం గడువు ఇస్తూ (తరువాయి 8వ పేజీలో)

## వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి
# సర్దార్ గౌతు లచ్చన్న కృషి చిరస్మరణీయం

**జయంతి వేడుకలో నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్**



విశాఖపట్నం, ఆగస్టు 16,ప్రభాత వార్త :

సమాజంలోని వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, సామాజిక సమానత్వం కోసం సర్దార్ గౌతు లచ్చన్న చేసిన కృషి చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా ఆదివారం గ్రీన్ పార్క్ హోటల్ జంక్షన్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం లచ్చన్న చేసిన పోరాటం, సామాజిక న్యాయం కోసం ఆయన సాగించిన కృషి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని వెనుకబడిన వర్గాల సంక్షేమం, అభ్యున్నతికి మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, బీసీ సంఘాల నాయకులు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొని సర్దార్ గౌతు లచ్చన్నకు నివాళులర్పించారు.

# బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విశాఖకు రాక

**18న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ విస్తృత సమావేశం**

**945 మండలాల ప్రతినిధుల హాజరు.. రాష్ట్ర ప్రగతిపై పలు తీర్మానాలు**




విశాఖపట్నం, ఆగస్టు 16, ప్రభాత వార్త:

బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నితిన్ నబీన్ తొలిసారిగా విశాఖపట్నం రానున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. ఈ నెల 17న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కానున్న రోజే రాత్రి 9 గంటలకు నితిన్ నబీన్ విశాఖకు చేరుకోనున్నారని చెప్పారు. శనివారం డాల్ఫిన్ హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాధవ్ మాట్లాడారు. కొత్త రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటైన నేపథ్యంలో ఈ నెల 18న విశాఖలోని (తరువాయి 8వ పేజీలో)

## చైల్డ్ వెల్ఫేర్ కమిటీ విశాఖ జిల్లా బోర్డు సభ్యునిగా
# డాక్టర్ దిగుమర్తి ఉదయ్ కుమార్



విశాఖపట్నం, ఆగస్టు 16, ప్రభాత వార్త :

విశాఖ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ బోర్డు సభ్యునిగా నగరానికి చెందిన ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ దిగుమర్తి ఉదయ్కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన నియామకాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సూర్యకుమారి ధృవీకరించారు. ఉదయ్కుమార్ 20 ఏళ్లుగా విద్య, దంత ఆరోగ్య సంరక్షణకు మొదలగు పలు అంశాల్లో కృషి చేస్తున్నారు. ఆర్థోడెంటిక్ విభాగంలో రాష్ట్రంలోనే మొట్ట మొదటి డాక్టరేట్ను ఉదయ్ కుమార్ అందుకున్నారు. ఉదయ్కుమార్కు ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్కు ఉండే అధికారాలు, జువైనల్ జస్టిస్ పరంగా కూడా హోదా ఉంటుందని అధికారులు తెలిపారు. ఉదయకుమార్కు ఈ పదవి వరించడం పట్ల పలువురు నగర ప్రముఖులు ఆనందం వ్యక్తం చేశారు.

# వైజాగ్ ఎయిర్‌పోర్ట్ ఖాళీ..

### కార్మికుల కన్నీళ్లు

### అర్ధరాత్రి నుంచి ప్రయాణికుల విమాన సేవలకు ముగింపు..

### తరలింపు పనుల్లో సిబ్బంది



విశాఖపట్నం, ఆగస్టు 16, ప్రభాతవార్త : విశాఖ విమానాశ్రయంలో ప్రయాణికుల విమాన సేవలకు ఆదివారం అర్ధరాత్రి నుంచి తెరపడింది. భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విమాన సేవలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విశాఖ విమానాశ్రయం నుంచి షెడ్యూల్డ్ కమర్షియల్ విమాన సర్వీసులు నిలిచిపోనున్నాయి.

విశాఖ విమానాశ్రయం నుంచి చివరి ప్రయాణికుల విమానం రాత్రి 10.45 గంటలకు ఢిల్లీకి బయలుదేరనుంది. దీంతో విమానాశ్రయంలోని పలు వస్తువులు, సామగ్రిని సిబ్బంది ఇతర ప్రాంతాలకు తరలించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇన్నాళ్లుగా విశాఖ విమానాశ్రయంలో పనిచేసిన కార్మికులు, సిబ్బంది ఈ పరిణామంతో తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తమతో అనుబంధం ఉన్న విమానాశ్రయం ఖాళీ అవుతుండటాన్ని చూసి పలువురు కంటతడి పెట్టుకున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడే విధులు నిర్వహించిన తమకు ఈ రోజు భావోద్వేగంగా ఉందని పేర్కొన్నారు. దశాబ్దాలుగా విశాఖ నగరానికి విమాన సేవల కేంద్రంగా ఉన్న పాత విమానాశ్రయం నుంచి ప్రయాణికుల విమాన సర్వీసులు నిలిచిపోవడం నగర చరిత్రలో కీలక పరిణామంగా మారింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కొత్త విమానయాన కేంద్రంగా రూపుదిద్దుకుంటున్న వేళ.. పాత విమానాశ్రయంతో అనుబంధం ఉన్న సిబ్బంది భావోద్వేగ వీడ్కోలు పలికారు.

# అత్యవసర వైద్య సేవలు నిలిపివేత

(7వ పేజీ తరువాయి)

అత్యవసర ఐసియూ వైద్య సేవలు నిర్వహింస్తూ సమ్మె లో భాగంగా అవుట్ పేషెంట్, సాధారణ వార్డు వైద్య సేవలను మాత్రమే బహిష్కరిస్తూ దశలవారీ ఆందోళన కొనసాగుతున్న మని వారుచెప్పారు. ఎప్పటికి ప్రభుత్వం నుంచి చర్చల్లో పురోగతి రాక పోవడం వల్ల తప్పనిసరి పరిస్థితి లో మూడో దశ సమ్మె ఆందోళన కు శ్రీకారం చుట్టాలిసివచ్చిందని పేర్కొన్నారు. సోమవారం నుండి అన్ని అత్యవసర, ఐసియూ,ఓటీ,వార్డు వైద్య సేవలను నిలిపవేసి తమ సమ్మె ను ఉధృతం చేయనున్నట్టు వారు ఆదివారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటన లో పేర్కొన్నారు. సోమవారం నాటి సమ్మె లో భాగంగా కెజీ హెచ్ తో పాటు ఏఎంసి పరిధిలో ని అన్ని ప్రభత్వ ఆసుపత్రులలోనూ అత్యవసర వైద్య సేవలను బహిష్కరణ చేసి జూనియర్ డాక్టర్ లు అంతా కెజీహెచ్, ఏఎంసి లలో నిరసన ప్రదర్శన నిర్వహించిన అనంతరం సూప్రెండేంటెంట్ కార్యాలయంఎదుట ఆమరణ నిరసన నిరాహార దీక్షను చెపడతామని చెప్పారు. తమ సమ్మె లో భాగంగా ఆరో రోజు విశాఖ జీవీఎంసి కార్యాలయంగాంధీ విగ్రహం ఎదుట సుమారుగా వెయ్యి మంది జూనియర్ డాక్టర్ లు పెద్ద ఎత్తున ఆమరణ నిరాహార దీక్ష ను కొనసాగించారు. ఇదిలావుండగా సోమవారం నుండి జూనియర్ డాక్టర్ ల చేయనున్నా అత్యవసర వైద్య సేవలు ను బహిష్కరణ ను సమర్థ వంతగా ఎదుర్కొనేందుకు అన్ని అనుబంధఆసుపత్రుల లో పనిచేస్తున్న సిబ్బంది కి సెలవులు రద్దు చేయడం తో పాటు అవసరమైన అదనపు వైద్యులు ను పీహెచ్సి లు,ప్రైవేటు ఆసుపత్రులనుఉంచి రప్పించుకుని సమ్మె ప్రభావం రోగుల మీద పడకుండాప్రత్యామ్నాయఏర్పాటులను చేసుకునడంలో ఏఎంసి అనుబంధ ఆసుపత్రుల సూపరింటెండెంట్ లు అందరూ ఆదివారం అర్ధరాత్రి వరకూ తల మునకల య్యారు.

## ఏదో వెలితిగా ఉంది..ఎంతో బాధగా ఉంది..

(7వ పేజీ తరువాయి)

నిలిచింది. ఈరోజు ఎయిర్ పోర్టులో సహచర ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్ గారు గారు, సుందరపు విజయ్ కుమార్ గారు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు గారు కలిశారు. పైకి అందరం మాట్లాడుకుం టున్నా మనసులలో మాత్రం ఏదో తెలీని ఆర్ద్రత.. ఆవేదన.. అనేక ఏళ్ల పాటు లక్షల మంది ప్రయాణికులకు మధుర జ్ఞాపకాలను పంచిన మనందరి విశాఖ ఎయిర్ పోర్టు ఈరోజుతో మూతబడుతుందన్న ఊహే బాధగా ఉంది. ఎయిర్ పోర్టు లో గడిపిన క్షణాలు ఎప్పటికీ మదిలో పదిలంగా ఉంటాయి. రేపటి నుంచి అధికారికంగా మొదలు కానున్న భోగాపురం అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు అత్యాధునిక హంగులతో ప్రయాణికులకు స్వాగతం పలుకుతోంది.

## రింతాడలో ఉచిత కంటి వైద్య శిబిరం

### 72 మందికి కంటి పరీక్షలు.. 45 మందికి ఉచిత కళ్లద్దాల పంపిణీ

### 25 మందికి శస్త్రచికిత్సల కోసం ఎంపిక




గూడెం కొత్తవీధి ఆగస్టు 16 ప్రభాతవార్త : మండలంలోని రింతాడ సచివాలయం ఆవరణలో ఆదివాసీ మాతోట రైతుల మ్యాక్స్ సీఈఓ ధనుంజయ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జీకే వీధి, చింతపల్లి మండలాల పరిధిలోని పలు గ్రామాల నుంచి గిరిజనులు పెద్ద సంఖ్యలో శిబిరానికి తరలివచ్చారు. శిబిరంలో మొత్తం 72 మందికి అత్యాధునిక పరికరాలతో కంటి పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న 45 మందికి ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. తీవ్రమైన కంటి సమస్యలతో బాధపడుతున్న 25 మందిని శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మరో వృద్ధుడి కంటి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు సీఈఓ ధనుంజయ్ వెల్లడించారు. శిబిరంలో ఆప్తాల్మాలజిస్టులు ముక్కా రమేష్, నాగలక్ష్మి, శిరీష, ఈశ్వరి, గాయత్రి, పుణ్యవతి తదితరులు పాల్గొని రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఇటువంటి వైద్య శిబిరాలను తరచుగా నిర్వహించి గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వారు కోరారు.

## విధి నిర్వహణలో విశేష సేవలకు పంచాయతీ అధికారులకు ప్రశంస పత్రాలు



రాంబిల్లి, ఆగస్టు 16, ప్రభాతవార్త: విధి నిర్వహణలో విశేష సేవలు అందిస్తూ ప్రజలకు అందుబాటు లో ఉంటూ, గ్రామాల పరిశుభ్రతకు కృషి చేస్తున్న రాంబిల్లి మండల పంచాయతీ అధికారుల ను స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఘనంగా సత్కరించారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ చేతుల మీదుగా రాంబిల్లి మండలానికి చెందిన నలుగురు పంచాయతీ అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. పెద్దకలవలపల్లి గ్రామపంచాయతీ వి. విశ్వేశ్వరరావు (గ్రేడ్-5), కొత్తూరు గ్రామపంచాయతీ పీ. పరశురాం (గ్రేడ్-2), మురకాడ గ్రామపంచాయతీ బి. అనురాధ (గ్రేడ్-3), వాడ నరసాపురం గ్రామపంచాయతీ ఎం. సబిత (గ్రేడ్-4)లకు తమ విధుల్లో చూపిన సమర్థతకు గుర్తింపుగా ఈ ప్రశంసా పత్రాలను అందుకున్నారు. మండల పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ పంచాయతీ పరిపాలనను సమర్థవంతంగా నిర్వహించడం, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించడం, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయడం వంటి సేవలను గుర్తించి వీరికి ధ్రువపత్రాలు అందజేశారన్నారు.

# దీర్ఘకాలిక ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా నగర అభివృద్ధి

### బీచ్ తీర అభివృద్ధి, పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం: కమిషనర్ కేతన్ గార్గ్



విశాఖపట్నం, ఆగస్టు 16, ప్రభాతవార్త : విశాఖ నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసి, ప్రజలకు శాశ్వత ప్రయోజనం కలిగేలా మౌలిక వసతులు, సుందరీకరణ పనులు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. నగరానికి వచ్చే ప్రజలు, దేశ, విదేశీ పర్యాటకులు, అతిథులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు.

ఆర్కే బీచ్ రోడ్, బీచ్ పరిసర ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్.. మౌలిక వసతులు, పరిశుభ్రత, సుందరీకరణ పనులను పరిశీలించారు. ప్రధాన రహదారులు, జంక్షన్లు, ఫుట్‌పాత్‌లు, గ్రీనరీ, వీధి దీపాలు, ప్రజా సదుపాయాలను దశలవారీగా మెరుగుపరచాలని ఆదేశించారు. బీచ్ ప్రాంతానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ తాగునీరు, పబ్లిక్ టాయిలెట్లు, వ్యర్థాల నిర్వహణ, గ్రీనరీ, విద్యుత్ అలంకరణ తదితర సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు. బీచ్‌లోకి డ్రైన్ల ద్వారా నీరు చేరకుండా చర్యలు చేపట్టడంతో పాటు సముద్రంలో కలుస్తున్న డ్రైన్లను లుంబినీ పార్కు వద్ద ఉన్న ఎస్టీపీకి అనుసంధానం చేసేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఆర్కే బీచ్ బస్ బేకు మరమ్మతులు చేపట్టి పెయింటింగ్, విద్యుత్ అలంకరణతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, ఫుట్‌పాత్‌లు, బీచ్ పరిసరాల్లో వాల్ పెయింటింగ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. అదనంగా ట్విన్ డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ఆదేశించారు.

బీచ్‌లో అస్తవ్యస్తంగా ఉన్న చిరు వ్యాపారాలను క్రమబద్ధీకరించి, ప్రత్యేక వెండింగ్ జోన్ ఏర్పాటు చేయాలని తూర్పు జోన్ జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్‌ను ఆదేశించారు. విద్యుత్ స్తంభాలపై లైటింగ్‌ను ఒకే విధంగా, ఆధునికంగా ఏర్పాటు చేయాలని సూచించారు. బీచ్ రోడ్ సెంట్రల్ మీడియన్‌లో ఆకర్షణీయమైన మొక్కలు పెంచడంతో పాటు గ్రిల్స్, ఫోకస్ లైట్లతో సుందరీకరణ చేపట్టాలని, ఆర్కే బీచ్ బస్ బే వెనుక గార్డెన్‌ను మరింత అభివృద్ధి చేసి నిరంతరం నిర్వహించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు.

ఈ పర్యటనలో అదనపు కమిషనర్ పి.నల్లనయ్య, ప్రధాన ఇంజనీర్ పీవీవీ సత్యనారాయణరాజు, పర్యవేక్షక ఇంజనీర్లు, జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్, టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, ఇంజనీరింగ్, హార్టికల్చర్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ఇక శెలవు

(7వ పేజీ తరువాయి)

విశాఖ వాసులు జీర్ణించు కోలేకున్నారు. ప్రభుత్వాలు ఎంత మాత్రం భోగా పురం నుంచి మాత్రమే విమానాలు నడిపేలా ఏర్పాటు చేసేసారు. ఈనెల 17వ తేదీ నుంచి భోగాపురం అంతర్జాతీయ విమాన సర్వీసులు రాకపోకలు సాగించనున్నాయి. దేశీయ విమానాలు కూడా విజయనగరం భోగాపురం నుంచి రాకపోకలు సాగిస్తాయి. సుమారు మూడు దశాబ్దాలుగా విశాఖ విమానాశ్రయం నగర వాసులకు విమాన సర్వీసులు అందుబాటులో ఉంచింది. తాజా పరిణామాలతో ఈ విమానా శ్రయం నేవీ పరిధిలోకి పూర్తిస్థాయిలో వెళ్ళనుం ది. నగరవాసులు విశాఖపట్నం విమానాశ్రయాన్ని కొనసాగించాలని ఎంతగా మొత్తుకుంటున్నా రాష్ట్ర ప్రభుత్వం ససిమీరా అంటుంది. ప్రజల బాధలు అర్థం చేసుకోకుండా రోడ్లు వేస్తాం, బస్సులు వేస్తామంటూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తుంది. విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్లడానికి విమానం కంటే వందేభారత్ రైలు మంచిదన్న నిర్ణయాన్ని విమాన ప్రయాణికులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్ నుంచి నుంచి నడుస్తున్న విమాన సర్వీసులు భోగాపురం లోనే దిగుతాయని విమానాశ్రయ అధికారులు పేర్కొన్నారు. విజయనగరం జిల్లా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం విషయంలో ప్రభు త్వం జిఎంఆర్‌తో లాలూచీ పడిందన్న ఆరోప ణలు ప్రయాణికులు చేస్తున్నారు విశాఖపట్నం నుంచి సుమారు 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరాలంటే రెండు గంటల వ్యవధి పడుతుంది. అలాగే భోగాపురం నుంచి విశాఖ చేరాలని అంతే సమయం పడుతుంది. వీటిని పరిగణలోకి తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం అర్ధాంతరంగా వైజాగ్ విమానాశ్రయం మూసి వేయడంపై సర్వత్ర నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం మూసివేత నిర్ణయానికి అనేకమంది తప్పు పడుతున్నారు. జాతీయ విమానాలు విశాఖలో దిగేలా విమాన ప్రయాణికులు ప్రభుత్వాన్ని అర్థిస్తున్నారు. ఈ సమస్య విశాఖ వాసులందరికీ ప్రస్తుతంతో పాటు భవిష్యత్తులో వెంటాడనుందని అనేకమంది చెబుతున్నారు. భోగాపురం ఎయిర్పోర్ట్ విజయనగరానికి అత్యంత సులువుగా ఉంటుందని, ప్రజల కోరికను మన్నించి ప్రభుత్వం విశాఖ విమానాశ్రయాన్ని కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## వందేమాతరం అవమానంపై బీజేవైఎం క్యాండిల్ ర్యాలీ

### దేశభక్తి గీతాన్ని అవమానించడం యావత్ దేశాన్ని అవమానించడమే: పీవీఎన్ మాధవ్






విశాఖపట్నం, ఆగస్టు 16 (ప్రభాత వార్త): వందేమాతరం గీతాలాపన సమయంలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ అవమానకరంగా వ్యవహరించారని ఆరోపిస్తూ బీజేపీ యువమోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో గాజువాకలో శనివారం క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ.. వందేమాతరం కేవలం గీతం కాదని, కోట్లాది భారతీయుల దేశభక్తి భావోద్వేగాలకు ప్రతీక అని అన్నారు. జాతీయ, దేశభక్తి గీతాల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవభావంతో వ్యవహరించాల్సిన బాధ్యత ఉందన్నారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలకు ప్రతీకగా నిలిచిన వందేమాతరం గీతాన్ని అవమానించేలా వ్యవహరించడం దేశభక్తిని అవమానించడమేనని మాధవ్ అన్నారు. కాంగ్రెస్‌కు దేశ చరిత్ర, స్వాతంత్ర్య ఉద్యమం, జాతీయ భావాలపై గౌరవం ఉంటే ఇలాంటి ఘటనలు జరిగేవి కావని విమర్శించారు. దేశ ప్రజల మనోభావాలను గౌరవించి కాంగ్రెస్ నేతలు తమ వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. దేశ సమైక్యత, అఖండత, జాతీయ స్ఫూర్తిని యువతలో పెంపొందిం చేందుకు బీజేవైఎం నిరంతరం పనిచేస్తుందని మాధవ్ తెలిపారు. కార్యక్రమానికి బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి, నాగోతు హరికృష్ణ, ఆదిత్య నాయకత్వం వహించారు. బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని 'వందేమాతరం', 'భారత్ మాతాకీ జై' నినాదాలు చేశారు.

# చిత్రలేఖనం, నృత్యం పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రధానం




ఆరిలోవ, ఆగస్టు 16, ప్రభాతవార్త : జీవీఎంసీ పదో వార్డ్ పాత డైరీ ఫారంలో ఉన్న ఆనంద మార్గ ఆశ్రమంలో 'రైనేసాన్స్ ఆర్టిస్ట్స్ అండ్ రైటర్స్ అసోసియేషన్' (రావ) 44వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన చిత్రలేఖనము, నృత్యం, గాత్ర సంగీతం పోటీలలో విజేతలకు ఆదివారం సాయంత్రం బహుమతులు ప్రధానం చేశారు. రావ సంస్థ కార్యదర్శి ఎన్ పండ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో విజేతల ఎంపికకు శ్రీ వారాహి సామవేద మ్యూజిక్ అకాడమీ ప్రిన్సిపాల్ ఏ. శాంతి శ్రీ, ఏయూ డాన్స్ విభాగం ఫ్యాకల్టీ డాక్టర్ కేవీ విజయ వేణి జడ్జిలుగా వ్యవహరించారు. ఈ పోటీల్లో ఆరు విభాగాల్లో 60 మంది పాల్గొనగా 20 మందికి ప్రధమ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి అతిధుల చేతుల మీదగా మెమొంటోళ్లు అందుకున్నారు. విజేతలతో పాటు పోటీల్లో పాల్గొన్న అభ్యర్థులందరికీ అతిథులు ధ్రువ పత్రాలు అందజేశారు. ఆనంద మార్గ ఆచార్య సౌమ్యానంద అవధూత, సీనియర్ సభ్యులు రాజు తదితరులు పాల్గొన్నారు.

## అనుమానస్పదంగా మృతి చెందిన ఎస్‌బిఐ మేనేజరు



పద్మనాభం, ఆగస్టు 16, ప్రభాతవార్త : మండలంలో మద్దిగ్రామానికి చెందిన ఎస్‌బిఐ మేనేజరు కాళ్ల శ్రీకర్ (39),భీమిలి మండలం తిమ్మాపురం వద్ద ఉన్న సముద్రంలో శనివారం రాత్రి పడి అనుమానస్పదంగా మృతి చెందినట్లు పోలీసులు చెప్పారు.మృతుడు శ్రీకర్ శ్రీకాకుళంలో ఎస్‌బిఐ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తూ ప్రస్తుతం సస్పెన్షన్ లో ఉన్నట్లు పోలీసులు చెప్పారు. మృతుడుకి తండ్రి సూరిబాబు, తల్లి సత్యవతి, చెల్లెలు ఉన్నారు. శ్రీకర్ తల్లిదండ్రులతో కొంత కాలం నుండి మధురవాడ మిథిలాపురంలో నివసిస్తున్నారు. అయితే శ్రీకర మృతదేహానికి భీమిలి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడు తండ్రి సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు చెప్పారు.మృతుడికి మద్దిగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆనందపురం, ఆగస్ట్ 16, ప్రభాతవార్త: మండలంలోని పొడుగుపాలెం గ్రామంలో విష పదార్థం సేవించి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. పొడుగుపాలెం గ్రామానికి చెందిన బంటుబిల్లి సూరి అప్పలనాయుడు (61) వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. ఆయనకు మద్యం సేవించే అలవాటు ఉంది. ఈ నెల 6న సూరి అప్పలనాయుడు మద్యం కొనుగోలు చేసి కొంత సేవించి, మిగిలిన మద్యాన్ని ఇంటి సమీపంలోని వ్యవసాయ కళ్లంలో ఉంచారు. ఏడో తేది ఉదయం కళ్లం వద్దకు వెళ్లి మిగిలిన మద్యం సేవించాడు. అక్కడే ఉన్న థమ్సప్ బాటిల్‌లో సాధారణ శీతల పానీయమే ఉందని భావించి, అందులోని ద్రవాన్ని కూడా సేవించాడు.అప్పటి నుంచి తీవ్ర వాంతులు, విరేచనాలతో బాధపడటంతో స్థానిక ఆర్ఎంపీ వైద్యుడిని సంప్రదించారు. మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం సూరి అప్పలనాయుడు మృతి చెందినట్లు కేజీహెచ్ వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో మృతుడి పెద్ద కుమారుడు బంటుబిల్లి వెంకటేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి హెచ్‌సీ పార్థసారథి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యార్థి తల్లిదండ్రులను అభినందించిన" కొప్పిశెట్టి"



నక్కపల్లి, ఆగస్ట్ 16, ప్రభాతవార్త : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తోపాటు డీసీసీబి సిబ్బంది , రైతులు కుటుంబాలలో 10వ తరగతి, ఇంటర్ లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకం అందించే కార్యక్రమం లో భాగంగా నక్కపల్లి పిఏసిఎస్ లో పని చేస్తున్న శీరంరెడ్డి గోవింద్ కుమార్తె యశస్విని ఎంపిక కాగా వారి తండ్రి గోవింద్ కి 10000/- చెక్ ను సొసైటీ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మనబాల కొండబాబు, కోసూరి శ్రీను, సంఘ సీఈఓ ఖాన్ , పలువురు రైతులు, సిబ్బంది ,నగేష్, వరలక్ష్మి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# విశాఖకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రాక

(7వ పేజీ తరువాయి)

వి-కన్వెన్షన్ హాల్‌లో బీజేపీ విస్తృత స్థాయి రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించను న్నట్లు మాధవ్ తెలిపారు. రాష్ట్రంలోని 945 మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, రాష్ట్ర పదాధికారులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు సమావేశానికి హాజరవుతారని చెప్పారు. జిల్లాలవారీగా పార్టీ సంస్థాగత నిర్మాణం, ప్రగతి, ఏడు మోర్చాల కార్యక్రమాలను ప్రదర్శించే ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

రాష్ట్రానికి జరిగిన అభివృద్ధి, వచ్చిన పెట్టుబడులపై ఒక తీర్మానం, రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడం, ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టుపై మరో తీర్మానం ప్రవేశపెట్టనున్నట్లు మాధవ్ చెప్పారు. బీజేపీ అఖిల భారత సంఘటన మంత్రి బీఎల్ సంతోష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభారిగా ఉన్న శివప్రకాశ్ తదితర జాతీయ నాయకులు సమావేశానికి హాజరవుతారని తెలిపారు.

పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మాధవ్ అన్నారు. త్వరలో గోదావరి జలాలు అనకాపల్లి జిల్లాకు చేరే పరిస్థితి ఏర్పడుతోందని చెప్పారు. అనంతరం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఫేజ్-1, ఫేజ్-2 ద్వారా ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలకు సాగు, తాగునీటి భద్రత కల్పించే దిశగా చర్యలు సాగుతున్నాయని తెలిపారు. 24.33 టీఎంసీల తాగునీటి లభ్యత కూడా ఈ ప్రాంతానికి ప్రయోజనం చేకూరుస్తుందని పేర్కొన్నారు.

విశాఖలో గూగుల్ వంటి భారీ పెట్టుబడులు రావడంతోపాటు డేటా కేబుల్ ప్రాజెక్టులు, సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటుతో విశాఖ ప్రాధాన్యం పెరుగుతోందని మాధవ్ తెలిపారు. కొత్త రైల్వే లైన్లు, స్టేషన్లు, రైళ్ల రాకతో నగర ప్రాధాన్యం మరింత పెరగనుందని చెప్పారు.

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కావడం ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక పరిణామమని మాధవ్ అన్నారు. ఆర్సెలార్ మిట్టల్, నిప్పాన్ స్టీల్ వంటి భారీ పరిశ్రమలు, ఎన్టీపీసీ ఆధ్వర్యంలో సుమారు రూ.1.84 లక్షల కోట్ల గ్రీన్ హైడ్రోజన్ పెట్టుబడులు, బల్క్ డ్రగ్ పార్క్ తదితర ప్రాజెక్టులతో ఉత్తరాంధ్రలో అభివృద్ధి వేగవంతం కానుందని తెలిపారు.

నితిన్ నబీన్‌కు ఘన స్వాగతం పలికేందుకు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి ఎమ్మెల్యే ఈశ్వరరావు నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు మాధవ్ చెప్పారు. తప్పెటగుళ్లు, డప్పులు తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. నగరంలో స్వాగత ఏర్పాట్లను ఎమ్మెల్యే పెన్మెత్స విష్ణుకుమార్ రాజు, ఇతర నాయకులు, నగర అధ్యక్షుడు పరశురామరాజు ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఈ నెల 18న సాయంత్రం 4 గంటలకు గ్రాండ్ బే హోటల్‌లో 25 ఏళ్లలోపు ఎంపిక చేసిన 250 మంది యువతతో నితిన్ నబీన్ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాధవ్ తెలిపారు. యువ న్యాయవాదులు, వైద్యులు, పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులు తదితరులు ఇందులో పాల్గొంటారని చెప్పారు. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సమన్వయంతో ముందుకు సాగుతోందని మాధవ్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమిగా కలిసి పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అంశాలపై ముందుకు సాగడంతోపాటు స్థానిక సంస్థల ఎన్నికలను దశలవారీగా నిర్వహించే అంశంపై చర్చ జరుగుతోందన్నారు.

ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో కూటమిపై ఉంచిన నమ్మకాన్ని బాధ్యతగా తీసుకుని సంక్షేమంతోపాటు అభివృద్ధిని వేగవంతం చేస్తామని మాధవ్ తెలిపారు. రాష్ట్రంలో ఏర్పడిన సానుకూల వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడమే బీజేపీ లక్ష్యమన్నారు.

కార్యక్రమంలో బీజేపీ శాసనసభా పక్ష నేత పెన్మెత్స విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్యే నడికుడి ఈశ్వరరావు, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారి దిలీప్, జిల్లా అధ్యక్షుడు పరుశురామరాజు, అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్, గాదె శ్రీనివాసరావు, బొత్స సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో కనుమరుగైన విమానాలు!

(7వ పేజీ తరువాయి)

అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావడంతో విశాఖలోని పాత విమానాశ్రయం నుంచి వాణిజ్య విమాన సర్వీసులు నిలిచిపోనున్నాయి. ఆదివారం అర్ధ రాత్రి తరువాత విశాఖ విమానాశ్రయం వైభవం ముగిసిపోనుంది. ఆగస్టు 17 నుంచి అన్ని షెడ్యూల్డ్ విమాన సర్వీసులు భోగాపురం నుంచే నడవనున్నాయి.విశాఖ విమానాశ్రయంతో ప్రయాణికులకు ఉన్న అనుబంధం మాత్రం అంత సులభంగా ముగిసిపోదు. నగరానికి దగ్గరగా ఉండే ఆ విమానాశ్రయం, ప్రయాణికుల పరుగులు, వీడ్కోలు చెప్పే కుటుంబాలు, విమానం కోసం ఎదురుచూసే కళ్లతో ఎన్నో కథలకు సాక్ష్యంగా నిలిచింది. ఇకపై ఆకాశంలో ఏ విమానం ఎగిరినా దాని శబ్దం విశాఖ నేలపై కాకుండా భోగాపురం నేలపై వినిపించనుంది. విశాఖ నగరం విమానాశ్రయాన్ని కోల్పోలేదు. కానీ తన ఇంటి వాకిటి (గుమ్మం) నుంచి ఎగిరే విమానాలను మాత్రం కోల్పోయింది. ఆ జ్ఞాపకాలతోనే విశాఖ ఈ మార్పును చూస్తోంది. విశాఖపట్నం విమానాశ్రయం సివిల్ ఎన్‌క్లేవ్ నుంచి నిర్వహించే చివరి షెడ్యూల్డ్ వాణిజ్య విమాన సర్వీస్ ఇండిగో విమానం 6E 2018. ఈ విమానం 16 ఆగస్టు ఆదివారం సాయంత్రం 22:45 గంటలకు విశాఖపట్నం నుంచి ఢిల్లీకి బయలుదేరింది. ఈ విమానం బయలుదేరడంతో విశాఖపట్నం విమానాశ్రయంలో షెడ్యూల్డ్ వాణిజ్య విమాన కార్యకలాపాలకు అధికారికంగా తెరపడింది. ఇది ప్రాంతీయ పౌర విమానయాన చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది.





### విశాఖ ఎయిర్ పోర్ట్‌కు ఆఖరి వీడ్కోలు పలికిన ఉత్తరాంధ్రా ఎమ్మెల్యేలు.

విశాఖ సాగర తీరం అందించిన ఆత్మీయ అనుభూతులతో విశాఖపట్నం విమానాశ్రయానికి ఉత్తరాంధ్రాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ఆఖరి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఆదివారం సాయంత్రం విశాఖపట్నం ఉత్తర ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ పి.విష్ణుకుమార్ రాజు, విశాఖపట్నం విమానాశ్రయం నుంచి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో విజయవాడకు బయలుదేరారు. విజయవాడలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు ఆయన ప్రయాణమయ్యారు. ఈసందర్భంగా ఆయనతో పాటువిజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు కూన రవికుమార్, ఈశ్వర్ రావు, విజయ్ చంద్రుడు, మామిడి గోవిందరావు అలాగే ఎమ్మెల్సీ గ్రీష్మ కూడా చివరి సారిగా విశాఖ ఎయిర్పోర్ట్ నుంచి విజయవాడ కు బయలుదేరారు. విశాఖపట్నం విమానాశ్రయం నుంచి బయలుదేరుతున్న సందర్భంగా, విశాఖ సాగరతీరం అందించిన అనుబంధాలు, ఆత్మీయ జ్ఞాపకాలను గుర్తుచేసు కుంటూ వారు విమానాశ్రయానికి వీడ్కోలు పలికారు.

విశాఖ చరిత్రలోఈ సండే బ్లాక్ డే: డోమెస్టిక్ విమాన సేవలు కొనసాగేలాఅసెంబ్లీ లో ప్రస్తావిస్తా ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు. "నగర చరిత్రలో ఈ ఆదివారం చీకటి రోజు గా మిగిలిపోతుంది" అని విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్రాజు అన్నారు.మరికొన్ని గంటల్లో విశాఖపట్నం విమానాశ్రయం నుంచి విమాన సేవలు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మారనున్న నేపథ్యంలో, విశాఖ విమానాశ్రయంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.దశాబ్దాల చరిత్ర కలిగిన విశాఖపట్నం విమా నాశ్రయం నుంచి సేవలు నిలిచిపోవడం దురదృష్టక రమని ఆయన అన్నారు. విశాఖ విమానాశ్రయం నుంచి డొమెస్టిక్ విమాన సేవలు కొనసాగించేలా అసెంబ్లీలో ప్రస్తావిస్తానని తెలిపారు.

అదే విధంగా విశాఖ విమానాశ్రయంలో పనిచేస్తున్న కింది స్థాయి సిబ్బంది, హౌస్‌కీపింగ్ సిబ్బంది ఉపాధిపై విశాఖ ఎంపీ శ్రీ భరత్‌తో చర్చిస్తానని చెప్పారు. వారి ఉపాధికి ఎలంటి ఇబ్బందులు కలగ కుండా తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని తెలిపారు. భవిష్యత్‌లో విశాఖపట్నం విమానాశ్రయం నుంచే డొమెస్టిక్ విమాన సేవలు కొనసాగించే విధంగా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా విశాఖ విమానా శ్రయంలో పనిచేస్తున్న స్థానిక సిబ్బంది ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పట్ల ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు. అనంతరం విశాఖపట్నం విమానాశ్రయం నుంచి నేరుగా విజయవాడకు బయలుదేరి, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రయాణమయ్యారు.

## సర్దార్ గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం : కెఎన్ఆర్

గాజువాక,ఆగష్టు 16,ప్రభాతవార్త :



స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీ యమని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ ఆర్) అన్నారు. గాజువాక బాల చెరువు పెదగంట్యాడ పోలీస్ స్టేషన్ కూడలిలో గీత సహకార సంఘం అధ్యక్షుడు బత్తిన పరదేశి ఆధ్వర్యంలో లచ్చన్న జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఆయన నూతన విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. అనంతరం మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, దాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కేఎన్ఆర్ మాట్లాడుతూ.. నేతాజీ సుభాష్ చంద్రబోస్, ఆచార్య ఎన్.జి.రంగా వంటి యోధులతో కలిసి పనిచేసిన లచ్చన్న, సర్దార్ పటేల్ తర్వాత 'సర్దార్'గా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పరదేశి, వెంకటేష్, మాజీ కౌన్సిలర్ నూకరాజు, రమణారావు, మంగరాజు పాల్గొన్నారు.

## మోడేకుర్తి సత్యనారాయణకు స్వాతంత్ర్య దినోత్సవ పురస్కారం

గాజువాక,ఆగష్టు 16,ప్రభాతవార్త :



వివిధ దేవాలయాల ఉత్సవాల్లో స్వచ్ఛంద మైక్ అనౌన్సర్‌గా విశిష్ట సేవలు అందిస్తున్న మోడేకుర్తి వీరవేంకట సత్యనారాయణ (ఎం.వి.వి. సత్యనారాయణ) విశాఖ జిల్లా యంత్రాంగం నుంచి ప్రతిష్టాత్మక 'స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక సేవా పురస్కారాన్ని' అందుకున్నారు. విశాఖపట్నం పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చేతుల మీదుగా ఆయన ఈ ప్రశంసాపత్రాన్ని స్వీకరించారు. జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. గడిచిన కొన్నేళ్లుగా సింహాచలం దేవస్థానం చందనోత్సవం, గిరిప్రదక్షిణ, వైకుంఠ ఏకాదశితో పాటు శ్రీ కనకమహాలక్ష్మి, అప్పికొండ సోమేశ్వరస్వామి, అన్నవరం, అరసవిల్లి, అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయాల ఉత్సవాల్లో కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి మైక్ ద్వారా భక్తులకు సూచనలు అందిస్తూ ఆయన సేవలు అందిస్తున్నారు. ఈ పురస్కారం లభించడం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## చురుగ్గా కృష్ణాపురం ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణ పనులు

పద్మనాభం, ఆగష్టు 16, ప్రభాతవార్త :



మండలంలో కృష్ణాపురం గ్రామ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టిన ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి, గత సంవత్సరం మే నెలలో సూదికొండ వద్ద సర్వే నెంబరు 28 లో సుమారు 50 ఎకరాలలో ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణానికి 12 కోట్ల 40 లక్షల రూపాయలతో రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు శంకుస్థాపన చేసారు. నేటికి రోడ్లు, కాలువల పనులు దాదాపు పూర్తికావచ్చాయి. నేల చదును చేసే పనులు 70 శాతం మిగిలి ఉన్నాయని, వీటిని పర్యవేక్షించేవారు లేరని చెప్పారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు స్పందించి కృష్ణాపురం ఎంఎస్ఎంఈ పార్కు నిర్మాణం పనులను పర్యవేక్షించి వేగంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## ఇండియన్ ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్ చేతుల మీదుగా మెరిట్ విద్యార్థికి బహుమతి ప్రధానం

పద్మనాభం, ఆగష్టు 16, ప్రభాతవార్త :



స్వతంత్ర దినోత్సవ వారోత్సవాలు సందర్భంగా ఆదివారం నగరం లోని అడివివరం ప్రాంతంలో గల మహాత్మా జ్యోతిరావు పూలే ఎపిబిసి సంక్షేమ గురుకుల విద్యాలయంలో 6వ తరగతి చదువుతున్న గౌరిపట్టపు అభిషేక్ అత్యధిక మార్కులు సాధించి గురుకుల పాఠశాలలో ప్రథమ బహుమతి సాధించినందుకు ఇండియన్ ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్ మెరిట్ అవార్డును అంద చేసారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ కల్నల్ మాట్లాడుతూ ఒకప్పుడు తాను కూడా ఇదే స్కూల్లో చదువు కున్నట్లు గుర్తు చేసుకున్నారు. తాను ఈ స్థాయి లో ఉండటానికి కారణమైన ఈ స్కూల్ ను తానెప్పుడూ మరచి పోలేనని అని ఆయన పేర్కొన్నారు. అభిషేక్ మాట్లాడుతూ తాను పెద్దాయక మంచి ఉద్యోగం సాధించి దేశ సేవకు అంకిత మవుతానని ఉద్వేగంగా చెప్పాడు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉత్తమ విద్యార్థి అభిషేక్ ఇప్పటి నుంచే మంచి లక్ష్యం ఏర్పాటు చేసుకున్నాడని, వాని లక్ష్య సాధనకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో అభిషేక్ తల్లిదండ్రులు గౌరిపట్టపు రూపావతి, సతీష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ కాలనీలో అధ్వాన రహదారితో అవస్థలు

ఆనందపురం, ఆగస్టు 16, ప్రభాత వార్త:



ఆనందపురం పరిధిలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పక్కన ఉన్న వైఎస్సార్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో స్థానికు లు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి మొత్తం గుంతలమయంగా మార డంతో వర్షాలు కురిసినప్పుడు పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. కాలనీలోని అంతర్గత రహదారులు కూడా అధ్వానంగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. కాలనీ వాసులు, విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఈ రహదారిపైనే ఆధారపడాల్సి వస్తోంది. గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో అవి కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం సమయంలో రహదారి బురదమయంగా మారడంతో నడవడానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు జారిపడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. రహదారి దుస్థితి కారణంగా ఆటోలు, ఇతర వాహనాలు సక్రమంగా రాకపోవడంతో విద్యార్థులు నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోందన్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు కాలనీలోకి చేరుకోవడం కూడా కష్టంగా మారుతోందని తెలిపారు. ఏళ్లుగా రహదారి సమస్య పరిష్కారం కాకపోవడంతో కాలనీ వాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. అవసరమైతే పూర్తిస్థాయి సీసీ రోడ్డు నిర్మించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## సస్పెక్ట్ షీట్ హోల్డర్లకు పోలీసుల కౌన్సిలింగ్

గాజువాక,ఆగష్టు 16,ప్రభాతవార్త :



విశాఖపట్నం సౌత్ సబ్ డివిజన్ పరిధిలోని దువ్వాడ, స్టీల్ ప్లాంట్, గాజువాక పోలీస్ స్టేషన్ల పరిధికి చెందిన సస్పెక్ట్ షీట్ హోల్డర్లకు పోలీసులు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ జి.డి. బాబు మాట్లాడుతూ... సస్పెక్ట్ షీట్ అనేది శిక్ష కాదని, నేరాల నివారణలో భాగంగా చేపట్టే పర్యవేక్షణ చర్య మాత్రమేనని స్పష్టం చేశారు. గత నేర చరిత్రను పక్కన పెట్టి, ఇకపై ఎలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడకుండా కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జీవించాలని హితవు పలికారు. సమాజంలో మంచి ప్రవర్తనతో ఉంటే నిబంధనల ప్రకారం సస్పెక్ట్ షీట్లను క్లోజ్ చేసే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. ఒకవేళ మళ్లీ నేరాలకు పాల్పడితే చట్టపరంగా తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు జి.డి. బాబు, హరికృష్ణ, ఏఎస్ఐ మధు, హెడ్ కానిస్టేబుళ్లు సురేష్, రమణ, రాంబాబు, తులసి, శేఖర్, లక్ష్మణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విమానాశ్రయానికి ఏరో ఎక్స్‌ప్రెస్

## నేటి నుంచి ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులు

విశాఖపట్నం, ఆగష్టు 16, ప్రభాతవార్త:



అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రయాణికుల సౌకర్యార్థం సోమవారం నుంచి గాజువాక నుంచి ఏరో ఎక్స్‌ప్రెస్ ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులను ప్రారం భించనున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ విశాఖపట్నం రీజినల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. ప్రయాణికుల కోసం ఏఎస్ఆర్-1, ఏఎస్ఆర్-2 పేర్లతో రెండు మార్గాల్లో బస్సులను నడపనున్నారు. ప్రతి అరగంటకు ఒక బస్సు చొప్పున ఉదయం 4.30 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

**ఏఎస్ఆర్-1 మార్గం:** గాజువాక-ఎన్ఏడీ-గురుద్వార్-జూ పార్క్ - మారికవలస-ఆనందపురం-తగరపువలస-ఏర్పాటు జంక్షన్-విమానాశ్రయం.

**ఏఎస్ఆర్--2 మార్గం:** గాజువాక-సింధియా-రైల్వే స్టేషన్-బస్ స్టేషన్-సిరిపురం-ఇస్కాన్ టెంపుల్-ఐటీ హిల్స్-మారికవలస-ఆనందపురం-తగరపువలస- ఏర్పాటు జంక్షన్-విమానాశ్రయం.

గాజువాక నుంచి విమానాశ్రయానికి రూ.400, ఎన్ఏడీ నుంచి రూ.350, గురుద్వార్ నుంచి రూ.300, జూ పార్క్ నుంచి రూ.250, మారికవలస నుంచి రూ.200, ఆనందపురం నుంచి రూ.150, తగరపువలస నుంచి రూ.100, ఎర్పాటుజంక్షన్ నుంచి రూ.50గా ఏఎస్ఆర్--1 ఛార్జీలను నిర్ణయించారు. ఏఎస్ఆర్--2లో గాజువాక, సింధియా, కంచరపాలెం నుంచి రూ.400, సిరిపురం నుంచి రూ.350, ఇస్కాన్ టెంపుల్ నుంచి రూ.300, ఐటీ హిల్స్ నుంచి రూ.250, మారికవలస నుంచి రూ.200, ఆనందపురం నుంచి రూ.150, తగరపువలస నుంచి రూ.100, ఎర్పాటుజంక్షన్ నుంచి రూ.50గా ఛార్జీలు ఉంటాయి. విమాన ప్రయాణికులు తమ ప్రయాణ సమయాలకు అనుగుణంగా ఏరో ఎక్స్‌ప్రెస్ సేవలను వినియోగించుకోవాలని రీజినల్ మేనేజర్ కోరారు. మెరుగైన, సౌకర్యవంతమైన, పర్యావరణహిత ప్రజా రవాణా అందించాలనే ఉద్దేశంతో ఏపీఎస్ఆర్టీసీ ఈ ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు.

# మెగా ప్రాజెక్టులకు వేగం.. ప్రజలకు మెరుగైన వసతులు

## 24 x7 నీటి కనెక్షన్లు సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలి: కమిషనర్ కేతన్ గార్గ్

విశాఖపట్నం, ఆగష్టు 16, ప్రభాతవార్త :



నగర ప్రజలకు నిరంతర నీటి సరఫరా, సమగ్ర సీవరేజ్ వ్యవస్థ, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చేపట్టిన మెగా ప్రాజెక్టులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం మధురవాడ, నార్త్, అగనంపూడి జోన్లలో విస్తృతంగా పర్యటిం చిన ఆయన 24x7 నీటి సరఫరా, సీవరేజ్, ఎస్టీపీ, ప్రధాన నీటి పైప్‌లైన్లు, స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ జోన్ పనులను పరిశీలించారు. ఏడీబీ ఆర్థిక సహాయంతో చేపట్టిన 24x7 నీటి సరఫరా ప్రాజెక్టులో భాగంగా అంబేద్కర్ కాలనీలో ఇంటింటికీ వెళ్లిన కమిషనర్ నీటి సరఫరా, నాణ్యతపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఇంటి కుళాయి ద్వారా వస్తున్న నీటిని స్వయంగా పరిశీలించారు. లక్ష్యంగా పెట్టుకున్న 40 వేల కనెక్షన్లలో 28 వేల కనెక్షన్లు పూర్తయ్యాయని, మిగిలిన 12 వేల కనెక్షన్లను సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. బిల్లింగ్ వ్యవస్థను ఆన్‌లైన్‌తో అనుసంధానించి వసూళ్లకు చర్యలు చేపట్టాలని సూచించారు. రూ.116.40 కోట్లతో చేపట్టిన అగనంపూడి నీటి సరఫరా ప్రాజెక్టులో భాగంగా 85 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి అనకాపల్లి హెడ్ వాటర్ వర్క్స్‌కు, అగనంపూడి నుంచి నరవ వరకు జరుగుతున్న ప్రధాన పైప్‌లైన్ పనులను పరిశీలించారు. మిగిలిన పనులను 45 రోజుల్లో పూర్తి చేయాలని సంబంధిత సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. మధురవాడలో రూ.658.61 కోట్లతో చేపట్టిన సమగ్ర సీవరేజ్ ప్రాజెక్టులో భాగంగా కాపులుప్పాడలో ప్రతిపాదిత ఎస్టీపీ ప్రాంతాన్ని కమిషనర్ పరిశీలించారు. 30 ఎకరాల్లో 20 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఎస్టీపీ, గ్రీన్‌బెల్ట్, కాంపౌండ్ వాల్, సీ అండ్ డీ వ్యర్థాల నిర్వహణ, టీపీటీ తదితర సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సీవరేజ్ పంపింగ్, లిఫ్ట్ స్టేషన్ల పనులను కూడా వేగవంతం చేయాలని సూచించారు. దువ్వాడలో నిర్మిస్తున్న స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ జోన్ పనులను పరిశీలించిన కమిషనర్.. వీధి వ్యాపారులకు సురక్షితమైన, క్రమబద్ధమైన వాతావరణం కల్పించేలా పనులను త్వరగా పూర్తి చేసి అర్హులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రజల సౌకర్యం, పరిశుభ్రతతో పాటు వీధి వ్యాపారుల జీవనోపాధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్లు పి.నల్లనయ్య, పి.ఎం.సత్యవేణి, ప్రధాన ఇంజనీర్ పీవీవీ సత్యనారాయణరాజు, యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ బి.వి.రమణ, పర్యవేక్షక ఇంజనీర్లు, జోనల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జిఎంఆర్ లబ్ధి కోసమే విశాఖ విమానాశ్రయం మూత

- సిపిఎం సీనియర్ నాయకులు నర్సింగరావు
- ప్రభుత్వ ద్రోహంపై సిపిఎం నిరసన
- డొమెస్టిక్ ఎయిర్‌పోర్ట్‌గా విశాఖను కొన సాగించాలి
- భోగాపురం ఎయిర్ పోర్ట్ ఖర్చుపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ విచారణ
- సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు




విశాఖపట్నం, ఆగస్టు 16, ప్రభాత వార్త :
జిఎంఆర్ సంస్థ లాభాల కోసం, సుదీర్ఘ చరిత్ర కలిగి సేవలందించిన విశాఖ ఎయిర్ పోర్ట్‌ను ప్రభుత్వం శాశ్వతంగా మూసివేసి విశాఖ ప్రజలకు అన్యాయం చేస్తుందని సిపిఎం సీనియర్ నాయకులు సీహెచ్ నర్సింగరావు అన్నారు. ప్రభుత్వ సంస్థ అయిన ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు వచ్చిన భోగాపురం ఎయిర్ పోర్ట్ టెండర్ రద్దుచేసి, ప్రైవేటు జిఎంఆర్ సంస్థకు ప్రభుత్వాలు అప్పగించాయన్నారు. ఎయిర్ పోర్ట్ మూసివేతకు నిరసనగా, సిపిఎం బ్లాక్ డే పిలుపులో భాగంగా ఆదివారం ఉదయం మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద జాతీయ రహదారిలో పార్టీ శ్రేణులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉన్న విశాఖ విమానాశ్రయాన్ని మూసివేసి, కమీషన్ల కోసం జిఎంఆర్‌కు ప్రభుత్వం లబ్ధి చేకూర్చుతుందని అన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను అంతర్జాతీయ విమానాశ్రయంగా కొనసాగించి, విశాఖ విమానాశ్రయాన్ని డొమెస్టిక్ ఎయిర్‌పోర్ట్‌గా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, ఆర్.కె. ఎస్.వి.కుమార్ మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయంపై జిఎంఆర్ గుత్తాధిపత్యం కోసం కూటమి, మోడీ ప్రభుత్వాలు కుట్ర పన్నాయని విమర్శించారు. జిల్లాకు ఒక ఎయిర్‌పోర్ట్ నిర్మిస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, విశాఖలో 45 లక్షల మందికి పైగా ప్రయాణసేవలు అందిస్తున్న విశాఖ విమానాశ్రయాన్ని ఎందుకు మూసివేస్తున్నా రని ప్రశ్నించారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి చేసిన రూ.5వేల కోట్లు ఖర్చుల పై అనుమానాలున్నందున జాయింట్ పార్లమెంటరీ కమిటీతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రూ.1500 కోట్లు ఖర్చుకాని భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణానికి రూ.5వేలు ఖర్చు చేసినట్లు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. నిజాలు బయటకు రావాలంటే పార్లమెంటరీ కమిటీ విచారణ జరగాలన్నారు. భోగాపురం విమానాశ్రయంలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. అంతర్జాతీయ నగరంగా విశాఖను తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చి, విమానాశ్రయం లేని నగరంగా విశాఖను తయారుచేసి కూటమి ప్రభుత్వం ప్రజలకు ద్రోహం చేసిందన్నారు. విశాఖ అభివృద్ధిని దెబ్బతీసి, విమాన ప్రయాణికులను కష్టపెడుతున్న ప్రభుత్వానికి ప్రజలు గుణ పాఠం చెబుతారని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.మణి, వి.కృష్ణారావు, కెఎం.శ్రీనివాస్, జిల్లా నాయకులు ఎం.సుబ్బారావు, వెంకటరావు, నరేంద్ర కుమార్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు వంచన, దగా రెట్టింపు చేశారు

**ఎన్నికల్లో డబ్బులు పంచలేదని సిఎం చంద్రబాబు ప్రమాణం చేయగలరా?**

**సూటిగా ప్రశ్నించిన వైఎస్సార్సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కళ్యాణి**

విశాఖపట్నం, ఆగస్టు 16 (ప్రభాత వార్త):



ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వంచనకు పాల్పడుతున్నారని వైఎస్సార్సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కళ్యాణి ఆరోపించారు. విశాఖలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడుతూ మహిళల సమస్యలకు పరిష్కారం చూపకుండా నిర్వహించిన తేనీటి విందు కేవలం ప్రచార కార్యక్రమమేనని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన రూ.18 వేల ఆర్థిక సాయం, ఆడబిడ్డ నిధి, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ రుణాలు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, 50 ఏళ్లకే పెన్షన్ వంటి హామీల అమలుపై చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలకు ప్రభుత్వం బకాయి పడిన మొత్తం రూ.1.80 లక్షల కోట్లని పేర్కొంటూ, రూ.3 వేల కోట్లు ఇచ్చినట్లు చెబుతున్నారని, ఆ మొత్తం ఎక్కడ జమ చేశారో చెప్పాలని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విషయంలోనూ ప్రభుత్వం మోసం చేసిందని కళ్యాణి ఆరోపించారు. సూపర్ లగ్జరీ, ఏసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. మహిళల భద్రతకు సంబంధించిన 'దిశ' చట్టాన్ని రద్దు చేయడం, రాష్ట్రంలో మద్యం, డ్రగ్స్ నియంత్రణలో విఫలమవడం ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు. ఎన్నికల్లో తాను ఒక్క రూపాయి కూడా పంచలేదని తిరుమల శ్రీవారి సాక్షిగా చంద్రబాబు ప్రమాణం చేయగలరా అని కళ్యాణి సవాల్ చేశారు. మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేకపోతే రాష్ట్ర మహిళలు ఏకమై ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడతారని హెచ్చరించారు.

# శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేద్దాం

- మనం తినే దేశీయ పండ్ల విత్తనాలతో వనాలు పెంచుదాం
- భూగర్భ జలాలు పెంపొందించేందుకు కృషి చేద్దాం
- ప్రకృతి ఆధారంగా పంటలు పండించుదాం
- డాక్టర్ మురళీమోహన్, ఎపి స్టేట్ అధ్యక్షులు, ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్

విశాఖపట్నం, ఆగష్టు 16, ప్రభాతవార్త :

శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేద్దాం, సామాజిక వనాలు పెంచుదాం అని ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ ఏపీ స్టేట్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ ఎం వి వి మురళి మోహన్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం గ్రీన్ క్లైమేట్ టీం, వనమాలి, సి టి జి, మన కూరగాయల తోట సంస్థల నేతృత్వంలో తాటి పళ్ళు, విత్తనాల బంతులు, మామిడి టెంకలు, కొంకుడుకాయ, గంగ రావి, నేరేడు, సీతాఫలం తదితర రకాల విత్తనాలు మధురవాడలోని ఎన్ వి పి లా కాలేజీ ఎదురుగా ఉన్న కొండల మీద విద్యార్థులతో చల్లించి, మనం తినే దేశీయ పండ్ల విత్తనాలతో వనాలు పెంచుదాం అని పిలుపునిచ్చారు. ఎల్ నినో, సూపర్ ఎల్ నినో నేపథ్యంలో వస్తున్న ప్రకృతి వైపరీత్యాలకు అడ్డుకట్ట వేసేందుకు అవసరమైన కృషి చేయాలని కోరారు. ప్రధానంగా శీతోష్ణస్థితి వేడెక్కకుండా ఉండడానికి సామాజిక వర్ణాలు పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భూగర్భ జలాలు పెంపొందించేందుకు కృషి చేద్దాం అని పిలుపునిచ్చారు. రేపటి తరాన్ని పర్యావరణ హితంగా జీవించేందుకు అవసరమైన అవగాహన కల్పించాలని కోరారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవి రత్నం మాట్లాడుతూ ప్రతి దేశ విత్తనం మొక్కై మొలకెత్తేందుకు కృషి చేయాలి అని కోరారు. మనం తినే పళ్ళ లోని విత్తనాలతో వనాలు పెంచుదాం అన్నారు. ప్రతి విద్యార్థి కనీసం 100 విత్తనాల బంతులు తయారు చేసి కొండల మీద, మైదాన ప్రాంతాల్లో చల్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్వా నేచరల్స్ మధుసూదన రెడ్డి, వనమాలి, సిటిజి, మనకూరగాయలతోట ప్రతినిధులు ఉష, కవిత,యాక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధి ఐ కృష్ణ కుమారి తదితరులు 50 మందికి పైగా పాల్గొన్నారు.

## వైఎస్ఆర్‌సీపీ ఇన్‌ఛార్జ్ తిప్పల దేవన్‌రెడ్డి సమక్షంలో గాజువాక లీగల్ సెల్ సమావేశం

గాజువాక,ఆగష్టు 16 ప్రభాతవార్త :



నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ తిప్పల శ్రీనివాస దేవన్ రెడ్డి పార్టీ లీగల్ సెల్ ప్రతినిధులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన గాజువాక నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు గిల్బర్ట్‌ను వైకాపా జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు, కార్యదర్శి బాజీ నాయుడు, హైకోర్టు న్యాయవాది అంబోయిన లక్ష్మిల సమక్షంలో దేవన్ రెడ్డి శాలువా కప్పి, పూల బొకే అందజేసి ఘనంగా సత్కరించారు. సమావేశంలో దేవన్ రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారనే అంశంపై చర్చిస్తూ, బాధితులకు చట్టపరంగా తగిన రక్షణ కల్పించాలని లీగల్ సెల్‌కు సూచించారు. ప్రజాస్వామ్యబద్ధంగా, చట్ట పరిధిలోనే పార్టీ శ్రేణులకు ఎల్లప్పుడూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా యాత విభాగం అధ్యక్షుడు అంబోయిన అప్పారావు, నాయకులు పాక సత్యనారాయణ, శ్రీనివాస్, అనిల్, సంతోష్, లక్ష్మణ్, రమణలతో పాటు లీగల్ సెల్ ప్రతినిధులు, వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.
మహిళలకు వంచన రెట్టింపు చేశారు

## గాజువాకలో ఘనంగా మాజీ భారత ప్రధాని భారతరత్న ఎబి వాజ్‌పేయి విగ్రహావిష్కరణ

గాజువాక, ఆగష్టు 16, ప్రభాతవార్త :



భారత మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్ర హాన్ని రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పి.వి.ఎన్.మాధవ్ ఘనంగా ఆవిష్కరించారు. గాజువాక డిపో ఆంజనేయ స్వామి ఆలయం ఎదురుగా జరిగిన ఈ కార్యక్రమా నికి ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్‌తో పాటు రాష్ట్ర బీజేపీ మీడియా ప్యానలిస్ట్, గాజువాక బీజేపీ కన్వీనర్ కర్ణంరెడ్డి నరసింగరావు కలిసి పాల్గొని విగ్రహాన్ని ప్రారంభించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడు తూ వాజ్‌పేయి దేశంలో అనేక సంస్కరణలు తెచ్చిన మహానాయకుడని, స్వర్ణ చతుర్భుజి రహదారులు, కార్గిల్ విజయం, సర్వశిక్షా అభియాన్ వంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని మాధవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 59వ వార్డ్ జనసేన అధ్యక్షులు పుర్రి సురేష్ యాదవ్, టీడీపీ యువ నాయకులు మౌర్య సింహా, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అసంపూర్తిగా ఉన్న అరకిలో మీటరు రెడ్డిపల్లి రోడ్డు పనులు మొదలు

పద్మనాభం, ఆగష్టు 16, ప్రభాతవార్త :



మండలంలో రెడ్డపల్లి గ్రామం నుండి శేరీఖండం గ్రామం వరకు అసంపూర్తిగా ఉన్న అర కిలోమీటరు విజయనగరం, సింహాచలం రోడ్డు పనులు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవతో మొదలయ్యాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ అర కిలోమీటరు రోడ్డులో అడుగడుగున ఉన్న గోతుల వల్ల ప్రయాణికులు పడిన కష్టాలు చెప్పలేనివి. రోడ్డు వర్షాకాలంలో బురదమయం,ఎండాకాలంలో ధూలిమయం కావడంతో గ్రామ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో ఈ రోడ్డుపై పలు పత్రికలలో వచ్చిన కథనాలపై ఎమ్మెల్యే గంటా స్పందించి త్వరితగతిన రోడ్డును పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

## యోగా పోటీల్లో గుడిలోవ విద్యార్థుల ప్రతిభ

ఆనందపురం, ఆగస్ట్16, ప్రభాతవార్త:



విశాఖ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీతమ్మధార శ్రీకృష్ణ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో గుడిలోవ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వయస్సుల వారీగా వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో బాలురు, బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గుడిలోవకు చెందిన విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించి సత్తా చాటారు. ప్రతిభ కనబరిచిన ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. విశాఖపట్నంలోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ఎంపికైన విద్యార్థులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

## సేవా ప్రతిభకు మెరిటోరియల్ అవార్డులు

ఆనందపురం, ఆగస్ట్ 16, ప్రభాతవార్త:



80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆనందపురం మండలానికి చెందిన పలువురు ఉద్యోగులు తమ విధుల్లో చూపిన ప్రతిభ, సేవలకు గుర్తింపుగా మెరిటోరియల్ అవార్డులను అందుకున్నారు. మండల స్వర్ణ గ్రామం అధికారి జిఎవి.శ్రీరామమూర్తి, ఆనందపురం డిజిటల్ అసిస్టెంట్ చందక వెంకట్, కొలవానిపాలెం గ్రేడ్--5 పంచాయతీ కార్యదర్శి ఏ. గాయత్రి, గంభీరం డిజిటల్ అసిస్టెంట్ డి. సంతోష్ కుమార్, తర్లువాడ వెల్ఫేర్ అసిస్టెంట్ వై. మాధవి, పాలవలస మహిళా పోలీస్ హేమలు ఈ అవార్డులకు ఎంపిక కాగా రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్, గౌరవ జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డులు అందుకున్న ఉద్యోగులకు పలువురు అధికారులు, సహచరులు అభినందనలు తెలిపారు. తమ సేవలను గుర్తించి మెరిటోరియల్ అవార్డులకు ఎంపిక చేసిన జిల్లా స్వర్ణ గ్రామం-స్వర్ణ వార్డు అధికారిణి పూర్ణిమ దేవికి అవార్డు గ్రహీతలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఈ పురస్కారాలు తమకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని వారు పేర్కొన్నారు.

## జోడిగుడ్లపాలెంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

ఆరిలోవ, ఆగష్టు 16, ప్రభాతవార్త :



తూర్పు నియోజకవర్గం స్థానిక 9వ వార్డు జోడుగుళ్లపాలెంలో ఆదివారం వార్డు ఇన్‌ఛార్జ్ బుడుమూరి గోవింద్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా తూర్పు శాసనసభ్యులు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు హాజరై పూజ కార్యాక్రమాలతో కల్వర్ట్ లు, డ్రైన్స్, రోడ్స్ పనులకు శంకుస్థాపన చేశారు. సుమారు 16 లక్షలు జీవీఎంసీ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ జోనల్ కమీషనర్ శివ ప్రసాద్, డి ఇ చంద్రమౌళి,ఏ ఇ నరేష్, వార్డ్ అధ్యక్షులు వేజెళ్ళ సుబ్బరాజు, బీజేపీ నాయకురాలు ఉమ్మిడి సుజాత, వార్డ్ ఉపాధ్యక్షులు మారుపల్లి చిన్నారావు,వార్డ్ మహిళా అధ్యక్షురాలు బుడుమూరి భూలక్ష్మి, గరికిన నూకరాజు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

vsp10:vsp10.qxd 16-08-2026 23:58 Page 1






## రాంబిల్లి రెవెన్యూ సిబ్బందికి పురస్కారాలు



**రాంబిల్లి, ఆగస్టు 16, ప్రభాతవార్త:**

మండల రెవెన్యూ పరిధిలో విధి నిర్వహణలో విశేష సేవలు అందించిన రాంబిల్లి రెవెన్యూ సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రశంసాపత్రాలు అందజేశారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ విజయ కృష్ణన్ చేతుల మీదుగా మండల సర్వేయర్ రావాడ త్రిమూర్తి, వీఆర్వోలు జగదీష్, రాంబాబు, జిరాయితీ చింతువా సర్వేయర్ వసుంధరకు ధ్రువపత్రాలు అందజేశారు. మండల రెవెన్యూ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులను సమర్థవంతంగా నిర్వహించినందుకు వీరిని గుర్తించి ఈ ప్రశంసాపత్రాలు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ పి.వి. రత్నం, ఉప తహసీల్దార్ డి. రమేష్‌బాబు, తోటి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## విద్యార్థులు గుర్తింపు కలిగిన వ్యక్తులుగా ఎదగాలి



**అనకాపల్లి, ఆగస్టు 16, (ప్రభాత వార్త):**

విద్యార్థులు ఉద్యోగం వ్యాపార రంగాల్లో రాణించి సమాజంలో మంచి గుర్తింపు కలిగిన వ్యక్తులుగా ఎదగాలని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రొఫెసర్, ఎండి న్యూరో డాక్టర్ గరుడా బుచ్చిరాజు ఆకాంక్షించారు. పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో 80వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా శనివారం రాత్రి ఆర్యవైశ్య పేద విద్యార్థులకు శ్రీ గుంపున సర్వేశ్వరరావు శ్రీఅనుమాలి శెట్టి వెంకట్ రాజు ఏసి కళ్యాణ మండపంలో ప్రతి ఏడాది వలె ఈ ఏడాది కూడా విద్యా వేతనముల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన ముందుగా కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆలయ అధ్యక్షులు వుప్పల రవిరామ్ జవహర్, కార్యదర్శి శ్రీధరాల సోమరాజు, కార్యదర్శి కడిమిశెట్టి అచ్యుతరామయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి వివి ఎస్ మాణిక్యం, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



**ఎలమంచిలి, ఆగస్టు 16, ప్రభాతవార్త:**

ఆంధ్రప్రదేశ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ ఏఐటీయూసీ రాష్ట్ర 4వ మహాసభలు ఈనెల 20, 21 తేదీల్లో విశాఖ జిల్లాలో అత్యంత ఘనంగా జరగనున్నాయి. ఈ మహాసభలకు సంబంధించిన గోడపత్రిక ను పట్టణములోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల సాయిబాబా గుడి సాయిరాం ఆటో స్టాండ్ వద్ద ఉదయం విడుదల చేయడం చేశారు.ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్. రహమాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్. కాసుబాబు మాట్లాడుతూ ఈ మహాసభలకు రాష్ట్రంలోని 28 జిల్లాల నుండి ఆటో మోటార్ రంగాలకు నాయకత్వం వహిస్తున్న ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అనకాపల్లి జిల్లా కార్యదర్శి గనిశెట్టి. ఏసుదాసు, అలిమిల్లి నాగేశ్వరరావు (నాగు), నగిరెడ్డి కుమార్, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## సీతయ్యపేటలో వి.ఏ.ఎస్. చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభం



**బుచ్చయ్యపేట, ఆగస్టు 16,ప్రభాతవార్త:**

సీతయ్యపేటలో వి.ఏ.ఎస్ చారిటబుల్ ట్రస్ట్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ట్రస్ట్ చైర్మన్ వజ్రపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కే.ఎస్. ఎన్.ఎస్. రాజు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు తమరాన సింహాద్రి అప్పన్న, మాజీ జెడ్పీటీసీ గోకివాడ కోటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై ట్రస్ట్ లోగోను ఆవిష్కరించారు. నిరుపేదలు, వెనుకబడిన వర్గాలు, విద్యార్థులు, నిరుద్యోగ యువతకు అండగా నిలవడమే ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం, విద్యార్థులకు విద్యా సామగ్రి, నిరుద్యోగులకు పోటీ పరీక్షలు, ఉద్యోగ అవకాశాల కోసం సహకారం అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు, ట్రస్ట్ ప్రతినిధులు, మహిళలు, యువత, తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్య రహిత సమాజం కోసం విశిష్ట సేవలందించిన సీడ్‌కు గుర్తింపు .!



**(విశాఖపట్నం, ప్రభాతవార్త):**

మాదకద్రవ్యాల వినియోగానికి బానిసైన వారి పునరావాసం, చికిత్స, కౌన్సెలింగ్‌తో పాటు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడంలో విశిష్ట సేవలు అందిస్తున్న సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డెవలప్‌మెంట్ (సీడ్) సంస్థకు విశాఖపట్నం జిల్లా యంత్రాంగం మెరిటోరియస్ సర్టిఫికెట్‌తో సత్కరించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సీడ్ కార్యదర్శి వెనుతురు పల్లి సన్యాసిరాజును జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా యంత్రాంగం నుంచి ఈ మెరిటోరియస్ సర్టిఫికెట్‌ను అందుకున్నారు.

## టీడీపీలో పలువురి చేరిక



### ఆర్.శివరాంపురంలో అప్పలరాజు ఆధ్వర్యంలో చేరికలు

**బుచ్చయ్యపేట, ఆగస్టు 16, ప్రభాత వార్త :**

ఆర్.శివరాంపురం గ్రామానికి చెందిన నమ్మి అప్పలరాజు ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు. చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో టీడీపీని మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషిచేయాలని సూచించారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, గోకివాడ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు



**( నక్కపల్లి, ప్రభాతవార్త):**

మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా మెగా ఫ్యాన్స్ ఉత్తరాంధ్ర నాయకులు మీగడ సత్యనారాయణమూర్తి నాయకత్వంలో మండలంలోని పలు కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక 50 పడకల ఆసుపత్రిలో రోగులకు రొట్టు, పాలు, పళ్ళు పంపిణీ చేశారు. మండల చిరంజీవి ఫ్యాన్స్ నాయకులు కొల్లాటి దుర్గాప్రసాద్, టిడిపి నాయకులు అల్లాడ తాతారావు, బాలికల హైస్కూల్ చైర్మన్ పెద్దిరెడ్డి రమేష్, బండారు అయ్యప్ప, కొలనాటి నాగు తదితరులు ఉన్నారు.

## నకిలీ పిసీబీ అధికారులు- లారీలను అడ్డగించి డబ్బులు వసూల్

**రాంబిల్లి, ఆగస్టు 16, ప్రభాతవార్త:**

రాంబిల్లి,అచ్యుతాపురం సెజ్‌లోని వివిధ పరిశ్రమలకు సరుకులు రవాణా చేసే లారీలను అడ్డగించి, తాము పీసీబీ (కాలుష్య నియంత్రణ మండలి) అధికారులమంటూ వాహనదారులను భయపెట్టి, ఒత్తిడి తెచ్చి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదుపై రాంబిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 15వ తేదీన బాధితుడు ఏ. శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విశాఖపట్నం మింది గ్రామానికి చెందిన దంపతులు పైడా హారిక, ఆమె భర్త రాజ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అచ్యుతాపురం, రాంబిల్లి సెజ్‌లోని వివిధ కంపెనీలకు సరుకులు రవాణా చేసే లారీలను మార్గమధ్యంలో అడ్డుకుని, వాహనాల రవాణా నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారు అని పేర్కొంటూ మేము పిసిబి అధికారులమని వాహనదారులపై ఒత్తిడి తీసుకురావడం భయపెట్టడం బ్లాక్ మెయిల్ చేయడం డబ్బులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక సీఐ సిహెచ్ నరసింగరావు తెలిపారు.

## గణేష్ జన్మదిన వేడుకల్లో కూటమి నేతలు



**( నక్కపల్లి ,ప్రభాతవార్త) :**

మండలంలోని ఉపమాక గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు పాము గణేశ్వరరావు జన్మదిన వేడుకల్లో మాజీ జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు తోట నగేష్ టిడిపి పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కూటమి నాయకులు పురం దాసు అప్పలరాజు, పిక్కి స్వామి ,ఎలమంచిలి చందర్రావు, కర్రీ వెంకట సత్యనారాయణ (కేవీ) తోపాటు పలువురు ఉన్నారు.

## విశాఖకు దీటుగా అనకాపల్లి వ్యాపార రంగంలో దినదినాభివృద్ధి

### టిడిపి నేత దాడి రత్నాకర్



**అనకాపల్లి, ఆగస్టు 16, (ప్రభాత వార్త):**

గ్రామీణ ప్రాంతాలకు ప్రధాన కేంద్రంగా అనకాపల్లి ప్రత్యేక జిల్లాగా ఏర్పడిన తర్వాత విశాఖకు దీటుగా దీటుగా వ్యాపారంగంలో దినదిన అభివృద్ధి చెందుతుందని టిడిపి నేత దాడి రత్నాకర్ అన్నారు. ఆదివారం స్థానిక చేపల బజార్ సమీపంలో శ్రీనివాసా జువెలరీస్ బంగారు నగర షో రూమ్‌ను ఆయన ప్రారంభించారు. ప్రముఖ వ్యాపారవేత్త షో రూమ్ యజమాని ఉల్లూరి శ్రీనివాసరావు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ రూరల్ జిల్లాకు ప్రధాన పట్టణంగా అనకాపల్లి అన్ని రంగాల్లోని అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రధానంగా అనకాపల్లి ప్రత్యేక జిల్లా ఏర్పడిన నేపథ్యంలో పెద్దపెద్ద షాపింగ్ మాల్స్ అనకాపల్లిలో వెలసి వ్యాపార రంగంలో అభివృద్ధికి దోహదపడుతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా షోరూం యజమాని శ్రీనివాసరావు ఆయనను ఘనంగా సత్కరించారు.



## ఆకట్టుకున్న జాతీయ పతాకం రంగవల్లిక

**(నక్కపల్లి ,ప్రభాతవార్త):**

మండల కేంద్రంలో ఉన్న కేజీబీవీ పాఠశాల విద్యార్థులు 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా కళాశాల మొదటి ద్వారం వద్ద 80 స్వాతంత్ర దినోత్సవానికి స్వాగతం పలుకుతూ వేసిన జాతీయ జెండా రంగవల్లిక విశేషంగా ఆకట్టుకుంది. ఇటువంటి రంగవల్లికను వేసిన విద్యార్థులను ప్రిన్సిపల్ సలీమాతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

## ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలు



**(నక్కపల్లి ,ప్రభాతవార్త) :**

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పలు విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు 80 వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు చేసిన ఉద్యోగానికి గుర్తింపుగా ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఇందులో భాగంగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ,జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ చేతుల మీదుగా సమాచార శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న బాలాజీ అందుకున్నారు. ప్రతిభా పురస్కారం అందుకున్న బాలాజీని పాత్రికేయ సంఘాలు, సమాచార శాఖ ఉద్యోగులతోపాటు పలువురు అభినందించారు.

## రెండు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తు ఆహ్వానం

**అనకాపల్లి, ఆగస్టు 16, (ప్రభాత వార్త) :**

అనకాపల్లి మండల విద్యాశాఖ కార్యాలయం పరిధిలోని మండలంలోని మార్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ జి టి పోస్ట్, అనకాపల్లి పట్టణం బాలికల ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ హిందీ పోస్టులకు మంజూరైన అకడమిక్ ఇనస్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మండల విద్యాశాఖ అధికారి ఎన్ కే శ్రీదేవి తెలిపారు. అర్హులైన అభ్యర్థులు పూర్తి వివరాలు, అర్హతల ధ్రవపత్రాల నకళ్ళతో ఈ నెల 23 వ తేదీ లోగా దరఖాస్తులను అనకాపల్లి మండల విద్యాశాఖ అధికారి వారి కార్యాలయంలో సమర్పించాలని ఆమె కోరారు. పూర్తి సమాచారం కోసం అనకాపల్లి గవరపాలెం నిదానం దొడ్డి దాడి భోగలింగం నాయుడు పాఠశాలలో ఉన్న మండల విద్యాశాఖ అధికారి వారి కార్యాలయంలో కార్యాలయ పనివేళల్లో సంప్రదించి, తెలుసుకోవచ్చని ఆమె కోరారు.

## వెంకటనగరం తీరంలో మత్స్యకారుడు మృతి

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**

పాయకరావుపేట మండలం వెంకటనగరం తీరంలో చోటుచేసుకున్న ప్రమాదంలో ఉప్పాడ బాబి అనే మత్స్యకారుడు మృతి చెందడం పట్ల రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాబి మృతి అత్యంత బాధాకరమని మంత్రి పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హోం మంత్రి అనిత భరోసా ఇచ్చారు.బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ, సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు.

## అనకాపల్లి జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



**అనకాపల్లి,ఆగస్టు 16,( ప్రభాత వార్త):**

ఆర్యవైశ్య మహాసభ అనకాపల్లి జిల్లా నూతన కార్యవర్గం ఆదివారం అనకాపల్లి పెంటకోట కన్వెన్షన్ లో ఘనంగా జరిగింది. ఈ ప్రమాణ స్వీకార కార్యవర్గానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యులు, ఆర్యవైశ్య మహాసభ చైర్మన్ టీజీ వెంకటేష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమంలో ఆర్యవైశ్యులు ముందుంటారని, ఆర్యవైశ్యులకు ఎటువంటి కష్టం వచ్చిన టీజీ వెంకటేష్ ఉన్నాడని గుర్తుపెట్టుకోవాలని అన్నారు. అన్ని కులాలు మాదిరిగానే మనవాళ్లు కూడా ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మరో ముఖ్య అతిథిగా టీడీపీ నాయకులు దాడి రత్నాకర్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు ఇల్లూరి లక్ష్మయ్య, మాజీ అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ, స్టేట్ సెక్రటరీ మాటూరి రంగనాథ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కోప్పురావూరి రజిని, స్టేట్ కోఆర్డినేటర్ కారుమూరి మహేష్, గౌరవ అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు జిల్లా మండల కమిటీ సభ్యులు, జిల్లా నలుమూలల నుంచి 750 ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. అరేపు కామేశ్వరరావు ఆర్థిక సహాయంతో ఇద్దరూ పేద ఆర్యవైశ్యులకు రుబ్బుమిషన్లు పంపిణీ చేశారు.

## నిరుద్యోగ యువతకు భారీ జాబ్‌మేళా

**గూడెంకొత్తవీధి, ఆగస్టు 16, ప్రభాతవార్త :**

జిల్లాలోని నిరుద్యోగ యువతీ,యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పాడేరులో భారీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు గూడెం కొత్తవీధి ఎస్ఐ సురేష్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీ.ఈ.ఎం.ఎస్ ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆటోమొబైల్ తయారీ, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఈ-కామర్స్, రిటైల్ తదితర రంగాలకు చెందిన ప్రముఖ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఎస్.ఐ తెలిపారు. 35 ఏళ్లలోపు అర్హత కలిగిన యువతీ యువకులు తమ బయోడేటాతో జాబ్ మేళాకు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగాలు, అర్హతలు, ఇతర వివరాల కోసం ఎస్.ఐ సురేష్‌ను సంప్రదించి సమాచారం పొందవచ్చని తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో జాబ్ మేళాలో పాల్గొని తమ అర్హతలకు తగిన ఉద్యోగాలను పొందాలని ఎస్ఐ సురేష్ కోరారు.

## రైల్వే అధికారులకు వీల్ చైర్ స్ట్రెక్చర్ అందజేత

**అగనంపూడి, ప్రభాత వార్త**

దువ్వాడ రైల్వే స్టేషన్‌లో ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర సేవలకు వైద్యులు, మెడికల్ స్ట్రెక్చర్లు కొరకు రైల్వే సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారు.దాన్ని దృష్టిలో ఉంచుకొని దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రోత్బలంతో రెండు వీల్ చైర్ స్ట్రెక్చర్లను ఏర్పాటు చేయ నిమిత్తం స్పందన చేయూత ఫౌండేషన్ సహకారంతో సుమారు 22 వేల రూపాయల ఖరీదైన వీల్స్ స్ట్రెక్చర్స్ ను కొనుగోలు చేసింది. వీటిని ఆదివారం రైల్వే అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో దువ్వాడ రైల్వే స్టేషన్ ఎస్ఎంఆర్, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వి.జాషువా,కే.ఈశ్వర్, వీర్రాజు, బీ.కామేశ్వరరావు, భాస్కర్ గోవింద్, సుందర మూర్తి, కే రాంబాబు, స్పందన ఫౌండేషన్ ప్రతినిధులు ఈ. బుచ్చి రాజు, కిషోర్, ఆనంద్ పాల్గొన్నారు.

## ఎల్‌సిసి చైర్మన్ కృష్ణకుమారి సేవలకు ప్రశంసాపత్రం అందజేత



**అరకులోయ, ఆగస్టు 16, ప్రభాతవార్త:**

అల్లూరి జిల్లా స్థానిక ఫిర్యాదుల కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ కంబిడి కృష్ణకుమారి అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి ప్రశంసా పత్రంతో సత్కరించారు. స్వాతంత్ర్య దినోత్సవం సం దర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా ఆమె ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. మహిళల హక్కుల పరిరక్షణ, ఫిర్యాదుల పరిష్కారం, మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించడంలో స్థానిక ఫిర్యాదుల కమిటీ చైర్‌పర్సన్‌గా డాక్టర్ కృష్ణకుమారి చేస్తున్న సేవలను అధికారులు అభినందించారు.

## పాఠశాలలో విగ్రహాలు ఏర్పాటు

**(నక్కపల్లి, ప్రభాతవార్త) :**

ఉపమాక గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పాఠశాలలో దాతలు సహకారంతో మహాత్మా గాంధీ, సరస్వతి దేవి ,సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాలను ఏర్పాటు చేశారు. 80 వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన విగ్రహాలను సీఐ జూరెడ్డి మురళి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ విగ్రహాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన సీఐ మురళితోపాటు పలువురు దాతలను పీఏసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి అభినందించారు. మాజీ సర్పంచ్ ప్రగడ వీరబాబు, కొప్పిశెట్టి వెంకట రమణ, వాసు, శ్రీను, తోలేటి శ్రీను, తోట అప్పారావుతో పాటు స్కూల్ చైర్మన్ , తదితరులు ఉన్నారు.

## విద్యార్థి రుత్విక్‌ను సత్కరించిన గ్రామస్తులు

( నక్కపల్లి, ప్రభాతవార్త): ఉపమాక పంచాయతీకి చెందిన సీనియర్ జర్నలిస్ట్ దవర సింగి రాంబాబు కుమారుడు రుత్విక్ ఒంగోలు ట్రిబుల్ ఐటిఐకి ఎంపిక కావడంతో గ్రామస్తులు సత్కరించారు. సీఐ జూరెడ్డి మురళితో పాటు పిఏసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జిరుత్విక్ మంచి పేరు తీసుకొచ్చారన్నారు. మాజీ సర్పంచ్ ప్రగడ వీరబాబు, వెంకటేశ్వరరావు, తోలేటి శ్రీను, కొప్పిశెట్టి వాసు, తోట అప్పారావు, తదితరులున్నారు.

## ప్రజా సేవలో రెవెన్యూ శాఖ నిరంతర కృషి



**పాడేరు,ఆగస్టు16,ప్రభాతవార్త:**

భౌగోళికంగా సవాళ్లతో కూడుకున్న ఏఎస్ఆర్ జిల్లాలో మారుమూల ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేయడంలో రెవెన్యూ శాఖ అధికారు లు, సిబ్బంది అందిస్తున్న సేవలు ప్రత్యేకంగా ప్రశంసించదగినవి. జిల్లా యంత్రాంగం చేపట్టే వివిధ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో కూడా రెవెన్యూ శాఖ కీలకంగా సహకరిస్తోంది.జిల్లా కలెక్టర్ టి. నిశాంతి, నాయకత్వంలో అతి తక్కువ సమయం లోనే ఏఎస్ఆర్ జిల్లా పరిపాలనలో గణనీయమైన పురోగతి సాధించి, పలు రంగాల్లో రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానాలను సాధించింది. ఈ పురోగతిలో రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది అందిస్తున్న సహకారం, సమన్వయం, అంకితభావం ఎంతో కీలకంగా నిలిచాయి. ఈ సేవలను గుర్తించిన జిల్లా కలెక్టర్ , 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రెవెన్యూ శాఖలో విశేష సేవలు అందించిన అధికారులు, సిబ్బందిని ప్రశంసా పత్రాలతో సత్కరించారు.

## విద్యార్థులకు రాబిస్ వ్యాక్సిన్‌పై అవగాహన కార్యక్రమం

**అరకులోయ, ఆగస్టు 16, ప్రభాతవార్త :**

అరకులోయ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆదివారం కమిషనరేట్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.కుసుమకుమారి ఆధ్వర్యంలో డిపార్ట్మెంట్ ఆఫ్ జువాలజీ అధ్యాపకులు, రెడ్ రిబ్బన్ కమిటీ సభ్యులు, స్థానిక వెటర్నరీ ఆసుపత్రిలో "రాబిస్ వ్యాక్సిన్" పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వెటర్నరీ ఆసుపత్రి ఉద్యోగి సాంబశివరావు ఇతర సిబ్బంది వ్యాక్సిన్ గురించి విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. అవగాహన కార్యక్రమంలో అధ్యాపకులు జంతువుల పట్ల ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమానికి సహకరించిన వైద్య సిబ్బందికి , డిపార్ట్మెంట్ అధ్యాపకులకు , అవగాహన కార్యక్రమానికి హాజరైన విద్యార్థులకు , కళాశాల ప్రిన్సిపల్ అభినందించారు.

## జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఏకలవ్య విద్యార్థి ఎంపిక

**గూడెంకొత్తవీధి, ఆగస్టు 16, ప్రభాతవార్త :**

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈ.ఎం.ఆర్.ఎస్) జూనియర్ కళాశాల విద్యార్థి గుబ్బలి చంద్ర శేఖర్ నాయుడు జాతీయ స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన 37వ రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-16 షాట్‌పుట్ విభాగంలో చంద్రశేఖర్ నాయుడు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. వచ్చే సెప్టెంబర్ 2 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న 37వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున చంద్రశేఖర్ నాయుడు ప్రాతినిధ్యం వహించనున్నాడు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన చంద్రశేఖర్ నాయుడిని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వి. రమణారావు, అధ్యా పక బృందం అభినందించారు. జాతీయ స్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

## ఉత్తమ సేవకులకు ప్రశంసా పత్రాలు

**పాడేరు,ఆగస్టు16,ప్రభాతవార్త:**

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఏ పరిధిలో ఉత్తమ సేవలందిస్తున్న వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు, ఉద్యోగులకు,సిబ్బంది సేవలను గుర్తించి 80వ స్వాతంత్య దినోత్సవం సందర్భంగా పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డిడి పరిమళ, ఐటిడిఏ అధికారులు వెంకటేశ్వరరావు, హేమలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రశంసా పత్రాలు అందుకున్న క్లాప్ మిత్రలు

**(నక్కపల్లి ,ప్రభాతవార్త):**

నక్కపల్లి, ఎన్. నర్సాపురం గ్రామాలకు చెందిన క్లాప్ కే.లోవరాజు, ఐ. లోవరాజును 80 వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా అనకాపల్లి జిల్లా కేంద్రంగా జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా వారి అభినందించి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారిని పంచాయతీ కార్యదర్శి పివిపి రాజశేఖర్ అభినందించారు.

## అమ్మవారి భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు



**పాడేరు,ఆగస్టు16,ప్రభాతవార్త;**

పాడేరు గిరిజన హారద్య దైవం కోరికలు తీర్చే కొంగుబంగారంగా పేరుగాంచిన పాడేరు మోదకొండమ్మ వారి సన్నిధిలో ఆలయ కమిటీ చైర్మన్, పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదేశాల మేరకు ఆదివారం పాడేరు పూర్వపు సర్కిల్ ఇన్స్పెక్టర్ డి దీనబంధు వారి కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయం విశాఖపట్నం వాస్తవ్యులు శశి సింగ్ అర్చన సింగ్ వారి కుటుంబ సభ్యులు సహాయ సహకారాలతో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారమైనందున వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమం స్వీకరించారు. ముఖ్య అతిథులుగా అనకాపల్లి డిప్యూటీ డిఇఓ గిడ్డి అప్పారావు నాయుడు మాజీ జెడ్పిటిసి రొబ్బ ఉషారాణి, శోభ లింగన్నదొర, గంగ పూజారి విజయభాస్కర్, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు నాయుడు,కమిటీ సభ్యులు చల్ల రామకృష్ణ కిల్లు చంద్రమోహన్ కుమార్ గూడెపు సూర్య ప్రకాష్ బాకూరి పాండురాజు లకే రత్నా బాయ్ కురుస లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## కృత్రిమ చేయూల ఉచిత పంపిణీ శిబిరం



**పాడేరు,ఆగస్టు16,ప్రభాతవార్త:**

పాడేరు ఇండియన్ రెడ్ క్రాస్ రాష్ట్ర శాఖ, ఆంధ్రప్రదేశ్లో ఉన్న అన్ని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం విజయనగరం జిల్లా కలెక్టరేట్ ఆడియో టోరియంలో కృత్రిమ చేయూల ఉచిత పంపిణీ శిబిరంను చేయూత ప్రోగ్రాం కన్వీనర్ రవి వడ్ల మనీ రాష్ట్ర ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ వై.. డి .రామారావు వైయస్ చైర్మన్ పి. రామచంద్రారాజు ప్రారంభించారు. రాష్ట్ర ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ వై.డి. రామారావు మాట్లాడుతూ కృత్రిమ చేయలను అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం దుమ్మిడిగూడ గ్రామం మాదల రమేష్ ఇంటర్ చదువు చదువుతున్న అబ్బాయికిబొండా భగత్రామ్ దింబిగూడ గ్రామం ముంచంగి పుట్టు మండలం అంటిపర్తి కంటిపురం గ్రామం అనంతగిరి మండలం ఈ ముగ్గురికి కృత్రిమ చేయలను అందజేశారు. జిల్లా కార్యదర్శి జి గౌరీ శంకర్రావు పి. సూర్యరావు కోశాధికారి రాష్ట్ర మేనేజ్ కమిటీ సభ్యులు బొర్రా నాగరాజు, జిల్లా కోఆర్డినేటర్ ఎస్. పూనానంద పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో అంకితభావం



**పాడేరు,ఆగస్టు16,ప్రభాతవార్త:**

విధి నిర్వహణలో అంకితభావం పనితీరులో కచ్చితత్వం ఆయన ఉన్నతాధికారుల నుండి ప్రశంసలు పొందుతున్నారు. ఐటిడిఏ కాఫీ ప్రాజెక్ట్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. కాఫీ రైతుల అభ్యున్నతికి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుంటారు. ఐటీడీఏ అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన భాగస్వామ్యం విశేషమైన సేవలు అందిస్తూ ఉంటారు. విధి నిర్వహణలో అంకితభావం ఆయనకు ఎన్నో అవార్డులను తెచ్చిపెడుతోంది. ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం. వెంకటేశ్వరరావు సేవలు పలువురికి ఆదర్శంగా నిలుస్తాయి. 1994లో సాధారణ టైపిస్ట్ గా గిరిజన సంక్షేమ శాఖలో చేరిన ఆయన 1999 లో సీనియర్ అసిస్టెంట్ గా పదోన్నతి పొందారు. ఐటీడీఏ లో మేనేజర్ గా, డీఎస్ఓగా, ఎస్ ఓ గా విధులు నిర్వహిస్తూ ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారులు మనలను పొందారు. ప్రస్తుతం ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి గా విధులు నిర్వహిస్తూ 80 స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ చేతుల మీదుగా ఉత్తమ అధికారిగా ప్రశంస పత్రాన్ని పొందారు.

## మద్యం మత్తులో భార్యను హతమార్చిన భర్త

**దుంబ్రిగుడ, ఆగస్టు16 ప్రభాతవార్త:**

మద్యం మత్తులో భార్యపై కర్రతో బలంగా కొట్టి కట్టు కున్న భర్త చంపిన సంఘటన దుంబ్రిగుడ మండలంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై సురేష్ బాధితురాలి కుటుంబీకుల కథనం ప్రకారం. అల్లూరి జిల్లా దుంబ్రిగుడ మండలం కొర్రా పంచాయతీ శెట్టిబంధ గ్రామానికి చెందిన గెమ్మెలి కామయ్య తాగుడికి బానిసయ్యారన్నారు. మద్యంకు డబ్బులు ఇవ్వాలని శనివారం రాత్రి మృతురాలు గెమ్మెలి కోమిలి(40)ని బలవంతం చేశారన్నారు. ఇద్దరి మధ్య తగదా చిలికి చిలికి పెద్దదయ్యి కోట్లాటకు దారి తీసింది మద్యం మత్తులో ఉన్న భర్త మృతురాలి మెడపై, శరీరంపై బలంగా కర్రతో దాడి చేసి హత్య చేశారన్నారు. బాధిరాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఎనిమిదేళ్ల కుమారుడి కళ్ల ముందే తల్లి విగాత జీవిగా మిగిలి ఉండడంతో బాలుడు బోరున విలపిస్తున్న తీరును పలువురికి కంటతడిని పెట్టించింది. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రిలోని శవగారానికి తరలించడం జరిగిందని ఎస్సై సురేష్ తెలిపారు.

## 389 పోస్టులను అర్హులైన గిరిజనులతోనే భర్తీ చేయాలి

**దుంబ్రిగూడ,ఆగస్టు 16 ప్రభాతవార్త:**

జీవో నెంబర్ 3 పునరుద్ధరణ చేసేంతవరకు గిరిజన ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న 389 విద్యా బోధకుల పోస్టులను అర్హత కలిగిన గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు సుజాత సల్మాన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జీవో నం.3 స్థానంలో గిరిజనుల రిజర్వేషన్ హక్కులను పరిరక్షించేలా నూతన జీవోను ప్రభుత్వం జారీ చేసి, గిరిజనులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని ఆమె కోరారు.ఈ ఉద్యోగాల నోటిఫికేషన్‌కు సంబంధించిన సమాచారం మారుమూల గిరిజన గ్రామాల్లోని అర్హులైన అభ్యర్థులకు పూర్తిస్థాయిలో సమాచార చేరలేదని అందువల్ల అర్హులైన గిరిజన యువతకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించేందుకు దరఖాస్తు గడువును పొడిగించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

17-8Pg7exHMNWJQE.qxd:17-8Pg7exHMNWJQE.qxd 1/1/02 6:34 AM Page 1



# ఎచ్చెర్ల టిడిపి 'ఇన్‌ఛార్జ్' పీఠం ఎవరిది?

- ఐవీఆర్ఎస్ సర్వేలతో అధిష్ఠానం ముమ్మర కసరత్తు
- నియోజకవర్గ కేడర్‌లో తీవ్ర ఉత్కంఠ
- కుల సమీకరణాల కంటే సమన్వయ నాయకత్వానికే మొగ్గు చూపాలని కేడర్ డిమాండ్



Etcherla MLA constituency - Srikakulam dist,

**రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 16 ప్రభాతవార్త :** రాష్ట్రంలో తెలుగుదేశం–బీజేపీ–జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నా, శ్రీకాకుళం జిల్లాలోని అత్యంత కీలకమైన ఎచ్చెర్ల నియోజకవర్గంలో తెదేపా ఇన్‌ఛార్జ్ పదవి ఇంకా కొలిక్కి రాలేదు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పొత్తు ధర్మంలో భాగంగా ఎచ్చెర్ల అసెంబ్లీ సీటును బీజేపీకి కేటాయించడంతో, అప్పటి నుంచి ఇక్కడ తెదేపాకు ఇన్‌ఛార్జ్ నియామకం వాయిదా పడుతూ వచ్చింది. నియోజకవర్గ స్థాయి బాధ్యుడు లేకపోవడంతో క్షేత్రస్థాయిలో పార్టీ పనులు, సంక్షేమ పథకాల సమన్వయం కుంటుపడి కార్యకర్తల్లో తీవ్ర నిరుత్సాహం నెలకొంది.

**చారిత్రక కంచుకోటలో నాయకత్వ శూన్యత :** 1967 నియోజకవర్గాల పునర్విభజన అనంతరం రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల, జి సిగడాం మండలాలు కలిపి ఎచ్చెర్ల నియోజకవర్గంగా ఏర్పడింది. ఎచ్చెర్ల నియోజకవర్గం మూడు దశాబ్దాలకు పైగా తెలుగుదేశం పార్టీకి బలమైన కంచుకోటగా గుర్తింపు పొందింది. పార్టీ చరిత్రలోనే ప్రత్యేక గుర్తింపు ఉన్న ఈ నియోజకవర్గానికి ఇన్‌ఛార్జ్‌ను నియమించడంలో పార్టీ అధిష్ఠానం ఇంతటి జాప్యం చేయడం శ్రేణులను కలవరపెడుతోంది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో, సరైన నాయకత్వం లేకపోతే క్షేత్రస్థాయిలో పార్టీ తీవ్ర రాజకీయ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కేడర్ హెచ్చరిస్తోంది.

**ఐవీఆర్ఎస్ సర్వే వెనుక అధిష్ఠానం వ్యూహం:** గతంలో మాదిరిగా కేవలం పైస్థాయి నాయకుల సిఫార్సులు, పైరవీలపై ఆధారపడకుండా పార్టీ అధిష్ఠానం నేరుగా గ్రామస్థాయి కార్యకర్తల అభిప్రాయాల సేకరణకు పూనుకున్నారు. ఐవీఆర్ఎస్ ఆటోమేటెడ్ ఫోన్ కాల్స్ ద్వారా నియోజకవర్గంలోని బూత్ స్థాయి కార్యకర్తలు, స్థానిక నాయకుల ఓటింగ్ అభిప్రాయాలను సేకరిస్తున్నారు. పొత్తులో భాగంగా ఎమ్మెల్యే బీజేపీకి చెందినవారైనందున, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, స్థానిక అభివృద్ధి పనుల్లో తెదేపా కార్యకర్తలకు న్యాయం జరిగేలా సమన్వయం చేసుకోగల సమర్థుడైన సారథి కోసం పార్టీ అన్వేషిస్తోంది. కేడర్ చెదిరిపోకుండా కాపాడుతూ, పార్టీ ఉనికిని బలంగా నిలబెట్టే 'కమాండర్' ఎంపికే లక్ష్యంగా ఈ కసరత్తు సాగుతోంది. పోటాపోటీగా సీనియర్లు, యువ రక్తం : సర్వే ప్రక్రియ ముమ్మరం కావడంతో నియోజకవర్గంలో రాజకీయ వేడి తారస్థాయికి చేరింది.

**ఆశావహుల్లో రోజురోజుకు పెరుగుతున్న ఉత్కంఠ :** ఎచ్చెర్ల తెదేపా ఇన్‌చార్జ్ పదవి కోసం ఆశావహుల్లో ఉత్కంఠత నెల్కొంది. దశాబ్దాల తరబడి పార్టీ జెండాను మోసి, ఆటుపోట్లను తట్టుకుని నిలబడిన తమ అనుభవానికి అధిష్ఠానం ప్రాధాన్యత ఇస్తుందా, దూకుడు, ఆర్థిక పరిపుష్టి ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తుందా అన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. అయితే పదవి కోసం ఆశావహులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.కుల సమీకరణాలా? సేవా దృక్పథమా? కులాల ప్రాతిపదికన మాత్రమే పదవులు కేటాయించే పాత పద్ధతులకు కాలం చెల్లిందని, సేవా తత్పరతతో నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే వారికే పగ్గాలు ఇవ్వాలని పార్టీ వర్గాలు గట్టిగా కోరుతున్నాయి. కుల మతాలకు అతీతంగా అందరినీ కలుపుకుపోయే వ్యక్తికి బాధ్యతలు అప్పగిస్తేనే పార్టీకి ప్రజాదరణ, విశ్వసనీయత పెరుగుతాయని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ఐవీఆర్ఎస్ నివేదిక ఆధారంగా పార్టీ అధిష్ఠానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందో ఎచ్చెర్ల తెదేపా సారథ్య పగ్గాలు ఎవరికి దక్కుతాయో మరి కొద్ది రోజుల్లో తేలనుంది.

## అల్లాబక్ష్‌పై పిడి యాక్ట్ నమోదు



**చిత్తూరు, ఆగస్టు 16 ప్రభాతవార్త:** పలు నేర కేసుల్లో పలుమార్లు పాల్గొని ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న చిత్తూరు వైయస్సార్ నగర్ కు చెందిన అల్లాబక్ష్ (36) పై పోలీసులు పిడి యాక్ట్ నమోదు చేశారు. ఎస్పీ తుషార్ డుడి ఆదేశాల మేరకు ఆదివారం అల్లాబక్ష్‌ను పోలీసులు కడప సెంట్రల్ జైల్ కు తరలించారు. అల్లాబక్ష్ పలుమార్లు నేరపూరిత కార్యక్రమాల్లో పాల్గొనడం, ఎన్డి పి ఎస్ కేసుల్లో పలుమార్లు పట్టుబడటంతో పోలీసులు హెచ్చరించిన అల్లాబక్ష వారి మాటలు వినలేదు. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా అల్లాబక్ష ప్రవర్తన ఉండడం, అలాగే అల్లాబక్షు యువతను మాదకద్రవ్యాల వైపు మళ్లించే అవకాశం ఉండడంతో అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ నిర్ణయించింది. ఆర్థిక ప్రయోజనాల కోసం నేరపూరిత కార్యకలాపాలకు పాల్పడడం, ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం, అనేకమార్లు నేరపూరిత కార్యకలాపాల్లో పాల్గొనడం, ఎన్ డి పి ఎస్ కేసుల్లో పలుమార్లు పట్టుబడిన అతనిలో మార్పు రాకపోవడం కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ తుషార్ దూడిల సిఫార్సు మేరకు అల్లాబక్ష పై పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఎఆర్‌హెచ్‌సి 198 జి. విజయ్ ప్రకాష్ మృతి



**ముత్తుకూరు (నెల్లూరు), ఆగస్టు 16, ప్రభాతవార్త :** ముత్తుకూరు మండలంలోని జంగాలకండ్రిగ గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏఆర్ హెచ్‌సి 198 జి. విజయ్ ప్రకాష్ మృతి చెందారు. పోలీసులు కథనం మేరకు వివరాలిలా వున్నాయి. నెల్లూరు జిల్లా ఏఆర్‌కు చెందిన ఏఆర్ హెచ్‌సి 198 జి. విజయ్ ప్రకాష్ విధులు ముగించుకుని ఏపీ 39 ఎల్‌హెచ్ 0608 నంబర్ గల స్కూటీపై ముత్తుకూరు వైపు వెళ్తుండగా శనివారం రాత్రి సుమారు 12.01 గంటల మధ్య జంగాలకండ్రిగ గ్రామంలోని భారత్ పెట్రోలియం బంక్ ఎదురుగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ప్రాథమిక సమాచారం మేరకు ఆయన ప్రయాణిస్తున్న స్కూటీ అదుపుతప్పి రోడ్డుకు ఎడమవైపుకు వెళ్లి స్కిడ్ కావడంతో ఆయన కింద పడిపోయారని పోలీసులు తెలిపారు. రోడ్డుపై పడిపోయిన ఆయనను స్థానికులు గుర్తించి వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి, చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. అయితే, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జి. విజయ్ కుమార్ మృతి చెందారని ఎస్ఐ తెలిపారు. ఇదే విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## కాకరపల్లి ధర్మల్ 1108జీవో రద్దు వెంటనే చేయాలి



**సంతబొమ్మాళి, (శ్రీకాకుళం జిల్లా) ఆగస్టు 16, ప్రభాతవార్త :** శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం కాకరపల్లి ధర్మల్ ప్లాంట్ 1108 జీవోను రద్దుచేసి ఆ భూములను మత్స్యకార సొసైటీకి లీజుకివ్వాలని ధర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ ప్రభుత్వానికి డిమాండ్ చేస్తూ తీర్మానం చేసింది. వడ్డీతాండ్రలోని ధర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ నిర్వహిస్తున్న దీక్ష శిబిరానికి 5842రోజులు పూర్తవుతున్న సందర్భంగా (17వ సంవత్సరంలో అడుగుపెడుతున్న వేళ)ఆదివారం దీక్ష శిబిరం వద్ద ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మత్స్యకారులపైన, ధర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకత్వంపైన, కార్యకర్తలపైన అక్రమంగా బనాయించిన పోలీసు కేసులను తక్షణమే రద్దు చేయాలని, కాకరాపల్లి తంపర భూముల్లో ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా ఏర్పాటు చేసుకున్న చేపల చెరువులను వెంటనే రద్దు చేయాలని కాకరాపల్లి ధర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ డిమాండ్ చేసింది. అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, స్థానిక రైతు సంఘం నాయకులు కోత మధుసూదనరావు, మత్స్యకార సొసైటీ నాయకులు మాట్లాడారు. ముందుగా ప్రధాన వక్తగా సన్నశెట్టి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమాచార సేవలో ప్రతిభకు పురస్కారం..

**విజయవాడ.ఆగస్టు16,ప్రభాతవార్తప్రతినిధి:** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా విధి నిర్వహణలో అంకితభావం, సమర్థతతో ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ(ఐఅండ్‌పీఆర్) అధికారులు, విశ్రాంత అధికారికి ప్రశంసా పత్రాలు లభించాయి. విజయవాడలో మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో నిన్న జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ చేతులు మీదుగా డివిజనల్ పీఆర్వో కె.రవి, అసిస్టెంట్ ఇంజనీర్ కె.ధనుంజయ రాజు, ఏవీఎస్ (రిటైర్డ్) వి.వి.ప్రసాద్‌లకు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ప్రముఖుల పర్యటనలతో పాటు వివిధ కార్యక్రమాలకు సంబంధించి పత్రికా ప్రకటనల రూపకల్పన, ప్రభుత్వ కార్యక్రమాలు–అభివృద్ధి కార్యక్రమాల సమాచారాన్ని మీడియాకు సమర్థవంతంగా చేరవేయడంలో ఉత్తమ పనితీరు కనబరిచిన డివిజనల్ పీఆర్వో కె.రవికి ప్రశంసా పత్రం అందజేశారు. అలాగే పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్ నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తున్న కె.ధనుంజయ రాజుకు, మీడియా కోఆర్డినేషన్‌లో ఉత్తమ సేవలు అందించిన వి.వి. ప్రసాద్‌కు ప్రశంసా పత్రాలు అందజేశారు.

## ఇన్‌స్పెక్టర్ గోవిందరావుకు (మెరిటోరియస్) పురస్కారం

**విజయవాడ.ఆగస్టు 16,ప్రభాతవార్తప్రతినిధి:** పోలీసుశాఖలో విశేష సేవలందించిన ఇన్‌స్పెక్టర్ మామిడి గోవిందరావు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యోగ్యత (మెరిటోరియస్) పురస్కారాన్ని అందుకున్నారు. 2025 సంవత్సరానికి గాను ప్రకటించిన ఈ పురస్కారాన్ని రాజధాని అమరావతిలో నిన్న నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయనకు ప్రదానం చేశారు.విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణతో పాటు పోలీసుశాఖకు అందించిన విశేష సేవలకు గుర్తింపుగా గోవిందరావును ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ప్రస్తుతం ఆయన ఆంధ్రప్రదేశ్ పోలీస్ అకాడమీలో విధులు నిర్వర్తిస్తున్నారు. వివిధ హోదాల్లో, ప్రాంతాల్లో పనిచేసిన ఆయన సమర్థ అధికారిగా గుర్తింపు పొందారు.పార్వతీపురం నుంచి ప్రస్థానం.గోవిందరావు తండ్రి రామినాయుడు విశ్రాంత ఉపాధ్యాయుడు. గోవిందరావుడిగ్రీ వరకు పార్వతీపురంలో విద్యాభ్యాసం చేశారు. అనంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ పూర్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పోలీసు (ఏపీఎస్పీ) విభాగంలో ఆర్ఎస్ఐగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అని తెలిపారు.

## నాలుగు సార్లు నన్ను గెలిపించారు..
# మీకు ఏం ఇచ్చినా తక్కువే

- నా నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలే నాకు తొలి ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత ♦ టిడిపి నేతలతో సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

**అనంతపురం, ఆగస్టు 16 ప్రభాతవార్త:** నాలుగు సార్లు నన్ను గెలిపించి ఎమ్మెల్యేగా చేసిన.. ప్రజలకు, కార్యకర్తలకు ఏం ఇచ్చినా తక్కువేనని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆమె సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 6మండలాలకు చెందిన 52మందికి రూ.54.39లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలు, మండలాల నాయకులు, లబ్ధిదారుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న వారు ఎమ్మెల్యే సునీతతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. రెండేళ్లలో 1430 మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.11 కోట్లు అందజేసినట్లు తెలిపారు. గతంలో ఎప్పుడూ ఇంత పెద్ద ఎత్తున సాయం అందలేదన్నారు. అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్న వారికి ఇది ఎంతగానో ఊరటనిస్తోందన్నారు. నా వద్దకు ఎవరైనా సరే ఈ సాయం కోసం వస్తే కాదనకుండా ముఖ్యమంత్రి వద్దకు ఫైల్ తీసుకెళ్తున్నానని చెప్పారు. తనను నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి చేయడమే కాకుండా, ఇలా వ్యక్తిగతంగా కూడా సాయం చేయడం నా బాధ్యత అన్నారు. ఏ కార్యకర్త, నాయకుడికైనా సరే ఏ కష్టం వచ్చినా నేను ఉంటానన్నారు.

**ఇంటింటికీ కార్యక్రమాన్ని వేగవంతం చేయండి :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సునీత పార్టీ నాయకులకు ఆదేశించారు. తన క్యాంప్ కార్యాలయంలో పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న డోర్ టూ డోర్ కార్యక్రమం, సర్ ప్రక్రియ మీద సమీక్ష నిర్వహించారు. డోర్ టు డోర్ కార్యక్రమంలో 100 ఇళ్ల కంటే తక్కువ తిరిగిన బూత్ ల గురించి, ఇప్పటి వరకు 50శాతం లోపు ఉన్న వాటి గురించి ప్రధానంగా ప్రస్తావించారు. కార్యక్రమం ప్రారంభమై 20రోజులు గడుస్తున్నా, ఎందుకు ఇంత నెమ్మది సాగుతోందని ఆరా తీశారు. పార్టీ ఏదైనా నిర్దేశించినప్పుడు దానిని కచ్చితంగా చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడ్డవారికే ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా అందజేసిన నోటీసులను పరిశీలించి వివరణ ఇవ్వాలని, ఓటరు జాబితాలో తప్పులు, అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఎవరైనా ఓట్లు కోల్పోయి ఉన్నా, లేదా కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియపై దృష్టి సారించాలని ఆదేశించారు.

## నిశ్చితార్థ వేడుకల్లో వైసిపి, టిడిపి వర్గాల మధ్య ఘర్షణ

- జె.సి ప్రభాకర్‌రెడ్డిపై దూసుకొచ్చిన వైసిపి నాయకులు రామచంద్రారెడ్డి - ఘర్షణలో కారు అద్దాలు ధ్వంసం
- జె.సి ప్రభాకర్‌రెడ్డికి నచ్చచెప్పిన మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి
- సిఐ నారాయణరెడ్డి చొరవతో తప్పిన పెద్ద వివాదం



నిశ్చితార్థ వేడుకకు హాజరైన మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి, జె.సి దివాకర్‌రెడ్డి ♦ఘర్షణలో ధ్వంసమైన కారు అద్దాలు ♦ జె.సి ప్రభాకర్‌రెడ్డికి నచ్చచెబుతున్న మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి

**తాడిపత్రిఅర్బన్, ఆగస్టు 16 ప్రభాతవార్త:** తాడిపత్రిలో ఓ వివాహ నిశ్చితార్థ వేడుకల్లో వైసిపి, టిడిపి వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. ఈ ఘర్షణలో కావేరిసముద్రంకు చెందిన హనుమంతరెడ్డి వాహనం అద్దాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కావేరిసముద్రానికి చెందిన సంజీవరెడ్డి కుమారుడు నిశ్చితార్థ వేడుకను ఆదివారం అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో కడప రోడ్డులోని ఎస్ఆర్‌టి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేశారు. కావేరిసముద్రం సంజీవరెడ్డికి రాజకీయంగా వైసిపి, టిడిపి నాయకులతో బంధుత్వాలు ఉన్నాయి. కావేరిసముద్రం సంజీవరెడ్డి తండ్రి పుల్లారెడ్డి తాడిపత్రి మండలంలో మంచి పేరు గల నాయకుడు. గత కొన్ని సంవత్సరాల క్రితం ఆయన ఫ్యాక్షన్ గొడవల్లో మృతి చెందారు. ఆయనకు ఇరువురు కుమారులు. సంజీవరెడ్డితో పాటు శ్రీరామిరెడ్డి కావేరిసముద్రం సర్పంచుగా పని చేస్తూ ప్రస్తుతం తెలంగాణలోని తాండూరులో నివాసం ఉంటున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంచి సన్నిహితులు. తన సోదరుడు కుమారుడు నిశ్చితార్థ వేడుకలకు ఆయన కుటుంబసభ్యులతో సహ హాజరయ్యారు. ఆయనతో పాటు వైఎస్ఆర్‌సిపిలో ఉన్న కందిగోపుల మురళిప్రసాద్‌రెడ్డి, ఇగుడూరు మాజీ సర్పంచు రామచంద్రారెడ్డి, హనుమంతరెడ్డి తదితరులు హాజరుకాగా, రాష్ట్ర మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి జె.సి దివాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డిలతో పాటు టిడిపి నాయకులు హాజరయ్యారు. ఈ సమయంలో నిశ్చితార్థ వేడుకల్లో మొదటి వరుసలో ఉన్న కందిగోపుల మురళిప్రసాద్‌రెడ్డిని చూసి జె.సి ప్రభాకర్‌రెడ్డి ఇతన్ని బయటికి పంపమని సంజీవరెడ్డికి సూచించారు. అనంతరం శ్రీరామిరెడ్డి జె.సి ప్రభాకర్‌రెడ్డి వద్దకు వెళ్లి బాగున్నారా అంటూ పలకరించగా అతనిని కూడా బయటికి పంపండి అని చెప్పారు. హనుమంతరెడ్డిని తనకున్న చనువుతో కొద్దిగా హెచ్చరిస్తూ మాట్లాడడం జరిగింది. అందరూ మీరే ఉన్నారు. మేము ఎందుకంటూ జె.సి ప్రభాకర్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ముందు వరుసనుంచి వెళ్ళిపోతూ మధ్యలో కూర్చున్నారు. ఆ సమయంలో పక్కకు వస్తున్న శ్రీరామిరెడ్డిని ఇగుడూరు గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి చేతులు పట్టుకొని జె.సి ప్రభాకర్‌రెడ్డి వద్దకు తన కుమారులతో కలిసి దూసుకువచ్చేందుకు ప్రయత్నించారు. ఇది గమనించిన జె.సి ప్రభాకర్‌రెడ్డి అనుచరులు ఒక్కసారిగా వారిని ఎదుర్కొనేందుకు ప్రయత్నించడంతో అక్కడ ఉన్న సిఐ నారాయణరెడ్డి ఇగుడురు రామచంద్రారెడ్డిని, ఆయన కుమారున్ని, వైసీపీ నాయకులను పక్కకు ఈడ్చిపడవేశారు. అనంతరం జె.సి ప్రభాకర్‌రెడ్డి ఫంక్షన్ హాల్ బయటకు వచ్చి కూర్చున్నారు. విషయం తెలుసుకున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి అనుచరులు ఒక్కసారిగా ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకుని అక్కడ ఉన్న కారు అద్దాలను పూర్తిగా ధ్వంసం చేశారు. ఆ సమయంలో మంత్రి జనార్దన్‌రెడ్డి జె.సి ప్రభాకర్‌రెడ్డి వద్దకు వచ్చి నచ్చజెప్పి ఆయనను ఫంక్షన్ హాల్ వద్ద నుంచి ఇంటికి పంపించారు. జె.సి ప్రభాకర్‌రెడ్డి ఇంటికి వెళ్లిన తర్వాత ఒక్కసారిగా పెద్దఎత్తున టిడిపి నాయకులు, జె.సి అనుచరులు ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకొని ఘర్షణకు దిగిన వైసిపి నాయకులపై దాడి చేయడానికి ప్రయత్నించగా సిఐ నారాయణరెడ్డి టిడిపి నాయకులు ఎస్‌వి రవీంద్రారెడ్డికి ఉన్నతాధికారుల నుంచి ఫోన్లో మాట్లాడించగా వారు ఫంక్షన్ హాల్ వద్ద నుంచి వెళ్లిపోయారు. వైసిపి నాయకులను ఒక రూములో ఉంచి టిడిపి నాయకులంతా వెళ్లిన తర్వాత వారిని కడప జిల్లా వైపుకు పోలీసులు బందోబస్తుతో పంపించారు. వైసీపీ నాయకుడు రామచంద్రారెడ్డి జె.సి ప్రభాకర్‌రెడ్డిపై దాడికి రెచ్చగొట్టడం వల్లనే ఈ ఘర్షణ చెలరేగిందని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. జె.సి ప్రభాకర్‌రెడ్డికి హనుమంతరెడ్డి, శ్రీరామిరెడ్డిలు ఒకప్పుడు ప్రధాన అనుచరులుగా ఉండేవారు. వారి మధ్య చెలరేగిన మనస్పర్థలు వల్ల ప్రస్తుతానికి దూరంగా ఉన్నారు. ఫంక్షన్ హాల్ వద్ద ఘర్షణ జరుగుతుందన్న ఉద్దేశంతో టౌన్ సిఐ ఆరోహణరావు, పెద్దవడుగూరు సిఐ నరేందర్‌రెడ్డి, సబ్ డివిజన్‌లోని పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకొని శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

## భోగాపురంలో జిఎంఆర్‌విఎఫ్ కేంద్రం ప్రారంభం

**విజయనగరం (భోగాపురం), ఆగస్టు 16 ప్రభాతవార్త :** ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, మానవతావాది, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ ఆదివారం భోగాపురంలోని జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ (జీఎంఆర్‌వీఎఫ్) నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన యువ శిక్షణార్థులు, సిబ్బందితో ముచ్చటించి, వారి ఆశయాలు, కేంద్రంలో అందిస్తున్న శిక్షణా కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. తమ ముందున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వారికి ఆశీస్సులు అందించారు. నైపుణ్యాలు, ఉపాధి, సుస్థిర జీవనోపాధి ద్వారా స్థానిక యువతకు సాధికారత కల్పించాలనే కేంద్రం లక్ష్యాన్ని గురుదేవ్ ఆశీర్వదించారు. భోగాపురం పర్యటనలో భాగంగా ఆయన అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కూడా సందర్శించారు. జీఎంఆర్ గ్రూప్ చైర్మన్ జి.ఎం.రావు విమానాశ్రయంలో ఆయనకు స్వయంగా మార్గనిర్దేశం చేస్తూ, విమానాశ్రయ అభివృద్ధి, మౌలిక వసతులు, ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్‌కు నూతన విమానయాన ద్వారంగా దాని దార్శనికత గురించి వివరించారు. జీఎంఆర్ గ్రూప్‌కు చెందిన కార్పొరేట్ సామాజిక బాధ్యత విభాగమైన జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ (జీఎంఆర్‌వీఎఫ్), విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో తన సమాజ అభివృద్ధి కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తోంది. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కేంద్రం ద్వారా ఏటా 1,000 మంది యువతకు శిక్షణ అందించే సామర్థ్యం ఉంది. మారుమూల, వెనుకబడిన ప్రాంతాలకు చెందిన యువతకు సాధికారత కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా, ఉద్యోగ ఆధారిత శిక్షణను అందించడంతో పాటు, శిక్షణార్థులను దేశంలో, విదేశాల్లోని ఉపాధి అవకాశాలతో అనుసంధానం చేస్తారు. శిక్షణార్థులతో జరిగిన సమావేశంలో గురుదేవ్‌కు కేంద్రంలో అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలు, మౌలిక వసతులు, ఉపాధి ఆధారిత కార్యక్రమాల గురించి వివరించారు. యువత ఆశయాలను ఆయన తెలుసుకుని, తమ కలలను సాకారం చేసుకునేందుకు కష్టపడి పని చేయాలని ప్రోత్సహించారు. తమ శక్తి, ప్రతిభను తమతో పాటు ఇతరుల జీవితాల్లోనూ ఆనందాన్ని తీసుకురావడానికి వినియోగించాలని సూచించారు.

## అన్నను చంపిన తమ్ముడు..



**బ్రహ్మంగారిమఠం ఆగస్టు 16, ప్రభాతవార్త :** కడప జిల్లాలోని బ్రహ్మంగారి మఠం మండల కేంద్రమైన తెలుగు గంగ ప్రాజెక్ట్ వెళ్లే దారిలో వున్న రజక అన్నదాన సత్రానికి సమీపంలో నివాసం వున్న వజ్రాల సుబ్బారాయుడు,హైమావతి లకు ఇద్దరు కుమారులలో పెద్ద కుమారుడు వజ్రాల వెంకటసుబ్బయ్య,చిన్న కుమారుడు సురేష్ ఆదివారం మంచం పైన పండుకొని వున్నా వెంకట సుబ్బయ్య 45 అన్నను అతి కిరాతకంగా గొడ్డలితో నరకి చంపాడు. వివరాల్లోకెళితే వీరిద్దరూ మద్యానికి బానిసై కావడంతో వాళ్ళను భార్యలు వదిలేసి వెళ్లిపోయారు. అప్పటి నుండి వారు తల్లి హైమావతి వద్దనే ఉంటున్నారు. శనివారం రాత్రి తమ్ముడు సురేష్ చికెన్ పకోడీ తెచ్చుకోగా అన్న వెంకట సుబ్బయ్య శనివారం ఎందుకు తెచ్చుకున్నావని అనడంతో ఇద్దరి మధ్య జరిగిన గొడవను మనసు పెట్టుకొని ఆదివారం అన్న వెంటసుబ్బయ్యను తమ్ముడు సురేష్ గొడ్డలి తో నరికి చంపాడు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి హత్యకు సంబంధించిన దర్యాప్తు చేపడతామన్నారు.

## ఉద్యోగుల ఉద్యమంపై 28న కార్యాచరణ

**విజయవాడ, ఆగస్టు 16 (ప్రభాతవార్త):** తమకు న్యాయబద్ధంగా రావాల్సిన బకాయిలు, సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేనందున ఉద్యమానికి సిద్ధం కావాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల అమరావతి జెఏసి నిర్ణయించింది. విజయవాడ రెవెన్యూ భవన్ లో ఆదివారం జరిగిన వివిధ ప్రభుత్వశాఖల ఉద్యోగుల సంయుక్త సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వశాఖల డివిజన్ స్థాయి నుంచి జిల్లా స్థాయి, జోనల్, రాష్ట్ర స్థాయి నాయత్వాలతోఈ నెల 28వ తేదీన విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య ఆడిటోరియంలో సమావేశం కానున్నట్లు జె.ఎ.సి. ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి, ఉద్యమ కమిటీ కన్వీనర్ పలిశెట్టి దామోదర్ తెలిపారు.ప్రభుత్వమే ఉద్యోగుల సమస్యలు పరిష్కారంలో నిరక్ష ్యం చేస్తూ ఉద్యమానికి ప్రేరేపిస్తోందిని అన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, సమస్యలను పరిష్కరించకుండా పదేపదే కాలయాపన చేయడం ద్వారా ప్రభుత్వమే ఉద్యోగులను ఉద్యమం వైపు నడిపిస్తోందని, "ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి స్పష్టమైన చర్యలు

## రూ.15 లక్షలు లంచం డిమాండ్ సిబిఐకి చిక్కిన రైల్వే ఇంజనీర్

**విజయవాడ, ఆగస్టు 16 (ప్రభాతవార్త):** విజయవాడలో లంచం తీసుకుంటూ రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ సీబీఐకి చిక్కారు. విజయవాడ రైల్వే డివిజనల్ కార్యాలయంలో సీనియర్ సెక్షన్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న బాపిరాజు ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ పనుల వ్యవహారంలో కాంట్రాక్టరుకుబిల్లులు చెల్లించేందుకు లంచం డిమాండ్ చేసినట్లు విశాఖపట్నంలోని సీబీఐ అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో సిబిఐ అధికారులు విచారణ జరిపి ఆదివారం కాంట్రాక్టరు నుంచి రూ.15 లక్షలు లంచం తీసుకుంటూ ఉండగా ఇంజనీరును పట్టుకున్నారు. ఆయనతో పాటు ప్రైవేటు వ్యక్తి శ్రీచంద్ అనే వ్యక్తిని సైతం సిబిఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పనుల కేటాయింపులోనూ అనుకూలంగా వ్యవహరించేందుకు కాంట్రాక్టర్ నుంచి బాపిరాజు లంచం డిమాండు చేసినట్లు సమాచారం. రూ.179.50కోట్ల విలువైన ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ ప్రాజెక్టుకు సంబంధించి రూ.7 కోట్ల బోనస్ లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రాజెక్టుకు సంబంధించిన లావాదేవీలు, కాంట్రాక్ట్ పనులు, బిల్లుల మంజూరు వ్యవహారాలపై సిబిఐ అధికారులు వివరాలను సేకరిస్తున్నారు.

## రాజకీయాలను డబ్బుమయం చేసింది చంద్రబాబే



**పుత్తూరు(నగరి), ఆగస్టు 16 ప్రభాతవార్త :** డబ్బులు తీసుకుని ఓట్లేస్తున్నారని, ఫలితంగా గెలిచిన ఎమ్మెల్యేలు కూడా ప్రజా క్షేమం వదిలిపెట్టి డబ్బు సంపాదనకే మొగ్గు చూపుతున్నారని, అందువల్ల డబ్బులు తీసుకోకుండా ఓట్లేయండని స్వాతంత్ర దినోత్సవం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళలకు హితబోధ చేయడం పట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పర్యాటక శాఖ మాజీ మంత్రి ఆర్.కె.రోజా తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం నగరి పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ...అసలు రాజకీయాలను డబ్బు మయం చేసింది చంద్రబాబునాయుడే అన్నారు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటుకు, ఇతర పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం కోసం, గతంలో తెలంగాణాలో కెసిఆర్ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడానికి ఇలా డబ్బుతోనే రాజకీయాలు నడపడంలో చంద్రబాబును మించిన వారు లేరని విమర్శించారు. మహిళల కోసం ఇచ్చిన హామీలేవీ నెరవేర్చకుండా తిరిగి వారిని డబ్బులకు వెంపర్లాడే వాళ్లలా చిత్రీకరించి మాట్లాడడం సిగ్గు చేటన్నారు. మహిళలకు నీతులు చెప్పడానికి ముందు చంద్రబాబు వారికిచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికలపుడు ఇచ్చిన హామీల మేరకు ఎస్సీ,ఎస్టీ మహిళలకు 50 ఏళ్లకే పెన్షన్, 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడపిల్లకు నెలకు రూ. 1500, డ్వాక్రా మహిళలకు పది లక్షల వరకూ సున్నా వడ్డీతో రుణాలు, నిరుద్యోగ మహిళలకు ఒక్కొకరికి నెలకు రూ. 3000 వేలు వంటి ఏ పథకాన్ని చంద్రబాబు అమలు చేయలేదని తెలిపారు.

## ప్రియాంక హత్య కేసు దర్యాప్తు అధికారిగా దేవరాజ్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు16,ప్రభాతవార్త:** పీజీ వైద్య విద్యార్థిని ప్రియాంక హత్య కేసు దర్యాప్తును ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం వేగవంతం చేసింది. కేసు దర్యాప్తు అధికారిగా ఐపీఎస్ అధికారి పాటిల్ దేవరాజ్ మునీష్‌ను నియమిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దర్యాప్తును అన్ని కోణాల్లో చేపట్టి, నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం.కేసు దర్యాప్తులో ప్రకాశ్‌నగర్ సీఐపై వచ్చిన విమర్శలు, ఘటనకు సంబంధించిన వాస్తవాలు బయటకు రాకుండా తొక్కిపెట్టే ప్రయత్నాలు జరిగాయన్న ఆరోపణలపైనా లోతైన విచారణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా సంబంధిత ఫోన్ కాల్ డేటాను సైతం పరిశీలించనున్నట్లు సమాచారం.కొత్త దర్యాప్తు అధికారికి రాజమహేంద్రవరం సౌత్‌జోన్ డీఎస్పీ శివప్రియ, ప్రకాశ్‌నగర్ సీఐ బాజీలాల్ సహకారం అందించనున్నారు. కేసులో ఇప్పటివరకు వెలుగులోకి వచ్చిన అంశాలతో పాటు అనుమానాస్పద పరిణామాలు, సంబంధిత వ్యక్తుల పాత్రపై సమగ్రంగా విచారణ జరిపే అవకాశం ఉంది. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో దర్యాప్తు మరింత కీలక దశకు చేరింది. కొత్త దర్యాప్తు అధికారి విచారణతో ప్రియాంక మృతి వెనుక ఉన్న అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

## యుగంధర్‌ను అరెస్ట్ చేసిన సిసిఎస్ పోలీసులు

**విజయవాడ.ఆగస్టు 16,ప్రభాతవార్తప్రతినిధి:** భూములపై బ్యాంకు రుణాలు ఇప్పిస్తానని నమ్మించి ఆస్తి పత్రాలను దుర్వినియోగం చేసి, భారీ మోసాలకు పాల్పడిన అంతర్ రాష్ట్ర నిందితుడు నునావత్ యుగంధర్‌ను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎకనామిక్ ఆఫెన్సెస్ వింగ్ ఆధ్వర్యంలో చేపట్టిన దర్యాప్తులో యుగంధర్‌పై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 2016 నుంచి 20కి పైగా క్రిమినల్, సివిల్ కేసులు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 12 క్రిమినల్ కేసులతో పాటు 8 సివిల్, నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్‌కు సంబంధించిన కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. తాజాగా ఓ బాధితుడికి రూ.60 లక్షల ఆర్థిక సాయం ఇప్పిస్తానంటూ లీవీగే చేసుకున్న యుగంధర్, అతడికి తెలియకుండా ఆస్తి పత్రాలను దుర్వినియోగం చేసి మూడో వ్యక్తి పేరిట ఆస్తిని బదిలీ చేసినట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం అదే ఆస్తిని ఆధారంగా చేసుకుని యాక్సిస్ బ్యాంక్ నుంచి ఏకంగా రూ.1.50 కోట్ల రుణం తీసుకున్నాడు. రుణం డిఫాల్ట్ కావడంతో బ్యాంకు నుంచి బాధితుడికి నోటీసులు రావడంతో అసలు మోసం వెలుగులోకి వచ్చింది. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించగా, దర్యాప్తు చేపట్టిన సీసీఎస్ అధికారులు యుగంధర్ వ్యవహారాలను వెలుగులోకి తీసుకని వచ్చారు.దర్యాప్తులో యుగంధర్ ఇదే తరహాలో పలువురిని మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటివరకూ 30 మందికి పైగా బాధితులు ఉన్నట్లు, వారి నుంచి రూ.10 కోట్లకు పైగా మోసం చేసినట్లు విచారణలో వెల్లడైంది. భూములు, రుణాలు ఇప్పిస్తామంటూ వచ్చే వ్యక్తుల మాటలను గుడ్డిగా నమ్మవద్దని సీసీఎస్ పోలీసులు హెచ్చరించారు.

17-8Pg8.qxd:17-8Pg8.qxd 1/1/02 6:35 AM Page 1



# డ్రగ్స్ స్మగ్లర్లతో పోలీసుల దోస్తానా!

### గంజాయి డాన్‌లు బొల్లం బ్రదర్స్‌తో ఎస్‌ఐ సహా ఐదుగురు కానిస్టేబుళ్ల మిలాఖత్

### గతంలో స్టువర్ట్‌పురం దొంగలకు ఆశ్రయం కల్పించిన ఓ కానిస్టేబుల్

**హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** పోలీసు అధికారుల్లో కొందరు డ్రగ్స్ స్మగ్లర్లతో చెలిమి చేస్తుండడం మొత్తం పోలీసు విభాగానికే చెడ్డపేరు తెస్తోంది. బాలానగర్‌లో గత గురువారం ఈగల్ పోలీసులు గంజాయి డాన్‌లుగా పేరొందిన బొల్లం బ్రదర్స్ అడ్డాపై దాడులు చేసిన సమయంలో బాలానగర్ పోలీసు స్టేషన్‌కు చెందిన ఓ ఎస్‌ఐ సహా ఐదుగురు కానిస్టేబుళ్ల లాలూచీ వ్యవహారం వెలుగు చూసింది. గంజాయి డాన్‌ల అడ్డాలో ఏకంగా ఎస్‌ఐ మ్యాన్ ప్యాక్ (వాకిటాకీ) లభ్యం కాగా దీనిపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. గతంలోనూ పలుచోట్ల ఇటువంటి ఉదంతాలు అనేకం వెలుగు చూడగా ఈగల్ ఏర్పాటయ్యాక ఏకంగా ఒక ఎస్‌ఐ స్మగ్లర్లతో దోస్తానా చేయడం సంచలనం రేపింది. ఇప్పటి వరకు దొంగలతో పాటు ఇతర నేరగాళ్లతోనే స్నేహంగా వుండే పోలీసులు ఇప్పుడు మాదకద్రవ్యాల స్మగ్లర్లతో చెట్టాపట్టాల్ వరకు ఎదిగారు. మూడేళ్ల క్రితం సైబరాబాద్‌లో సైబర్ క్రైం విభాగానికి చెందిన రాజేందర్ అనే ఒయువ ఎస్‌ఐ ఓ డ్రగ్స్ స్మగ్లర్‌ను మహారాష్ట్రలో అరెస్టు చేసిన సమయంలో అతని వద్ద లభించిన మాదకద్రవ్యాలలో కొంతభాగం సర్కారుకు ఇవ్వకుండా తన వద్ద దాచుకుని, దానిని బహిరంగ మార్కెట్లో విక్రయించేందుకు యత్నించి దొరికిపోయాడు. డ్రగ్స్ స్మగ్లర్ మరో కేసులో విచారణ ఎదుర్కొనే సమయంలో సదరు ఎస్‌ఐ బండారం బయటపెట్టడంతో గోల్‌మాల్ బాగోతం రట్టయ్యింది. ఈ కేసులో సదరు ఎస్‌ఐ ఇంట్లోనే డ్రగ్స్ పట్టుబడగా చివరకు అతన్ని అరెస్టు చేశారు. ఈ ఘటనకు ముందు అనేక మంది పోలీసు అధికారులు నేరగాళ్లతో చెలిమి చేసి ఉద్యోగాల నుంచి సస్పెండ్ కాగా కొందరు డిస్మిస్ అయ్యారు. ఇందులో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్లకు చెందిన ఎంసెట్ స్కాంను విచారించిన సిఐడికి చెందిన ఓ ఇన్‌స్పెక్టర్ వరంగల్‌లో ఓ నిందితుడి నుంచి 50 వేల రూపాయలు తీసుకుని దొరికిపోవడం సంచలనం రేపింది. సైబరాబాద్, మల్కాజిగిరి పరిధుల్లో వున్న ఎస్‌ఓటికి చెందిన కొందరు అధికారులు గతంలో కరడుగట్టిన నేరగాళ్లను అరెస్టు చేసే సమయంలో వారి వద్ద నగదును కాజేసిన ఉదంతాలు అనేకం వెలుగు చూశాయి. ఈ క్రమంలో కొందరిపై వేటు పడింది. దీని తరువాత వారు అనేక మంది వున్నారు. దీంతో పాటు ఎనిమిదేళ్ల క్రితం రాష్ట్రంలో సంచలనం రేపిన నాలుగేళ్ల క్రితం సిటీ పోలీసు విభాగానికి చెందిన ఓ కానిస్టేబుల్ ఏకంగా స్టువర్టుపురం దొంగల ముఠాకు తన ఇంట్లోనే ఆశ్రయం ఇచ్చి వారిచేత దొంగతనాలు చేయించి, చివరగా నల్లగొండ పోలీసులకు చిక్కాడు. దీంతో పాటు రియల్ ఎస్టేట్ రంగంలో నేరచరిత్ర వున్న వారి నుంచి కొందరు ఏసిపిలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని ఉద్యోగాల నుంచి సస్పెండ్ అయిన ఘటనలు కూడా వున్నాయి. దీంతో పాటు హవాలా నగదును తరలిస్తూ దొరికిపోయిన పోలీసులు కూడా వున్నారు. వీటన్నింటికి భిన్నంగా కొంతకాలంగా డ్రగ్స్ స్మగ్లర్లతో పోలీసుల దోస్తానా ఎక్కువయ్యింది. ఈగల్ విభాగం ఏర్పాటయ్యాక రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి సహా ఇతర మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతూ అడ్డాలపై దాడులు చేస్తుండడం తెలిసిందే. దాడుల సమయంలో ఆయా ప్రాంతాల పోలీసులతో స్మగ్లర్లకు వున్న లింకులు బయట పడుతున్నాయి. బాలానగర్‌లో రట్టయిన గోల్‌మాల్ ఈ కోవలో నిదే. ఈఘటనపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఈ కేసులో ఎస్‌ఐని విచారిస్తుండగా ఆయనతో పాటు కానిస్టేబుళ్లపై వేటుపడే వీలుందని తెలిసింది.

**ఉన్నతాధికారుల అజమాయిషీ కొరవడడం వల్లే ఇటువంటి ఘటనలు:** ఇదిలావుండగా పోలీసు శాఖలో కీలకంగా వుండే ఎస్‌ఐ స్థాయి అధికారులు ఏకంగా డ్రగ్స్ స్మగ్లర్లతో దోస్తానా చేయడం పోలీసు శాఖకు తల వంపుగా తేలింది. ఇలాంటి ఘటనలు జరగడానికి క్షేత్రస్థాయిలో వుండే అధికారులపై ఉన్నతాధికారుల అజమాయిషీ కొరవడడమేనని నిపుణులు అంటున్నారు. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందనే దానిపై ఉన్నతాధికారులు నిత్యం పర్యవేక్షణ చేయడంతో పాటు ఒకటికి నాలుగుమార్లు క్రాస్ చెకింగ్ చేస్తే ఇటు వంటి ఘటనలు జరిగేందుకు ఆస్కారం వుండవని వారంటున్నారు.

## బొల్లం బ్రదర్స్ నుంచి కస్టమర్లకు భారీగా గంజాయి



**హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** బాలానగర్‌లో గత గురువారం రట్టయిన బొల్లా బ్రదర్స్ గంజాయి డెన్‌లో మరిన్ని సంచలన విషయాలు వెలుగు చూశాయి. ఈ డెన్‌కు నాయకుడుగా పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన బొల్లా కిరణ్ వుండగా అతని సోదరులు ఇద్దరు సహా నాయకులుగా వుండడం తెలిసిందే. పోలీసులకు ఓవైపు ఇన్‌ఫార్మర్లుగా వుంటూనే మరోవైపు గంజాయి దందా సాగిస్తున్న వీరు ఇందుకోసం డెడ్ డ్రాప్ పద్దతిని ఎంచుకోవడం విదితమే. ఒడిషా, ఏపి నుంచి తక్కువ ధరకు గంజాయి తెప్పించి దానిని చిన్న ప్యాకెట్లలో వుంచి వాటిని డెడ్ డ్రాప్ వ ద్ధతిలో అమ్ముతున్నారని పోలీసులు తేల్చారు. దీనికి సంబం ధించి పోలీసులు రిమాండు రిపోర్టును కోర్టుకు సమర్పించారు. ఈ కేసులో బొల్లా బ్రదర్స్‌తో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేయగా వీరిని విచారించగా కొత్త విషయాలు వెలుగు చూశాయి. బొల్లా బ్రదర్స్ నుంచి పెద్ద సంఖ్యలో గంజాయి వ్యసనపరులు గంజాయి కొంటున్నట్లు పోలీసులు తేల్చారు. వీరికి ఏడుగురు బడా స్మగ్లర్లు గంజాయి అమ్ముతున్నట్లు తేలింది. బొల్లా బ్రదర్స్ నుంచి గంజాయి కొన్న వారి జాబితా 225గా పోలీసులు గుర్తించారు. వీరి చిరునామాలను కూడా గుర్తించిన పోలీసులు వారిని విచారించేందుకు సిద్ధమవు తున్నారు. డిజిటల్ పద్దతిలో వీరు నగదును తీసుకునే వారని తేలింది. దీంతో పాటు గంజాయిని సరఫరా కోసం నంబర్ ప్లేట్లు లేని పదికి పైగా వాహనాలను వాడినట్లు తేలింది. ఇందులో కొన్నింటిని జప్తు చేయగా మిగతా వాటి కోసం గాలిస్తున్నారు.

## ద్రంకన్ డ్రైవ్‌లో 271 మంది పట్టివేత

**హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** జంట నగరాలు, శివారు ప్రాంతాలలో మందు బాబుల భరతం పట్టేందుకు డ్రంకన్ డ్రైవ్ దాడులు కొనసాగుతూనే వున్నాయి. శుక్రవారం, శనివారం రాత్రివేళలో ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ దాడుల్లో మొత్తం 271 మంది మందుబాబులు పట్టుబడ్డారు. వీరిలో 228 మంది ద్విచక్ర వాహనదారులు, 20 మంది ఆటో డ్రైవర్లు, 23 మంది కార్లతో పాటు ఇతర వాహనాల డ్రైవర్లు వున్నారు. పట్టుబడ్డ వారిలో 55 మందిలో 30 నుంచి 50 పాయింట్ల వరకు వుండగా 103 మందిలో 51 నుంచి 100 పాయింట్ల వరకు, 68 మందిలో 101 నుంచి 150 పాయింట్ల వరకు, 29 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు, ఐదుగురు 201 నుంచి 250 పా యింట్ల వరకు, ఏడుగురు 251 నుంచి 300 పాయింట్ల వరకు, నలుగురు 300 పాయింట్లకు మించి విపరీతంగా మద్యం సే వించినట్లు తేలింది. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన తరువాత కోర్టుల్లో హాజరు పరుస్తారు. కోర్టులు వీరికి శిక్షలు విధిస్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్ మీడియాకు తెలిపారు. జంట నగరాలలో డ్రంకన్ డ్రైవ్ దాడులు నిరంతరం కొనసాగుతాయని ఆయన వెల్లడించారు.

**సైబరాబాద్‌లో 201 మంది పట్టివేత**

ఇదిలావుండగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 201 మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 174 మంది ద్విచక్ర వాహనదారులు, తొమ్మి ది మంది ఆటో డ్రై వర్లు, 17 మంది కార్ల డ్రైవర్లు, ఒకరు భారీ వాహనం డ్రైవర్ వున్నారు. పట్టుబడ్డ వారిని నిబంధనల మేరకు కోర్టులో హా జరు పరుస్తామని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు అదనపు డిసిపి నరేందర్ తెలిపారు.

**మల్కాజిగిరి పరిధిలో 193 మంది**

కాగా మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో 193 మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 161 మంది ద్విచక్ర వాహనదారులు. ఎనిమిది మంది ఆటో డ్రైవర్లు, 24 మంది కార్ల డ్రైవర్లు వున్నారు. పట్టుబడ్డ వారిని నిబంధనల మేరకు కోర్టులో హాజరు పరుస్తామని ట్రాఫిక్ డిసిపి రాహుల్ రెడ్డి తెలిపారు.

## బాలికపై లైంగిక దాడి: 8 నెలల తరువాత కేసు నమోదు

**కుషాయిగూడ, ప్రభాతవార్త ఆగస్టు 16 :** మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారంటూ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు సకాలంలో స్పందించలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బాధితురాలు ఆరు నెలల గర్భవతి అయిన తర్వాత కేసు నమోదు చేయడం పోలీసుల విధి నిర్వహణపై ప్రశ్నలు తలెత్తేలా చేసింది. బాధితురాలి తల్లి తెలిపిన వివరాల ప్రకారం మైనర్ బాలికపై యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ గత డిసెంబరులో చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆ ఫిర్యాదుపై సుమారు ఎనిమిది నెలల పాటు ఎలాంటి కేసు నమోదు చేయలేదని ఆరోపించారు. అనంతరం కేసు నమోదు చేసిన పోలీసులు, సంఘటన జరిగిన ప్రాంతం తమ పరిధిలోకి రాదని గుర్తించి కుషాయిగూడ పోలీసులకు బదిలీ చేసినట్లు సమాచారం. సంబంధిత ప్రాంతం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుందని గుర్తించినప్పటికీ కేసును సకాలంలో బదిలీ చేయకపోవడం వల్ల బాధితురాలికి న్యాయం ఆలస్యమైందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చివరకు ఆగస్టు 16న కేసును కుషాయిగూడ పోలీసులకు బదిలీ చేయగా, వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు అభిషేక్ (24) అనే యువకుడిపై మైనర్ బాలికపై బలవంతంగా లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి.

బాలిక గర్భం దాల్చిన నేపథ్యంలో ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలి పారు. నిందితుడిపై చట్టప్రకారం చర్యలు తీసు కుంటామని పేర్కొన్నారు. బాధితురాలు మైనర్ కావడంతో ఆమె వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## మహిమల పేరిట మోసం
## టాస్క్‌ఫోర్స్‌కు పట్టుబడ్డ ఆరుగురు నేరగాళ్లు



మహిమ గల పంచలోహ విగ్రహం, అరుదైన గులాబి రాయి పేరిట అమాయకులను మోసం చేస్తూ పట్టుబడ్డ నేరగాళ్లు

**హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** మహిమలు గల లక్ష్మీదేవి పంచలోహ విగ్రహంతో పాటు అరుదైన గులాబి రాయి వుందని, వీటివల్ల ఇంట్లో దివ్యశక్తులు వచ్చి సంపదలు సమకూరుతాయని అమాయకులను నమ్మిస్తూ నకిలీ వస్తువులను అమ్మేందుకు యత్నించిన ఆరుగురు నేరగా ళ్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారి వద్ద నుంచి ఇత్తడి లక్ష్మీదేవి విగ్రహంతో పాటు గులాబి రంగు కలిగిన రా యి సహా మరికొన్ని వస్తువులను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ డిసిపి వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ ఆదివారం మీ డియాకు వెల్లడించారు. శివార్లలోని లక్ష్మీగూడకు చెందిన నరసింహా (45) ఓ కారు డ్రైవర్. 2024లో వేములవాడలో రవి, బిక్షపతిల వద్ద ఇత ను పది లక్షల రూపాయలు చెల్లించి నకిలీ పంచలోహ విగ్రహం కొని మోసపోయాడు. దీని తరువాత తాను పోగొట్టుకున్న డబ్బులను ఎలా సంపాదించాలో తెలియక తన స్నేహితులైన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట్‌కు చెందిన కేతావత్ రాజు అలియాస్ కట్టప్ప (38), (ఇతను మై లార్‌దేవుపల్లిలో వుంటున్నాడు), కాటేదాన్‌కు చెందిన వడత్య కుమార్ (34), ప్రవీణ్ సింగ్ (34), బసవ నరేష్ (38), చల్లా రవి (38) (ఇతను జ్యోతిష్యుడు)లతో కలిసి ఒక ముఠాను ఏర్పాటుచేశాడు. వీరితో కలిసి గతంలో తాను కొన్న నకిలీ పంచలోహ విగ్రహంతో పాటు నకిలీ గులాబిరాయిని ఎవరైనా అమాయకుడికి అంటగట్టి తన నష్టాన్ని భర్తీ చేసుకోవాలని, మరికొంత సంపాదించాలని నరసింహా పథకం రచించాడు. ఇం దులో భాగంగా శనివారం రాత్రి ఆరుగురు కలిసి లక్ష్మీగూడ వద్ద ఒక చోట ఇత్తడి లక్ష్మీదేవి పంచలోహ విగ్రహంతో పాటు నకిలీ గులాబి రంగు రాయితో ఒక వ్యక్తి కోసం వేచి వున్నారు. కాగా వీరి గురించి సమాచారం వున్న జూబ్లీహిల్స్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఒక్కసారిగా దాడిచేసి ఆరు గురిని పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి ఇత్తడి లక్ష్మీదేవి విగ్రహంతో పాటు నకిలీ గులాబి రంగురాయితో పాటు ఒక కారు, ఐదు సెల్‌ఫోన్లు. మూడురసాయనాల ద్రావకాల బాటిళ్లు జప్తు చేశారు. పట్టుబడ్డ నిందితులను తదుపరి విచారణ నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించారు.

## నేను గర్వపడే దీమాగీ నక్సల్‌ను..
## కేంద్రమాజీ మంత్రి చిదంబరం పోస్టు



**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన దిమాగీ నక్సలిజం అంటే మేధోపరమైన నక్సలిజం వ్యాఖ్యలపై రాజకీయ దుమారం చెలరేగింది. ప్రధాని వ్యాఖ్యలకు కౌంటర్‌గా, తాను గర్వపడే దిమాగీ నక్సల్ అని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం ప్రకటించారు. ప్రధాని చేసిన వ్యాఖ్యల అనంతరం ఆదివారం ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "నేను గర్వపడే దిమాగీ నక్సల్‌ను!" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై నుంచి జాతినుద్దేశించి ప్రసంగించిన ప్రధాని మోడీ, దేశంలో సాయుధ నక్సలిజాన్ని బలహీనపరచడంలో గణనీయమైన పురోగతి సాధించామని తెలిపారు. అయితే, దిమాగీ నక్సలిజం రూపంలో ఒక కొత్త సవాల్ పొంచి ఉందని హెచ్చరించారు. "అడవుల్లో సాయుధ నక్సల్స్‌ను మనం వదిలించుకున్నాం. కానీ హింస, అశాంతిని సృష్టించడానికి దిమాగీ నక్సల్స్ అవకాశాల కోసం చూస్తున్నారు. వారు సమాజాన్ని తప్పుదోవ పట్టించాలనుకుంటున్నారు. ఈ దిమాగీ నక్సల్స్‌ను గుర్తించి, వారిని ఏకాకులను చేయాలి. యువతను ప్రధాన స్రవంతిలోకి తీసు కురావాలి" అని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. ప్రధాని వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. రాజకీయ ప్రత్యర్థులపై ప్రధాని మోదీ రెచ్చగొట్టే పదజాలాన్ని వాడుతున్నారని, ఇది ఆయనలోని రాజకీయ నిస్పృహను ప్రతిబింబిస్తోందని ఆరోపించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా ప్రధాని వ్యాఖ్యలను తప్పుబట్టారు. గతంలో ఆయన ఉపయోగించిన అర్బన్ నక్సల్స్ పదాన్ని గుర్తుచేశారు. మొదట ఆయన తన ప్రత్యర్థులను అర్బన్ నక్సల్స్ అన్నారు. ఇప్పుడు దిమాగీ నక్సల్స్ అంటున్నారు. ఇది ఆయన నిరాశకు స్పష్టమైన సంకేతం" అని జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అంతేకాకుండా, అర్బన్ నక్సల్స్ లేదా దిమాగీ నక్సల్స్ అని ముద్ర వేసిన వారు డిమాండ్ చేసిన అనేక అంశాలను చివరికి ప్రధాని మోడీయే అమలు చేస్తుంటారని ఆయన ఆరోపించారు.

## శ్రావణ మాసంతో తగ్గిన చికెన్ ధరలు

**హైదరాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** శ్రావణ మాసం రాకతో చాలామంది నాన్ వెజ్ వంటకాలకు దూరంగా ఉంటున్నారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో చికెన్, కోడి గుడ్లకు డిమాండ్ భారీగా తగ్గిపోయింది. ఫలితంగా వీటి ధరలు రూ.100కు పడిపోయింది. గత నెలలో కిలో చికెన్ రూ.350 వరకు చేరుకోగా, ఒక్కో గుడ్డు ధర రూ.9 వరకు చేరుకుంది. కానీ ఇప్పుడు చికెన్‌తో పాటు గుడ్ల ధరలు కూడా పడిపోయాయి. గత కొద్ది రోజులలో ఈ రెండింటి ధరలు భారీగా పతనమయ్యాయి. గత నెలలో కిలో చికెన్ ధర రూ.340కి చేరుకోగా, ఇప్పుడు రూ.240 పలుకుతుంది. కొద్ది రోజుల్లోనే రూ.100 మేర పడిపోయింది. ఆదివారం హైదరాబాద్‌లో కిలో స్కిన్ లెస్ చికెన్ రూ.222 పలుకుతుండగా, డ్రస్స్‌డ్ చికెన్ రూ.197కి చేరుకుంది. ఇక రిటైల్ లైవ్ బర్డ్ రూ.127గా ఉండగా, ఎక్స్ ఫారం లైవ్ బర్డ్ రూ.100 వద్ద కొనసాగుతోంది. ఇక వరంగల్ డివిజన్‌లో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. ప్రాంతాలను బట్టి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చికెన్ ధరల్లో స్వల్ప మార్పులు ఉంటాయి. స్థానిక ఫామ్స్, రవాణా ఖర్చుల ఆధారంగా ధరల్లో మార్పులు ఉంటాయి.

## ఆరావళిలో హంగామా చేసిన మోడల్ అంతరా బెనర్జీ అరెస్టు

**ముంబై, ఆగస్టు 16:** ఆరావళి ఎక్స్‌ప్రెస్‌లో రైల్వే అధికారులపై బ్లేడుతో దాడికి పాల్పడిన కేసులో మోడల్, వెబ్‌సిరీస్ నటి అంతరా బెనర్జీ (31)ని పోలీసులు అరెస్టు చేశారు. ఏసీ కోచ్‌లో సీటు విషయంలో తలెత్తిన వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. దీంతో ఆమె రైల్వే అధికారులు, ఆర్‌పీఎఫ్ సిబ్బందిపై దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఓ అధికారి సహా అంతరాకు గాయాలయ్యాయి. ఆమెను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం నోటీసులు ఇచ్చి బెయిల్‌పై విడుదల చేశారు. అంతరా బెనర్జీ షూటింగ్ నిమిత్తం సూరత్‌కు వెళ్లేందుకు ఈ నెల 12 రాత్రి 9:30 గంటలకు బోరివాలిలో ఆరావళి ఎక్స్‌ప్రెస్ ఎక్కింది. ఆమె వద్ద స్లీపర్‌క్లాస్ టికెట్ ఉండగా రిజర్వ్‌డ్ ఏసీ కోచ్‌లోకి ప్రవేశించింది. ఆమె సీటులో కూర్చొని ఉండగా కాసేపటికి ఓ ప్రయాణికుడు వచ్చాడు. అది తాను రిజర్వ్ చేసిన సీటని, లేచి వెళ్లిపోవాలని కోరాడు. అందుకు ఆమె నిరాకరించడంతో సదరు ప్రయాణికుడు టికెట్ కలెక్టర్ హారికేష్ త్రిపాఠి, ఆర్‌పీఎఫ్‌కు సమాచారం అందించాడు. దీంతో కానిస్టేబుల్ రాజేశ్ కుమార్, ఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ యమినికాంత్ మిశ్రా వారి వద్దకు చేరుకున్నారు. సీటును ఖాళీ చేయాలని వారిద్దరూ అంతరాను కోరారు. అందుకు ఆమె నిరాకరిస్తూ అధికారులను దూషించింది. ఆ తర్వాత అంతరా తన బట్టలు విప్పేసి బ్లేడుతో దాడికి పాల్పడింది. ఈ ఘటనలో మిశ్రాతో పాటు అంతరాకు గాయాలయ్యాయి. పరిస్థితి అదుపు తప్పడంతో ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఏసీ కోచ్ తలుపులను మూసేశారు. దీంతో ఆమె తప్పించుకోవడానికి కోచ్ అద్దాలను పగలగొట్టేందుకు ప్రయత్నించింది. దాదాపు గంటపాటు ఆమె హంగామా చేయడంతో తోటి ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. అనంతరం అంతరాను దహను రైల్వే స్టేషన్‌లో అధికారులు దించేశారు. మరుసటి రోజు ఉదయం అంతరాను బోరివాలి రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులకు ఫోన్ చేయాలని వారు కోరగా ఆమె నిరాకరించింది. తనపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. దీంతో అంతరాపై కేసు నమోదు చేసిన పోలీసులు.. అనంతరం నోటీసులు ఇచ్చి బెయిల్‌పై విడుదల చేశారు. ఏసీ కోచ్ టికెట్ దొరక్కపోవడంతో అంతరా బెనర్జీ తీవ్ర మనోవేదనకు గురైందని పోలీసులు పేర్కొన్నారు.

## తవ్వకాల్లో బయటపడ్డ రూ.98కోట్ల బంగారు బిస్కెట్లు





**బ్రస్సెల్స్, ఆగస్టు 16:** భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనుల కోసం తవ్వకాలు జరుపుతుండగా ఊహించని విధంగా భారీ మొత్తంలో బంగారు బిస్కెట్లు, అరుదైన నాణేలు బయటపడ్డాయి. వీటి విలువ దాదాపు 9 మిలియన్ యూరోలు అంటే భారత కరెన్సీల్లో రూ.98 కోట్లు ఉంటాయని అంచనా. ఈ ఘటన బెల్జియం రాజధాని బ్రెస్సెల్స్‌కు సమీపంలోని సింటిగిల్లిస్‌డెండర్‌మొండె ప్రాంతంలో వెలుగుచూసింది. సమ్మర్ జాబ్ చేస్తోన్న కోబే అనే 18 ఏళ్ల యువకుడు ఈ నిధిని మొదటిసారి గుర్తించాడు. మాకు ఒక్కసారిగా కింద ఏదో మెరుస్తున్నట్టు కనిపించింది దానిని మేము యూరో నాణేలు అనుకున్నాం కానీ, తవ్వుతుంటే బంగారం బిస్కెట్లు బయటపడ్డాయి మేము అనుకున్న దానికంటే అక్కడ పెద్ద నిధి ఉందని తర్వాత అర్థమైందని తెలిపాడు. తన సహచర కార్మికులతో కలిసి పనులు చేస్తున్న సమయంలో నిధి బయటపడింది. 19వ శతాబ్దం చివరలో మద్యం తయారీ కేంద్రం యజమాని థియోఫిలస్ వాన్ అస్చే కోసం నిర్మించిన విల్లా కింద ఇటుకలతో కట్టిన గోడలోపల భద్రపరిచిన ఒక బ్యాగులో ఈ నిధిని దాచారు. ఈ నిధిలో బంగారు నాణేలు, బంగారు ముక్కలు, నెంబర్లు వేసిన కడ్డీలు ఉన్నాయి. ఈ నిధిని కావాలనే ఎవరైనా దాచిపెట్టినట్లు కనిపిస్తోందని అతడు అభిప్రాయపడ్డాడు. నిధి బయటపడిన ప్రదేశంలో 1899లో ప్రారంభమైన బీరు తయారీ కేంద్రం 1970 వరకు నడించింది. ఇప్పటికీ భవనం ఇనుప గేట్లపై అక్షరాలు కనిపిస్తాయి. ప్రస్తుతం సిఏడబ్ల్యు ఓస్ట్‌వ్లాండరెన్ అనే సామాజిక సంస్థ దీనిని కొత్త కార్యాలయాలు, నివాసాలను ఏర్పాటు చేయడానికి పునరుద్ధరిస్తోంది. బ్రూవర్స్ హౌస్ ఒక అందమైన భవనం, కానీ దానిని పూర్తిగా కూల్చివేస్తున్నారు. చివరికి, కేవలం గోడలు మాత్రమే మిగిలి ఉంటాయి అని సంస్థ గీర్ట్ హిల్లార్ట్ చెప్పారు. అధికారులు వెంటనే ఆ ప్రదేశాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని, నిధిని బ్రస్సెల్స్‌లోని ఒక సురక్షిత కేంద్రానికి తరలించారు. చట్టబద్ధమైన యాజమాన్యాన్ని నిర్ధారించడానికి అధికారులు దాని మూలాలపై దర్యాప్తు చేస్తున్నారు. తూర్పు ఫ్లాండర్స్ ప్రాసిక్యూటర్ కార్యాలయానికి చెందిన హన్నే ఒల్లెవియర్ మాట్లాడుతూ ఆ బంగారం దొంగిలించింది కాదని లేదా నేరంతో సంబంధం లేదని దర్యాప్తు అధికారులు ముందుగా ధ్రువీకరించుకోవాలని అన్నారు.

అయితే, ముమ్మందు ఇది సంక్లిష్టమైన వివాదానికి దారితీయవచ్చని ఆమె హెచ్చరించారు. భవన నిర్మాణ కాంట్రాక్టర్లు, సంక్షేమ సంస్థ, వాన్ అస్చే కుటుంబ ఈ నిధిపై హక్కులు కోరే అవకాశం ఉంది. బెల్జియన్ చట్టం ప్రకారం నిధిని కనుగొన్నవారు దాని అసలైన యజమానులు ముందుకు వచ్చే వరకు కనీసం ఐదేళ్లు వేచి ఉండాలి. ఇక కార్మికుల విషయానికొస్తే ఇంత పెద్ద నిధిని అప్పగిం చాల్సిందేనని తమకు తెలుసని కోబ్ అంగీకరిం చారు. అవి కొన్ని నాణేలు మాత్రమే అయితే పరిస్థితి వేరేలా ఉండేది కానీ బహుశా చివరికి మాకు ఏదో ఒకరకమైన బహుమతి లభిస్తుందేమో అని అతడు ఆశాభావం వ్యక్తం చేశాడు.

## పొంగి పొర్లుతున్న వారణాసి గంగానది

### బోట్ సర్వీసులు నిలిపివేయాలని ఆదేశాలు



**లక్నో, ఆగస్టు 16:** యూపీ, వారణాసి పరిధిలోని గంగానదిలో నీటి ప్రవాహం భారీగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో నదిలో బోటు సర్వీసుల్ని రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. భారీ నీటి ప్రవాహాన్ని, సందర్శకుల క్షేమాన్ని, భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు వాటర్ పోలీస్ ఉన్నతాధికారులు ఏసీపీ దశాశ్వమేధ, డా.అతుల్ అంజాన్ త్రిపాఠిలు ప్రకటన జారీ చేశారు. బోటు నిర్వాహకులకు దీనిపై తగిన సూచనలు చేశారు. బోటు సేవల్ని నిలిపివేయడంపై అధికారులు మీడియాకు వివరించారు. ముందురోజు ఉదయానికి గంగానదిలో 64.70 మీటర్ల నీళ్లున్నాయి. ఈ నీళ్లు గంటలకు 6 సెంటీమీటర్ల మేర పెరుగుతున్నాయి. ఇది ప్రమాదకరమైన లోతు. నీటి ప్రవాహం కూడా ఎక్కువగానే ఉంది. వర్షాల కారణంగా నీటి ప్రవాహం పెరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో బోట్లు నడపడం అంత శ్రేయస్కరం కాదు. అందుకే బోటు సర్వీసుల్ని వెంటనే నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. అందరు బోటు ఆపరేటర్లకు కూడా ఈ అంశంపై ఆదేశాలు జారీ చేశారు. సందర్శకులు కూడా నీటి లోపలికి వెళ్లకూడదని సూచించారు. అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో అధికారులు అక్కడి నీటి ప్రవాహాన్ని నిరంతరం గమనిస్తున్నారు. సందర్శకుల రక్షణ కోసం తగిన సూచనలు చేస్తున్నారు. వారి క్షేమమే తమ మొదటి కర్తవ్యమని అధికారులు వివరించారు. బోటు నిర్వాహకులు తమ ఆదేశాల్ని కచ్చితంగా పాటించాలని కోరారు. తదుపరి ఆదేశాలు ఇచ్చేంత వరకు ఈ నిర్ణయం అమలవుతుందన్నారు. మరోవైపు బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి కారణంగా ఒడిశా సహా అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ఐఎండీ తెలిపింది. ఒడిశాకు ఏకంగా రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఒడిశాతోపాటు ఏపీలోని ఉత్తర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈనెల 16నుంచి 18 వరకు వర్షాలు పడతాయని తెలిపింది.

## వైభవంగా వరుణ యాగాలకు పూర్ణాహుతులు

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 16, ప్రభాతవార్త :** సకల లోక కళ్యాణార్ధం దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న వరుణ యాగాలకు ఆదివారం పూర్ణాహుతులతో స్వస్తి వచనాలు పలికారు. ఆగస్టు 14 నుండి అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన త్రయాహ్నిక "వరుణ యాగములు, వరుణ జపములకుమహా పూర్ణాహుతి నిర్వహించారు. ఈ వరుణ యాగా ముగింపు ఉత్సవాలలో ఆలయ వేదపాఠశాల విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

**నిత్యన్నదాన పథకానికి విరాళం:** కనకదుర్గమ్మ అమ్మవారి నిత్యఅన్నదాన విభాగానికి సత్తెనపల్లికి చెందిన దేవిశెట్టి నాగేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులు మరియు కుటుంబ సభ్యులు ఆదివారం రూ. 1,00,116లు విరాళ మందించారు. విశాఖపట్నంకు చెందిన ఎస్. చక్రన్ శ్రీ షణ్ముఖ్ మరియువారి కుటుంబ సభ్యులు రూ.1,25,000లు ఆలయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కిషోర్ కుమార్‌కు విరాళంగ అందించారు. విజయవాడకు చెందిన డివిఎస్ సాయిరాం మరియు వారి కుటుంబ సభ్యులు రూ.1,00,000లు విరాళమందించారు. విజయవాడకు చెందిన పి.రామయ్ లావణ్యదంపతులు రూ.1,00,000లు విరాళంగా సమర్పించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. ఆలయ ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు ఆదివారం పోరంకిలోని దేవస్థానం వేద పాఠశాల, గోశాలను సందర్శించారు.

కొమరవోలులో వైభవంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ప్రతిష్ఠా మహోత్సవాలుఆలయ శిఖర కుంభాభిషేకం జరిగింది. ఈ సందర్భంగా దాత కాట్రగడ్డ రమేష్ దంపతులను దుర్గమ్మవారి ఆలయ ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు ఘనంగా సత్కరించారు.



**దుర్గమ్మవారి సేవలో ప్రముఖులు :** తెలుగు చిత్ర కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్, కొణిదెల నిహారిక శ్రీ అమ్మవారి దర్శనము చేసుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించారు.

ఎపి డిజిపి దంపతులకు దుర్గమ్మవారి ప్రసాదమందిస్తున్న దృశ్యం

**దుర్గమ్మవారి సేవలో ఏపి డిజిపి:**
దుర్గమ్మవారిని రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఇఓ వి.కె. సీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు అమ్మవారి శేషవస్త్రం, పవిత్ర లడ్డు ప్రసాదం మరియు అమ్మవారి చిత్రపటం జ్ఞాపికను బహూకరించారు. సాంప్రదాయ ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.

17skl13:17skl13.qxd 16-08-2026 23:13 Page 1



# శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



సంతబొమ్మాళి, ఆగస్టు 16, ప్రభాతవార్త :

మండల కేంద్రం సంతబొమ్మాళిలో వెలసిన శ్రీ సూర్య నారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పురోహితులు ఆలయం పూజారి సుసరాపు శ్రీకాంత్ శర్మ (గున్నుబాబు) ఆధ్వర్యంలో సూర్యనమస్కారాలు, సూర్యహోమం జరిపించారు. ఆలయం ప్రతిష్ట మహోత్సవం అనంతరం నిత్య పూజలు జరుగుతున్నప్పటికీ ప్రతి ఆదివారం సూర్య హోమం, నమస్కారాలు దినేష్ శర్మతో జరిపించారు. ఈ ఆలయంలో ప్రతి ఆదివారం ఉదయం 9 గంటలకు ఈ ప్రత్యేక పూజలు, సూర్య నమస్కారాలు, హోమం కార్యక్రమం నిర్వహిస్తామని కమిటీ ప్రతినిధులు పప్పు రాజు తెలిపారు. అలాగే ప్రతి ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి 5గంటల వరకు హనుమాన్ చాలీసా పారాయణం, యోగా కార్యక్రమం పాఠశాల విద్యార్థులతో నిర్వహిస్తున్నమ్మన్నారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొని ఆరోగ్య ప్రదాత అయిన స్వామి వారి ఆశీస్సులు పొందాలన్నారు.



# సర్దార్ గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం

## - మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, ఆగస్టు 16, ప్రభాతవార్త :

బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న అని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కొనియాడారు. సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పిస్తున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.స్వాతంత్ర్య సమరయోధుడిగా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడటంతో పాటు, భారత రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన మహనీయుడు సర్దార్ గౌతు లచ్చన్న అని మంత్రి పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాలు, రైతులు, కార్మికుల ప్రగతి, సంక్షేమం కోసం ఆయన సాగించిన ఉద్యమాలు చిరస్మరణీయమన్నారు. బీసీల అభ్యున్నతి, సామాజిక న్యాయం కోసం సర్దార్ గౌతు లచ్చన్న చేసిన కృషి మరువలేనిదని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన మహనీయుడిగా ఆయన చేసిన సేవలు ఈ ప్రాంత ప్రజలకు గర్వకారణమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, బడుగు వర్గాల హక్కుల సాధన కోసం జీవితాంతం పోరాడిన లచ్చన్న ఆశయాలను నేటితరం నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి సూచించారు.సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన సర్దార్ గౌతు లచ్చన్న సేవలు, పోరాట స్ఫూర్తి ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు

# గీత కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి

## విశ్రాంత జిల్లా జడ్జి దూగాన చిరంజీవులు

## చైతన్య దీపిక ఆధ్వర్యంలో గీత కార్మికులకు ఘన సన్మానం




సోంపేట, ఆగస్టు 16, ప్రభాతవార్త :

తరతరాలుగా గీత వృత్తిని నమ్ముకుని కుటుంబాలను నెట్టుకు వస్తున్న గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని విశ్రాంత జిల్లా జడ్జి దూగాన చిరంజీవులు పేర్కొన్నారు. స్థానిక శ్రీశయన చైతన్య దీపిక ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న 118వ జయంతి సందర్భంగా ఆదివారం సోంపేటలో 31 మంది గీత కార్మికు లను ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా విశ్రాంత జడ్జి చిరంజీవులు, విశిష్ట అతిథిగా ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎస్.రాజేంద్ర ప్రసాద్ హాజరై గీత కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా చిరంజీవులు మాట్లాడుతూ సూర్యోదయం మొదలుకొని సూర్యాస్తమయం వరకు ఈత చెట్లు పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న కష్టజీవుల పట్ల ప్రభుత్వాలు కనికరం చూపాలని అన్నారు. ఈ వృత్తిలో ఎన్నో వ్యయప్రయాసలు ఉన్నాయని వాటిని అధ్యయనం చేసి వారు పడుతున్న వేదన పట్ల కరుణ చూపుతూ వారి సంక్షేమానికి, శ్రేయస్సుకు తగు విధమైన ప్రోత్సాహకాలు అందజేయాలని కోరారు. స్వాతంత్ర ఉద్యమంలో ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి సర్దార్ గౌతు లచ్చన్న సమరయోధుడిగా పోషించిన పాత్ర అమోఘమన్నారు. ఇచ్చాపురం నుంచి మందస వరకు వివిధ గ్రామాల నుంచి ప్రస్తుతం గీత వృత్తి నిర్వహిస్తున్న సీనియర్ కార్మికులను ఆహ్వానించి 31 మందిని ఘనంగా సన్మానించింది. సన్మాన గ్రహీతలకు దుశ్శాలువ కప్పి బహుమతులు అందజేశారు. దేవాడ మోహనరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దుద్ది వీరరాజు, ఉపాధ్యక్షులు బీన ఆనందరావు, పొడుగు కామేష్, దుద్ది శ్రీనివాస్, బల్ల జానకిరావు, బంజు లోకనాథం, జాక కేశవరావు, దూగాన లోకనాథం, బల్ల బాబురావు, ఆణింగి గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.



# బోన్‌మారో బాధితుడిని పరామర్శించిన దాసరి రాజు

కంచిలి, ఆగస్టు 16, ప్రభాతవార్త :

కంచిలి మండలం బూరగాం గ్రామానికి చెందిన దూపాన మాధవరావు గత 5 నెలలుగా బోను మారోతో బాధపడుతూ ప్రస్తుతం ఇచ్చాపురం హాస్పిటల్‌లో వున్న అతనికి ఇచ్చాపురం జనసేన ఇన్‌చార్జ్ మరియు యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు మరియు కంచిలి మండలం ఐటీడీపి అధ్యక్షులు వాసాల రమేష్ రెడ్డి కలిసి ఆదివారం హాస్పిటల్‌కు వెళ్లి ధైర్యం చెప్పి తొందరగా కోలుకుంటావు, భగవంతుడు మనుషుల రూపంలో ఆదుకుంటున్నారు, ధైర్యంగా ఉండాలని, ఏమి కాదని చెప్పి ఓదార్చి రావడం జరిగింది.

# కొత్తమ్మతల్లికి వెండి వడ్డానం వితరణ



కోటబొమ్మాళి, ఆగస్టు 16, ప్రభాతవార్త :

స్థానిక శ్రీ కొత్తమ్మతల్లికి విశాఖపట్నంకు చెందిన గేదెల చిన్నా దంపతులు ఆదివారం 331 గ్రాముల (రూ.1. 36. 900) విలువ కలిగిన వెండి వడ్డానంను కానుకగా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోరాడ గోవిందరావుకు అమ్మ వారి సన్నిదిలో అందజేశారు. చిన్నా దంపతులకు ఆలయ సంప్రదాయం ప్రకారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదం అందజేశారు.

# అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం జీవితాంతం పోరాడిన వ్యక్తి లచ్చన్న



కోటబొమ్మాళి, ఆగస్టు 16, ప్రభాతవార్త :

అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం జీవితాంతం అలుపెరగని పోరాటం చేసిన గొప్ప వ్యక్తి సర్థార్ గౌతు లచ్చన్న అని స్థానిక శ్రీశయన సంఘం శాశ్వత అధ్యక్షులు, కోటబొమ్మాళి మాజీ సర్పంచ్ లొట్టి రామారావు అన్నారు. ఆదివారం గౌతు లచ్చన్న 117వ జయంతి సందర్భంగా శ్రీశయన కుల కుటుంబసభ్యులు, సంఘం నాయకులతో కలిసి ఆయన లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లచ్చన్న ఆశయసాధన కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు లింగుబారి సంపత్, దాసరి నాగ, ఇర్రి ఆదినారాయణ, దాసరి మోహన్, గేదెల పాపారావు, గణపతి, పిత చిన్నారావు, ఇర్రి చిరంజీవి, లొట్టి లక్ష్మణ్ గంగరాజు, శ్రీను, లింగుబారి సందీప్, రవి , తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలకు గాను ప్రశంసా పత్రం



కోటబొమ్మాళి, ఆగస్టు 16, ప్రభాతవార్త:

మండలంలోని కస్తూరిపాడు జూనియర్ లైన్ మ్యాన్‌గా పని చేస్తున్న తోట గోపాలంకు తన సేవలకు గాను ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏ.పీ.ఈపి.డి.సి.యెల్) కంపెనీ స్థాయిలో సిఎండి పృథ్వీతేజ్ చేతుల మీదుగా శనివా రం విశాఖపట్నంలో ఈ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. గోపాలంకు సహచర ఉద్యోగులు, ఉన్నతాధికారులు అభినందించారు.

# నష్టపరిహారాల్లో ద్వంద్వనీతి తప్పు

## వైసీపి జిల్లా బూత్ కమిటీల వింగ్ ప్రధాన కార్యదర్శి మార్పు వెంకటరమణ

ప్రభాత వార్త, పలాస (మందస )



ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలపక్షపాత ధోరణి, కక్ష పూరిత రాజకీయాలను మేధావులు, ప్రజాస్వా మ్య వాదులు ఖండించాలని శ్రీకాకుళం జిల్లా వైసీపి బూత్ కమిటీల వింగ్ ప్రధాన కార్యదర్శి మార్పు వెంకటరమణ కోరారు. ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన దానయ్య కుటుంబానికి టిడిపి 10 లక్షల (శనివారం రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అందజేసిన ఐదు లక్షలతో పాటు) ఆర్థిక సహాయాన్ని ఆహ్వానిస్తున్నామని, ఈ మంచి పనికి అభినందనలు కూడా తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న ప్రమాద బాధితులందరికీ వారి ఆర్థిక పరిస్థితులు బట్టి ఆర్థిక సహకారం అందిస్తారా? లేదా ప్రమాదం చేసిన వారి స్థాయి అంటే ప్రతిపక్ష పార్టీ, వైఎస్ఆర్సిపి నాయకులు ద్వారా ప్రమాదాల జరిగితే ఈ ఆర్థిక సహాయం అందిస్తారా? అంటూ ప్రశ్నించారు .

# నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

## జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడి



శ్రీకాకుళం, ఆగస్టు 16, ప్రభాతవార్త :

నేడు (సోమవారం) ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించబడుతుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నేరుగా పై కార్యక్రమంలో లేదా మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీ దారుల అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. రెవెన్యూ క్లినిక్ ఉంటుందని తెలిపారు. అర్జీదారులు గమనించి నేడు నిర్వహించే ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అంతర్జాతీయ తైక్వాండో పోటీల్లో శ్రీకాకుళం ప్రతిభ



## పతకాలు సాధించిన తల్లి, తనయుడు!

శ్రీకాకుళం, ఆగస్టు 16, ప్రభాతవార్త :

వియత్నాంలో నిర్వ హించిన ఓపెన్ ఇంటర్నేషనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించిన రిమ్స్ ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శిరీష, ఆమె తనయుడు కారే మోక్షిత్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. 42 ఏళ్ల వయస్సు కేటగిరీ పూమ్ షి విభాగంలో డాక్టర్ శిరీష స్వర్ణ పతకం సాధించగా, క్యాడెట్ విభాగంలో ఆమె కుమారుడు కారే మోక్షిత్ రజత పతకం కైవసం చేసుకున్నారు. వీరిద్దరికీ కొమర మోహనకృష్ణ శిక్షకుడిగా వ్యవహరించారు. రెండవ తైక్వాండో సూంగ్ రీ ఛాంపియన్షిప్ ఈ ఏడాది జులై 31 నుంచి ఆగష్టు 2వరకు జరిగాయి. ఒకే కుటుంబానికి చెందిన తల్లి, తనయుడు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి జిల్లా కీర్తిని దశదిశలా చాటడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయానికి గుర్తుగా శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన అభినందన సభలో విజేతలను ఘనంగా సన్మానించారు. విజేతలు డాక్టర్ శిరీష, కారే మోక్షిత్, కోచ్ కొమర మోహనకృష్ణలను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావు, ప్రముఖ గ్యాస్ట్రాలజిస్ట్ డాక్టర్ గొండు గంగాధర్, గైనకాలజిస్ట్ డాక్టర్ హరిత, రిమ్స్ ఆసుపత్రి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కారే సంజీవకుమార్ పాల్గొన్నారు. అలాగే జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ససాపు జోగినాయుడు, స్టార్ వాకర్స్ క్లబ్ నుంచి గేదెల ఇందిరా ప్రసాద్, ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు హారిక ప్రసాద్, రాజేష్, వాకర్స్ క్లబ్ సభ్యులు, రెడ్డి సాయిరాం, తామాడ లోకేష్, శిక్షకులు లక్ష్మణ, కొమర్ మోహనకృష్ణ తదితరులు హాజరై విజేతలకు అభినందనలు తెలిపారు.

# శ్రీసూర్యనారాయణ స్వామిని దర్శించుకున్న యాక్టర్ ఈశ్వరీరావు

శ్రీకాకుళం, ఆగస్టు 16, ప్రభాతవార్త



ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని ఆదివారం ఉదయం టాలీవుడ్ ఇండియన్ ఫిలిం యాక్టర్ ఈశ్వరీరావు దేవాలయంనకు విచ్చేసి శ్రీస్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ ఘనంగా స్వాగతం పలికారు. తదుపరి ఆలయ అర్చకులు, వేద పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. శ్రీ స్వామి వారి ప్రసాదాలను, చిత్రపటం అందజేశారు.

# మతిస్థిమితం లేని వృద్ధురాలను చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు



రాజాం, ఆగస్టు 16, ప్రభాతవార్త :

రాజాం మండలం ఇల్లంనాయుదువలస గ్రామానికి చెందిన బెవర అనురాధ (70) అనే వృద్ధురాలు మతిస్థిమితం లేక గత రెండు రోజులు క్రితం పొలంకి వెళ్లాలని చెప్పి ఇంటి నుండి బయలుదేరి వెళ్ళిపోయింది. ఆ తర్వాత ఆచూకీ లేకపోవడంతో తన కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ డి.నవీన్ కుమార్ ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు దర్యాప్తు చేపట్టారు. పట్టణంలో ఉన్న సీసీ కెమెరాలు పుటేజీలు ఆధారంతో ఆమె ఆచూకీని గుర్తించి చాకచక్యంగా విజయ నగరంలో ఉందని గమనించి పట్టుకున్నారు. ఆమెను రాజాం పోలీస్ స్టేషన్‌కు తీసుకొని వచ్చి బంధువులకు అప్పగించారు. ఈ విధంగా తప్పిపోయిన ఆమెను అప్పగించి నందుకు గాను కుటుంబ సభ్యులు పోలీసులు తీరుపై అభినందనలు కురిపిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ పాఠశాలలకు కేఎంఆర్ ఆర్థిక సాయం అమోఘనీయం

## -భోజనాల షెడ్డు కోసం పురుషోత్తపురం పాఠశాలకు రూ.2 లక్షలు విరాళం

కంచిలి, ఆగస్టు 16, ప్రభాతవార్త :



సామంత రామచంద్రపురం గ్రామానికి చెందిన వ్యాపారవేత్త కిల్లంశెట్టి మోహన్ రావు, ఉషారాణి దంపతులు ప్రభుత్వ పాఠశాలకు మౌలిక వసతుల కోసం అందిస్తున్న ఆర్థిక సహాయం అమోఘనీయమని పలువురు పేర్కొన్నారు. పురుషోత్తపురంలో గల మోడల్ పాఠశాలలో ఉపాధ్యాయుడు నల్లన రవికుమార్ విద్యార్థుల కోసం వంట షెడ్ నిర్మించమని కోరడంతో వెంటనే స్పందించి వంట షెడ్ నిర్మాణం కోసం రెండు లక్షల రూపాయలు అందించి వెంటనే షెడ్ పూర్తి చేయడంతో గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు. అలాగే మోహన్‌రావు దంపతులకు దుశ్శాలువ, పూలమాలతో పలువురు సన్మాన కార్యక్రమం చేపట్టారు. వైకాపా నాయకుడు ఇప్పిలి కృష్ణారావు, ఎంఈఓ2 చిట్టిబాబులు మాట్లాడుతూ సామంత రామచంద్రపురం, పురుషోత్తపురం గ్రామాల్లో గల పాఠశాలకు కిల్లంశెట్టి మోహన్‌రావు, ఉషారాణి దంపతులు పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు కోసం చేస్తున్న కృషి ఎంతో గొప్ప విషయం అని పేర్కొన్నారు. పైల మన్మధరావు, వంకల ఉమాపతి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పీజీఆరఎస్‌కు అధికారులు హాజరు కావాలి

## ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్

సీతంపేట, ఆగస్టు 16, ప్రభాతవార్త:

సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆరఎస్ కార్యక్రమం ఇకపై ఉదయం 9 గంటలకే ప్రారంభమవుతుందని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పవార్ స్వప్నిల్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆరఎస్ కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా ఉదయం 9 గంటలలోపు హాజరు కావాలని పీవో స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యలు, అభ్యర్థనలు, ఫిర్యాదులతో కార్యక్రమానికి హాజరయ్యే నేపథ్యంలో అధికారులు సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

# 'ఫిజియోథెరపీ, రీహాబిలిటేషన్ సేవలు సద్వినియోగం చేసుకున్న సుదూర ప్రాంత వాసులు



కంచిలి, ఆగస్టు 16, ప్రభాతవార్త:

నిరాధార పరిస్థితిలో.. వైద్యం అందిపుచ్చుకోలేక పక్షవాతంతో బాధ పడుతున్న వారికి సేవలు అందించాలనే సదుద్దేశ్యంతో 'సీతయ్య ఫౌండేషన' స్వచ్ఛంద సంస్థ ఆగస్టు 15 నుండి మానవతా దృక్పథంతో అందిస్తున్న 'ఫిజియోథెరపి మరియు రీహాబిలిటేషన్ సెంటర' సేవలను ఖమ్మం, కర్నూలు, విజయవాడ, భీమవరం, విశాఖపట్నం, హైదరాబాద్, సాలూరు, గుంటూరు మరియు ఒరిస్సా మరియు స్థానికులు సద్వినియోగం చేసుకున్నారు. వారికున్న పక్షవాత సమస్యలను చెప్పుకుంటూ ప్రకృతి ఆవరణలో సేదతీరుతూ.. ఉదారంగా 'ఫిజియోథెరపీ' సేవలను సద్వినియోగం చేసుకుంటూ సంతృప్తి చెందారు. ఈ కార్యక్రమంలో కంచిలి ఎంఈఓ శివరామక్రిష్ణ, సహచర సభ్యులు సానా గణేష్, కిమ్మోజి ఢిల్లేశ్వరరావు, డోకి సోమేశ్వరరావు మరియు స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారు.

# ఘనంగా అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

ఇచ్చాపురం, ఆగస్టు 16, ప్రభాతవార్త :



స్థానిక ముడియావీధిలో అభయాంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్ట కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వీధి యువత, వీధి ప్రజల సహకారంతో నాలుగు అడుగుల విగ్రహంను ఏర్పాటు చేశారు. విగ్రహ ప్రతిష్ట పురస్కరించుకొని అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో యువత మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త



# ప్రభుత్వ విజయాలు ప్రతి గడపకు చేరాలి

## -విజయనగరం ఎంపీ కలిశెట్టి

## -జె.ఆర్.పురంలో ఘనంగా ఇంటింటికీ తెలుగుదేశం

రణస్థలం, ఆగస్టు 16, ప్రభాతవార్త :



కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆదివారం మండల కేంద్రమైన జె ఆర్ పురంలో నిర్వహించిన రెండేళ్ల నమ్మకం-సంక్షేమం, అభివృద్ధిలో భాగంగా ఘనంగా జరిగిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో అమలు చేసిన కీలక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల వివరాల కరపత్రాలను అందజేశారు. ప్రతి ఇంటిని సందర్శించిన ఆయన ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రజక కార్పోరేషన్ డైరెక్టర్ గురజాపు రాము, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు డీజీఎం శ్రీనివాసరావు, పైడి అప్పుడుదొర, పిషిణి అశిరినాయుడు, దన్నాన వంశీ, మండపాక కనకారావు పాల్గొన్నారు.

# విద్యార్థులంతా స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

## -విజయనగరం జిల్లా పార్లమెంటరీ ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు

## -విద్యార్థులకు నగదు బహుమతి అందజేత



లావేరు, ఆగస్టు 16, ప్రభాతవార్త :

మండలంలోని బెజ్జిపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి విజయనగరం జిల్లా పార్లమెంటరీ ఉపాధ్యక్షులు వడ్డిపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని విద్యార్థులకు ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు.

**ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు :**

విద్యార్థులను ప్రోత్సహించేలా ఆయన తన సొంత నిధులతో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ. 3 వేలు, తృతీయ బహుమతి రూ. 2 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు. అలాగే ఎంపీపీ-2 ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులందరికీ సొంత ఖర్చులతో నోట్‌బుక్స్, పెన్సిళ్లు, విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ మాస్టారు, బీజేపీ సీనియర్ నాయకులు ఇజ్జాడ శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ పిన్నింటి మధుబాబు, పార్టీ గ్రామ అధ్యక్షులు ఇజ్జాడ సన్యాసినాయుడు, నీటి సంఘం ఉపాధ్యక్షులు వడ్డిపల్లి సురేష్, ఎసఎంసీ చైర్మన్ వొళ్ళపిల్లి రామినాయుడు, ఇజ్జాడ విశ్వనాథం, ఇజ్జాడ అప్పారావు, పిన్నింటి కృష్ణ, పిన్నింటి సురేష్, పిన్నింటి నారాయణరావు, గంట్యాడ అప్పలనాయుడు, పిన్నింటి శివ, పిన్నింటి నరసింహ, కలిశెట్టి నాగేశ్వరరావు, కలిశెట్టి ధర్మారావు, పి.గౌరీ, డి.శ్రీను, బి.మల్లేష్, పి.శ్రీను, జి.చిన్న, పి.రాము, జి.సంతోష్, జె.మల్లేష్, ఎల్.దుర్గారావు, కె.రమణ, ఎల్.లక్ష్మణ, ఎల్.సంతు, డి.శివ, వి.మోహనకృష్ణ, వెంకటేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఇచ్ఛాపురం, ఆగస్టు 16, ప్రభాతవార్త :

సుమారు 60 నుండి 65 సంవత్సరాల గల ఒక బక్క పలుచని గుర్తు తెలియని మగ వ్యక్తి ఇచ్చాపురం రైల్వే స్టేషన్ యార్డ్ ఆవరణలో రైలు ప్రమాదంలో చనిపోయి ఉన్నట్లు పలాస జి అర్ పి ఎసఐ డి.శ్రీనివాసరావు చెప్పారు. శ్రీకాకుళం రోడ్ నుంచి బరంపూర్ వరకు టికెట్ ఉన్నట్లు చెప్పారు. మృతునికి ఎడమ కాలు బొటనవేలు లేదని, మృతుడు ఆరెంజ్ రంగు పై నిలువు ఎరుపు రంగు గీతాలు కలిగిన షర్ట్ మరియు ఎరుపు, నీలం, కుంకుమ రంగు కలిగిన కాటన్ లుంగీ. లోపల నీలం రంగు కలిగిన ఆఫ్ నిక్కర్ ధరించి ఉన్నాడని ఇతని ఆచూకీ తెలిసిన వారు 9247585743.నెంబర్‌కి సంప్రదించాలని కోరారు.

# లింగాలవలస హైస్కూల్‌లో సైకిల్ షెడ్ ప్రారంభం



రేగిడి, ఆగస్టు 16, ప్రభాతవార్త :

మండలంలోని లింగాలవలస హై స్కూల్ అభివృద్ధిలో భాగంగా 1996 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు సుమారుగా 3,00,000తో పాఠశాల ఆవరణలో సైకిల్ షెడ్ నిర్మాణ పనులు దుప్పలపూడి రవిశంకరాచారి ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. ఇటీవల కాలంలో 30 సంవత్సరాల తర్వాత గెట్ టుగెదర్ నిర్వహించుకొని కార్యక్రమం అనంతరం భవిష్యత్తులో శాశ్వతంగా నిలిచిపోయేలా విద్యార్థులకు సైకిల్ షెడ్ నిర్మాణ పనులు పూర్తి చేసి శనివారం 80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా లింగాలవలస గ్రామ పెద్దలు, పాఠశాల హెచఎం, సిబ్బందిల సమక్షంలో నూతన సైకిల్ షెడ్ అట్టహాసంగా ప్రారంభించారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచఎం భావన రావు మాస్టారు, సునీల్ దొర, సర్పంచ్ అప్పలనాయుడు, వెంకట అప్పలనాయుడు, రామకృష్ణ, చిరంజీవి, నరసింగరావు, స్కూల్ ప్రధానోపాధ్యాయులు దాసరి కృష్ణారావు, సిఆర్పి మోహనరావు, పిడి సన్యాసిరావు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# స్కూల్ ఫస్ట్ విద్యార్థినికి సైకిల్ అందజేత

ఆమదాలవలస, ఆగస్టు16, ప్రభాతవార్త :



ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో స్కూల్ ఫస్ట్ సాధించిన విద్యార్థులకు గ్రామానికి చెందిన దాతలు విద్యార్థులకు ప్రోత్సాహాలను అందజేశారు. మార్చి నెలలో వెలువడిన పదో తరగతి పరీక్షల్లో నిమ్మతొర్లాడ హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులు సోమరాజు, సంజనకు సైకిల్‌ను ఉచితంగా అందజేశారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ స్వర్గీయ వండాన తవిటి నాయుడు జ్ఞాపకార్థం, వారి కుమారులు ఉదయ్ కుమార్, శ్రీరామచంద్రరరావు 5 వేలు విలువచేసే సైకిల్ బహుకరించారు. అలాగే అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సహాలను గ్రామస్తులు అందజేశారు. ఉపాధ్యాయులు గ్రామస్తులు ఉన్నారు.

# జలుమూరులో మండల సర్వసభ్య సమావేశం



జలుమరు, ఆగస్టు 16, ప్రభాతవార్త :

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన ఆదివారం జరిగినది. ఈ టర్మ్‌కు చివరి మండల సర్వసభ్య సమావేశం జరిగినట్లు ఎంపీడీవో బంట్రోతు చిన్నమ్మడు పేర్కొన్నారు. ఈ సమావేశాలు సమస్యలు పరిష్కరించుకోవడానికి నిర్వహిస్తూ ఉంటారు, కానీ కొన్ని సమస్యలు పరిష్కారము కాకుండా ఉన్నాయని సమావేశంనకు వచ్చిన వారు పేర్కొన్నారు. మండల చిట్టచివర సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా ముగిసినది. ఎంపీటీసీలు, ఈవోపీఆర్డి, డిప్యూటీ ఎంపీడీవో ఉమామహేశ్వర్, మండల ఇంజనీరు శ్రీధర్, వైద్యాధికారులు గొలివి సుజాత, పొన్నాన గురునాథరావు, పి.ప్రసన్నలక్ష్మి, మండల విద్యాశాఖ అధికారులు బమ్మిడి మాధవరావు, ఎం.వి.ఆర్ ప్రసాదరావు, ఏవో రవికుమార్, ఏఈ ఎం.సూర్యారావు, ఎంపీటీసీలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డిప్యూటీ తహసీల్దార్‌కు ప్రశంసాపత్రం

ఆమదాలవలస, ఆగస్టు 16, ప్రభాతవార్త :



ఆమదాలవలస డిప్యూటీ తహసిల్దారుగా ఎంఎలఎస్ పాయింట్ ఇన్‌చార్జ్‌గా పని చేస్తోన్న బుడుమూరు శారదా దేవికి ఆగస్టు 15న 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టర్ దినకర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమదాలవలస రెవిన్యూ అధికారులు, సిబ్బంది ఆమెకు పలువురు అభినందించారు.

# బూజు పట్టకుండా..



వర్షాకాలంలో తడిదనం, గాలిలో తేమ ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల వంటింటో ఉండే కొన్ని రకాల పదార్థాలు, స్నాక్స్.. వంటివి బూజు పడుతుంటాయి. ఇలా జరగకూడదంటే వాటిని నిల్వ చేసే విషంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాంరండి.

బయటి నుంచి కొని తెచ్చుకున్న స్నాక్స్ చాలవరకు ప్యాకెట్లలో పిల్వ చేస్తారు. అయితే వీటిని ఒక్కసారి తెరిచాక.. వాటిని అలాగే వదిలేస్తే.. అవి మెత్తగా అయిపోతాయి కొన్ని కొన్ని స్నాక్ ఐటమ్స్ జూజు పడతాయి కదా! కాబట్టి సాక్స్ ఇంట్లో చేసినా, బయటి నుంచి తెచ్చుకున్నా గాలి చొరబడని గాజు జార్లలో నిల్వ చేయడం మంచిది. వంటింట్లో నీటి వినియోగం ఎక్కువగా ఉండడం, తడిదనం వల్ల ఆ వాతావరణం ఎప్పుడూ తేమగా ఉంటుంది. తద్వారా క్రిములు, ఫంగస్..వంటివి వృద్ధి చెందే ప్రమాదం ఉంది. కాబట్టి నిల్వ చేసే పదార్థాలు, నిత్యావసర సరుకుల్ని తేమ లేని చోట భద్రపరచాలి. అలాగే తేమ చేరకుండా మధ్యమధ్యలో, కప్‌బోర్డ్ మూలల్లో సిలికాజెల్ ప్యాకెట్లను ఉంచాలి. తేమకు ఉప్పు, చక్కెర.. వంటివి గడ్డ కడతాయి. కాబట్టి ఈ రెండూ కలగలిసిన స్నాక్స్‌ని రెండు ఒకచోట నిల్వ చేయకుండా విడివిడిగా భద్రపరచడం వల్ల రుచి కోల్పోకుండా, మెత్తబడకుండా జాగ్రత్త పడచ్చు. తినగా మిగిలిన చపాతీలు, వేపుళ్లను అల్యూమినియం ఫాయిల్స్‌లో ప్యాక్ చేసి నిల్వ చేయడం వల్ల వాటి రుచి కోల్పోకుండా జాగ్రత్త పడవచ్చు. గోధుమ పిండి, శెనగపిండి.. వంటివి తేమ తగిలితే పాడవుతాయి.కాబట్టి వాటిని గాలి చొరబడని గాజు సీసాలో భద్రపరచి.. అందులో కొన్ని బిర్యాని అకుల్ని వేయాలి. తద్వారా ఈ ఆకులు ఏమాత్రం తేమ ఉన్నా పీల్చేసు కుంటాయి.



## 'గంగాదిత్యుడు'

కాశీ క్షేత్రం అనేక విశేషాలను సంతరించుకుని కనిపిస్తుంది. ఈ క్షేత్రంలో అడుగు పెట్టడమే పూర్వజన్మ సుకృతంగా భక్తులు భావిస్తుంటారు. ఇక్కడ చూడదగిన ప్రదేశాలలో సూర్య దేవాలయాలు కూడా కనిపిస్తాయి. ఒక్కో ఆలయంలోని సూర్య భగవానుడు ఒక్కో పేరుతో పిలబడుతూ ఉంటాడు. అలా సూర్యదేవుడు 'గంగాదిత్యుడు' అనే పేరుతో ఇక్కడ దర్శనమిస్తుంటాడు. ఇక్కడి 'లలితా ఘట్టం'లో స్వామి ఆలయం కనిపిస్తుంది. అంశుమంతుడు ఆయన కుమారుడు దిలీపుడు గంగను భూలోకానికి తీసుకురావడానికి ఎంతగానో ప్రయత్నిస్తారు. చివరికి దిలీపుడు కుమారుడైన భగీరథుడు .. గంగను భూలోకానికి తీసుకొస్తాడు. తన వంశంలోని భగీ రథుడు చేసిన ఈ ప్రయత్నాన్ని అభినందించిన సూర్యభగవానుడు, ఇక్కడే గంగాదేవిని స్తుతిస్తాడు. ఆ ప్రదేశంలోనే స్వామివారు 'గంగాదిత్యుడు' పేరుతో పిలవబడుతూ పూజలు అందుకుంటున్నాడు. స్వామివారి దర్శనం వలన సమస్త పాపాలు నశిస్తాయని స్థల పురాణం చెబుతోంది.

నిమిషంలో ఒక అమ్మాయి 19 సార్లు కళ్లు ఆర్పితే, అబ్బాయిలు 11 సార్లు మాత్రమే రెప్పవేస్తారట. అంతేకాదు, అమ్మాయిల కంటిపాప పెద్దగానూ ఉంటుందట. ఆఫీసులో ఒత్తిడి తగ్గుతుందిలా.. మారిన జీవనశైలితో ప్రతి

# ఒత్తిడి తగ్గేలా !



ఒక్కరిపైనా పని ఒత్తిడి ఎక్కువ ఉంటోంది. అయితే, మగవారితో పోల్చి చూసినప్పుడు ఆడవాళ్లు ఎక్కువగా దీని బారిన పడుతుంటారు. ఈ విషయం తాజాగా యువర్ దోస్త్ అనే సంస్థ ఎమోషనల్ వెల్‌నెస్ స్టేట్ ఆఫ్ ఎంప్లాయిస్ పేరుతో 5000 మంది భారతీయ నిపుణులపై చేసిన సర్వేలో వెల్లడైంది. ఇదే కాదు మరెన్నో అధ్యయనాలూ ఈ విషయాన్నే చెబుతున్నాయి. కుటుంబ బాధ్యతలు, ఆఫీసు పనులు భారం మధ్య సమన్వయం చేసుకోవడంలో ఇబ్బందులు, ఇతరత్రా కారణాలు వంటివెన్నో ఒత్తిడికి కారణాలు. అయితే, ఈ పరిస్థితి నుంచి త్వరితగతిన బయటపడాలంటే.. విధులు నిర్వర్తించే వాతావరణం ఆహ్లాదంగా, సౌకర్యంగా ఉండాలి. ఒకవేళ అలా లేదంటే.. అందుకు తగ్గట్లు మార్చుకోండి. మొదట మార్చాలింది కుర్చీనే. ఎందుకంటారా? వంగిపోయినట్లుగా కూర్చుంటే కాలక్రమంలో మీ భంగిమ మారుతుంది. వెన్నుపై ఒత్తిడి పెరిగి సయాటికా, స్పాండిలైటిస్ వంటి సమస్యల బారి పడే ప్రమాదం ఉంది. అందుకే, అది మీ వీపు భాగానికి ఆసరా ఇవ్వడంతో పాటు పాదాలు నేలను తాకాలని గుర్తుంచుకోండి. మీ డెస్క్‌టాప్‌ని క్లీన్‌చేయండి. ప్రతి ఫైల్‌నీ ఆర్గనైజ్ చేసుకోండి. ఇవన్నీ చిన్న విషయాల్లానే అనిపిస్తాయి కానీ ఎక్కువ ప్రభావం చూపిస్తాయి. కొందరు మహిళలు.. తమ శరీరానికి కావలసిన పోషకాలు అందుతున్నాయో లేదో సరిచూసుకోరు. ఇంకొందరు ఏది పడితే అది తినేస్తారు. ఇవన్నీ మీలో శక్తి స్థాయుల్ని తగ్గించేవే. ఈ తీరు ఒత్తిడితో పాటు మరికొన్ని అనారోగ్యాల బారినా పడేలా చేస్తుంది. అలాకాకుండా బ్యాగులో చిన్న చిన్న బాక్సుల్లో నట్స్, సీడ్స్ వంటివి పెట్టుకుంటే సరి. ఇవి మీలో ఎనర్జీ తగ్గనీయవు. స్ట్రైస్ బారిన పడనివ్వవు. ఎంత పని ఒత్తిడిలో ఉన్నా.. షార్ట్ బ్రేక్ తీసుకోండి. లేదంటే కండరాలు పట్టేస్తాయి. గంటకో సారైనా అటూ ఇటూ నాలుగడుగులు వేస్తే సరి. అయితే. అలాగని పదే పదే కాఫీ, టీలు తాగేయొద్దు. బదులుగా ఓ కప్పు వేణ్నీళ్లు లేదంటే నరగీన్‌టీ ఎంచుకోండి. వీటితో పాటు పనికి సరైన ప్రణాళిక వేసుని, వాటిని సకాలంలో పూర్తి చేసుకోవాలి. దీంతో పాటు శారీరక దృఢత్వాన్నీ, మానసిక బలాన్నీ పెంచుకోవడానికి యోగా, ధ్యానం వంటివి చేయాలి.

# డాక్టర్ మిస్ క్వీన్



భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, కళా వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలనే సంకల్పం. ఆమెను కళా రంగానికి పరిచయం చేసింది. హైదరాబాద్‌కు చెందిన డా. సనా ఖయ్యూం. విద్య, కళలు, వ్యక్తిత్వ వికాసాన్ని మేళవింస్తూ నిర్వహించే సౌందర్య పోటీలు ప్యాషన్ ఈవెంట్లలో విభిన్న కార్యక్రమాల్లో పాల్గొంటుండటం ఆసక్తి. ఆమెను మిస్ యూనివర్స్ ఫైనలిస్ట్ స్థాయికి చేర్చింది. తాజాగా పెగాసస్ గ్లోబర్ ప్రైవేట్ లిమిటెడ్ కేరళ రాష్ట్రంలోని కొచ్చిలో నిర్వహించిన సౌందర్య పోటీల్లో వారికి చే'మిస్ క్వీన్' అవార్డును దక్కించుకొంది. అందం, ఆత్మవిశ్వాసం. వ్యక్తిత్వ వికాసమే ఆలంబనగా నిర్వహించిన ప్రతిష్టాత్మక పోటీలలో డా.సనా టైటిల్‌ను గెలుచుకున్నారు. మిస్ ఇండియా గ్లామ్‌వరల్డ్ 2026 పౌర్ణమి మురళి నుండి 'మిస్ క్వీన్' టైటిల్ అందుకున్నారు. కళల్లోనూ వైద్య విద్యార్థిగా, శాస్త్రీయ నృత్య కళాకారిణిగా, కర్ణాటక సంగీత సాధకురాలిగా, అందాల పోటీలలో ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతోందామె.

## అటుకుల బూరెలు



బియ్యప్పిండితో చేసే బూరెలు అందరికీ తెలుసు కానీ.. అటుకులతో చేసినవి ఎప్పుడూ తిని ఉండరు కదూ! మరి అటుకుల బూరెలు రుచి చేసి చూదాం. ఎంతో సులువుగాచేసే ఈ బూరెలు మహా రుచిగా ఉంటాయి.

కావలసినవి : కప్పు అటుకులకు అర కప్పు బెల్లం, చారెడు గోధుమ పిండి, పావు చెంచా యాలకుల పొడి, రెండు స్పూన్ల నెయ్యి, వేయించేందుకు నూనె అవసరమౌతాయి.

తయారీ: అటుకులను కచ్చాపచ్చా దంచాలి. బెల్లం కరిగించి.. అందులో అటుకులు, గోధుమ పిండి, యాలకుల పొడి, నెయ్యి వేయాలి. సన్న సెగ మీద ఉండలు కట్టకుండా కలియ తిప్పుతూ రెండు నిమిషాలయ్యాక దించేయాలి. ఈ మిశ్రమాన్ని చల్లారనిచ్చి.. చిన్న ఉండలుగా చేసి బూరెలుగా ఒత్తుకునికాగిన నూనెలో బంగారు రంగు వచ్చేదాకా వేయించి తీయాలి. అంతే అటుకుల చిట్టి బూరెలు తయారైపోతాయి.

## మెడ మెరిసేన్

ముఖం అందంగా కనిపించడం కోసం ఎన్నో రకాల క్రీములు, ప్యాక్‌లు వాడతాం.కానీ మెడ భాగానికొచ్చేసరికి నిర్లక్ష్యం చేస్తుంటాం. ఇరవైల్లో పెద్దగా తేడా తెలియకపోయినా.. వయసు పెరిగేకొద్దీ ఆ ప్రభావం మెడ మీద బాగా కనిపిస్తుంది. మెడ చుట్టూ నల్లటి వలయం, సన్నటి ముడతలు, చిన్న చిన్న పొక్కులతో క్రమంగా చర్మం కాంతి విహీనంగా తయారవుతుంది. ఇలాంటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే మెడ సౌందర్యాన్ని తిరిగి పెంపొందించుకోవచ్చు. అవేంటో తెలుసుకుందాం..



**ఇలా శుభ్రపరచుకోవాలి..** ముఖంపై ఉండే చర్మం కన్నా మెడ చర్మం చాలా పల్చగా, సున్నితంగా ఉంటుంది. అందుకని ఎక్కువ గాఢత కలిగిన సబ్బులను వాడకూడదు. వీలైనంత వరకు రసాయనాలు లేని సబ్బు/బాడీ వాష్‌లను వాడాలి. అంతేకాదు.. ముఖాన్ని శుభ్రం చేసుకునే ప్రతిసారీ మెడను కూడా శుభ్రం చేసుకోవడం అలవాటు చేసుకోవాలి.

**స్క్రబ్ వాడాలి ....** చెమట వల్ల మెడపై చాలా త్వరగా మురికి చేరుతుంది. అంటేకాదు నిత్యం మనం ధరించే చెయిన్ల వల్ల కూడా మెడ పైన మురికి పేరుకునే అవకాశం ఉంది. సబ్బుతో పైపై మురికి పోయినా, చర్మ రంధ్రాల్లో పేరుకున్న మలినాలు పోవాలంటే స్క్రబ్బర్ తప్పని సరి. ఆ జరగకుండా ఉండాలంటే మనం వేసుకునే చెయిన్లను శుభ్రంగా ఉంచుకోవాలి. వారానికి నాలుగుసారునఉల స్క్రబ్బర్ వాడాలి. బాదం పలుకులని బరకగా పొడి చేసి, కొద్దిగా పాలుకలిపి పేస్ట్‌లా చేసి మెడకు పట్టించాలి. భుజాల నుంచి ముఖం వైపుగా ఐదు నిమిషాల పాటు స్క్రబ్ చేసి, చల్లటి నీటితో కడగేయాలి. ఐదు నిమిషాలకు మించి స్క్రబ్ చేయకూడదు. ఎందు కంటే అతిగా స్క్రబ్ చేయడం వల్ల పల్చని మెడ చర్మం దెబ్బతినే ప్రమాదం ఉంది.

**నెక్ ప్యాక్ !..** ఫేస్ ప్యాక్ వాడుతున్న ప్రతిసారీ మెడకి కూడా ప్యాక్ వేసుకోవడం తప్పనిసరి. బాగా పండిన అరటి పండు లేదా గుమ్మడి పండు, బొప్పాయి గుజ్జుతో ప్యాక్ వేసుకుని 20 నిమిషాల తర్వాత కడిగేయాలి. వారానికోసారి ఫ్రూట్ ప్యాక్‌లను వాడటం వల్ల చర్మం కాంతివంతంగా తయారవుతుంది. పాలమీగడలో పావు చెంచా నిమ్మరసం, చిటికెడు పసుపు కలిపి మెడకు పట్టించాలి. 20 నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగేసే మెడ చుట్టూ పేరుకున్న నలుపు క్రమంగా తగ్గుతుంది.

**టోనింగ్...** ముఖంపై చర్మానికి టోనర్ వాడేప్పుడు మెడకు కూడా టోనర్ అప్లై చేయడం అలవాటు చేసుకోవాలి. కానీ మెడకి టోనర్ రాసుకునేప్పుడు నేరుగా చేతి వేళ్లతో కాకుండా దూదిని వాడాలి.

# 'విశ్వనాథ్ & సన్స్'కి నిజమైన హీరోలు ప్రేక్షకులే

## మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్



తమిళ అగ్ర కథానాయకుడు సూర్య నటించిన తాజా చిత్రం 'విశ్వనాథ్ & సన్స్'. ప్రతిభ గల దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మమితా బైజు కథానాయికగా నటించారు. రాధిక శరత్‌కుమార్, రవీనా టాండన్ కీలక పాత్రలు పోషించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు.

త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. "ఈ కథ విన్నప్పటి నుంచే, ఈ సినిమా నా హృదయానికి చాలా దగ్గరైంది. ఇలాంటి సమయంలో ఒక కుటుంబ కథా చిత్రం చేసి, దానిని విజయవంతం చేసినందుకు చిత్ర బృందం మొత్తానికి అభినందనలు. నేను సూర్యతో ఒక సినిమా చేయాలి. ఆయనకు నచ్చే కథ ఇంకా చెప్పలేకపోయాను (నవ్వుతూ). త్వరలోనే మేమిద్దరం కలిసి పని చేస్తామని నమ్ముతున్నాను' అన్నారు. కథానాయకుడు సూర్య మాట్లాడుతూ "మీరు చూపిస్తున్న ప్రేమకు కృతజ్ఞతలు చెప్పడానికి మాటలు కూడా సరిపోవడం లేదు. త్రివిక్రమ్ గారు ఈ వేడుకకు రావడం చాలా సంతోషంగా ఉంది. ఆయన రాకతో ఇది మరింత ప్రత్యేకంగా మారింది' అన్నారు.

నటి రవీనా టాండన్ మాట్లాడుతూ "విశ్వనాథ్ & సన్స్' సక్సెస్ వేడుకలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాపై ప్రేమను కురిపిస్తూ, ఇంతటి విజయానికి కారణమైన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అన్నారు.

దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. "ఈ కథ రాసినప్పుడు ట్రెండ్ ఇది కాదు. యాక్షన్, డార్క్ హ్యూమర్, హారర్, డివోషనల్ లాంటి సినిమాల ట్రెండ్ నడుస్తుంది. ఇలాంటి సమయంలో ఫ్యామిలీ సినిమా చేస్తానంటే, ఎవరైనా నిరుత్సాహ పరుస్తారు. కానీ, వంశీ అలా చేయలేదు. త్రివిక్రమ్ కూడా నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. ఆయన మద్దతు లేకుండా ఇది సాధ్యమయ్యేది కాదు' అన్నారు.

## తెర

# 'అ' ఫస్ట్‌లుక్ విడుదల



ప్యాషనేట్ ప్రొడక్షన్ హౌస్‌లు స్టార్ బాక్స్ స్టోరీస్, రిప్పుల్ స్లైడ్ స్టూడియోస్ తొలిసారిగా ఓ ఇంట్రెస్టింగ్ థ్రిల్లర్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. రాహుల్ విజయ్, అర్చన అయ్యర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని కనకరావు తొనంగి, అభిషేక్, ప్రముఖ ఎడిటర్‌డైరెక్టర్ గ్యారీ నిర్మిస్తున్నారు. సాయి బాలి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం త్వరలోనే గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ చిత్రానికి 'అ' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను హిట్ మెషీన్ అడివి శేష్ ఆవిష్కరించారు. టైటిల్‌ను ఇంట్రెస్టింగ్‌గా ప్రజెంట్ చేయడంతో విడుదలైన వెంటనే అందరి దృష్టిని ఆకర్షించింది. టైటిల్ చుట్టూ 'అమ్మాయి, అదృశ్యం, అన్వేషణ' అనే పదాలను పొందుపరిచారు. ఆలోచింపజేసే పదాలతో రూపొందించిన ఈ ఇంట్రెస్టింగ్ టైటిల్ డిజైన్ విడుదలకు ముందే సినిమాపై ఆసక్తిని పెంచింది. ఇక ఫస్ట్ లుక్ ఈ క్యూరియాసిటీని మరింత పెంచింది. రాహుల్ విజయ్ ఓ ప్రదేశంలో చేతిలో లాఠీ పట్టుకుని కూర్చుని కనిపిస్తున్నారు. ఆయన చుట్టూ నేలంతా రక్తపు మరకలతో కనిపిస్తోంది. ఈ ఇంటెన్స్ విజువల్‌కు బ్యాక్‌గ్రౌండ్‌లో చార్మినార్ కనిపించడం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. దీంతో ఈ థ్రిల్లర్ కథ హైదరాబాద్ నేపథ్యంగా సాగుతుందని అర్థమవుతోంది. రాహుల్ విజయ్ స్ట్రైకింగ్ లుక్, ఫస్ట్ లుక్‌లో కనిపిస్తున్న డార్క్ అండ్ సస్పెన్స్‌ఫుల్ వాతావరణం సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. అర్చన అయ్యర్ రాహుల్ విజయ్ సరసన కథానాయికగా నటిస్తున్నారు. సాయి బాలి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తుండగా, మోనిష్ భూపతి రాజు సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. అభినవ్ వి. కునపరెడ్డి కోప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తూ ఎడిటింగ్ బాధ్యతలను గ్యారీ తీబీతో కలిసి నిర్వహిస్తున్నారు. త్వరలోనే 'అ' గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది.

# 'డార్క్ చాక్లెట్' నుంచి సాంగ్ లాంచ్



రానా దగ్గుబాటి, స్పిరిట్ మీడియా, వాల్టెయిర్ ప్రొడక్షన్స్‌తో కలిసి 'డార్క్ చాక్లెట్' చిత్రాన్ని సగర్వంగా అందిస్తున్నారు. విశ్వదేవ్ రాచకొండ, బిందు మాధవి లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరో విశ్వదేవ్ మాట్లాడుతూ.'కల్లో కల్లోలం' పాట ఈ సినిమాలో చాలా ముఖ్యమైన సందర్భంలో వస్తుంది. ఈ సాంగ్ సినిమాకు చాలా ఇంపార్టెంట్. వివేక్ సాగర్ చాలా అద్భుతమైన ట్యూన్ ఇచ్చారు. ఇందులో లిరిక్స్ విషయంలో చాలా పర్టిక్యులర్‌గా ఉంటారు' అన్నారు.

డైరెక్టర్ శశాంక్ మాట్లాడుతూ 'కల్లో కల్లోలం' పాటలో ఈ సినిమా కథంతా నిక్షిప్తమై ఉంది. కాకపోతే అది అంత ఈజీగా పట్టుకోలేం. చాలా ఇంట్రెస్టింగ్ సిట్యువేషన్‌లో ఈ పాట వస్తుంది. ఈ పాటకు వివేక్ సాగర్ తప్ప మరొకరు మ్యూజిక్ చేయలేరనేది నా స్ట్రాంగ్ ఫీలింగ్. ఈ సినిమాకు మ్యూజిక్ చేయడం నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది' అన్నారు. బిందు మాధవి మాట్లాడుతూ.. 'నాకు వివేక్ సాగర్ మ్యూజిక్ అంటే చాలా ఇష్టం. ఈరోజు ఆయన చేసిన మ్యూజిక్‌లో నేను వర్క్ చేయడం చాలా ఆనందంగా ఉంది. 'డార్క్ చాక్లెట్'లో ఫుల్ లెంగ్త్ క్యారెక్టర్ చేశాను అన్నారు. డైరెక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఇందులో విశ్వదేవ్ వర్సటాలిటీ కనిపిస్తుంది' అన్నారు. వివేక్ సాగర్ మాట్లాడుతూ 'ఏదైనా సరే కథతోనే మ్యూజిక్ వస్తుంది. శశాంక్ చాలా అద్భుతమైన ఐడియాతో వచ్చారు' అన్నారు.

# 'ధరణి ఐ లవ్ యూ' పోస్ట్ ప్రొడక్షన్ పనులు



హెచ్ఎస్‌పీ క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్.ఎస్.రాజమౌళి, పరుచూరి మురళి, దేవిప్రసాద్ వంటి దర్శకుల వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసి మొదటగా 'అనగనగా ఒక ఊళ్ళో' చిత్రానికి దర్శకత్వం వహించిన సాయి కృష్ణ కె.వి దర్శకత్వంలో రాజశేఖర్ మద్దికుంట నిర్మిస్తున్న తాజా చిత్రం 'ధరణి ఐ లవ్ యూ' షూటింగ్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. బొమ్మరాశిపేట, ఎల్లగూడ, ఉద్దమర్రి, లాల్గాడిమలక్‌పేట్, శామీర్‌పేట్, తూప్రాన్, వెంకటరత్నాపురం తదితర ప్రాంతాల్లోని అందమైన లొకేషన్లలో చిత్రీకరణను పూర్తి చేసినట్లు చిత్రబృందం వెల్లడించింది. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆసక్తికరమైన కథనం, కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలతో 'ధరణి ఐ లవ్ యూ'ను మంచి కుటుంబ కథా చిత్రంగా రూపొంది స్తున్నామని దర్శక, నిర్మాతలుతెలిపారు. ప్రేమ, కుటుంబ అనుబంధాలుతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా సినిమాను తెరకెక్కించినట్లు చెప్పారు.. ఈ చిత్రంలో ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ ఆర్.పి.పట్నాయక్ ఒక సెంటిమెంట్ సాంగ్ పాడటం జరిగింది అన్నారు.

# '2కె లవర్స్' ప్రారంభం



ఎం బి ప్రొడక్షన్ హౌస్ బ్యానర్ మీద రాజేష్ నాయుడు దర్శకత్వలో బిచ్చు నాయక్ నిర్మిస్తున్న ప్రొడక్షన్ నెం.1 '2కె లవర్స్' పూజా కార్యక్రమాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సినిమాలో మోహిత్ పెడాడ, శృతి శంకర్, సాయి కుమార్, తనికెళ్ల భరణి, ప్రణీత్ రెడ్డి, సప్తగిరి, రచ్చ రవి, మొట్టా రాజేంద్రన్, రమ్య పొందూరి, సూర్య, శివన్నారాయణ, ఆమని తదితరులు ముఖ్య పాత్రలను పోషించబోతున్నారు. ఈ మూవీకి రసూల్ భాయ్ కథను అందించారు. ఈ చిత్ర ప్రారంభోత్సవానికి మెలోడీ బ్రహ్మ మణిశర్మ, తనికెళ్ల భరణి, వీఎన్ ఆదిత్య ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ముహూర్తపు సన్నివేశానికి వీఎన్ ఆదిత్య క్లాప్ కొట్టగా, మణిశర్మ గౌరవ దర్శకత్వం వహించారు. తనికెళ్ల భరణి స్క్రిప్ట్ అందజేశారు. పూజా కార్యక్రమాల అనంతరం.. దర్శకుడు రాజేష్ నాయుడు మాట్లాడుతూ ..'రసూల్ అద్భుతమైన కథను ఇచ్చారు. తెలంగాణ నేపథ్యంలో సాగే అందమైన ప్రేమ కథతో పాటు, ఎమోషన్స్‌తో సినిమాని రూపొందిస్తున్నాం. ఆద్యంతం వినోదభరితంగా మూవీ ఉంటుంది' అన్నారు. నిర్మాత బిచ్చు నాయక్ మాట్లాడుతూ ..'ఈరోజు మా ఎం.బి. ప్రొడక్షన్స్‌హౌస్ ప్రారంభించడం ఆనందంగాఉంది. రాజేష్ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. తెలంగాణ యాసలో ఇది వరకు చూడని ప్రేమ కథ, ఫ్యామిలీ ఎమోషన్స్‌తో సినిమా ఉండబోతోంది' అన్నారు.రచయిత రసూల్ మాట్లాడుతూ 'ఎం.బి. ప్రొడక్షన్స్‌లో తెరకెక్కించబోతోన్న ఈ'2కె లవర్స్' ప్రాజెక్ట్ ప్రారంభోత్సవానికి వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మేం తీయబోతోన్న ఈ ప్రేమ కథను అందరూ ఆదరిస్తారు.' అని అన్నారు.హీరో మోహిత్ మాట్లాడుతూ 'ఎంబి ప్రొడక్షన్స్‌లో వస్తున్న ఈ '2కె లవర్స్' చిత్రంలో నాకు అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. ఇదొక కొత్త ప్రేమకథ. రెగ్యులర్‌సినిమాల్లా మాత్రం ఉండదు' అన్నారు. హీరోయిన్ శృతి శంకర్ మాట్లాడుతూ 'ఎంబి ప్రొడక్షన్స్‌లో వస్తున్న ఈ'2కె లవర్స్'లో ఎంతో ఎమోషన్ ఉంటుంది' అన్నారు.



# 'అమీర్ లోగ్' అందరికీ కనెక్ట్ అవుతుంది

'అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై మాధవి రెడ్డి సోమ నిర్మించిన ఈ మూవీకి రమణా రెడ్డి సోమ దర్శకత్వం వహించారు. ఈ సినిమాకి మనోహర్ రెడ్డి మంచురి సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రంలో ఎంసి హరి, మనోజ్, శశిధర్ ప్రధాన పాత్రల్లో నటించగా.. వేధా జలంధర్, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయోగి కీలక పాత్రలు పోషించారు. రానా దగ్గుబాటి సంస్థ 'స్పిరిట్ మీడియా' ఈ మూవీని తెలుగులో ఆగస్ట్ 21న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోంది. ఈ క్రమంలో ప్రమోషన్స్‌లో భాగంగా ప్రధాన పాత్రధారులు ఎంసి హరి, మనోజ్, శశిధర్ చిత్ర విశేషాల్ని పంచుకున్నారు. 'అమీర్ లోగ్' ఎంతో నేచురల్‌గా ఉంటుంది. సినిమాని చూసినట్టుగా ఉండదు. హైదరబాద్ బస్తీలోకి వెళ్లినట్టుగా, ఆబస్తీల్లో జీవిస్తున్నట్టుగా అనిపిస్తుంది. మేం బస్తీల్లోనే పెరిగాం. తెలంగాణ యాస, బస్తీ లైఫ్ కథ అవ్వడంతో మాకు చాలా సులభంగా మారింది. 'అమీర్ లోగ్' చిత్రంలో బిర్యానీ అనేదే మెయిన్ పాయింట్. ఆ బిర్యానీ చుట్టూనే మా పాత్రలు తిరుగుతాయి. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ఉంటుంది. మా సినిమా అంతా కూడీ ఫీమేల్ సెంట్రిక్‌గా ఉంటుంది. 'అమీర్ లోగ్' అవుట్ పుట్ చూశారు కాబట్టే మా దర్శకుడు రమణన్న గారు అంత కూల్‌గా ఉంటున్నారు. సినిమా చూశాక మా అందరికీ ఎంతో కాన్ఫిడెంట్ వచ్చింది. రానా టీం మా సినిమాని చూసింది. హైదరాబాద్‌లో ముందు ఫోకస్ పెట్టండి. ఆ తర్వాత అన్ని ఏరియాల్లో కవర్ చేయండని రానా చెప్పారు.మా సినిమాలోని ఎమోషన్‌ను స్మరణ్ మ్యూజిక్ మరో స్థాయికి తీసుకు వెళ్లింది. ఆయన పాటలే ఈ చిత్రానికి ప్రాణం. ఆయన ఇచ్చిన మ్యూజిక్, ఆర్ఆర్‌తో సినిమా నెక్స్ట్ లెవెల్‌కి వెళ్లింది. రెగ్యులర్ తెలుగు సినిమాల్లో ఉండేలా కాకుండా ఇందులో హిందీ ఎక్కువగా ఉంటుంది. తెలంగాణ, హైదరాబాద్ అంటే తెలీకుండానే కొన్ని పదాల్లో హిందీ, ఉర్దూ వచ్చేస్తుంది. మరీ హై లెవెల్లో కాకుండా సాధారణ జనాలకు అర్థమయ్యేలానే భాషను వాడాం. ఇక్కడి భాషకి, యాసకి అడ్రెస్‌లా మా 'అమీర్ లోగ్' సినిమా ఉంటుంది. భాష, యాసతో సంబంధం లేకుండా ఎమోషన్స్‌తో తీసిన ఈ చిత్రం అందరికీ కనెక్ట్ అవుతుంది. అన్నారు.

## విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి వినతిపత్రం అందజేసిన కార్మికులు

**లక్కవరపు కోట, ఆగస్టు 16 ప్రభాత వార్త :**



విద్యుత్ శాఖలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (జి.3045) ఆధ్వర్యంలో ఆదివారం ఎస్.కోట ఎమ్మెల్యే శ్రీమతి కోళ్ల లలితకుమారికి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా అధ్యక్షులు బి. గోవిందరావు నేతృత్వంలో కార్మికులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆమెను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బి. గోవిందరావు మాట్లాడుతూ, దాదాపు మూడు దశాబ్దాలుగా విద్యుత్ శాఖలో అత్యంత ప్రమాదకరమైన ఇండక్షన్ జోన్ పరిధిలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి రిస్క్‌తో కూడిన పని చేస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత లేకపోవడం శోచనీయమన్నారు. రిటైర్మెంట్ సమయంలో కనీస గ్రాట్యూటీ కూడా అందకపోవడంతో వృద్ధాప్యంలో కుటుంబ పోషణ భారంగా మారుతోందని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్లకు చెందిన కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 6న రజకులకు ఎస్సీ హోదా డిమాండ్ పై రౌండ్ టేబుల్ సమావేశం

**విజయనగరం, ఆగస్టు 16, ప్రభాతవార్త**



రజక సంక్షేమ సంఘం విజయనగరం పార్వతీపురం మన్యం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఐక్యత రజిక ఎస్సీ సాధన రౌండ్ టేబుల్ సమావేశం-9 నగరంలోని పూల్‌బాగ్ ప్రాంతంలోని జగన్నాథ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు తంగేటి భాస్కరరావు వెల్లడించారు. స్థానిక అంబర్ సత్రం ప్రెస్ క్లబ్ లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ప్రధాన డిమాండ్‌తో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఈ రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి రాష్ట్ర నలుమూలల నుండి రజక సంఘం పెద్దలు , రజక సంఘం రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నారని భాస్కరరావు వెల్లడించారు. కూటమి పార్టీల నాయకులు గతంలో ఇచ్చిన హామీ మేరకు రజకులను ఎస్సీ జాబితాలో చేర్చి హామీలు నిలబెట్టుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ హామీపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. జిల్లా అధ్యక్షులు తంగేటి భాస్కరరావు తో పాటు చైర్మన్ అప్పికొండ సన్యాసిరావు, కార్యదర్శి జంపా చిన్న, అధ్యక్షురాలు మలిచర్ల చిట్టితల్లి , టౌన్ కమిటీ అధ్యక్షులు పైడిశెట్టి , సతీష్ జాయింట్ సెక్రెటరీ సింహాచలం , తాతారావు , కొల్లేటి శ్రీను అప్పలరాజు ,రాజు, లక్ష్మణరావు ,రాము , ఈశ్వరరావు పాల్గొన్నారు.

## మూఢనమ్మకాలకు స్వస్తి పలకండి

**పాచిపెంట ఆగస్టు 16 , ప్రభాత వార్త:**



మూఢ నమ్మకాలు కు స్వస్తి పలకాలని పాచిపెంట ఎస్సై ఎల్ అర్జున్ తెలిపారు. మండలంలో పనుకోవల్స పంచాయతీలో గల కోస్ట్ వలస గ్రామంలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా మూఢనమ్మకాలు పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. "మూఢనమ్మకాలను నమ్మవద్దని, లేని పోనీ అపోహలు, వదంతులను నమ్మి చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని సూచించడం గ్రామస్తులకు సూచించారు. అనుమానాస్పద విషయం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలియజేసారూ. గ్రామస్థులు గ్రామంలో అందరితో కలిసిమెలిసి స్నేహపూర్వకంగా మెలగాలని ప్రజలను, యువకులకు సూచించారు. అలాగే శాంతి రక్షణ పరిరక్షణకై పోలీసులకు సహకరించాలని కోరారు. సైబర్ క్రైమ్, ఫోక్సో చట్టాల పైన ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు తెలిపారు. అలాగే మత్తు పదార్థాలు మాదక ద్రవ్యాలు సమాచారం తెలిస్తే పోలీస్ స్టేషన్కు తెలియజేయాలని తెలిపారు. రోడ్డు భద్రతాన్ని నియమాలు పాటించి సురక్షితంగా ప్రయాణించాలని వాహనదారులకు హెచ్చరించారు.

## దివ్యాంగ విద్యార్థుల ప్రతిభకు ప్రశంసలు

**గరివిడి, ఆగస్టు 16, ప్రభాత వార్త:**



శ్రీరాం నగర్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పాఠశాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులు ప్రతిభ కు ప్రశంసలు లభించాయి. జూలైలో మౌంట్‌అబూ లో నిర్వహించిన దివ్యాంగజన్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు వివిధ కళా, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ప్రతిభను చాటుకున్న విద్యార్థులను అభినందిస్తూ ఆదివారం గరివిడిలోని బ్రహ్మకుమారి ఈశ్వరియ విద్యాలయ ఆధ్యాత్మిక కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ వారికి ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. దివ్యాంగ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయనగరం బ్రహ్మకుమారి ఆధ్యాత్మిక కేంద్రం ప్రధాన ఇంచార్జ్ అన్నపూర్ణ, ఫేకర్ జనరల్ మేనేజర్ రామకృష్ణ, స్థానిక బ్రహ్మకుమారి ఇన్‌చార్జ్ లత, సహాయ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఉప్పు శ్రీను, ఉపాధ్యాయులు పి.కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## పడవకు మరమ్మత్తులు నిర్వహించండి

**కొమరాడ ,ఆగస్టు 16, ప్రభతవార్త:**

మండలంలో నాగావళి నదిపై కొమరాడ - కొట్టు, పూర్ణపాడు - లాబేసు గ్రామాల మధ్య నడిపే మర పడవకు మరమ్మతులు నిర్వహించాలని సిపిఎం పార్టీ నాయకులు సాంబమూర్తి డిమాండ్ చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడం వల్ల నదిలో నీటిమట్టం పెరుగుతుండడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే పడవ మరమ్మత్తులు చేపట్టి ఈ రెండు రేవులలో పడవ నడిచే విధంగా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ఆయన కోరారు.

## రోడ్డు భద్రత పై అవగాహన

**కురుపాం, ఆగస్టు16, ప్రభాత వార్త :**

రోడ్ భద్రత పై ప్రజలకు అవగాహన కల్పించినట్లు నీలకంఠాపురం ఎస్ ఐ పి. రమేష్ నాయుడు అన్నారు. ఆదివారం మండలం పీలేవిడి గ్రామం జంక్షన్ లో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం ప్రజలతో నిర్వహించారు.కార్యక్రమంలో ట్రాఫిక్ నియమాలు పాటించాలి రోడ్డు ప్రమాదాలకు గురి కాకుండా ఉండాలని వివరించారు.అదే విధంగా హెల్మెట్ యొక్క ఉపయోగాలు తెలియజేశారు . హెల్మెట్ ధరించిన ప్రతి ఒక్కరు సరైన విధంగా క్లిప్ ని లాక్ చేయాలని వివరించడం జరిగింది. కార్యక్రమంలో కానిస్టేబుల్ త్రినాథ్, దొర, కొండలరావు లు పాల్గొన్నారు.

## నాగభూషణరావుకి ఉత్తమ సర్వేయర్‌గా అవార్డు

**గరివిడి, ఆగస్టు 16, ప్రభాత వార్త:**



గరివిడి మండలం కోనూరు గ్రామ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న విభూది నాగభూషణరావు ఉత్తమ సర్వేయర్‌గా అవార్డు అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ద్వారా విబూది పురస్కారాన్ని స్వీకరించారు.కోనూరుసర్వేయర్‌గా విధులు నిర్వహిస్తూ భూ సర్వేలు, సరిహద్దుల నిర్ధారణ, ప్రజల భూ సమస్యల పరిష్కారంలో సమర్థవంతంగా సేవలందించినందుకు ఆయనను ఉత్తమ సర్వేయర్‌గా పురస్కారం వరించింది. పురస్కార గ్రహీత కు పలువురు అభినందించారు. అవార్డు ప్రధాన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ పాల్గొన్నారు.

## పశువైద్య విద్యలో ప్రవేశాలకు 18 నుంచి ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియ

**గరివిడి, ఆగస్టు 16, ప్రభాత వార్త:**

పశువైద్య విద్యలో ప్రవేశాలకు గాను ఈ నెల 18 నుండి ఆన్ లైన్ పక్రియ ప్రారంభంకానుంది.ఈ మేరకు 2026-27 విద్యా సంవత్సరానికిగాను వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల18 నుండి 23 వరకు మొదట విడత ఫీజులు చెల్లింపు,రిజిస్ట్రేషన్ పక్రియ,సెప్టెంబర్ 1 నుండి 2 వరకు రెండో విడత, కాగా చివరి విడత సెప్టెంబర్9 నుండి10 వరకు ఆన్ లైన్ కౌన్సెలింగ్ జరగనుంది. మొదటి రౌండ్ వారికి అగస్టు 25 సీట్ అలాట్మెంట్ ,రెండో రౌండ్ వారికి సెప్టెంబర్ 3 న,చివరి రౌండ్ వారికి సెప్టెంబర్11 న సీట్ అలాట్మెంట్ ప్రకటన విడుదల కానుందని పశువైద్య మండలి తమ షెడ్యూల్ లో పేర్కొంది.

## సమగ్ర శిక్ష ఇన్ స్ట్రక్టర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

### యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర నాయకుల డిమాండు

**రామభద్రపురం, ఆగష్టు 16,ప్రభాత వార్త:**



ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష విభాగం ద్వారా పాఠశాల విద్యా శాఖలో పనిచేస్తున్న ఆర్ట్ వర్క్ ఫిజికల్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ ఇన్స్ట్రక్టర్లు 14 ఏళ్లు సర్వీస్ పూర్తి చేసినా ఉద్యోగ భద్రత, వేతనం పెంపుదల, ఈఎస్ఐ, ఈపీఎఫ్, హెల్త్ కార్డ్స్, గ్రాట్యూటీ వంటి సౌకర్యాలకు నోచుకోవడం లేదని యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ ఎం వి రమణ ప్రధాన కార్యదర్శి కాళ్ళ సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు ఆదివారం రామభద్రపురంలో విలేకరులతో వారు మాట్లాడుతూ మారుతున్న జీవన ప్రమాణాలకు అనుగుణంగా వేతనం పెంపుదల చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలోని సమగ్ర శిక్ష విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ అన్ని విభాగాల సిబ్బందికి రెండు నెలలుగా వేతనం మంజూరు కాక ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. విధులలో చేరి 14 ఏళ్ళు అయినా ఇప్పటికీ ఒక జాబ్ చార్ట్ లేకుండా తరగతి గదులకు దూరమై పాఠశాలల్లో బోధనేతర పనులకు మాత్రమే ఉపయోగపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్ ఆర్ పాలసీ అమలు చేయాలని, ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్మెంట్ సమయములో కుటుంబ పోషణ నిమిత్తము ఐదు నుండి 10 లక్షలు గ్రాడ్యుటీ మంజూరు చేయాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేయాలని, వారు డిమాండ్ చేశారు.ఏటా రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులను కలసి విజ్ఞప్తులు చేస్తున్నా ఫలితం లేకపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## అనాథ బాలికల చదువుకు వి.కె. ట్రస్ట్, క్రెడిట్ బీ భరోసా

**రామభద్రపురం,ఆగష్టు 16,ప్రభాత వార్త:**



తల్లిదండ్రులను కోల్పోయిన బాలికల విద్యకు ఆర్థిక భరోసా కల్పిస్తూ వి.కె. ఫ్యామిలీ ఫౌండేషన్, క్రెడిట్ బీ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నాయి. రామభద్రపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మన్యం, విజయనగరం జిల్లాలకు చెందిన మరో 30 మంది బాలికలకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. వి.కె. ఫ్యామిలీ ఫౌండేషన్, క్రెడిట్ బీ సంయుక్తంగా ఒక్కో బాలికకు నెలకు రూ.1,000 చొప్పున 8వ తరగతి నుంచి డిగ్రీ పూర్తయ్యే వరకు స్కాలర్‌షిప్ అందించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి కొల్లి ఈశ్వరరావు తెలిపారు. ఇప్పటికే శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల్లో అనాథ బాలికలకు 1,000 సైకిళ్లు పంపిణీ చేయడంతో పాటు 200 మంది బాలికలకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. 2026 పదో తరగతి పరీక్షల్లో మూడు జిల్లాల టాప్-10 ప్రతిభావంతులైన విద్యార్థులకు మొత్తం రూ.2.40 లక్షలతో మెరిట్ అవార్డులు అందించినట్లు తెలిపారు. బాలికా విద్యను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఫౌండేషన్ సేవలను కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు విస్తరించినట్లు వివరించారు. గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన రెల్లా జానకిరామయ్య చైర్మన్‌గా, అమెరికాలోని డల్లాస్‌లో స్థిరపడిన ఆయన కుమారుడు రెల్లా శ్రీనివాసరావు డైరెక్టర్‌గా ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ సిబ్బంది బొప్పె సురేష్, శ్రీనివాసరావు, రాజేశ్వరి, ప్రసాద్, శంకరరావు, స్కాలర్‌షిప్ లబ్ధిదారులు, వారి సంరక్షకులు పాల్గొన్నారు.

## విశాఖపట్నం ఎయిర్‌పోర్టుతో మాకు ఎంతో అనుభూతి

**భోగాపురం, ఆగస్టు 16 ప్రభాతవార్త:**



భావోద్వేగభరితమైన అనుబంధం ఉంది. నా కెరీర్ భవిష్యత్తు కోసం నేను తొలిసారిగా 1989 సంవత్సరంలో అమెరికాకు వెళ్లేందుకు ఇదే ఎయిర్‌పోర్టు నుంచి నా ప్రయాణాన్ని ప్రారంభించాను. అలాగే, నా ఆప్తులను చివరిసారిగా ఇక్కడి నుంచే పంపిస్తున్న ఈ తరుణంలో ఆ పాత జ్ఞాపకాలు మళ్ళీ గుర్తుకువచ్చాయి. ఇక్కడ అనేక సందర్భాలలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారికి కూడా ఘన స్వాగతం పలకడం జరిగింది.ఇప్పుడు విశాఖ ఎయిర్‌పోర్టులో కమర్షియల్ సర్వీసులు ముగియడం కొద్దిగా బాధిస్తున్నప్పటికీ... ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి మరియు సరికొత్త మైలురాయికి ప్రతీకగా భోగాపురం మండలం లో రూపుదిద్దుకున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం సేవలను ప్రారంభించనుండటం ఎంతో సంతోషకరమైన విషయం. ఇదే ఎయిర్‌పోర్టులో గతంలో పవన్ కళ్యాణ్ గారికి ఘన స్వాగతం పలికిన సందర్భాలను గుర్తుచేసుకుంటూ... భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఆపరేషన్స్ ప్రారంభమవుతున్న ఈ సందర్భంగా, నూతన అభివృద్ధికి నాంది పలుకుతున్న ఈ బృహత్ ప్రాజెక్ట్‌ను నేను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నారు.

## 70వ సారి రక్తదానం చేసిన దుర్గాప్రసాద్

### అభినందించిన రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ రామారావు

**నెల్లిమర్ల, ఆగస్టు 16, ప్రభాతవార్త**



నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట సాధన యువజన సంఘం అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాదరావు 70వ సారి రక్తదానం చేసి పలువురితో ప్రశంసలు అందుకున్నాడు. విజయనగరం లోని ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో దుర్గాప్రసాద్ పాల్గొని 70 వ సారి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రెడ్ క్రాస్ సంస్థ రాష్ట్ర చైర్మన్ వై.డి. రామారావు , వైస్ చైర్మన్ పి ఆర్ సి రాజు, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఇండియన్ రెడ్ క్రాస్ శ్రీకాకుళం జిల్లా చైర్మన్ పి.జగన్ మోహన్ రావు, విశాఖపట్నం జిల్లా చైర్మన్ బాల సతీష్ , విజయనగరం జిల్లా చైర్మన్ కంది వెంకటరమణ , సెక్రెటరీ కే. సత్యం , ట్రెజరర్ డాక్టర్ విశ్వేశ్వరరావు, విజయనగరం జిల్లా రెడ్ క్రాస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భాను ప్రకాష్ అవనాపు, జరజాపు పేట గ్రామ పెద్దలు, సాధన యువజన సంఘం ప్రతినిధులు దుర్గా ప్రసాద్ ను అభినందించారు.

## సత్య జ్ఞానానంద ఆశ్రమం అభివృద్ధికి గ్రామస్థుల నిర్ణయం

**నెల్లిమర్ల, ఆగస్టు 16, ప్రభాతవార్త:**



నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో ఉన్న శ్రీ సత్య జ్ఞానానంద ఆశ్రమాన్ని అభివృద్ధి చేయాలని గ్రామ పెద్దలు, గ్రామస్తులు నిర్ణయించారు. ఆశ్రమంలో ఆదివారం ఆశ్రమం నిర్వహణ కమిటీ ఆద్వర్యం లో గ్రామ పెద్దల సమక్షంలో సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. ఆశ్రమం దేవాదాయశాఖ పరిధిలో ఉన్నందున ఆ శాఖ అధికారులను కలిసి ఆశ్రమం స్వయం నిర్వహణకు అనుమతి పొందాలని తీర్మానించారు. దుకాణాల అద్దెల ద్వారా వస్తున్న ఆదాయంతో ఆశ్రమాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.ఆశ్రమం భూములను పరిరక్షించాలని, సోషల్ మీడియాలో అనవసర పోస్టులను నియంత్రించాలనిఅభిప్రాయపడ్డారు. ఆశ్రమం అభివృద్ధికి అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని గ్రామ పెద్దలు సూచించారు.

## బెస్ట్ లైన్ ఇన్స్పెక్టర్‌గా అవార్డు

**శృంగవరపుకోట,ఆగష్టు16,ప్రభాతవార్త :**



బోగాపురంలో ఏపీఈపీడీసీఎల్(విద్యుత్ శాఖ)లో పనిచేస్తున్న దూరి సత్యనారాయణకు బెస్ట్ లైన్ ఇన్స్పెక్టర్ గా అవార్డు దక్కింది.బోగాపురం ఎయిర్‌పోర్టు పనులలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఆయనకుఅవార్డు లభించింది.ఆగష్టు15న జిల్లా పోలీసు పెరేడ్ గ్రౌండ్లో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలోమంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా సత్యనారాయణ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.సత్యనారాయణ స్వస్థలం ఎస్.కోట మండలం బొడ్డవరగ్రామానికి చెందిన నివాసి.గత 26ఏళ్లుగాఆయన విద్యుత్ శాఖలో పనిచేస్తున్నారు. ఈమేరకు జిల్లాలో విద్యుత్ శాఖ ఉద్యోగులు,స్నేహితులు సత్యనారాయణకు అభినందనలు తెలిపారు.

## పాఠశాలకు బీరువా, కుర్చీలు వితరణ

**మెరకముడిదాం, ఆగస్టు 16 ,ప్రభాత వార్త :**



మండలంలో కొర్లాం ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన జమ్ము రమేష్ 7101 రూపాయి విలువ చేసే బీరువా, ఇదే గ్రామానికి చెందిన బొండా సుందర్ రావు మరియు బూరెల శ్రీనివాసరావు 15 కుర్చీలు విరాళంగా అందించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయం అందించిన దాతలకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందించాల్సిందిగా దాతలు కోరారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## చచ్చినమేకలా చంపినమేకలా మటన్ కా సీక్రెట్ ..!

### జోరుగా మటన్, చికెన్, ఫిష్ బిజినెస్ .. రూల్స్ పాటించని దుకాణాల ఓనర్స్

### తూతూమంత్రంగా అధికారుల విజిట్స్.. డబ్బులిచ్చి రోగాలు కొంటున్న కస్టమర్స్

**సాలూరు, ఆగష్టు16, ప్రభాతవార్త :**

సాలూరు పట్టణ పెద్దమార్కట్ లో మేక,గొర్రె,కోడి,చేప మాంసాహార దుకాలు అలాగే ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర ఇంకా ఈ మధ్యన సందులు గొందుల్లో అనేక చిన్నచితక దుకాణాల్లో మటన్,చికెన్,ఫిష్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.ఇది ఓకేగాని అసలు విషయం ఏమిటంటే ముందుగా మటన్ గురించి ఆరా తీస్తే అసలు చచ్చినమేకలా లేక చంపిన మేకమాంసం కొంటున్నామనే కన్ఫ్యూజన్లో జనాలు మటన్ కోసం దుకాణాల దగ్గర ఎగబడడం పెద్ద హైలెట్ అని చెప్పుకోవచ్చు.అలాగే ఇంకా హోటల్స్ లో వేటమాంసం కోసం ఆర్డర్ ఇవ్వక పోలడం చాలా బెటర్ ఇది ఎలాగూ ఓపెన్ సీక్రెట్.అలాగే చికెన్,ఫిష్ విక్రయాల్లో కూడ చాలా పెద్దమోసాలు గురించి టాక్ వినిపిస్తున్నాయి.అసలు మటన్ దుకాణాల నిబంధనలపై ఒక లుక్కేస్తే దిమ్మతిరిగే నిజాలు బయటకు వచ్చి మైండ్ బ్లాక్ అవుతుంది.ఎందుకంటే ప్రజల హెల్త్ కు సంబంధించింది కాబట్టి ఎంతో కఠినమైన రూల్స్ పాటించాల్సిన హెల్త్ ఆఫీసర్లు లైట్ తీసుకొని కొద్దిగా ఫైన్ వేసి యజమానికి రొటీన్ గా వార్నింగ్ ఇచ్చి వదిలేస్తున్నారు.దీంతో నాన్ వేజ్ దుకాణాదారులు జనాల జేబులకు చిల్లు పెడుతుంటే తరువాత ఆసుపత్రిలో డాక్టర్లు రోగానపడిన వారిచేతిలో మెడికల్ బిల్ పెడుతున్నారు. ఇదిఇలా ఉంచితే అసలు మేక,గొర్రె మాంసం అమ్మకాలు జరపాలంటే మున్సిపాల్టీ రూల్స్ ఏమిటో ఒకసారి చూద్దాం. మొదటిగా దుకాణదారుడు మున్సిపల్ అధికారుల వద్ద ట్రేడ్ లైసెన్స్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.అలాగే పబ్లిక్ హెల్త్ విభాగం అధికారి అలాగే వెటర్నరీ డాక్టర్ (పశువైద్యుడు) కమెళాలో వారి సర్టిఫికెట్ ఆమోదముద్ర వేసిన తర్వాత మేక ఇంకా గొర్రె మాంసం విక్రయించాలనే కఠినమైన రూల్స్ ఉన్నాయి. ఇంతకు ముందు మున్సిపల్ అధికారులు ఈ ప్రోసెస్ కోసం పట్టణ సమీపంలో వేగవతినది వద్ద నీలాటిరేవు సమీపంలో కమేళా (జంతువధశాల)ను పరపాలిక నిధులతో నిర్మించి వాడుకులో తేకుండా వదిలేసారు. అలాగే ఇప్పుడున్న ఉరుకులు పరుగులు జీవన విధానంలో ఇష్టారాజ్యాంగ అమ్మేవాడు రూల్స్ పాటించక కొనేవాడికి టైంలేక నిల్వఉన్న కుళ్లిన గొర్రె మేక మటన్ కొని జనాల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి మోసపోతున్నారు.అలాగే టౌన్ లో చిన్నపెద్ద కలిపి 50 మటన్,చికెన్,ఫిష్ దుకాణాలు, సెంటర్లు ఉంటే వారు ఏ మాత్రం రూల్స్ పాటిస్తున్నారో అని అప్పుడప్పుడు శానిటరీ ఇన్స్పెక్టర్ ఇంకా సిబ్బందికి గుర్తొస్తుంది.దీంతో అక్కడకు హడావడిగా అధికార బృందం చేరుకొని కుళ్ళిన నిల్వఉన్న మటన్,చేపలు,చికెన్ గుర్తించి వారికి వార్నింగ్ ఇచ్చి కొద్దిఫైన్ వేసి తరువాత డంపింగ్ యార్డ్ లో పాతిపెట్టి మమ అనిపించి డ్యూటీ ముగించేస్తారనే విమర్శలు ఉన్నాయి.అలాగే మరలా కథ మొదటికి రావడం అధికారుల ఎన్నిసార్లు హెచ్చరించిన నాన్ వేజ్ దుకాణా యజమానులు డోంట్ కేర్ గా మున్సిపల్ అధికారులకు సవాల్ విసురుతూ బిజినెస్ చేయడంతో మున్సిపల్ ప్రజాఆరోగ్యశాఖ అధికారులు ఇంకా జిల్లా ఫుడ్ సేఫ్టీ అఫీసర్లు ఏం చేయలేరని సర్వత్ర అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

## ఉత్తమ జేఈ అవార్డు అందుకున్న తేజేశ్వరరావు

**గరుగుబిల్లి, ఆగస్టు 16, ప్రభాతవార్త:**



మండల ఉపాధి హామీపథకంలో జేఈగా పనిచేస్తున్న దాసరి తేజేశ్వర రావు విధి నిర్వహణ లో చక్కని ప్రతిభ కనబరచడంతో ఉత్తమ జేఈ అవార్డును అందుకు న్నారు. మండల ఉపాధి హామీ పథకంలో జేఈగా పనిచేస్తున్న దాసరి తేజేశ్వరరావుకు ఆగస్టు 15 సందర్భంగా ఎంపిక చేసిన అవార్డులకు సంబంధించి ఉపాధి హామీ పథకంలో ఉత్తమ జే ఈ అవార్డుకు ఎంపికయ్యా రు. ఈమేరకు పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగముగా రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమము మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేతుల మీదుగా దాసరి తేజేశ్వరరావు ఉత్తమ జేఈ అవార్డు ను అందుకున్నారు.

## సమస్యలపై శాసనమండలిలో గళం విప్పుతా

### -ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు

**నెల్లిమర్ల, ఆగస్టు 16 ప్రభాతవార్త :**



ఈ నెల 17వ తేదీ నుంచి జరిగే శాసనమండలి సమావేశాల్లో పలు సమస్యలను ప్రస్తావిస్తానని ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణ రాజు ( సురేష్ బాబు) వెల్లడించారు. మొయిద గ్రామంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతేడాది నిర్వహించిన డీఎస్సీలో చోటుచేసుకున్న అక్రమాల గురించి మాట్లాడుతానని తెలిపారు. నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తానన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, ముఖ్యంగా సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు చెప్పారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు భృతి వెంటనే చెల్లించాలని డిమాండ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతామన్నారు. అలాగే జూనియర్ డాక్టర్ల స్టైపండ్ 15 శాతం పెంచాలని శాసనమండలిలో డిమాండ్ చేస్తానని చెప్పారు. అవకాశం ఉంటే జర్నలిస్టుల ఇళ్లస్థలాల అంశాన్ని కూడా ప్రస్తావిస్తానని ఎమ్మెల్సీ తెలిపారు. సమావేశంలో వైసీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధికార ప్రతినిధి ధవళ లక్ష్మణరావు పాల్గొన్నారు.

## నెల్లిమర్లలో ఘనంగా ఏ.పి.జి.ఇ.ఏ ఆవిర్భావ దినోత్సవం

**నెల్లిమర్ల, ఆగస్టు 16, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ( ఏ పి జి ఇ ఏ) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఆ సంఘం నెల్లిమర్ల తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయ సముదాయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నెల్లిమర్ల తాలూకా కమిటీ అధ్యక్షులు పి. వీరన్న దొర మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు కె. ఆర్ సూర్యనారాయణ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం నకు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ మధ్య కాలంలో జూనియర్ లెక్చర్ లును డిగ్రీ కాలేజీ లెక్చరర్స్ గా ప్రమోషన్స్ ఇప్పించడం లో కృషి చేసారని చెప్పారు. పి ఆర్ సి పై కమిషన్ వెంటనే వేయాలని, పెండింగ్ లో ఉన్న డి ఎ లను ఉద్యోగుల కు విడుదల చేయాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని,సీపీఎస్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ జి. చక్రవర్తి, సెక్రటరీ పి సి నవీన్, వైస్ ప్రెసిడెంట్లు జి.పద్మగౌరి,బి. త్రినాథ రావు, జె వి లీలా, బి. గోవిందా, జాయింట్ సెక్రటరీలు గణపతి రావు, భువనచంద్ర, రమణ ,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విశ్వ భారత్ వీర పురస్కారాల ప్రదానం




**గరివిడి,ఆగస్టు 16, ప్రభాత వార్త:**

విశ్వ భారత్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన వీర పురస్కార్ ప్రధాన కార్యక్రమం గరివిడి లో శనివారం రాత్రి అట్టహాసంగా సాగింది. విశ్వ భారత్ సేవా ట్రస్ట్ ఛైర్మన్ బలివాడ రమేష్ ఆధ్వర్యంలో 80 మంది వీర జవానులు,స్వాతంత్ర్య సమరయోధులు కుటుంబీకులకు వీర పురస్కారం తో సత్కరించే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా దేశ నలుమూలలకు చెందిన 80 మంది కుటుంబీకులకు వీర పురస్కారాలు ప్రధానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ లక్ష్మీ, మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు లు మాట్లాడుతూ విశ్వ భారత్ సేవా ట్రస్ట్ సేవలను కొనియాడారు. బలివాడ రమేష్ చేపట్టే బృహత్కర కార్యక్రమం స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమంలో ఫేకర్ జనరల్ మేనేజర్ రామకృష్ణ, ఫేకర్ పర్సనల్ అధికారి వై ఆర్ వి సూర్యనారాయణ, లక్ష్మీ బాయి వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షురాలు భోగాపురపు శ్రీదేవి ,సేవా ట్రస్ట్ ప్రతినిధులు జి.హరి గంగాధర్ రావు,మేధరమెట్ల వెంకటేశ్వర రావు , తండేల రామకృష్ణ, పి.కుమార్, ఉప్పు శ్రీనివాసరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.స్థానికులు, సేవా ట్రస్ట్ వాలంటీర్ లు, పెక్కు సంఖ్యలో పాల్గొన్నారు.

16-08pg10.qxd:16-08pg10.qxd 1/1/02 6:14 AM Page 1



ఆట

## మహిళల హాకీ వరల్డ్ కప్ ఆరంభ మ్యాచ్‌లో
# చైనాతో భారత్ డ్రా



**నెదర్లాండ్స్:** మహిళల హాకీ ప్రపంచ కప్ 2026 లో చైనా, భారత్ జట్లు డ్రా చేసుకున్నాయి. ఆదివారం నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టెల్వీన్‌లోని వాగెనర్ స్టేడియంలో జరిగిన మహిళల హాకీ ప్రపంచ కప్, గ్రూప్ డి ఆరంభ మ్యాచ్‌లో భారత్, చైనా జట్లు 2-2తో డ్రా చేసుకున్నాయి. ఈ మ్యాచ్‌లో భారత్ రెండు సార్లు ఆధిక్యంలోకి వెళ్లినా ఒలింపిక్ రజత పతక విజేత చైనా ప్రతీసారీ పుంజుకుని స్కోరును సమం చేసింది. మ్యాచ్ ప్రారంభం నుండే భారత్ దూకుడు ప్రదర్శించింది. 8వ నిముషంలో నవ్‌నీత్ కౌర్ గోల్ చేయడంతో భారత్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే తొలి క్వార్టర్ ముగిసే సమయానికి చైనా తిరిగి పుంజుకుంది. 15వ నిముషంలో జాంగ్ గోల్ చేయడంతో స్కోర్ 1-1గా సమమైంది. రెండో క్వార్టర్‌లో భారత్ మరోసారి ఆధిక్యంలోకి వచ్చింది. 25వ నిముషంలో దీపిక గోల్ చేయడంతో భారత్ 2-1తో ముందంజ వేసింది. భారత్ ఆధిక్యాన్ని కాపాడుకుంటూ విజయంపై ఆశలు పెట్టుకున్న సమయంలో చైనా మరోసారి ఎదురుదాడి చేసింది. 39వ నిముషంలో మా నింగ్ గోల్ చేయడంతో స్కోర్ 2-2గా మారింది. ఆ తర్వాత ఇరు జట్లు గెలుపు కోసం తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ మరో గోల్ రాకపోవడంతో చివరకు మ్యాచ్ డ్రా గా ముగిసింది. దీంతో చైనాతో పాయింట్లు పెంచుకున్న భారత్ పూల్ డి లో తదుపరి మ్యాచ్ కీలకంగా మారింది. ఈ నెల 18న దక్షిణాఫ్రికాతో భారత్ జట్టు తలడనుంది.

## స్విస్ లేడీస్ ఓపెన్‌లో కట్ సాధించిన ఏకైక భారత్ క్రీడాకారిణి ప్రణవి



**స్విట్జర్లాండ్:** స్విస్ లేడీస్ ఓపెన్‌లో హాఫ్‌వే కట్‌ను దాటిన ఏకైక భారతీయ గోల్ఫర్‌గా ప్రణవి ఉర్స్ నిలిచింది. అలాగే రెండో రౌండ్‌లో విభిన్నమైన ప్రదర్శనల తర్వాత భారత్‌కే చెందిన త్వేసా మాలిక్, దీక్షా దాగర్ టోర్నమెంట్ నుండి నిష్క్రమించారు. గోల్ఫ్‌పార్క్ హోల్జ్‌హౌసెర్న్‌లో ఆదివారం జరిగిన రెండు-అండర్ 70తో ప్రారంభించిన ప్రణవి, మరో రెండు-అండర్ 69 స్కోరు చేసి, మొత్తం మూడు -అండర్ 139 స్కోరుతో వారాంతంలోకి ప్రవేశించే ముందు 28వ స్థానంలో నిలిచింది. త్వేస తన తొలి రౌండ్‌లోని 72 స్కోరును మెరుగుపరుచుకుని వన్-అండర్ 71 స్కోరు చేసినప్పటికీ, వన్‌ఓవర్ పార్‌తో ముగించి, ఒక్క స్ట్రోక్ తేడాతో కట్‌ను కోల్పోయింది. ప్రణవి, త్వేసల మాదిరిగానే దీక్ష, తొలి రౌండ్‌లోని 71 స్కోరు తర్వాత 78 స్కోరు చేసి, సెవెన్ ఓవర్‌తో ముగించింది. స్వీడన్‌కు చెందిన కైసా ఆర్వెఫ్యాల్, 64 స్కోరుతో ప్రారంభించి, బోగీ రహిత 66 స్కోరుతో టోర్నమెంట్‌పై తన పట్టును మరింత బలపరుచుకుంది. ఆమె సాధించిన 12 అండర్ మొత్తం ఆమెకు మూడు షాట్ల ఆధిక్యాన్ని ఇస్తుంది. అలాగే ఆర్వెఫ్జాల్ తన రెండవ రౌండ్‌ను బ్యాక్ నైన్‌లో ప్రారంభించి, పార్‌ఫోర్ 10వ హోల్‌లో బర్డీ సాధించి, ఆ తర్వాత వరుసగా ఎనిమిది పార్స్ చేసింది. అనంతరం ఫ్రంట్ నైన్‌లో మొదటి, రెండవ, నాల్గవ మరియు ఏడవ హోల్స్‌లో మరో నాలుగు బర్డీలు సాధించి స్పష్టమైన ఆధిక్యాన్ని సంపాదించింది.

# ఆసియా కప్: భారత్‌తో పోరుకు పాక్ రెడీ




**న్యూఢిల్లీ:** భారత్, పాకిస్తాన్ మహిళల క్రికెట్ జట్లు వచ్చే నెల ప్రారంభంలో తలపడనున్నాయి. ఈ మ్యాచ్ టీ20 ఆసియా కప్‌లో భాగంగా జరగనుంది. మహిళల ఆసియా కప్ ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 13 వరకు దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. గ్రూప్ ఎ లో పాకిస్తాన్‌తో పాటు హాంకాంగ్‌చైనా, భారత్, థాయిలాండ్ ఉన్నాయి. పాకిస్తాన్ తమ ఆసియా కప్ ప్రయాణాన్ని సెప్టెంబర్ 1న థాయిలాండ్‌తో ప్రారంభించనుంది. ఆ తర్వాత సెప్టెంబర్ 5న ఏడుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన భారత్‌తో, సెప్టెంబర్ 7న హాంకాంగ్‌చైనాతో తలపడనుంది. ఈ టోర్నమెంట్ సెమీఫైనల్స్ సెప్టెంబర్ 10, 11 తేదీలలో జరగనుండగా, ఫైనల్ సెప్టెంబర్ 13న జరగనుంది. దీనికోసం పాకిస్తాన్ తన జట్టును ప్రకటించింది. 2026 ఆసియా క్రీడల కోసం పాకిస్తాన్ 15 మంది సభ్యులతో కూడిన మహిళల క్రికెట్ జట్టును ప్రకటించింది. ఈ జట్టుకు ఫాతిమా సనా నాయకత్వం వహించనుంది. లెఫ్టార్మ్ స్పిన్నర్ సాదియా ఇక్బాల్, బ్యాటర్ గుల్ ఫిరోజా కూడా పాకిస్తాన్ టీ20 జట్టులోకి తిరిగి వచ్చారు. సాదియా శ్రీలంక పర్యటనలో భాగం కాలేదు.

కాగా గుల్ ఫిరోజాను ఇటీవలి టీ20 మ్యాచ్‌ల నుంచి తప్పించినప్పటికీ పర్యటనలోని వన్డే సిరీస్‌లో ఆడింది. జపాన్‌లోని ఐచినగోయాలో జరిగే ఆసియా క్రీడల జట్టు నుంచి సాదియా, వహీదా అక్తర్, నజీహా అల్వీలను తొలగించి, వారి స్థానంలో అలియా రియాజ్, తస్మియా రుబాబ్, హుమ్నా బిలాల్‌లను తీసుకున్నారు. అయితే స్టార్ పేసర్ డయానా బేగ్‌ను రెండు జట్ల నుంచి తొలగించారు. ఆమె పేరు రిజర్వ్ జాబితాలో కూడా లేదు.






# ఆస్ట్రేలియాకు షాక్
## 23 యేళ్ల తర్వాత బంగ్లా సంచలన విజయం

**డార్విన్:** బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. ఆస్ట్రేలియా గడ్డపై ఆ జట్టును ఓడించింది. నాల్గో రోజు రెండో సెషన్ ఆదివారం జరిగిన ఏకంగా 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. తద్వారా 23ఏళ్ల తరువాత సంచలన విజయాన్ని నమోదు చేసింది. ఫలితంగా రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌కు గాను 1-0తో బంగ్లాదేశ్ ఆధిక్యంలో ఉంది. టాస్ గెలిచిన ఆస్ట్రేలియా బ్యాటింగ్ ఎంచుకోగా, ఆ జట్టు బ్యాటర్లకు అద్భుత బంతులతో బంగ్లాదేశ్ బౌలర్లు చుక్కలు చూపించారు. దీంతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 198 పరుగులకే ఆలౌటైంది. బంగ్లాదేశ్ బౌలర్ హసన్ మహ్మద్ 6 వికెట్లు పడగొట్టాడు. అతని దెబ్బకు ఆస్ట్రేలియా బ్యాటింగ్ ఆర్డర్ కుప్పకూలింది. ఆ తరువాత తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ జట్టు 426 పరుగులు చేసింది. బంగ్లాదేశ్ బ్యాటింగ్‌లో తంజిద్ హసన్ శతకంతో మెరిశాడు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియాపై బంగ్లాదేశ్ జట్టుకు 228 పరుగుల ఆధిక్యం లభించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా బ్యాటింగ్‌లో కామెరాన్ గ్రీన్ ఒంటరి పోరాటం చేశాడు. అతను 104 పరుగులతో శతకం సాధించాడు. అయితే మరో ఎండ్‌లో సహచరుల నుంచి తగిన సహకారం లభించలేదు. ఫలితంగా ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 284 పరుగులకే ఆలౌటైంది. దీంతో బంగ్లాదేశ్ ముందు విజయానికి కేవలం 57 పరుగుల లక్ష్యం మాత్రమే నిలిచింది. చిన్న లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్‌కు ఆస్ట్రేలియా బౌలర్లు పెద్దగా సవాలు విసరలేకపోయారు. బంగ్లాదేశ్ కేవలం ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 57 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. మోమినుల్ హక్ విజయ బౌండరీ సాధించడంతో బంగ్లాదేశ్ చారిత్రక విజయాన్ని ఖాయం చేసుకుంది. 2003లో డార్విన్‌లోనే ఆస్ట్రేలియాతో బంగ్లాదేశ్ తొలి టెస్టు ఆడింది. ఆ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా భారీ విజయాన్ని సాధించింది. ఇప్పుడు అదే డార్విన్‌లో బంగ్లాదేశ్ చరిత్ర తిరగరాసింది. ఈ విజయం బంగ్లాదేశ్ టెస్టు చరిత్రలోనే అత్యంత ప్రత్యేకమైన విజయాల్లో ఒకటిగా నిలిచింది. ఆస్ట్రేలియాపై వారి టెస్టు విజయాల సంఖ్య రెండుకు చేరింది. అంతకుముందు 2017లో స్వదేశంలో ఆస్ట్రేలియాను బంగ్లాదేశ్ ఓడించింది.

# శ్రీలంకతో రెండో రోజు ముగిసిన ఆట
## టీమిండియా 460 పరుగుల భారీ స్కోర్



**న్యూఢిల్లీ:** గాలే వేదికగా శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో భారత్ ఆధిపత్యం కొనసాగుతోంది. అయితే తొలి రోజే పటిష్ట స్థితిలో నిలిచిన భారత జట్టు రెండో రోజు ఆదివారం తడబడింది. దీనికి తగినట్లుగా వర్షం కారణంగా రెండో కేవలం 43 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. దేవ్‌దత్ పడిక్కల్(167) భారీశతకంతో మెరిసినా, మిడిలార్డర్ బ్యాటర్లు చేతులెత్తేశారు. వర్షం ప్రభావంతో శ్రీలంక బౌలర్లు పుంజుకోవడంతో స్కోర్ వేగం తగ్గింది. అయితే టీ సెషన్‌లో ధ్రువ్ జురెల్(51), మానవ్ సుతార్(24)లు విలువైన భాగస్వామ్యం నెలకొల్పారు. ఆఖర్లో పేసర్ ప్రభాత్ జయసూర్య(4-109) వరసగా వికెట్లు తీయడంతో భారత్ ఆలౌట్ అంచున నిలిచింది. తొలి టెస్టులో భారీ స్కోర్ దిశగా సాగుతున్న భారత జట్టు రెండో రోజు దేవ్‌దత్ పడిక్కల్(167: 230 బంతుల్లో 15 ఫోర్లు, సిక్సర్) ఔటయ్యాడు. మొట్టమొదటి సెంచరీతో భారత జట్టు భారీ స్కోర్‌కు బాటలు వేసిన ఈ కుర్రాడు రెండో రోజు లంచ్ తర్వాత వెనుదిరిగాడు. ఓవర్ నైట్ స్కోర్ 288/2తో ఆట మొదలెట్టిన టీమిండియా రిషభ్ పంత్(39), కేఎల్ రాహుల్(82) వికెట్లు కోల్పోయింది. వెంటవెంటనే ఇద్దరూ కీలక ప్లేయర్లు ఔటైన వేళ ధ్రువ్ జురెల్(51) ఇన్నింగ్స్ నిర్మించిన పడిక్కల్ డబుల్ సెంచరీకి 33 పరుగుల దూరంలో ఆగిపోయాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన రవీంద్ర జడేజా(13) విఫలమైనా జురెల్ ఆచితూచి ఆడాడు. లహిరు కుమార ఓవర్లో మానవ్ సుతార్(24) బౌండరీతో స్కోర్ నాలుగొందలు దాటింది. అర్ధ శతకం సాధించిన జురెల్‌ను ప్రభాత్ జయసూర్య కాసేపటికే సుతార్‌ను డగౌట్ చేర్చాడు. సిరాజ్ త్వరగా వెనుదిరిగినా కుల్దీప్ యాదవ్(12 నాటౌట్) పట్టుదలగా ఆడాడు. ప్రసిధ్ కృష్ణ(1 నాటౌట్) కూడా వికెట్ కాచుకోవడంతో రెండో రోజు ఆట ముగిసే సరికి 9 వికెట్ల నష్టానికి భారత్ 460 పరుగులు చేసింది.

# ఈ యేడాది పెన్నీస్టాక్స్ ఇన్వెస్టర్లకు కాసుల పంట




**ముంబయి, ఆగస్టు 16:** ఈ క్యాలెండర్ సంవత్సరంలో ఇప్పటి వరకు చూసుకుంటే 10 పెన్నీ స్టాక్స్ అత్యంత వేగంగా పెరిగాయి. ఈ స్టాక్స్ 25 శాతం నుంచి 325 శాతం మధ్య రిటర్న్స్ అందించాయి. అందులో 3 స్టాక్స్ ఇన్వెస్టర్ల పెట్టుబడిని పలు రెట్లు పెంచి మల్టీబ్యాగర్ స్టాక్స్‌లో నిలిచాయి. ఈ స్టాక్స్‌ను ప్రత్యేక కేటగిరీలోని అంశాలను పరిగణనలోకి తీసుకుని జాబితా చేయడం జరిగింది. అందులో కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1000 కోట్ల లోపు ఉండి షేర్ల ధర రూ.20 లోపు ఉంటూ రోజుకు సగటున 5 లక్షల షేర్ల ట్రేడింగ్ వాల్యూమ్ ఉన్న వాటిని ఎంచుకోవడం జరిగింది. దీంతో చాలా తక్కువ ధరకో మంచి పనితీరు గల మైక్రో క్యాప్‌స్టాక్స్ లభించాయి. ఈ స్టాక్స్ గత 8 నెలలుగా చూసుకుంటే హైరిటర్న్స్ ఇచ్చాయి. పెన్నీ స్టాక్స్‌లో విజయం సాధించడానికి కేవలం అదృష్టం మాత్రమే కాదు, స్పష్టమైన వ్యూహం, పటిష్టమైన నష్ట నిర్వహణ కూడా అవసరం. ట్రియో మెర్కంటైల్ అండ్ ట్రేడింగ్ కంపెనీ స్టాక్ ఇప్పటి వరకు 8 నెలల్లో చూసుకుంటే ఏకంగా 326 శాతం మేర రాణించింది. లక్ష రూపాయలు పెట్టిన వారికి రూ.4.26 లక్షల వరకు అందించింది. ఈ స్టాక్ ధర కేవలం రూ.2.94 వద్ద ఉండడం గమనార్హం. గుజరాత్ ఇంజెక్ట్ కేరళా లిమిటెడ్ కంపెనీ స్టాక్ గత ఎనిమిది నెలల కాలంలో చూసుకుంటే 254 శాతం మేర రాబడులను అందించింది. లక్ష పెట్టిన వారికి రూ.3.54 లక్షలు అందించింది. ప్రస్తుతం ఈ స్టాక్ ధర రూ.12.66 వద్ద ఉంది.

స్టార్‌లైన్‌ప్స్ ఎంటర్ ప్రైజెస్ కంపెనీ స్టాక్ గత 8 నెలల కాలంలో 156 శాతం మేర పెరిగింది. లక్ష పెట్టిన వారికి రూ.2.56 లక్షలు అందించింది. ప్రస్తుతం ఈ కంపెనీ స్టాక్ ధర రూ.8.57 వద్ద ఉంది. ఎసిఐ ఇన్ఫోకామ్ కంపెనీ స్టాక్ గడిచిన 8 నెలల కాలంలో 63 శాతం మేర పెరిగి లక్ష పెట్టిన వారికి రూ.1.63 లక్షలు అందించింది. ఈ స్టాక్ ధర రూ.2.05 మాత్రమే. ఎన్‌హెచ్‌ఎ ఫుడ్స్ కంపెనీ స్టాక్ ఈ ఏడాది 2026లో ఇప్పటి వరకు 60 శాతం మేర లాభాలు అందించింది.

# రోజుకు 64వేల టన్నులు ఉత్పత్తిచేయాలి
## రిఫైనరీలకు కేంద్రం ఆదేశాలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 16:** ఇరాన్ యుద్ధం కారణంగా దేశంలో ఎల్పీజీ గ్యాస్ కొరతను భర్తీచేసేందుకు ఎల్పీజీ ఉత్పత్తి పెంచాలని కేంద్రం నిర్ణయించింది. చమురు ఉత్పత్తి, రిఫైనరీ సంస్థలకు ఈ నెల 13న కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎల్పీజీ ఉత్పత్తి పెంచాలని ఆదేశించింది. రోజుకు 63,810 టన్నుల ఎల్పీజీ ఉత్పత్తి చేయాలని దేశంలోని 21 రిఫైనరీలను ఆదేశించింది. 2026 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఎల్పీజీ ఉత్పత్తికి రెట్టింపుకంటే ఎక్కువ. ప్రస్తుతం దేశంలో ఒకరోజు వినియోగమవుతున్న గ్యాస్‌లో 70 శాతం. ఇది ఇప్పటికిప్పుడే సాధ్యమయ్యే పరిస్థితి లేదు. ప్రస్తుతం విదేశాల నుంచి చమురు సరఫరా తగినంతగా లేకపోవడే ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో తగినంత చమురు దిగుమతి జరిగితే, రిఫైనరీ కంపెనీలు ఈ టార్గెట్‌ను అందుకుంటాయి. దేశంలోఉన్న రిఫైనరీ కంపెనీలలో 18 రిఫైనరీలు ప్రభుత్వం రంగ సంస్థలే. వీటికి రోజుకు 31,470 టన్నుల ఎల్పీజీ ఉత్పత్తి చేయాల్సిందిగా కేంద్రం లక్ష్యాన్ని నిర్దేశించింది. ప్రైవేటు రిఫైనరీ లలో అత్యధికంగా ఎల్పీజీ ఉత్పత్తి చేసే సామర్థం రిలయన్స్ సంస్థకు ఉంది. ఈ సంస్థ రోజుకు 18,000 టన్నుల ఎల్పీజీ ఉత్పత్తి చేయగలదు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న రిఫైనరీలో ఏడాదికి 33 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయగలదు. ఆ తర్వాత కోచిలోని బీపీసీఎల్ సంస్థ 4,800 టన్నులు, రష్యాకు చెందిన నయారా ఎనర్జీ సంస్థ 4,480 టన్నుల ఎల్పీజీ ఉత్పత్తి చేయగలవు. ఈ మూడు కంపెనీలు కలిపి 27,280 టన్నుల ఎల్పీజీ ఉత్పత్తి చేయగలవు. 202526 ఆర్థిక సంవత్సరంలో ఇండియాలో 33.2 మిలియన్ టన్నుల ఎల్పీజీ వినియోగమైంది. రోజుకు సగటున 91,000 టన్నులు. వీటిలో 13.1 మిలియన్ టన్నుల ఎల్పీజీ దేశీయంగా ఉత్పత్తి అయితే, మిగిలిన 21.3 మిలియన్ టన్నుల ఎల్పీజీని విదేశాల నుంచి దిగుమతి చేయాల్సి వచ్చింది.

# టాప్ ఐదు కంపెనీల్లో రూ.లక్షల కోట్ల ఆవిరి




**ముంబయి, ఆగస్టు 16:** దేశీయ స్టాక్ మార్కెట్లలో గత వారం అమ్మకాల ఒత్తిడి తీవ్రంగా కొనసాగింది. ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలహీనపడటంతో సూచీలు నష్టాల్లో ముగిశాయి. దీని ప్రభావం దేశంలోని అత్యంత విలువైన టాప్10 కంపెనీలపై స్పష్టంగా కనిపించింది. వీటిలో ఐదు దిగ్గజ కంపెనీలు కలిసి తమ మార్కెట్ విలువలు ఏకంగా రూ.1 లక్ష కోట్లకు పైగా నష్టపోయాయి. నష్టపోయిన కంపెనీలలో ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అగ్రస్థానంలో నిలిచింది. ఒక్క వారంలోనే టిసిఎస్ మార్కెట్ విలువ రూ.34,263.28 కోట్లు క్షీణించి రూ.8.53 లక్షల కోట్లకు పడిపోయింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా భారీ నష్టాన్ని చవిచూసింది. ఈ సంస్థ మార్కెట్ విలువ రూ.31,869.13 కోట్లు తగ్గి రూ.17.70 లక్షల కోట్లకు చేరింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.25,891.88 కోట్లు నష్టపోయి రూ.9.86 లక్షల కోట్ల వద్ద ముగిసింది. ఇ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ రూ.7,165.37 కోట్లు, ఐసిఐసిఐ బ్యాంక్ రూ.2,792.65 కోట్లు తమ మార్కెట్ విలువను కోల్పోయాయి. ఒకవైపు ఐదు కంపెనీలు నష్టాలపాలవ్వగా, మరో ఐదు కంపెనీలు మాత్రం లాభాలను ఆర్జించడం విశేషం. ఈ ఐదు కంపెనీలు కలిసి తమ మార్కెట్ విలువకు రూ.55,149.45 కోట్లను జోడించుకున్నాయి. లాభపడిన వాటిలో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి) ముందుంది. ఎల్ఐసి మార్కెట్ విలువ రూ.26,438.49 కోట్లు పెరిగి రూ.5.23 లక్షల కోట్లకు చేరింది. భారతీ ఎయిర్‌టెల్ కూడా రూ.20,592.13 కోట్లు లాభపడి తన విలువను రూ.12.43 లక్షల కోట్లకు పెంచుకుంది. బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ అండ్ టూబ్రో, హిందుస్థాన్ యూనిలీవర్ కూడా స్వల్ప లాభాలతో వారాన్ని ముగించాయి. వారం ముగిసే నాటికి అత్యంత విలువైన కంపెనీల జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, ఆ తర్వాతి స్థానాల్లో భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, ఎస్‌బిఐ నిలిచాయి.

# రూ.24 వేల కోట్ల రెవెన్యూపై లోథా ఫోకస్



**ముంబయి, ఆగస్టు 16:** ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ లోధా డెవలపర్స్ లిమిటెడ్ వచ్చే ఏడాది మార్చి నాటికి 21 కొత్త హౌసింగ్ ప్రాజెక్టులను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. వీటి ద్వారా సుమారు రూ.24,000 కోట్ల ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉందని కంపెనీ తెలిపింది. బలమైన గృహ డిమాండ్ కొనసాగుతున్న నేపథ్యంలో వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు సంస్థ ఈ ప్రాజెక్టులను చేపడుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో లోధా డెవలపర్స్ ముంబై మెట్రోపాలిటన్ రీజియన్‌లో 4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒకే హౌసింగ్ ప్రాజెక్టును ప్రారంభించింది. దీని ఆదాయ సామర్థం రూ.330 కోట్లుగా ఉంది. ఎంఎంఆర్, ఢిల్లీ ఎన్‌సీఆర్, పుణె, బెంగళూరు ప్రాంతాల్లో 7 కొత్త హౌసింగ్ ప్రాజెక్టులను ప్రారంభించనుంది. మొత్తం 59 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో చేపట్టే ఈ ప్రాజెక్టుల ఆదాయ సామర్థం సుమారు రూ.9,850 కోట్లు. ఇప్పటికే కొనసాగుతున్న 14 ప్రాజెక్టుల్లో కొత్త దశలను ప్రారంభించనుంది. మొత్తం 97 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో చేపట్టే ఈ దశల ద్వారా మరో రూ.14,210 కోట్ల ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంది. ఈప్రాజెక్టులతో నిర్దేశించుకున్న రూ.24,000 కోట్ల సేల్స్ బుకింగ్స్ లక్ష్యాన్ని సాధించేందుకు కంపెనీ ప్రయత్నిస్తోంది. ఏప్రిల్‌జూన్ త్రైమాసికంలో లోధా డెవలపర్స్ సేల్స్ బుకింగ్స్ వార్షిక ప్రాతిపదికన 4 శాతం పెరిగి రూ.4,630 కోట్లకు చేరాయి. దేశంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థల్లో ఒకటైన లోధా డెవలపర్స్‌కు ఎంఎంఆర్, పుణె, బెంగళూరులో కార్యకలాపాలు ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఢిల్లీఎన్‌సీఆర్‌లో తన తొలి హౌసింగ్ ప్రాజెక్టును ప్రారంభించేందుకు సంస్థ ప్రణాళిక సిద్ధం చేసింది. హౌసింగ్‌తో పాటు కార్యాలయాలు, మాల్స్, వేర్‌హౌసింగ్, పారిశ్రామిక పార్కులు, డేటా సెంటర్ల వంటి వాణిజ్య ప్రాజెక్టులను కూడా కంపెనీ అభివృద్ధి చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నికర లాభాన్ని 20 శాతం వార్షిక వృద్ధితో రూ.4,100 కోట్లకు పెంచుకోవాలని లోధా డెవలపర్స్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ త్రైమాసికంలో కంపెనీ నికర లాభం దాదాపు రెట్టింపై రూ.1,373.1 కోట్లకు చేరింది. ఆదాయం కూడా రూ.3,624.7 కోట్ల నుంచి రూ.5,096.7 కోట్లకు పెరిగింది.

## ఈవారం మార్కెట్‌లోకి
# 8 కొత్త ఫండ్స్




**ముంబయి, ఆగస్టు 16:** మ్యూచువల్ ఫండ్స్‌లో ఈ వారం ఎనిమిది కొత్త ఫండ్స్ సబ్‌స్క్రిప్షన్ కోసం వస్తున్నాయి. అందులో 5 ఫండ్స్ ఆఫర్లు 17న తేదీన మొదలవుతున్నాయి. తమ పోర్ట్‌ఫోలియోల్లోని ఖాళీలను పూరించి ఇన్వెస్టర్లను ఆకర్షించడమే లక్ష్యంగా కొత్త ఫండ్స్‌ను సంస్థలు తెస్తున్నాయి. ఇందులో రెండు ఫండ్ ఆఫ్ ఫండ్స్ ఉన్నాయి. నిప్పాన్ ఇండియా ఇన్‌కమ్ ప్లస్ ఆర్బిట్రేజ్ ఓమ్ని ఫండ్ ఆఫ్ ఫండ్, క్వాంట్ ఇన్‌కమ్ ప్లస్ ఆర్బిట్రేజ్ యాక్టివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ కోసం ఈనెల17నుంచి 31 వ తేదీ వరకు కొనసాగనున్నాయి. వీటిల్లో కనీస పెట్టుబడి రూ. 500, రూ. 5000గా నిర్ణయించారు. ఇక ఐటిఐ మల్టీ అసెట్ అలకేషన్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ సైతం 17న మొదలై ఆగస్టు 31వ తేదీ వరకు కొనసాగనుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ. 5000గా నిర్ణయించారు. క్వాంట్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ న్యూ ఫండ్ ఆఫ్ సబ్‌స్క్రిప్షన్ట్ 21వ తేదీన మొదలై సెప్టెంబర్ 4వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఇందులో కనీస పెట్టుబడి రూ.500గా నిర్ణయించారు. ఇన్వెస్కో ఇండియా ఫార్మా అండ్ హెల్త్ కేర్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఈనెల 18వ తేదీన ప్రారంభమవుతోంది. సెప్టెంబర్ 1వ తేదీ వరకు కొనసాగనుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ. 1000గా నిర్ణయించారు. క్వాంట్ సిల్వర్ ఈటీఎఫ్ కొత్త ఫండ్ ఆఫర్ సబ్‌స్క్రిప్షన్ ఆగస్టు 17వ తేదీన ప్రారంభమై ఆగస్టు 19తోనే ముగుస్తుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ. 2000గా నిర్ణయించారు. ఎడెల్వేయిస్ ఆల్ట్రా షార్ట్ టర్మ్ ఫండ్ న్యూ ఫండ్ ఆఫర్ సబ్‌స్క్రిప్షన్ కోసం 17వ తేదీన అందుబాటులోకి వస్తోంది. 24వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ. 100 మాత్రమే. డిఎస్‌పీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెక్టోరల్ డెట్ ఫండ్ కొత్త స్కీమ్ సబ్‌స్క్రిప్షన్ 17వ తేదీన మొదలై 24వ తేదీ వరకు కొనసాగుతుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ. 100గా నిర్ణయించారు.

SBI
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సెంట్రల్ రిక్రూట్‌మెంట్ & ప్రమోషన్ డిపార్ట్‌మెంట్
కార్పొరేట్ సెంటర్, ముంబై
ఫోన్: 022-22820427

అప్లై చేయడానికి QRని స్కాన్ చేయండి

**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI)లో క్లరికల్ కేడర్‌లో జూనియర్ అసోసియేట్స్ (కస్టమర్ సపోర్ట్ & సేల్స్) రిక్రూట్‌మెంట్**
**SC/ST/OBC బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి ప్రత్యేక నియామక ప్రక్రియ**

భారతీయ స్టేట్ బ్యాంకు రెగ్యులర్ బేసిస్‌లో జూనియర్ అసోసియేట్స్ (కస్టమర్ సపోర్ట్ & సేల్స్) నియామకం కోసం అర్హులైన భారతీయ పౌరులనుండి దరఖాస్తులు కోరుచున్నది

**ఖాళీల సంఖ్య : 1538**

అర్హత ప్రమాణాలు (వయస్సు, అర్హత మొదలైనవి) అవసరమైన ఫీజులు మరియు ఇతర వివరాలు, ఆన్‌లైన్ దరఖాస్తు మరియు ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు లింక్‌తో పాటు, బ్యాంక్ వెబ్‌సైట్ **https://sbi.bank.in/web/careers/current-openings** ప్రకటన నం. **CRPD/CR/SPLDRIVE/2026-27/16** లో లభిస్తుంది. అభ్యర్థులు దరఖాస్తు చేసే ముందు మరియు ఫీజు చెల్లించే ముందు పూర్తి ప్రకటనని చూసి, తమ అర్హతలను నిర్ధారించుకోవలని సలహా.

- ఆన్ లైన్ లో దరఖాస్తు చేయుటకు మరియు ఫీజు చెల్లింపు తేదీ : 07.08.2026 నుండి 27.08.2026 వరకు.

ఏవైనా సందేహాలు ఉన్నా, దయచేసి మాకు – **"CONTACT US" —> "Post Your Query"** లింకు ద్వారా వ్రాసి పంపండి. ఈ లింకు మీకు బ్యాంకు వెబ్ సైట్ **https://sbi.bank.in/web/careers/current-openings**లో లభించును.

స్థలం: ముంబై
తేదీ: 07.08.2026
మహానిర్వహణాధికారి (ఆర్‌పి & పీఎం)

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.